# కీర్తనల గ్రంథ ధ్యానము - 2



రచయిత
టి.పి.వరప్రసాద రెడ్డి

# కీర్తనల గ్రంథ ధ్యానము - 2

(రెండవ భాగము)

## తృతీయ, చతుర్థ, పంచమ స్కంధములు
## 73-150 కీర్తనలు


**రచయిత:**

**టి.పి. వరప్రసాద రెడ్డి**



**ప్రచురణ:**

టి.పి. వరప్రసాద రెడ్డి

షాలోమ్ చర్చి, జె.యన్.టి.యు, పోస్టాఫీస్, అనంతపురము - 515 002

ఫోన్: 9440285883, 9440669494

**keerthanala Grandha dhyanamu (Part - 2)**
**73-150 Psalms**

**Rate: Rs. 70/-**

## Bro. T.P. Vara Prasada Reddy

**© All Rights Reserved with publishers**
**Any part of this book not to be copied**

**1st Edition - (07-11-2020)**

**copies available at:**

1. **T.P.Varaprasada Reddy,** Shalom Church, JN.T.U. Post, Ananthapur - 515 002, Cell: 9440285883
2. **Moreh Christian assembly**
   1088, 3rd Phase, K.P.H.B. Colony,
   Hyderabad-72, Cell: 9866604438
3. **T. Rathna Reddy,** Multhoot Manager (Retired), Giddaluru, Prakasam D. Cell: 9490000789

**Printed & Published by**
**T.P. Varaprasada Reddy**
Shalom Church, JNTU.C. Post Office
ANANTAPUR – 5150002,Andhra Pradesh, India,
Cell: 9440285883, 9440669494

# కీర్తనల గ్రంథము

**వ్రాయబడిన కాలము:** క్రీ.పూ. 1440 – 540 – సుమారు 900 సంవత్సరములు కీర్తనల గ్రంథము ప్రార్థన, స్తుతులతో కూడిన పాటలు గల గ్రంథము. అద్దములో సహజ ముఖమును చూసుకొని దిద్దుకొనునట్లు, వాక్యమగు అద్దములో మన జీవితములను దిద్దుకొనాలి. కీర్తనల గ్రంథమును చదువునప్పుడు అద్దములో మన ముఖముపై ఉన్న మరకలను తీసివేసుకొని అలంకరించుకొనునట్లు, కీర్తనల గ్రంథములో మన జీవితములో తీసివేసికొనవలసినవి, అలంకరించు కొనవలసినవి ఉన్నవని, వాటిని దేవుడు చూపునని గుర్తింపుతో ధ్యానించాలి. అద్దము చూచి ముక్కు నోరు, ముఖముపై ఉన్న వాటిని దిద్దుకున్నట్లు వాక్యమను అద్దము మన ప్రాణాత్మ, దేహములలో ఉన్న మరకలను అనగా పాపములను చూపగా వాటిని దిద్దుకొని, వాక్యములో ఉన్న అలంకరణ చేత ప్రాణాత్మ, దేహాలను అలంకరించుకోవాలి. శ్రమలలో, దుఃఖములలో సంతోషించుట ఎట్లో నేర్చుకొని దేవునికి మన శరీరములను పరిశుద్ధముగా ఉండునట్లు సమర్పించుకోవాలి. కీర్తనల గ్రంథ ధ్యానము మన జీవితమును క్రమపరచునని గుర్తింతము. ధర్మశాస్త్రము దివారాత్రము ధ్యానించుటలో ఆనందము, ధన్యత ఉన్నది. ధ్యానించి మనము ధన్యులమగుదుము. స్తుతి, స్తోత్రము, సన్నుతి, కీర్తించుట అను పదములు సుమారు 250 పర్యాయములు కనిపించును. అందువలన దీనిని స్తుతుల గ్రంథము అన్నారు. ఆశ్రయించుట, శరణుజొచ్చుట అను హెబ్రీ పదమగు khaw - saw 70 పర్యాయాలు కీర్తనల గ్రంథములో కలదు. కనుక కీర్తన గ్రంథములో శరణుజొచ్చి మొర పెట్టుట కూడా ముఖ్య అంశము. మొఱకు దేవుడు జవాబివ్వగా మనము స్తుతించుదుము. సెలా అను పదము 71 పర్యాయములు కనిపించును. సెలా అనగా ఆగి ఆలోచించాలి. కనుక సెలా అను పదము కనిపించిన తరువాత ఆగాలి. ఒక అంశము అక్కడికి ముగించినదని తలంచాలి.

కీర్తనల గ్రంథమును నాలుగు విధములుగా విభజించవచ్చును.

A. **కీర్తనలు వ్రాసినవారు:** 1) దావీదు 73+3 కీర్తనలు, 2) కోరహు కుమారులు 12 కీర్తనలు, 3) ఆసాపు (50,73–83) 12 కీర్తనలు, 4) సొలొమోను (72,127) 2 కీర్తనలు, 6) మోషే (90) 1 కీర్తన, 6) ఏతాను (89) 1 కీర్తన, 7) అనాథ కీర్తనలు – 46 (దావీదు?) మొత్తము 150

B. **కీర్తనల అంశములు**: 1) స్తుతి కీర్తనలు - 60, 2) ప్రార్థన కీర్తనలు - 40, 3) యాత్రా కీర్తనలు–15, 4) మెస్సీయ కీర్తనలు–15, 5) రారాజు రాజ్య పాలన–8 6) దుష్టులు–నీతిమంతులు–8,7) పరిశుద్ధ గ్రంథము–4. మొత్తము 150,

**C. కీర్తనల గ్రంథములోని ఐదు స్కంధములు (41+31+17+17+44=150)**

**ప్రథమ స్కంధము: 41 కీర్తనలు (1+13+13+13+1=41 కీర్తనలు)**

అంశము:– పాపియైన మానవునిపై దేవుడు అనుగ్రహించిన ఆశీర్వాదములు (1) కాని మానవుడు దేవునిపై తిరుగుబాటుచేసిపడిపోయి–శత్రువుఅయ్యాడు (2–14) క్రీస్తు ద్వారా నిత్యరక్షణ, ఆశీర్వాదము ఏర్పరచబడినది. (16–27, 28–40) ముగింపులో శాశ్వత స్తుతి (41)

**ద్వితీయ స్కంధము:42–72 కీర్తనలు (2+7+5+17–31 కీర్తనలు)**

అంశము: శ్రమనుబట్టి ఇశ్రాయేలీయులు దేవునికి మొర పెట్టగా (42–43) దేవుడు రక్షించాడు.(43–50), ఆత్మీయజీవితములో వెనుకబడుట, శత్రువుతో పోరాటము, తరచూ ఓటమిని (51–57) రుచించారు. దేవుడు విమోచన కార్యము సమాప్తి చేసి పాలన చేయును (58–72)

**తృతీయ స్కంధము: 73–89 కీర్తనలు (11+6=17 కీర్తనలు)**

అంశము:–విమోచింపబడినవారు దేవునితో, మానవులతో కలిగి ఉండవలసిన పవిత్ర సంబంధము(78–83), దేవుని యెడల కలిగి ఉండవలసిన విధులు(84–89).

చతుర్ధ స్కంధము: 90–106 కీర్తనలు అంశము: భూమి మీద అవసరతలు (90–94, ఆశించినవి (95–100), అనుభవించు విశ్రాంతి (101–106).

**పంచమ స్కంధము. 107–150 కీర్తనలు (13+6+3+6+6=44 కీర్తనలు)**

అంశము: స్తుతులు వాక్యము యొక్క ప్రాముఖ్యత (107–119) యెరూషలేము యాత్ర (120–134), చివరలో స్తుతులు (135–137), ప్రార్థన (138–143) స్తుతితో (144–150) ముగింపు. కీర్తనల గ్రంథములోని ప్రతి సంధము యొక్క ముగింపులో ఆమేన్ అని ఉన్నది.

## తృతీయ స్కంధము = 73-89 కీర్తనలు

**పీఠిక:-తృతీయ స్కంధములో ఆసాపు-11(73-83), కోరహు కుమారులు-4(84-85,87-88), దావీదు-1(86), ఏతాము-1(89) వ్రాశారు.** ఆసాపు అంటే 'సమకూర్చు వాడు" అని అర్థము. ఆసాపే అన్నీ కీర్తనలు వ్రాయలేదని ఆసాపు వంశములో ఎవరు వ్రాసినా ఆసాపు పేరుతో సమకూర్చారని పండితులు తలుస్తారు. బబులోను చెరలో ఎవరో ఈ కీర్తన వ్రాసి ఉంటారని తలంచవచ్చు. ఎందుకంటే బబులోనులోనున్న యూదా వారి భక్తిహీనత ఈ కీర్తనలలో బాగా కనిపిస్తుంది. బబులోనీయులు అభివృద్ధి పొందుచున్నారు. ఇశ్రాయేలీయులు శ్రమలు పొందుచున్నారు. అట్టి పరిస్థితులకు కారణము తెలుసుకొని ఈ కీర్తనలు వ్రాశారు.

## 73వ కీర్తన (2 + 4 + 4 + 4 + 4 + 4 + 4 + 2 = 28వ.)

### అంశము:- భక్తిహీనుల అంతమును గురించిన ధ్యానము.

**1-2వ. దేవుని దయాళుత్వము:-** ఇశ్రాయేలీయుల యెడలను శుద్ధహృదయుల యెడలను దేవుడు దయాళుడు. ఇశ్రాయేలు ఆయన ద్రాక్షతోట, యూదా ఆయనకు ఇష్టమైన వనము (యెష 5:7). అయినను పాపము చేసినపుడు చెరకు పంపాడు. పశ్చాత్తాపపడినపుడు చెర నుండి విడిపించాడు. ఇట్టి దయగల దేవుని నేనెరుగుదును, అందుకే నా హృదయమును శుద్ధి చేసుకున్నాను అని భక్తుడు అంటున్నాడు. మానవులందరి యెడల దేవుడు దయాళుడు. నేటి దినములలో విశ్వాసులు దేవుని ఇశ్రాయేలు(గల 5:16). ఆయన దయాళుడు అని రుచి చూస్తే 1పేతురు 2:3 ప్రకారము సమస్తమైన దుష్టత్వమును, సమస్తమైన కపటమును, వేషధారణను, అసూయను, సమస్త దూషణ మాటలను మాని, క్రొత్తగా జన్మించిన శిశువులను పోలినవారై, జీవించాలి. ఈ కీర్తన చదువు మీరు క్రీస్తును రక్షకుడుగా నమ్ముకున్నారా? శుద్ధహృదయము కలిగి యుండుటకు ప్రయాస పడుచున్నారా?.

**3-6వ. భక్తిహీనులక్షేమము:-** భక్తిహీనులు క్షేమముగా యున్నారు మరణమందు వారికి యాతనలులేవు. పుష్టిగాఉన్నారు. ఇబ్బందులు, తెగులు లేవు. గర్వము కంఠహారముగా ధరించారు అందువల్ల నా కాలు జారుటకు సిద్ధమైనది, మత్సరపడితిని అని భక్తుడు ఒప్పుకుంటున్నాడు. ఇతరుల క్షేమము మనకు మత్సరము తెస్తుంది. మరి భక్తిహీనుల క్షేమము ఇంకా మత్సరముతెస్తుంది అయినా మత్సరపడవద్దు అని దేవుడు అంటున్నాడు. సామె 3:31, 14:30, 23:17.

**7-10వ. భక్తిహీనుల ఆలోచనలు:-** వారి ఆలోచనలు బయటికి కనిపించుచున్నవి కొవ్వు,ఎగతాలి,బలత్కారము,గర్వము, కీడు, వారిఆలోచనలను తెలియజేయుచున్నాయి. వారి

నాలుక భూసంచారము చేస్తుంది. దేవుని మాటలు తప్ప భూలోకములోని సమస్త సంగతులు మాట్లాడుతారు అలాంటి వారంతా ఒక పక్షము చేరుతారు. దుష్టుల ఆలోచన చొప్పున నడువ వద్దని 1వ కీర్తనలో హెచ్చరించబడ్డాము కదా! మన ఆలోచనలు జాగ్రత్త.

**11-14వ. భక్తిహీనుల మాటలు:-** మహోన్నతునికి తెలివి ఉందా? అంటారు. దేవుడు అన్యాయస్థుడు అంటారు. ఎప్పుడూ నిశ్చింతగా ధనవృద్ధి చేసుకుంటారు. అవసరాలకు ధనం కావాలి కానీ జీవితమే ధన సంపాదన కాకూడదు. నిరంతర సంపాదన భక్తిహీనతను పెంచుతుంది. ఇట్టి వారిని చూచినపుడు హృదయమును శుద్ధిచేసుకొని చేతులు కడుగుకొని నిర్మలుడనై ఉండుట వ్యర్థమే అని భక్తుడు వాపోవుచున్నాడు. యధార్థముగా ఈనాడు సంపాదిస్తే ఇల్లు కట్టుకోవడం కష్టము. పిల్లల చదువులు భారము అయినా మీ ప్రతి అవసరమును దేవుడు తీరుస్తాను అంటున్నాడు (ఫిలి 4:19.)

**15-18వ. దేవుని సన్నిధిలో ధ్యానము:-** భక్తిహీనులను దేవుడు క్షేమముగా ఉంచాడని ముచ్చటిస్తే నీ కుమారుల (విశ్వాసుల) వంశమును మోసపుచ్చిన వాడనవుతాను. దేవుని పరిశుద్ధ సన్నిధిలోనికి వెళ్ళి వారి అంతము ధ్యానించాలి లేకుంటే ఆయాసముగా ఉంటుంది అంటున్నాడు. దైవజనుడు ధ్యానించి సత్యము తెలియజేస్తున్నాడు. నిశ్చయముగా భక్తిహీనులు కాలు జారు చోట ఉన్నారు. ఎప్పుడు జారిపోతారో తెలియదు ఇది సత్యము.

**19-22వ. భక్తిహీనుల అంతము:-** క్షణములోనే పాడైపోతారు మహాభయము చేత నశిస్తారు. ఒక ధనవంతుని భూమి సమృద్ధిగా పండింది. ముందుగా ధనవంతుడు, మళ్ళీ సమృద్ధి పంట, మత్సరము కలుగదా? అయితే ఆ రాత్రే వాడు చనిపోయాడు. ఎంత విచారము ఇది భక్తిహీనుల అంతము. మెళకువ రాగానే కనిన కలను మరచిపోవునట్లు దేవుడు వారి జీవితాన్ని తృణీకరిస్తాడు అది గ్రహింపలేని పశుప్రాయుడను మృగమువంటివాడను అంటున్నాడు. వాక్య గ్రహింపులేకుంటే మనము కూడా పశుప్రాయులమయ్యే అవకాశం ఉంది.

**23-26వ. దేవుని నడిపింపు:-** పశుప్రాయుడనయినను నీవు నా కుడిచేయి పట్టుకొని యున్నావు. నేను నీయొద్దే యుంటాను. నీ ఆలోచనచేత నడిపిస్తావు. మహిమలో చేర్చుకొంటావు. ఎంత నిరీక్షణ మనకు ఉన్నది. నీవు తప్ప నాకెవరూ లేరు. నీవుండగా నాకేది అక్కరలేదు. అంటే నీ తర్వాతనే అన్నీ అని. శరీరము క్షీణించి మంటికి మన్ను చేరుతుంది. నా ఆత్మ నీదగ్గరకు వస్తుంది. నా ఆశ్రయ దుర్గము నీవే.

**27-28వ. ఆఖరు మాట:-** దేవుని విసర్జించువారు నశిస్తారు. యెహోవాను విసర్జించుట

వ్యభిచరించుటతో సమానము. నాకైతే నీపొందు ధన్యకరము. సాతానుపొందు నాశనకరము నీ శరణుజొచ్చి ఉన్నాను. నీ సర్వకార్యములను తెలియజేయు తెలివిని అనుగ్రహించు అని ముగిస్తున్నాడు. మన పొందు ఎవరితో దేవునితోనా? సాతానుతోనా? (1 యోహా 2:15-16)

## 74 వ కీర్తన. (3 + 5 + 4 + 5 + 6 = 23వ)

**అంశము - పీఠిక: దేవుని సహాయము కొరకు ప్రార్థన.-8 వ. లో దేవుని మందిరములను బొత్తిగా అణగద్రొక్కుదమనుకొని దేశములోని వాటన్నిటిని వారు కాల్చియున్నారు అని చెప్ప బడింది. దీన్ని బట్టి బబులోను చెర కాలములో వ్రాయబడినదని తలంచవచ్చు (యిర్మీ 52:13, 17-20).**

**1-3వ. శత్రువులు పరిశుద్ధ స్థలమును పాడు చేసియున్నారు:-** ఎందుకు పాడు చేశారు ఇశ్రాయేలీయులు దేవుని మాట వినలేదు. చెడునడతను నడిచారు. తగ్గింపు లేదు మనసును కఠినపరచుకున్నారు. ముఖ్యంగా యెహోవాను విడిచి విగ్రహారాధికులయ్యారు అందుకే తన పేరు పెట్టబడిన పరిశుద్ధ మందిరమును పాడుచేయడానికి దేవుడు శత్రువులకు అవకాశము ఇచ్చాడు. (2దిన 36:11-19) ఇపుడు మనమే ఆయన ఆలయము. దేవుని ఆలయము పాడుచేస్తే మనలను పాడుచేస్తాడు (1కొ3:16-17) మేము మీ గొర్రెలమే కదా మీరు విమోచించిన సమాజమే కదా. జ్ఞాపకం తెచ్చుకో దేవా అని ప్రార్థించుచున్నారు. నీ జీవితము కూడ పాడైన దశలో ఉంటే దేవునికి ప్రార్థించు.

**4-8వ. శత్రువులు మందిరమును దేశమును కాల్చియున్నారు:-** యాకో 4: 7లో కాబట్టి దేవునికి లోబడియుండుడి, అపవాదిని(సాతాను) ఎదిరించుడి, అప్పుడు వాడు మీయొద్ద నుండి పారిపోవును. ఇశ్రాయేలీయులు దేవునికి లోబడలేదు. అందుకే శత్రువులు మందిరమును దేశమును పాడుచేశారు. చెరకు తీసుకొనివెళ్ళారు. విరోధులు ఆర్భటించుచు విజయధ్వజమును ఎత్తి యున్నారు. గొడ్డళ్లను సమ్మెటలను చేతపట్టుకొని దాని విచిత్రమైన పనిని బొత్తిగా విరుగగొట్టు చున్నారు. దేవుని నామమందిరమును నేల పడగొట్టి అపవిత్ర పరచుచున్నారు. దేశములోని వాటినన్నిటిని వారు కాల్చియున్నారు. ఈ పరిస్థితి ఎందుకు? దేవుని మాట వినకపోవడం వల్లనే కదా? మన పరిస్థితి ఏంటి?

**9-12వ. సూచక క్రియలు లేవు, ప్రవక్తలు లేరు:-** ఇశ్రాయేలీయుల చరిత్ర అంతా సూచక క్రియలే. ఎర్ర సముద్రము పాయలు కావడము. నీటి గోడల మధ్య ఆరిన నేల మీద నడవడము, మన్నా కురవడము, మేఘస్తంభము, అగ్నిస్తంభము, యొర్దాను నిలిచిపోవుట,

యెరికో కూలుట, ఒకటేమి లేక్కలేన్ని సూచక క్రియలు అన్నీ నిలిచి పోయాయి. ప్రవక్తలు లేరు. ఇది ఎంతకాలము జరుగునో దాని నెరిగినవాడు మాలో ఎవడునులేడు. పురాతన కాలము నుండి మీరే మా రాజు రక్షణ కలుగ జేయువారు మీరే కదా అని వాపోవుచున్నారు దేవుని వదిలితే అంతా అయోమయమే జాగ్రత్త.

**13-17వ. గత కాలపు మేలులు:-** నీ బలముచేత ఎఱ్ఱ సముద్రమును పాయలుగా చేసితివి జలములలో భుజంగముల శిరస్సులను (ఫరోఅధికారులను ) నీవు పగుల గొట్టితివి. మకరము (ఫరో) యొక్క శిరస్సును నీవు ముక్కలుగా గొట్టితివి. ఎడారిలో జలధారలను ప్రవహింప జేశావు. సూర్యచంద్రులను సృజించావు. భూమికి సరిహద్దులను కాలములను ఏర్పాటు చేసినవాడా అని మొరపెట్టు చున్నారు.

**18-23వ. ప్రార్థన:-** యెహోవా, శత్రువులు నీ నామమును దూషించుటను మనస్సునకు తెచ్చుకొనుము. దుష్ట మృగమునకు(కల్దీయుల రాజకు)నీగువ్వ(ఇశ్రాయేలీయులను) యొక్క ప్రాణము నప్పగింపకుము. శ్రమనొందు నీ వారిని నిత్యము మరువకుము. బలత్కారులు ఉన్నారు. మాతో చేసిన నిబంధన జ్ఞాపకము చేసికోనగలిగిన వారిని నీ మార్గము విడిచి వెళ్ళనియ్యకుము. శ్రమ నొందినవారిని దరిద్రులను నిన్ను స్తుతించునట్లు చేయి దేవా, లెమ్ము కల్దీయులపై నీ వ్యాజ్యెము నడుపుము. అవివేకులు దినమెల్ల నిన్ను నిందించుసంగతి జ్ఞాపకము చేసికొనుము. నీమీదికి లేచువారి అల్లరి నిత్యము బయలుదేరుచున్నది. నీ విరోధులు చేయు గల్లత్తును మరువకుము. మన ప్రార్థన కూడా ఇదే.

## 75వ కీర్తన. (1 + 2 + 2 + 2 + 2 +1 = 10వ.)

**అంశము - పీఠిక :-** సమీపముగా ఉన్న దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుట.- మొదటి వచనంలోనే కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాను అన్నాడు కాబట్టి ఇది స్తుతి కీర్తన ముగింపులో కూడా స్తుతే (9) ఇది నిత్య స్తుతికీర్తనగా చూడవచ్చు. 74 కీర్తనలో వారు చేసిన ప్రార్థనకు జవాబు వచ్చింది కాబట్టి. ఈ కీర్తనలో కృతజ్ఞతలు చెల్లిస్తున్నారని అర్థము చేసుకో వచ్చు. ఇబ్బందులలో మొరపెట్టాము. దేవుడు జవాబు ఇస్తాడు. కృతజ్ఞతలు చెల్లించడము మరచిపోతాము. నా ప్రార్థనబట్టి దేవుడు జవాబు ఇచ్చాడు అనుకుంటాము. నెబుకద్నెజరు దేవాలయపు ఉపకరణాలన్నిటిని ముక్కలు చేశాడు. కాని సముద్రము తొట్టిని ముక్కలు చేయలేకపోయాడు. నీరు కలిగిన సముద్రపు తొట్టి దేవుని వాక్యానికి సూచనగా ఉంది అంటే దేవుని వాక్యమును ఎవరూ నాశనము చేయలేరు. బైబిలును ప్రపంచములో లేకుండా చేయాలని

ఎందరో ప్రయత్నము చేశారు. ఒకాయన బైబిలును కాల్చి సమాధిచేసి ఇదే ఆఖరు బైబిలు అని దానిపై వ్రాశాడట. అయిన ఇప్పటికి బైబిలు నిలిచి ఉంది. తొట్టిని ముక్కలు చేయకుండా తయారు చేయుటకు సోలోమోను ఎంతోకష్టపడ్డాడు. అలాగే మనము కూడా ప్రభువు పనికొరకై కష్టపడాలి (కొల1:24). పౌలు అంటున్నాడు నావంతు అని పౌలు ఆలాగు అంటే నీకు నాకు వంతు ఉందన్న మాట.

**1వ. దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుట:-** దేవా, నీవు సమీపముగా నున్నావని కృతజ్ఞతా స్తుతులు చెల్లించుచున్నాము. నరులు నీ ఆశ్చర్యకార్యములను వివరించుదురు. దేవుడు సమీపముగా ఉన్నాడు. మన మాట వింటాడు. మనము స్తుతించాలి. ఈయన కంటికి కన బడడు. అయితే సమీపముగా ఉన్న దేవునికి అందుకే స్తుతులు చెల్లిస్తూ ఉన్నాము. తనకు నిజముగా మొఱ్ఱపెట్టువారి కందరికి యెహోవా సమీపముగా ఉన్నాడు.(కీర్త 14 5:18-20, యెష46:4) ఏలయనగా మనము ఆయనకు మొఱపెట్టునప్పుడెల్ల మన దేవుడైన యెహోవా మనకు సమీపముగానున్నట్టు మరి ఏ గొప్పజనమునకు ఏ దేవుడు సమీపముగా నున్నాడు? (ద్వితీ4:1) అని మోషే అంటున్నాడు. మనకు ఏ డాక్టరైనా cancer బాగు చేస్తే చెప్పకుండా ఉ ంటామా? వాక్య వరము లేకపోయినా ఆయన చేసిన ఆశ్చర్య కార్యములను వివరించవచ్చు అన్నిటి కంటే రక్షణ ఆశ్చర్యకార్యము - రక్షణను ప్రకటిస్తున్నారా?

**2-3వ. దేవుడు తీర్పు తీర్చువాడు:-** దేవుడు యుక్త కాలమును కనిపెట్టి న్యాయమును బట్టి తీర్పు తీర్చును. యుక్తకాలము అనగా ఇశ్రాయేలీయుల చెర విడుదలకు 70 ఏండ్లు. భూమిని దాని నివాసులను లయపరచే దినము తెలియదు. అది దొంగ వచ్చినట్లు వచ్చును. ఆకాశములు గతించి పోవును, పంచ భూతములు లయమై పోవును. దానిని ఆశతో అపేక్షించుచు మీరు పరిశుద్ధమైన ప్రవర్తనతోను భక్తితోను ఎంతో జాగ్రత్తగలవారై యుండవలెను. (2పేతు3:10-12)

**4-5వ. గర్విష్ఠులను గద్దించువాడు:-** దేవుని బిడ్డలలో కూడ అహంకారము ఉంటుంది. ఒప్పుకోము, ఉందని కూడా తెలయదు.ఇదే హృదయపు మోసం అహంకారులైయుండకుడని కొమ్ము ఎత్తవద్దు, పొగరుపట్టిన మాటలాడకుడని దేవుడు ఆజ్ఞ ఇచ్చుచున్నాడు. ఇవి భక్తిహీనులకు ఎక్కవగా వస్తాయి. నెబుకద్నెజరు మీరు నమస్కరింపనియెడల తక్షణమే మండుచున్న వేడిమి గల అగ్ని గుండములో వేయబడుదురు అని ఉంటే బాగుండేది కాని నా చేతిలోనుండి మిమ్మును విడిపింప గల దేవుడెక్కడనున్నాడు? అన్నాడు. ఇవి పొగరుబట్టిన మాటలే కదా! 7 ఏండ్లు గడ్డి మేసేట్టుగా చేశాడు తరువాత బుద్ధి వచ్చింది మన మాటలు ప్రవర్తన జాగ్రత్తగా ఉండాలి.

**6-7వ. దేవుడు ఇచ్చే ఫలము:-** తూర్పునుండియైనను పడమటినుండియైనను అరణ్యము (దక్షిణము) నుండి యైనను హెచ్చు కలుగదు ఎక్కడ నుండి కలుగు తుంది. దేవుని సభా పర్వతము ఉన్న ఉత్తర దిక్కు నుండి (యెష14:14) ఎవరి దగ్గరకు పోయినా హెచ్చింపు కలుగదు. బబులోనీయులను తగ్గించాడు. బబులోను శిథిలాల నుండి మాదీయ పారశీకులను హెచ్చించాడు. దేవుడే తీర్పు తీర్చువాడు ఆయన ఒకని తగ్గించును ఒకని హెచ్చించును.

**8-9వ. భూలోకపు తీర్పు:-** అంత్య కాలములో భూమి మీద భక్తిహీనులందరు నాశన మవుతారు. మనమైతే నిత్యము ఆయన స్తుతిని ప్రచురము చేయాలి. యాకోబు దేవుని నిత్యము కీర్తించాలి.

**10వ. భక్తిహీనులు నీతిమంతులు:-** భక్తిహీనుల కొమ్ములు నేను విరుగగొట్టుదును. నీతిమంతుల కొమ్ములు హెచ్చింపబడును. మనము నీతిమంతుల గుంపులో ఉండుట ఆశీర్వాదము.

## 76వ కీర్తన (3+3+3+3=12వ)

**పీఠిక:-** ఇది స్తుతి కీర్తన-వారు బబులోను చెరలో ఉన్నారు చెర నుండి విడుదల అయిన తర్వాత అయినా ఈ కీర్తన వ్రాసి ఉండవచ్చు లేక చెరలో ఉన్నపుడు చెర నుండి విడుదలచేస్తాడు అని భావికాల నిరీక్షణలో అయినా ఈ కీర్తన వ్రాసి ఉండవచ్చు. లేదా హిజ్కియా కాలములో సన్హెరీబుపైన విజయము వచ్చినపుడైనా వ్రాసి ఉండవచ్చు

**1-3వ. దేవుని ప్రసిద్ధి:-** యూదాలో దేవుడు ప్రసిద్ధుడు ఇశ్రాయేలులో ఆయన నామము గొప్పది. షాలేములో ఆయన గుడారమున్నది సీయోనులో ఆయన ఆలయమున్నది. అక్కడ వింటి అగ్ని బాణములను కేడెములను కత్తులను యుద్ధాయుధములను ఆయన విరుగ గొట్టెను. (సెలా.) యూదా, ఇశ్రాయేలు, షాలేము, సీయోను, యెరూషలేము. ఎందుకు యూదాలో దేవుడు ప్రసిద్ధుడు? ఎందుకు ఇశ్రాయేలులో ఆయన నామము గొప్పది? ఎందుకు షాలేము, ఆలయము గురించి మాట్లడుతున్నాడు సీయోనులో ఏమి జరిగింది. శత్రువు వింటి అగ్ని బాణములు కేడెములు కత్తులు యుద్ధాయుధములతో వచ్చాడు. అక్కడ ఆయన వాటిని విరుగగొట్టెను. ఎపుడు? అష్షూరు రాజు యూదా మీదకు దండెత్తి వచ్చాడు. అతని సేవకుడు రబ్షాకే కాని మాటలు పలికాడు. హిజ్కియా ప్రార్థిస్తే అతడు ఈ పట్టణములోనికి రాడు. దానిమీద ఒక బాణమైన ప్రయోగింపడు ఒక కేడెమునైన దానికి కనుపరచడు. దానియెదుట ముట్టడి దిబ్బ కట్టడు. ఈ పట్టణము లోపలికి రాక తాను వచ్చిన మార్గమున అతడు తిరిగిపోవును. ఇదే యెహోవా వాక్కు నా

నిమిత్తము నా సేవకుడైన దావీదు నిమిత్తము నేను ఈ పట్టణమును కాపాడి రక్షింతును. అంతట యెహోవా దూత బయలుదేరి అష్షూరువారి దండుపేటలో లక్ష యెనుబదియైదు వేల మందిని మొత్తెను. ఉదయమున జనులు లేవగా వారందరును మృతకళేబరములుగా ఉండిరి. ఇటువంటి ప్రసిద్ధమైన కార్యము చేశాడు ఇంకా ఎన్నో చేశాడు. అందుకే యూదాలో ప్రసిద్ధుడు ఆయన (యెష37:33-36). ఆత్మీయముగా యూదా అంటే స్తుతి అని అర్థము. యూదాలో అనగా దేవుని స్తుతించే వారిలో దేవుడు ప్రసిద్ధుడు. ఆయన మనకు చేసిన ప్రసిద్ధకార్యము రక్షణ. ప్రభువును, ఆయన విమోచనను ఆరాధనలో జ్ఞాపకం చేసుకోవాలి. ఆయన ప్రసిద్ధి గురించే మన మాటలన్ని ఉండాలి. యెహోవా ఈ దేశమును మీకిచ్చుచున్నా డనియు, మీ వలన మాకు భయము పుట్టుననియు, మీ భయము వలన ఈ దేశ నివాసులందరికి ధైర్యము చెడుననియు నేనెరుగుదును (యెహె 2:9). యూదాలో దేవుడు ప్రసిద్ధుడని రాహాబు గుర్తించింది. యూదులు అంటే ప్రపంచం భయపడుతుంది. ప్రపంచంలో ఏ గొప్పకార్యము జరిగినా అందులో యూదుల intelligence ఉంది.

**4-6వ. తేజస్సు గల దేవుడు:-** దుష్ట మృగములుండు పర్వతముల సౌందర్యము కంటె (అంటే లోకము కంటే )నీవు అధిక తేజస్సుగలవాడవు. సమీపింపరాని తేజస్సులో ఉన్నవాడు కఠిన హృదయులు (ఐగుప్తు వారు, అష్షూరువారు) దోచుకొనబడియున్నారు వారు నిద్ర నొంది (చనిపోయి) యున్నారు. పరాక్రమ శాలులందరి బాహు బలము హరించెను. యాకోబు దేవా, నీ గద్దింపునకు రథసారథులకును గుఱ్ఱములకును గాఢ నిద్ర కలిగెను. ఎర్ర సముద్రములో ఐగుప్తు రథాలు గుర్రాలు సారధులు మునిగి చనిపోయారు.

**7-9వ. కోపపడు దేవుడు:-** 7వ. ఆయన భయంకరుడవు ఆయన కోపపడు వేళ ఆయన సన్నిధిని నిలువగలవాడెవడు? దేవునికి కోపము కూడా ఉంది ఎవరి మీద తన బిడ్డల మీద తన శతృవుల మీద . ఇశ్రయేలీయుల ప్రయాణంలో అంటే నిర్గమ నుండి ద్వితీయ వరకు 50 సార్లు, రాజుల కాలములో 40 సార్లు, ప్రవక్తల కాలములో 60 సార్లు ఆయన కోపపడ్డాడు. ఆయన కోపము మన క్రమశిక్ష కొరకే అని గమనించాలి. శత్రువుల మీద కూడా కోపగించు కుంటాడు. ఆ కోపము వారి నాశనముకే (నహూ1:2,8) దేశములో శ్రమనొందిన వారినందరిని రక్షించుటకై అంటే మనకు శ్రమలు కూడా ఉంటాయి అయితే ఆయన కాపాడుతాడు. మనకు కూడా న్యాయపు తీర్పు ఉంది. ప్రభువు ముందు నిలబడాలి.

**10-12వ. భయంకరుడైన దేవుడు:-** అధికారుల పొగరును ఆయన అణచి వేయు వాడు. భూరాజులకు ఆయన భీకరుడు. మీ దేవుడైన యెహోవాను మ్రొక్కుకొని మీ మ్రొక్కు

బడులను చెల్లించుడి. ఆదివారమే కానుకలు పట్టాలి. మనము మ్రొక్కు కోవలసినది పరిశుద్ధ జీవితం కావాలని. కనుక ముందుగా పరిశుద్ధమైన జీవితార్పణ ప్రభువుకు చేద్దాం.

## 77వ కీర్తన (3 + 3 +3 + 3 + 3 + 3 +2 = 20వ.)

అంశము:- ప్రార్థన కీర్తన - కృంగిన వేళ దేవుని సన్నిధిని ఎవరైతే నిట్టూర్పు విడుస్తారో వారు నిరీక్షణ కలిగి యుంటారు.

**1-3వ. కృంగిన వేళ నిట్టూర్పుతో దేవునికి మొఱ్ఱపెట్టుట:-** ఆసాపు భక్తుడు నా ఆత్మ కృంగిపోవుచున్నది. నా ప్రాణము ఓదార్పు పొంద నొల్లక యున్నది అంటున్నాడు దావీదు. కోరహు కుమారులు కూడా కృంగుదలను అనుభవించినవారే. ఎందుకు కృంగుదల? ఆపత్కాలము వచ్చింది. ఆపత్కాలములో కృంగిపోవుట సహజము. అంత భక్తులే కృంగిపోతే మనమెంత? అయితే భక్తులందరు కృంగినపుడు దేవునికి మొరపెట్టి జవాబు పొంది నెమ్మది అనుభవించారు. దేవునికి మహిమ రావాలంటే మనకు శ్రమలు రావాలి. మనము మొరపెట్టాలి దేవుడు విడిపించాలి. అపుడు ఆయనకు మహిమ అందుకే ఆసాపుభక్తుడు నా ఆపత్కాలమందు నేను ప్రభువును వెదకితిని నేను ఎలుగెత్తి దేవునికి మొఱ్ఱపెట్టుదును. దేవుడు చెవియొగ్గువరకు ఎలుగెత్తి మనవి చేయుదును. రాత్రివేళ నా చెయ్యి వెనుకకు తీయకుండ చాపబడి యున్నది అంటున్నాడు. అంటే జవాబు వచ్చు వరకు రాత్రంతా ప్రార్థించాలి ప్రార్థిస్తున్నామా ?

**4-6వ. గతకాలపు మేలులు జ్ఞాపకము తెచ్చుకొనుట:-** నీవు నా కన్నులు మూత పడ నీయనందున నేను కలవరపడుచు మాటలాడలేక యున్నాను. అందుకై తొల్లిటి దినములను, పూర్వకాల సంవత్సరములను నేను మనస్సునకు తెచ్చుకొందును. అపుడు గతంలో దేవుడు చేసిన మేలులు జ్ఞాపకానికి వస్తాయి. నేను పాడిన పాట రాత్రి యందు జ్ఞాపకము చేసికొందును హృదయమున ధ్యానించు కొందును. పాటలోని దేవుని కార్యాలు జ్ఞాపకానికి వస్తాయి. దేవుడు ఎంత శక్తిమంతుడో అర్థమవుతుంది ధైర్యము కలుగుతుంది. దేవా, నా ఆత్మ నీ తీర్పు మార్గము శ్రద్ధగా వెదకెను. అంటే నా శ్రమకు వచ్చిన తీర్పు అర్థమవుతుంది, నెమ్మది కలుగు తుంది.

**7-9వ. భక్తుని ప్రశ్నలు:-** భక్తుడు తన గతాన్ని తాను పాడిన పాటలను జ్ఞాపకము తెచ్చుకుని క్రింది ప్రశ్నలు వేసుకున్నాడు. ప్రభువు నిత్యము విడనాడునా? ఆయన ఇకెన్నడును కటాక్షింపడా? ఆయన కృప ఎన్నటికి లేకుండ మానిపోయెనా ఆయన సెలవిచ్చిన మాట తరతరములకు తప్పిపోయెనా? దేవుడు కటాక్షింప మానెనా? ఆయన కోపించి వాత్సల్యత చూపకుండునా?

**10-12వ. శ్రమలవల్ల దేవునిమీద ఆయాసము:-** దేవునిపై ప్రశ్నలు అడుగుటకు నాకు కలిగిన శ్రమయే కారణము అంటున్నాడు. శ్రమలు వచ్చినపుడు ఎన్నో ప్రశ్నలు వస్తాయి. (మత్త 11:1-10) యెహోవా పూర్వము జరిగిన నీ ఆశ్చర్య కార్యములను నేను మనస్సునకు తెచ్చుకొని, నీ కార్యమంతయు నీక్రియలను నేను ధ్యానించు కొందును అని ధ్యానించి తరువాత దేవుని గొప్పతనాన్ని తన ప్రశ్నలకు జవాబును కనుగొన్నాడు.

**13-15వ. శ్రమలవలన దేవుని గొప్పతనాన్ని కనుగొనుట:-** దేవుని మార్గము పరిశుద్ధ మైనది. ఆశ్చర్యక్రియలు జరిగించు మహా దేవుడు. ఆయన శక్తి, బాహుబలము వలన యాకోబు యోసేపుల సంతతి వారిని విమోచించి యున్నాడు. ఆయన విడనాడడు, కటాక్షిస్తాడు, కృప మాని పోదు, మాట తప్పిపోదు. కోపిస్తూనే వాత్సల్యత చూపుతాడు అని భక్తునికి అర్థమయింది. మనము అలాగే అర్థము చేసుకోవాలి.

**16-18వ.తన ప్రజలను విమొచించుట:-** ఈ వచనాలలో ఎర్ర సముద్రములో ఇశ్రాయేలును నడిపించిన విధానాన్ని భక్తుడు జ్ఞాపకం చేస్తున్నాడు ఎర్ర సముద్ర జలములు దేవుని చూచి దిగులు పడెను గజగజ లాడెను. 17,18 వచనాల సంభవాలు కలిగి ఉంటాయని గ్రహించాలి.

**19-20వ. విమోచన వివరము:-** దేవుని మార్గము, త్రోవలు, అడుగు జాడలు సముద్రములో నుండెను. మోషే అహరోనుల చేత నీ ప్రజలను మందవలె నడిపించితివి. ఆయన ఆశ్చర్య కార్యాలను తలచుకొని నెమ్మది పొందుదుము గాక !

## 78వ కీర్తన (16 + 17 + 6 + 3 + 9 +13 + 8 = 72వ.)

**అంశము :-** ఇది దైవధ్యానము, స్తుతి కీర్తన - ఇశ్రాయేలీయుల పట్ల దేవుని మంచి తనం-శిక్ష-ఇశ్రాయేలీయుల పశ్చాత్తాపము దేవుని వాత్సల్యత.

**1-16వ. ఇశ్రాయేలీయుల పట్ల దేవుని మంచితనము:-** ఇందులో ఇశ్రాయేలీయుల జీవితం అంతా చెప్పబడింది. ఇందులో మన జీవితం కూడా ఉంది. యెహోవా స్తోత్రార్హ క్రియలను, ఆయన బలమును, ఆశ్చర్య కార్యములను మా పితరులనుండి తెలుసుకున్నాము. ఇవి మా పిల్లలకు చెప్పాలి. వారు వారి పిల్లలకు చెప్పాలి. ఈప్రక్రియ నిరంతరము సాగాలి అని భక్తుడు అంటున్నాడు. మనము మనపిల్లలకు చెబుతూ ఉండాలి లేకుంటే మరచిపోతారు. యథార్థ హృదయాన్ని స్థిరమనస్సును గలిగి పితరులవలె తిరుగ బడకుండా ఉండుటకు దేవుడు ధర్మశాస్త్రమును ఇచ్చాడు. అయినను ఎఫ్రాయిము అనగా ఇశ్రాయేలు ధర్మశాస్త్రమును

అనుసరించలేదు. ఐగుప్తు దేశములో దేవుడు ఆశ్చర్యకార్యాలు చేశాడు. సముద్రమును పాయలు చేసి అద్దరికి నడిపించాడు. పగలు మేఘములో రాత్రి అగ్నిప్రకాశములో త్రోవ చూపాడు. బండలు చీల్చి సముద్రమంత సమృద్ధిగా త్రాగు నీరు నిచ్చాడు ఇంత మంచిదేవుని మరచి పోయారు. మనము అలాంటివారమే జాగ్రత్త.

**17-33వ. ఇశ్రాయేలీయుల తిరుగుబాటు-శిక్ష:-** అయినను వారు పాపము చేయుచు మహోన్నతునిమీద తిరుగబడ్డారు. ఆదికాండము నుండి ప్రకటన వరకు దేవుడు ఎన్నో స్తోత్రార్హ క్రియలు చేసినను దేవుని బిడ్డలు తిరుగబడుతూనే ఉన్నారు. న్యాయాధిపతుల గ్రంథంలో ఎన్నోసార్లు తిరుగబడ్డారు. దేవుడు శిక్ష పెడతాడు, పశ్చాత్తాపము వస్తుంది. దేవుడు శిక్ష తీసేస్తాడు మళ్ళీ తప్పులు మళ్ళీ శిక్షలు మన జీవితం కూడా ఇంతే. నీళ్లు, ఆహారము, మాంసము ఇస్తాడా? అని దేవుని శోధించారు. విరోధముగా మాటలాడారు. యెహోవా ఈ మాట విని కోపగించి నను దేవదూతల ఆహారము కురిపించాడు. మాంసము కొరకు విస్తారముగా పిట్టలను వ్రాల జేశాడు. అయినా వారిలో బలిసిన (క్రొవ్వెక్కిన) వారిని కోపముచేత సంహరించాడు.

**34-39వ.ఇశ్రాయేలీయుల ప్రశ్చాత్తాపము దేవుని వాత్సల్యత:-** ఆయన సంహరిం చినప్పుడు హృదయపూర్వకముగా దేవుని వెదికారు బతిమాలుకొన్నారు. మహోన్నతుడైన దేవుడు తమకు ఆశ్రయదుర్గమని విమోచకుడని జ్ఞాపకము చేసికొన్నారు. అయినను వారి హృదయము స్థిరముగా లేదు ఆయనను ముఖస్తుతి చేశారు. అయితే ఆయన వాత్సల్యసంపూర్ణుడై వారిని నశింపజేయక వారి దోషము పరిహరించాడు. కోపగించుకొనక వారు కేవలము శరీరులని గాలి వంటి వారని ఆయన జ్ఞాపకము చేసికొనెను. ఆయన వాత్సల్యతను జ్ఞాపకం తెచ్చుకుందాం.

ఆయన బాహుబలమునైనను విరోధుల చేతిలో నుండి ఆయన తమ్మును విమోచించిన దినమునైనను వారు స్మరణకు తెచ్చు కొనలేదు. ఎంత విచారము !

**40-51వ. ఐగుప్తీయుల మీదికి తెగులు పంపిన వివరము:-** ఐగుప్తులో నైలునదిని రక్తముగా మార్చాడు. జోరీగలను, కప్పలను పంపించాడు. వారి పంటను చీడ పురుగులకు మిడతల కప్పగించాడు. ద్రాక్షతీగెలను మేడిచెట్లను ఆయన పాడు చేసెను. పశువులను మందలను పిడుగులపాలు చేశాడు. ఆయన మహోగ్రతను శ్రమను కోపాగ్నిని వారిమీద కుమ్మరించెను ఐగుప్తులోని జ్యేష్ఠులనందరిని ఆయన సంహరించెను.

**52-64వ.ఇశ్రాయేలును విడిపించుటవారు తిరిగిఅవిధేయులైశిక్షింపబడుట:** అయితే తన ప్రజలను సురక్షితముగా నడిపించెను. వారి శత్రువులను సముద్రములో ముంచివేసెను. అయినను వారు మహోన్నతుడైన దేవుని శోధించి తిరుగుబాటు చేసిరి ద్రోహులైరి తొలగిపోయిరి.

దేవుడు  అసహ్యించుకొని ఆగ్రహించి ఖడ్గానికి అప్పగించాడు. దేవునికి ఎంత ప్రేమ ఉందో అంత కోపము కూడా ఉంది జాగ్రత్త.

**65-72వ. విరోధులకు నింద కలుగజేసి - ఇశ్రాయేలును తృణీకరించి యూదాను కోరుకొని దావీదును రాజుగా చేయుట:-** విరోధులకు నింద కలుగజేశాడు. ఇశ్రాయేలును తృణీకరించాడు. యూదాను కోరుకొని దావీదును రాజుగా చేశాడు. తన దాసుడైన దావీదును కోరుకొని గొఱ్ఱెల దొడ్లలో నుండి అతని పిలిపించెను. పాడిగొఱ్ఱెలను వెంబడించుట మాన్పించి తన ప్రజలైన యాకోబును, తన స్వాస్థ్యమైన ఇశ్రాయేలును మేపుటకై అతనిని రప్పించెను. ఆయన అతడు యథార్థహృదయము కలవాడైవారిని పాలించెను. కార్యముల యందు నేర్పరియై వారిని నడిపించెను. దేవుడు దావీదుపట్ల నాలుగు కార్యలు చేశాడు. కోరుకొని పిలిపించి మాన్పించి రప్పించాడు దావీదు కూడా దేవుని పట్ల నాలుగు కార్యలు చేశాడు యథార్థ హృదయుడై పాలించెను. నేర్పరియై నడిపించెను మన కుటుంబాలను సంఘాలను ఎట్లు నడిపిస్తున్నాము?

## 79వ కీర్తన (4 + 4 + 3 + 2 = 13వ.)

**అంశము:-ప్రార్థన, స్తుతి కీర్తన-యెరూషలేము పతన స్థితిని గురించి ప్రార్థించిన కీర్తన.**

**పీఠిక:-** అన్యజనులైన కల్దీయులు దేవుని స్వాస్థ్యమైన ఇశ్రాయేలు దేశంలోకి చొర బడ్డారు(2 ది 36 : 14-19 ) క్రీ.పూ 606 లోని  సంభవము. ఈ కాలంలో ఆసాపు లేడు కనుక ఆయన వంశీయులు వ్రాసి ఉండాలి లేదా ఆసాపు దీర్ఘదర్శి  కనుక జరుగబోయే భవిష్యత్తును వ్రాసి ఉండవచ్చు అదే నిజమైతే ఇది ప్రవచన కీర్తన.

**1-4వ. అన్యజనులు నీ స్వాస్థ్యములోనికి చొరబడి యెరూషలేమును పాడు చేసి యున్నారు:-** యాజకులు  జనులు అధిపతులు హేయమైన విగ్రహములను పూజించి మందిరమును అపవిత్ర పరచారు.అందువల్ల నెబుకద్నేజరు వచ్చి ఎవరిని కనికరింపక  ఖడ్గముచేత చంపాడు. దేవుని మందిరపు ఉపకరణములన్నిటిని బబులోనునకు తీసికొనిపోయాడు మందిరమును తగులబెట్టి, ప్రాకారమును పడగొట్టి, నగరులన్నిటిని కాల్చివేశాడు (2 దిన 36:17-19)

ఆ సంభవమును భక్తుడు జ్ఞాపకానికి తెస్తున్నాడు దేవా, అన్యజనులు నీ స్వాస్థ్యము లోనికివచ్చి నీపరిశుద్ధాలయమును అపవిత్రపరచి యెరూషలేమును పాడు దిబ్బలుగా చేసి యున్నారు. మనము దేవుని  స్వాస్థ్యము, దేవుడు కూడా మన స్వాస్థ్యము. అన్యజనులు దేవుని స్వాస్థ్యము లోనికి చొరబడి ఉన్నారు, కారణము ఇశ్రాయేలీయుల పాపమే. మన పాపమే అప

వాదికి అవకాశం. (ఎఫెసి4:27). నీ సేవకుల భక్తుల శవములు సమాధికిరాక ఆకాశపక్షులకు భూజంతువులకు పారవేసి వారి రక్తమునీళ్ళవలె పారబోసియున్నారు. వారిని పాతిపెట్టు వారెవరును లేరు. మా పొరుగువారికి అసహ్యులమైతిమి వారు యెగతాళి చేస్తున్నారు ఎంత విచారము !!!

**5-8వ.దేవుని కోపము ఎంత వరకు, ఎల్లప్పుడా?:-** యెహోవా, ఎంత వరకు కోప పడుదువు? ఎల్లప్పుడును కోపపడుదువా? నీ రోషము అగ్నివలె ఎల్లప్పుడు మండునా?దేవుడు తప్పుచేస్తే ఎవరినైనా శిక్షిస్తాడు శిక్షించినపుడు భరించలేక ఎంత వరకు ?ఎంత వరకు? అని వేదన కలుగుతుంది ( కీర్త 6:3, 13:1 , 90 : 13 ప్రక 6:10) క్రుంగిపోతాము. వాత్సల్యము చూపించమని వేదన పొందాలి. ఇశ్రాయేలు క్షేమము అనగా సంఘ క్షేమము కొరకై వేదన పొందాలి.

**9-11వ.పాపపరిహారము కొరకు ప్రార్థన:-** ఎంత వరకు పాప పరిహారము జరుగు నంత వరకు ఇంతే అని గ్రహించిన భక్తుడు మా రక్షణకర్తవగు దేవా, నీ నామ ప్రభావమును బట్టి మాకు సహాయము చేయుము మా పాపములను పరిహరించి రక్షింపుము అంటున్నాడు పాత నిబంధనలో ఆయన పేరు లేదు కనుక రక్షణ కర్తవగు దేవా అంటున్నాడు. క్రొత్త నిబంధనలో ఆయనకు యేసు అను పేరు పెట్టబడింది . యేసు నామములోనే పాపపరిహారమున్నది.ఏండ్లు గడవగా వారి దేవుడెక్కడనున్నాడని అన్యజనులు పలుక నేల? నీ సేవకుల రక్తమును గూర్చిన ప్రతిదండన అన్యజనులకు తెలియబడనిమ్ము. నేడు కూడా ఎంతో మంది సేవకుల రక్తము ఒలికించబడుతున్నది. అన్యజనులు తెలుసుకునే విధముగా దేవుడు చేస్తాడు. చెరలో నున్నవారిని చావుకు విధింపబడిన వారిని కాపాడుము. అనగా పాపపు చెరలో ఉండి నరకానికి వెళ్ళే వారిని కాపాడుటకు ప్రార్థించాలి పని చేయాలి.

**12-13వ. శత్రువుపై నింద- స్తుతి:-** ప్రభువా, మా పొరుగు వారు మమ్ములను నిందిం చిన పరవాలేదు నిన్ను నిందిస్తున్నారు .వారికి ఏడంతలు నిందను కలుగ జేయుము అని ప్రార్థించగా నెబుకద్నెజరుకు, బెల్షజ్జరుకు ఇంకా ఎంతోమందికి ప్రతిదండన చేశాడు. అప్పుడు నీ ప్రజలమును నీ మంద గొఱ్ఱెలమునైన మేము సదా కాలము నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించెదము తరతరముల వరకు నీ కీర్తిని ప్రచుర పరచెదము అని భక్తుడు చెప్పుచున్నాడు.

## 80వ కీర్తన (3 + 4 + 6 + 6 = 19వ.)

**అంశము పీఠిక:** చెరలో నుండి రక్షించి రప్పించుటకై ప్రార్థన. దేవా,చెరలోనుండి మమ్మును రప్పించుము (3) చెరలో ఉన్నారు. ఇది బబులోను లేదా అష్షూరు చెర కావచ్చు. ఈ కాలంలో

ఆసాపు లేడు కనుక ఆయన వంశీయులు వ్రాసి ఉండాలి లేదా ఆసాపు దీర్ఘదర్శి కనుక జరుగబోయే భవిష్యత్తును వ్రాసి ఉండవచ్చు. అదే నిజమైతే ఇది కూడా ప్రవచన కీర్తన.

**1-3వ. చెరలో నుండి రక్షించమని ప్రార్థన:-** ఇశ్రాయేలునకు కాపరీ, మందవలె యోసేపును నడిపించువాడా, కెరూబుల మీద ఆసీనుడవైనవాడా, ప్రకాశింపుము, చెవియొగ్గుము. రక్షింప రమ్ము దేవా, చెరలో నుండి మమ్మును రప్పించుము మేము రక్షణ నొందునట్లు నీ ముఖకాంతి ప్రకాశింప జేయుము.ఎంత మంచి పేర్లు ఎంత మంచి ప్రార్థన. ఆయన కాపరి. నడిపించువాడు. కెరూబుల (మహా దూతల) మీద ఆసీనుడా అనగా మహాపరిశుద్ధుడా చెరలోనుండి రక్షింప రమ్ము. నీ ముఖ కాంతి ప్రకాశింప జేయుము అంటున్నాడు ఎందుకంటే ఆయన ముఖ కాంతిలో మన రహస్యపాపములు కనబడుతాయి. మన జీవితాలు దిద్దుకోవచ్చు. మానవులందరు (1) పాపపుచెరలో ఉన్నారు ఫలితము నరకమే.మొదట ఈ చెర నుండి రక్షింపబడాలి. (2) తర్వాత యోగ్యముగా జీవించాలి లేకుంటే ఈ లోకపు చెరలో పడతాము. ఇశ్రాయేలీయులు అయోగ్యముగా జీవించి చెరలో ఉన్నారు. అది క్రమశిక్షణ కొరకైన చెర. అపుడు కూడా రక్షింప రమ్ము అని ప్రార్థించాలి ఇది నరకము నుండి రక్షణ కాదు అవిధేయతకు వచ్చిన శిక్ష నుండి రక్షణ.

**4-7వ. చెరలో నుండి మమ్ము రప్పించుము:-** యెహోవా, సైన్యముల కధిపతివగు దేవా, నీ ప్రజల మనవి నాలకింపక నీవు ఎన్నాళ్లు కోపగిస్తావు. కన్నీళ్లు వారికి ఆహారముగా పానముగా ఇస్తావు. మా పొరుగు వారికి కలహ కారణముగా శత్రువులకు అపహాస్యము ఉన్నాము. దేవా, చెరలోనుండి మమ్ము రప్పించుము. మేము రక్షణ నొందునట్లు నీ ముఖకాంతి ప్రకాశింపజేయుము అని భక్తుడు ప్రార్థిస్తున్నాడు మన ప్రార్థన కూడా అదే కావాలి.

**8-13వ. ఇశ్రాయేలును దేవుడు అభివృద్ధి పరచిన రీతి:-** నీవు ఐగుప్తులో నుండి యొక ద్రాక్షావల్లిని (ఇశ్రాయేలు) తెచ్చితివి. అన్యజనులను వెళ్లగొట్టి దాని నాటితివి. దానికి తగిన స్థలము సిద్ధపరచితివి. దాని వేరు లోతుగాపారి అది దేశ మంతట వ్యాపించెను. దాని నీడ కొండలను కప్పెను. దాని తీగెలు దేవుని దేవదారు వృక్షములను ఆవరించెను. దాని తీగెలు సముద్రము వరకు దాని రెమ్మలు యూఫ్రటీసు నది వరకు వ్యాపించెను. దేవదారు వృక్షములు 200 అడుగులు ఎత్తు ఉంటాయి సముద్రము, నది, గొప్పవి. వేరు, నీడ, తీగలు వ్యాపించెను, అంటే ఇశ్రాయేలు అంత ఉన్నతి పొందింది అని త్రోవను నడుచువారందరు దాని తెంచి వేయునట్లు దాని చుట్టునున్న కంచెలను (మన చుట్టు కంచె ఉంది అయితే జాగ్రత్త మన కంచె కూడా తీసివేయగలడు) నీ వేల పాడు చేసితివి? అడవి పంది దాని పెకలించుచున్నది

పొలములోని పశువులు దానితినివేయుచున్నవి. ఎందుకు? ద్రాక్షపండ్లు ఫలింపవలెనని యెదురు చూచుచుండెను గాని అది కారు ద్రాక్షలు కాచెను (యెష5:1-6). ఫలముల గురించి దాదాపు ప్రతి పత్రికలో ఉంది. ఆత్మఫలమేమనగా, ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచి తనము, విశ్వాసము, సాత్వికము, ఆశానిగ్రహము (గలతీ 5:22) ఇంకా వెలుగు ఫలము, నీతిఫలము, సమస్తవిధములైన మంచి ఫలాలు ఉన్నాయి ఇవి లేకపోతే కారు ద్రాక్షలు కాసినట్లే. మన కాపుదల తొలగిస్తాడు జాగ్రత్త (మత్త 3:10). ఇట్టి ప్రార్థనతో ముందుకు సాగుదముగాక !!

**14-19వ. రక్షింపుమని ప్రార్థన:-** సైన్యముల కధిపతివగు దేవా, ఆకాశములో నుండి నీవు నాటిన ఏర్పరచుకొనిన ఈ ద్రాక్షావల్లిని దృష్టించుము. అది కాల్చబడియున్నది. మాకు తోడుగా ఉండుము, చెరలో నుండి మమ్ము రప్పించుము మేము రక్షణ నొందునట్లు నీ ముఖకాంతి ప్రకాశింపజేయుము. అప్పుడు మేము నీ యొద్దనుండి తొలగిపోము. అలాగు మనము కూడా ప్రార్థించుదుము గాక !

## 81వ కీర్తన (3 + 2 + 2 + 3 + 3 + 3= 16వ.)

**అంశము-పీఠిక:-** పండుగలో దేవునికి చేయవలసిన ఆనంద గానము. -7వ వచనంలో ఆపత్కాలమునందు నీవు మొఱ్ఱపెట్టగా నేను నిన్ను విడిపించితిని అని ఉంది. అట్లయితే ఈ కీర్తన మొఱ్ఱకు చెందిన, ప్రార్థన కీర్తన అని తలంచవచ్చు. గిత్తీత్ అను రాగము మీద పాడదగినది అని ఉంది. గిత్తీత్ అంటే ద్రాక్ష గానుగ అని అర్థము అంటే శ్రమ అని. ద్రాక్షలు శ్రమపడి సంతోషకరమైన ద్రాక్షరసమునిస్తాయి. అలాగే ఇశ్రాయేలీయుల(విశ్వాసుల)కు శ్రమల తరువాత ఆనందము వస్తుంది. మనలను కూడా దేవుడు అపుడపుడు ద్రాక్షల గానుగలో వేస్తాడు అది క్రమశిక్షణ కొరకే గాని శిక్ష కొరకు కాదు. గిత్తీత్ హెబ్రీ పదము కాదు. గాతు నుండి వచ్చిందని వేదాంతుల అభిప్రాయము. ఈ రాగము మీద 8,81,84 కీర్తనలు వ్రాయబడ్డాయి. ఇది ఐగుప్తు లోని ద్రాక్షాగానుగ అని 6, 7 వచనాలను బట్టి తెలుస్తున్నది.

**1-3వ. బలమైన దేవునికి ఆనంద గానం చేయు విధము:-** ఇశ్రాయేలీయులు బలమై యున్నదేవునికి ఆనంద గానము చేయాలి. యాకోబు దేవునిబట్టి ఉత్సాహధ్వని చేయాలి. యాకోబు దేవుడు అంటే మోసగాని దేవుడు అని. నీవు మోసగానివే అని జ్ఞాపకము చేస్తున్నాడు నేను నిన్ను విమోచించాను అయినా నీలో మోసముంది మనలో మోసము ఉందా? ఉంది ఉంది. సరిదిద్దు కోవాలి. కీర్తన యెత్తాలి. గిలక తప్పెట పట్టుకొనాలి. స్వరమండలమును మనోహరమైన సితారాను వాయించాలి. మన దేశంలో వాయిద్యాలు వాయించే వారిని ప్రత్యేకించలేదు. ప్రాశ్చాత్య

దేశాల్లో ఉంది. ఇశ్రాయేలీయులలో లేవీయులు ప్రత్యేకించబడ్డారు. అమావాస్యనాడు, మనము పండుగ ఆచరించుదినమగు పున్నమ నాడు కొమ్ము ఊదాలి. కొమ్ము యాజకులు ఊదాలి (ఎజ్రా3:10). అమావాస్యనాడు అంటే ప్రతినెలమొదటిరోజు కొమ్ము ఊదాలి అని. పండుగదినము 1) పొంగని రొట్టెలపండుగలో అంటే పస్కా. మొదటి నెల 14న వస్తుంది. 15 లేదా పున్నమి రోజు అవుతుంది. 2). తరవాత 50 రోజులకు వారముల పండుగ అనగా పెంతకోస్తు పండుగ. 3) పర్ణశాలల పండుగ ఇది 7వ నెల 1 రోజు అంటే అమావాశ్య రోజు వస్తుంది (ద్వితీయ16:16). ఈ దినాల్లో ఊదాలి.

**4-5వ. ఇశ్రాయేలీయులకు దేవుడు ఇచ్చిన కట్టడ:-** ఇది దేవుడు ఇచ్చిన కట్టడ నిర్ణయం నియామకం. యాజకులారా మీరు బూరలు ఊదండి. లేవీయులారా కీర్తన ఎత్తండి గిలక తప్పెట వాయించండి. ఆయన యోసేపు సంతతికి సాక్ష్యముగా దానిని నియమించాడు. నియామ కాలను పాటించాలి.

**6-7వ.ఐగుప్తునుండి బయటికి తెచ్చుటలో దేవుడు చేసిన కార్యములు:-** వారి భుజము నుండి నేను బరువును దింపగా వారి చేతులు మోత గంపల నెత్తకుండ విడుదల పొందెను. దాన్ని జ్ఞాపకం చేసుకోవాలి. వారిచేత పశువుల మాదిరి పని చేయించేవారు. మోషే వారి భారాలు చూశాడు. మోషే బాధపడుచున్నాడు. దేవుడు బాధపడుచున్నాడు. ఆపత్కాలము నందు నీవు మొఱ్ఱపెట్టగా నేను నిన్ను విడిపించితిని.

ఉరుము దాగు చోటులో నుండి నీకు ఉత్తరమిచ్చితిని. మెరీబా జలముల యొద్ద నిన్ను శోధించితిని. (సెలా.) విడిపించాడు ఉత్తరమిచ్చాడు. అపుడే మరలా శోధించారు. మనము కూడా అంతే. అయితే ఆకలితో చంపడు. దేవుడు ఇబ్బందుల కొలిమిలో నలిపి వేస్తాడు. యూదా వాడయిన యేసు నలిగిపోయాడు. అందరికి ప్రయోజకుడయ్యాడు

**8-10వ. సీనాయిలో దేవుడు చేసిన నిబంధన:-** నా ప్రజలారా, ఆలంకింపుడి. నేను మీకు సంగతి తెలియజేతును. అయ్యో ఇశ్రాయేలూ, నీవు నా మాట వినినయెడల ఎంత మేలు! ఏమాట? ఆయన ధర్మశాస్త్రము ఇచ్చాడు 10 ఆజ్ఞలు 4 ఆజ్ఞలు దేవునివి 6 మానవునివి. దేవుని వాటిలో విశ్రాంతి దినము తప్పారు. అన్యులదేవతలలో ఒకటియు నీలో ఉండకూడదు అన్యుల దేవతలలో ఒకదానికిని నీవు పూజ చేయకూడదు. అయితే ఐగుప్తు విగ్రహారాధన నేర్చుకున్నారు. ఐగుప్తీయుల దేశములో నుండి నిన్ను రప్పించిన నీ దేవుడనగు యెహోవాను నేనే. నీ నోరు బాగుగా తెరువుము. నేను దాని నింపెదను. అంటే ప్రార్థన చేయ నేర్పుతాడు. నేడు ప్రార్థన కొదువగా ఉంది, నేర్చుకోవాలి.

**11-13వ. దేవుడు చేసిన నిబంధనను ఆలకించకుండుట:-** అయినను నా ప్రజలు నా మాట ఆలకింపక పోయిరి. ఇశ్రాయేలీయులు నా మాట వినకపోయిరి. మనలో ఎంతమంది ఆయన మాట వింటున్నాము. పరీక్షించుకోవాలి ఎందుకు వినలేదు? వారి స్వకీయా ఆలోచనలను బట్టి వారి హృదయము కఠినమైంది. మనము ఎవరి ఆలోచన ప్రకారము నడుస్తున్నాము అయ్యో నా ప్రజలు నామాట వినిన యెడల  అంటే ఇశ్రాయేలు నా మార్గముల ననుసరించినయెడల ఎంత మేలు!

**14-16వ. దేవునిమాట వినువారికి దేవుడు ఇచ్చు ఆశీర్వాదము:-** అప్పుడు నేను వేగిరమే వారి శత్రువులను అణగద్రొక్కుదును. వారి విరోధులను కొట్టుదును. యెహోవాను ద్వేషించువారు వారికి లొంగుదురు. అతిశ్రేష్ఠమైన గోధుమలననుగ్రహించి నేను వారిని పోషించుదును కొండ తేనెతో (మామూలు తేన కాదు)నిన్ను తృప్తి పరచుదును. అతి శ్రేష్ఠమైన వాటితో తృప్తిపరచు దేవుడు (యెషయ1:19) ఆయన మాట వింటే ఆశీర్వాదము, లేకుంటే శాపము.

## 82వ కీర్తన (2 + 2 + 3 + 1 = 8వ.)

**అంశము:- న్యాయాధిపతులు సరియైన న్యాయము తీర్చుటకైన దేవునికి మొర.**

**1-2వ. లోక న్యాయాధిపతుల మధ్య నీతిగల న్యాయాధిపతియైన ప్రభువు:-** 1 దేవుని సమాజములో దేవుడు నిలిచియున్నాడు. దైవముల మధ్య ఆయన తీర్పు తీర్చుచున్నాడు. 2 ఎంత కాలము మీరు అన్యాయముగా తీర్పు తీర్చుదురు? ఎంతకాలము భక్తిహీనుల యెడల పక్షపాతము చూపుదురు? దేవుడు ఒక్కడే మానవులను శిక్షించుటకు అర్హుడు. న్యాయాధిపతులు కూడా శిక్షించుటకు అర్హులు కనుక వారు దేవునితో సమానులు. కనుక ఇక్కడ చెప్పబడిన దైవములు లోకన్యాయాధిపతులు. లూకా18:4,6వ.లో  అన్యాయస్థుడైన  న్యాయాధిపతి నేను దేవునికి భయపడకయు మనుష్యులను లక్ష్యపెట్టకయు ఉన్నానని చెప్పుటను గమనింతుము. అట్టి అన్యాయస్తులైన న్యాయాధిపతులు ఉందురు. అట్టి దైవసమానులైన న్యాయాధిపతులు అన్యాయస్థులైనను వారి మధ్య తీర్పుతీర్చువాడు దేవుడు ఒక్కడే కనుక వారిని దేవుడు మీరు ఎంత కాలము పక్షపాతముగా అన్యాయపు తీర్పు తీర్చుదురని చెప్పుచున్నాడు. సెలా అని ఇక్కడ చెప్పబడినందున మానవులలో అధికారులు అన్యాయముగా వుండువారు ఉన్నారు కనుక మానవులు అందరు ఇక్కడ ఆగి ఆలోచించాలి. లోకములో భక్తిహీనుల యెడల పక్షపాతము చూపబడు చున్నదని గుర్తించి అట్టిది జరుగకుండుటకు ప్రయత్నించాలి..

**3-4వ. దరిద్రులకు, నిరుపేదలకు న్యాయమైన తీర్పు కొరకైన ఆలోచన:-** పేదలకును

అనాథలకు, దీనులకు, దరిద్రులకు, నిరుపేదలకు, భక్తిహీనుల చేతిలో శ్రమగల వారిని తప్పించి న్యాయము తీర్చుడని దేవుడు చెప్పుచున్నాడు. కనుక మనము ఆలాగు ప్రార్థించాలి.

**5-7వ. దైవసమానులైన న్యాయాధిపతులు ఇతరులు కూలునట్లు కూలుట:-** జనులకు తెలివి లేదు వారు గ్రహింపరు. వారు అంధకారములో ఇటు అటు తిరుగులాడుచు కూలుచున్నారు. దైవసమానులైన న్యాయాధిపతులు దైవములని సర్వోన్నతుని కుమారులని దేవుడు సెలవిచ్చినను వారు అన్యాయస్థులై దేవునికి భయపడక మనుష్యులను లక్ష్యపెట్టక యున్నారు. ఇతర మనుష్యులు చనిపోవునట్లు వారును చనిపోవుదురని, అధికారులలో ఒకడు కూలునట్లు కూలుదురని దేవుడు సెలవిచ్చుచున్నాడు.

**8వ.భూమి మీద జనులకు తీర్పు తీర్చుమని దేవునికి మోరపెట్టుట:-** దేవా లెమ్ము భూమికి తీర్పు తీర్చుము అనగా భూమిమీద వున్న అన్యాయస్థులైన న్యాయాధిపతులకు దేవుడు బుద్ధి చెప్పి ఆన్యులైన దీనులకు, దరిద్రులకు న్యాయము జరిగించినయెడల అన్యజనులందరు దేవునికే స్వాస్థ్యముగా ఉందురు.

## 83వ కీర్తన (4 + 4 + 4 + 3 = 18వ.)

**అంశము:-** ఇది ఒక ప్రవచన కీర్తనగా తలంచవచ్చు. యూదా వారి మీదకు శత్రువులు దండెత్తి వచ్చి ఇశ్రాయేలను పేరు ఇకను జ్ఞాపకము రాకపోవునట్లు జనముగా నుండకుండ వారిని సంహరించుదము రండని చెప్పు కొనుచుండగా యూదా వారు శత్రువునుండి తప్పించుమని దేవునికి పెట్టిన మొర బహుశా 2 దిన 20వ అధ్యాయములో మోయాబీయులును, అమ్మోనీయులును, మెయోనీయులలో కొందరును దండెత్తి యెహోషాపాతు మీదికి వచ్చినపుడు యెహోషాపాతు భయపడి యూదాయంతట ఉపవాసదినము చాటించి యెహోవా యొద్ద విచారించుటకు మనస్సు నిలుపుకొనిన సందర్భము కావచ్చును. ఆలాగే ప్రవచన కీర్తన నెరవేర్పుగా ఈ శతాబ్దకాలములో 1967 తమ చుట్టూవున్న మహమ్మదీయులు దండెత్తివచ్చి ఆరు దినములు యుద్ధము చేసిన సందర్భములో యూదులు పెట్టిన మొర కాబోలు.

**1-4వ. శత్రువులు చేయు అల్లరి, కపట అపాయమును బట్టి ప్రార్థించుట:-** దేవా, ఊరకుండకుము అని ముమ్మారు చెప్పుచు, నీ శత్రువులు, నిన్ను ద్వేషించు వారు నీ ప్రజలమీద కపటోపాయములు పన్ని అల్లరి చేయుచున్నారు. వారు ఇశ్రాయేలను పేరు ఇకను జ్ఞాపకము రాకపోవునట్లు జనముగా నుండకుండ వారిని సంహరించుదము రండని చెప్పుకొనుచున్నారు. 2దిన20వఅధ్యాయములో మోయాబీయులును, అమ్మోనీయులును, దండెత్తి యెహోషాపాతు

మీదికి వచ్చినపుడు యెహోషాపాతు భయపడి యూదా యంతట ఉపవాసదినము చాటించి యెహోవాయొద్ద విచారించగా దేవుడు ఇశ్రాయేలుకు విజయమిచ్చాడు.

ఆలాగే 1967లో ఇశ్రాయేల దేశము చుట్టూ వున్న మహమ్మదీయులు (జోర్డాన్, సిరియా, ఈజిప్టు) యుద్ధముచేసి ఇశ్రాయేలను పేరు ఇకను జ్ఞాపకము రాక పోవునట్లు జనముగా నుండకుండ వారిని సంహరించుదము రండని చెప్పుకొనిరి. కాని ఇశ్రాయేలీయులు దేవునికి మొరపెట్టగా దేవుడు వారికి విజయమిచ్చి నేటికి నిలిపి యున్నాడు. 1980లో యెరూషలేమును ముఖ్య పట్టణముగా చేయుటలోను ఇశ్రాయేలీయులు మొరపెట్టగా దేవుడు సహాయము చేశాడు. 2017లో ఇశ్రాయేలీయులు మొరపెట్టగా అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్ ద్వారా ముఖ్య పట్టణముగా అమెరికా గుర్తించునట్లు దేవుడు సహాయము చేశాడు.

**5-8వ. అల్లరి చేయు శత్రువుల ఐక్యత గొప్పదైనను మన దేవుడు ప్రార్థనకు జవాబిచ్చును:-** ఇశ్రాయేలుకు విరోధముగా ఏకమనస్సుతో గుడారపు వాసులైన ఎదోమీయులును, ఇష్మాయేలీయులును, మోయాబీయులును, గ్రీయీలును, గెబలువారును అమ్మోనీయులును, అమాలేకీయులు, ఫిలిష్తీయులును, తూరు నివాసులును ఆలోచన చేసికొని నిబంధన చేసికొని యున్నారు. 8 అష్షూరు దేశస్థులు వారితో కలిసియున్నారు. లోతు వంశస్థులకు వారు సహాయము చేయుచున్నారు. ఇష్మాయేలీయులు యెహోవాయొద్ద విచారించగా దేవుడు ఇశ్రాయేలుకు వారిపై విజయమిచ్చాడు. (సెలా అనగా ఆగి ఆలోచించాలి. ఆలోచించగా మన దేవుడు ప్రార్థనకు జవాబిచ్చువాడని గుర్తించగలము).

**9-12వ. శత్రువులను నాశనము చేయుమని ప్రార్థించుట:-** 9-11వ. మిద్యానునకు నీవు చేసినట్లు కీషోను ఏటియొద్దను నీవు సీసెరాకును యాబీనునకును చేసినట్లు వారికిని చేయుము. వారు ఏన్దోరులో నశించిరి. భూమికి పెంట అయిరి. ఓరేబు జెయేబు అనువారికి నీవు చేసినట్లు వారి ప్రధానులకును చేయుము. జెబహు సల్మున్నా అను వారికి చేసినట్లు వారి సకల రాజులకును చేయుము అని ఇశ్రాయేలీయులు మొరపెట్టిరి. న్యాయాధిపతుల గ్రంథములో 6:6-16 ఇశ్రాయేలీయులు పాపము చేయగా ఇశ్రాయేలు దేశమును పాడుచేయుటకు మిద్యానీయులను పంపాడు. ఇశ్రాయేలీయులు మిద్యానీయుల వలన మిక్కిలి హీనదశకు వచ్చినప్పుడు వారు యెహోవాకు మొఱ్ఱపెట్టిరి. మిద్యానీయులవలని బాధనుబట్టి ఇశ్రాయేలీయులు యెహోవాకు మొఱ్ఱపెట్టగా గిద్యోనుతో దేవుడు నేను నీకు తోడై యుందును గనుక ఒకే మనుష్యుని హతముచేసినట్లు మిద్యానీయులను నీవు హతముచేయుదువని సెలవిచ్చాడు. 7:23-26లో నఫ్తాలి గోత్రములో నుండియు, ఆషేరు గోత్రములో నుండియు, మనష్షే

గోత్రమంతటిలోనుండియు పిలిపింపబడిన ఇశ్రాయేలీయులు కూడుకొని మిద్యానీయులను తరిమిరి. ఎఫ్రాయిమీయులందరు కూడుకొని బేత్బారా వరకు వాగులను యొర్దానును పట్టుకొనిరి. మరియు వారు మిద్యాను అధిపతులైన ఓరేబు జెయేబు అను ఇద్దరిని పట్టుకొని, ఓరేబు బండమీద ఓరేబును చంపిరి, జెయేబు ద్రాక్షల తొట్టియొద్ద జెయేబును చంపి మిద్యానీయులను తరుముకొని పోయిరి. ఓరేబు జెయేబుల తలలను యొర్దాను అవతలికి గిద్యోను నొద్దకు తెచ్చిరి. 12వ. దేవుని నివాస స్థలములను మనము ఆక్రమించు కొందమని మిద్యానువారు చెప్పుకొనిరి కాని దేవుడు ఆలాగు జరిగించలేదు.

**13-15వ. శత్రువుకు పూర్ణ అవమానము కలుగ జేయుమని ప్రార్థన:-** 2దిన 20:12 మా దేవా, నీవు వారికి తీర్పుతీర్చవా? మా మీదికి వచ్చు ఈ గొప్ప సైన్యముతో యుద్ధము చేయుటకును మాకు శక్తి చాలదు, ఏమి చేయుటకును మాకు తోచదు. నీవే మాకు దిక్కు అని ప్రార్థన చేసెను. దేవుడు శత్రువులను తరుమాలని వారికి  భీతి పుట్టించాలని ప్రార్థించిరి.

**16-18వ. సర్వలోకము దేవుడు మహోన్నతుడని ఎరుగుట:-** యెహోవా, వారు నీ నామమును వెదకునట్లు వారికి పూర్ణావమానము కలుగజేయుము. వారు నిత్యము సిగ్గుపడి భీతి నొందుదురు గాక. వారు భ్రమసి నశించుదురు గాక.  యెహోవా అను నామము ధరించిన నీవు మాత్రమే సర్వలోకములో మహోన్నతుడవని వారెరుగుదురు గాక అని ప్రార్థించగా దేవుడు ఆలాగే చేశాడు.

## 84వ కీర్తన (4 + 4 + 4 =12వ.)

**అంశము:- దేవునియందు నమ్మికయుంచి, బలమునొంది, మందిరమునందు నివసించుచు, నిత్యము స్తుతించువారు ధన్యులు.**

**విభజన:-** సెలా అను పదము నాల్గవ వచనము తరువాత, ఎనిమిదవ వచనము తరువాత ఉండుటనుబట్టి 1-4 వచనములు ఒక భాగముగాను, 5-8 వచనములు రెండవభాగము గాను, 9-12 వచనములు మూడవ భాగముగాను విభజించవచ్చును. ముందుగా 9-12వ. తరువాత 5-8వచనములు, పిమ్మట 1-4 వచనములు ధ్యానించుట సహాయకరము. ఒక్కొక్క భాగములో ఒక ధన్యతకలదు. 12వ. నీ యందు నమ్మికయుంచువారు ధన్యులు. 5వ. నీవలన బలము నొందువారు ధన్యులు. 4వ. నీ మందిరమునందు నివసించు వారు ధన్యులు. కోరహు మోషే కాలమునకు చెందినవాడు. ఆ దినములలో యెరూషలేములో దేవాలయము నిర్మించబడలేదు కనుక మందిరమనగా ప్రత్యక్ష గుడారమే.

**9-12వ. దేవుని యందు నమ్మికయుంచి, మందిర ద్వారమునొద్ద నుండుట - ఒక దినము గడుపుట శ్రేష్ఠము:-** 11-12వ. సైన్యములకధిపతివగు యెహోవా, నీయందునమ్మిక యుంచు వారు ధన్యులు. యెహోవా కృప అనుగ్రహించువాడు, ఎఫె 2:8వ. ప్రకారము కృప చేతనే రక్షణ. కొలొ 2:14వ.ప్రకారము దేవుడు వ్రాత రూపకమైన ఆజ్ఞల వలన మనమీద ఋణముగాను మనకు విరోధముగా నుండిన పత్రము మేకులతో సిలువకుకొట్టి, దాని మీది చేవ్రాతను తుడిచివేసి,మనకు అడ్డములేకుండ దానిని ఎత్తివేసి మన అపరాధములనన్నిటిని క్షమించి, ఆయనతో కూడ మిమ్మును జీవింపచేసెను. 9దేవా,మాకేడెమా,అను మాటను బట్టి దేవుడు మనలను పడిపోకుండా కాపాడువాడు. 11దేవుడైన యెహోవా సూర్యుడు అనగా వెలుతురు, వేడిగలవాడు. విశ్వాసులు దేవుని పోలి వెలుతురు కలవారుగా నుండాలి. వేడిగా నుండాలి, కాని నిర్జీవముగా నుండరాదు. యథార్థముగా ప్రవర్తించువారికి ఆయన యే మేలును చేయకమానడు. 2దిన16:9 తన యెడల యథార్థ హృదయముగల వారిని బలపరచుటకై యెహోవా కనుదృష్టి లోకమందంతట సంచారము చేయుచున్నది. యీ విషయమందు నీవు మతి తప్పి ప్రవర్తించితివి అని రాజైన ఆసా విషయము చెప్పబడినది. ఈయన యథార్థ హృదయము గల వారిని బలపరచు దేవుడు. కనుక ఈయన ఆవరణములో ఒక దినము గడుపుట వెయ్యి దినముల కంటె శ్రేష్ఠము. భక్తిహీనుల గుడారములలో నివసించక దేవుని మందిర ద్వారమునొద్ద నుండుట మన కిష్టముగా నుండాలి.

**5-8వ. దేవుని వలన బలము నొందువారు ధన్యులై, సీయోనులో దేవుని సన్నిధిని కనబడుదురు:-** 5వ. యాత్ర చేయు మార్గములు వారికి అతి ప్రియములు అనగా ఆత్మీయ జీవితము ఒక యాత్రవంటిది. 6వ. వారు బాకా లోయలోబడి వెళ్లుచు, దానిని జలమయముగా చేయుదురు. బాకా అనగా ఏడ్పు. ఆత్మీయ యాత్రలో వ్యక్తిగత జీవితములో, కుటుంబ జీవితములో, ఉద్యోగ జీవితములో, సామాజిక జీవితములో, ఆత్మీయ జీవితములోను ఏడ్చు సందర్భము లుండును. మానవ జీవితము విచిత్రమైనది. వ్యక్తిగతముగా ఆరోగ్యము, ఆర్థిక విషయాలు, ఆస్తిపాస్తుల విషయాలలో ఏడ్చిన సందర్భములుండును. కుటుంబ విషయాలలో భార్య విషయము, భర్త విషయము, కుమారులు, కుమార్తెలు, తల్లి తండ్రులు, పిల్లల రక్షణ, చదువులు, వివాహములలో ఏడ్చిన సందర్భము లుండును. ఉద్యోగములో క్రిందినున్నవారు పైవారై శ్రమ పెట్టుట, ఉద్యోగ సంబంధమైన చెడుగులు, సమాజములోని అసమానతలు, ఆత్మీయత అనగా సంఘములోని సమస్యల ద్వారా ఏడ్పుట మొదలగునవి. వీటన్నిటిలో తొలకరి వాన అనగా వాక్యమే సరిచేసి దీవెనలతో మన జీవితములను కప్పును.

7వ. ప్రకారము దేవుని వలన అనగా వాక్యము వలన బలము నొందువారుగా నుండాలి. వారు నానాటికి బలాభివృద్ధి నొందుచు ధన్యులు కావాలి. ఆత్మీయ ప్రయాణములో ప్రతివాడును సీయోనులో దేవుని సన్నిధినిలో అనగా సంఘ సహవాసములో కనబడువారుగా నుండాలి. పై అనుభవముల కొరకు మనము దేవునికి ప్రార్థన చేయాలి.

**1-4వ. మందిరము నందు నివసించువారు, నిత్యము స్తుతించు వారు ధన్యులు:-** 1వ. యెహోవా, నివాసములు అనగా సంఘములు ఎంతో రమ్యమైనవిగా నుండాలి. 2వ. యెహోవా మందిర ఆవరణములను చూచి, జీవముగల దేవుని దర్శించుటకు మన ప్రాణము, హృదయము, శరీరము ఆనందముతో కేకలు వేయుచు, ఎంతో ఆశపడుచు, సొమ్మసిల్లు వారముగా నుండాలి. 3వ. పిచ్చుకలను గురించిన ప్రస్తావన బైబిలులో ఏడు పర్యాయములు కలదు. 1) కీర్త 84:3 యెహోవా, నా రాజా, నా దేవా, నీ బలిపీఠముల నొద్దనే పిచ్చుకలకు నివాసము దొరికెను. పిల్లలు పెట్టుటకు వాన కోవెలకు గూటి స్థలము దొరికెను. 2) కీర్త 102:7 రాత్రి మెలకువగా నుండి యింటి మీద ఒంటిగా నున్న పిచ్చుకవలె నున్నాను. 3) సామె 26:2 రెక్కలు కొట్టు కొనుచు తారాడు చున్న పిచ్చుకయు దాటు చుండు వానకోవెలయు దిగకుండునట్లు హేతువు లేని శాపము తగులక పోవును. 4) మత్త 10:29 రెండు పిచ్చుకలు కాసుకు అమ్మబడును గదా. అయినను మీతండ్రి సెలవు లేక వాటిలో ఒకటైనను నేలను పడదు. 5) మత్త 10:31 మీరు భయపడకుడి. మీరనేకమైన పిచ్చుకల కంటె శ్రేష్ఠులు. 6) లూకా 12:6 అయిదు పిచ్చుకలు రెండు కాసులకు అమ్మబడును గదా. అయినను వాటిలో ఒకటైనను దేవుని యెదుట మరువబడదు. 7) లూకా 12:7 మీ తల వెండ్రుకలన్ని లెక్కింపబడి యున్నవి. భయపడకుడి, మీరు అనేకమైన పిచ్చుకల కంటె శ్రేష్ఠులు కారా? ఒక పిచ్చుక, రెండు పిచ్చుకలు, ఐదు పిచ్చుకలు, అనేక పిచ్చుకల ప్రస్తావన కలదు. యింటి మీద ఒంటిగా నున్న పిచ్చుక ఒలీవల కొండపై ఒంటిగా బంధించబడి, చంపబడిన క్రీస్తు యేసే. ఒక కాసుకు రెండు, రెండు కాసులకు ఐదు పిచ్చుకలు అనగా రెండు కాసులకు ఒక పిచ్చుక ఉచితము. కనుక పిచ్చుక విలువ లేనిది. ఆటువంటి పిచ్చుకలలో ఒకటైన దేవుని సెలవు లేకుండా నేలను పడదు. మనకైతే తల వెంట్రుకలు లెక్కించబడినవి కనుక ఒకటి నేలకు రాలుట కూడా దేవుని సెలవుతోనే. అంతమాత్రమే కాక పిచ్చుకలమైన మనకు బలిపీఠముల యొద్ద నివాసము దొరుకుట ఎంత ఆశ్చర్యము. ప్రత్యక్ష గుడారములో రెండు బలిపీఠములు కలవు. ఒకటి దహనబలి పీఠము. హెబ్రీ 13:10-12 మనకొక బలిపీఠమున్నది. 11వ. పాప పరిహారార్థముగ పరిశుద్ధ స్థలములోనికి ప్రధాన యాజకునిచేత తేబడునో, ఆ జంతువుల శిబిరమునకు వెలుపట దహింపబడును. యేసు కూడ

తన స్వరక్తముచేత ప్రజలను పరిశుద్ధపరచుటకై గవిని వెలుపట శ్రమ పొందెను. ఇది కలువరి సిలువయే. ఇచ్చటనే మన పాపములకు ప్రాయశ్చిత్తము దొరుకును. రెండవది బంగారు బలిపీఠమనబడు ధూపవేదిక. ఇది అడ్డుతెర దగ్గర ఉండును. అడ్డుతెర చింపి వేయబడినందున ఎదుటవున్న మందసము అందులోనున్న మన్నా గల బంగారు పాత్రను, చిగిరించిన ఆహారోను కర్రను, ఆజ్ఞలు గల పలకలను చూపును. ధూప వేదిక నుండి వచ్చు ధూపము ప్రార్థనను స్తుతిని పోలినది. కనుక పిచ్చుకలు మొదటి బలిపీఠము దగ్గర విమోచించబడి రెండవ బలిపీఠము దగ్గర నిత్యము దేవుని స్తుతించు అనుభవములో నుండును. ఎమాత్రము విలువ లేని పిచ్చుకల వంటి మానవులమైన మనకు ఇది ఎంత గొప్ప ధన్యత.

## 85వ కీర్తన (3 + 4 + 2 + 4 = 13వ)

**అంశము:-** ఇది ప్రార్థనా కీర్తన ప్రభువు వెయ్యేండ్ల పాలన విషయాలు కూడా ఇందులో ఉన్నాయి. ప్రార్థన మాత్రమే కాదు దేవుడు ఇచ్చిన జవాబు కూడా ఇందులో చూస్తాము.

సందర్భము: 1 వ వచనములో చెరనుండి రప్పించాడు అన్నాడు కాబట్టి ఇది బబులోను చెరకు పోయిన యాకోబు సంతతిని దేవుడు వెనుకకు రప్పించిన సమయములో వ్రాయబడినది అని చెప్పవచ్చు.

**సారంశము:** చెర నుండి విడిపించాడు. తమ దేశానికి తీసుకుని వచ్చాడు. మనము కూడా చెరలో ఉన్నట్లు ఉన్న సందర్భాలు ఉంటాయి. మొదటగా మనము పాపపు చెరలో ఉన్నాము. క్రీస్తు కృప ద్వారా విడిపించ బడ్డాము. అయినా ఆనారోగ్య సందర్భముగా గాని అర్థిక ఇబ్బందుల ద్వారా గాని రాబోయే కాలములో ప్రభుత్వము ద్వార గాని ప్రజల ద్వారా గాని చెర అనుభవించే సందర్భాలు రావచ్చు. అపుడు ఆదరణ కొరకు హెచ్చరిక కొరకు ఈ కీర్తన సరిపోతుంది.

**1-3వ. దేవుడు తన ప్రజలకు చేసిన మేలులు:-** ఈ మూడు వచనాలలో 6 మేలులు ఉన్నాయి. 1. కటాక్షము 2. చెరకు పోయిన యాకోబు (మోసగాని) సంతతిని వెనుకకు రప్పించుట 3. దోషమును పరిహరించుట 4. పాపమంతయు కప్పివేయుట (సెలా.) ఆలోచించండి. 5. ఉగ్రత అంతయు మానివేయుట 6. కోపాగ్నిని చల్లార్చుకొనుట. అందుకే ఇశ్రాయేలు వంశము నాశనము కాలేదు. మన యెడల కూడా పైమేలులు చేస్తున్నాడు. కాబట్టి మనము నిలిచి ఉన్నాము ఆయన మేలులు తలపోసి స్తుతించుదుము గాక.

**4-7వ. ఆయన ఇచ్చు రక్షణను సంతోషమును బట్టి ప్రార్థించుట:-** మా రక్షణ

కర్తవగు దేవా, మావైపునకు తిరుగుము. ఎల్లకాలము కోపము ఉంచకుము. మేము నీ రక్షణను బట్టి సంతోషించునట్లు నీవు మరల మమ్మును బ్రదికించి యెహోవా, నీ కృప మాకు కనుపరచుము.

**8-9వ. రాబోయే కాలములో ఆయన చేసే మేలులు:-** యెహోవా మాటను నేను చెవిని బెట్టాలి వింటే మేలు చేసేవాడు. ఆయన శుభమే సెలవిస్తాడు. ఒకసారి బుద్ధిహీనులై చెరకు వెళ్ళారు. వారేమి మనమేమి మరల బుద్ధి హీనులము కాకూడదు. మన దేశములో మహిమ నివసించునట్లు ఆయన రక్షణ ఆయనకు భయపడు వారికి సమీపముగా నున్నది. మన భారత దేశములో దేవుని మహిమ కనపడాలంటే సువార్తను ప్రకటించాలి. ప్రకాశింప చేయాలి (2 కొరి 4:4)

**10-13వ. అంత్య కాలములో ( రారాజుగా రాబోయే రోజులలో) ఆయన చేసే మేలులు:-** కృపా సత్యములు కలిసి కొనినవి, నీతి సమాధానములు ఒకదాని నొకటి ముద్దుపెట్టు కొనినవి. ఇప్పుడు కృప సత్యము నీతి సమాధానము లోకములో లేవు. విశ్వాసులలో కొంత ఉంది కానీ పూర్ణముగా లేవు. ప్రభువు రెండవ రాకడలో ఉంటాయి. సత్యము రక్షింపలేదు. సత్యమేమిటంటే పాపి శిక్షింపబడాలి అంటుంది. కృప రక్షిస్తుంది. భూమిలో నుండి సత్యము మొలుచును ఆకాశములోనుండి నీతి పారజూచును. ఈ రోజులలో నీతి సత్యము లేదు ఆనాడు ఉంటుంది. యెహోవా ఉత్తమమైన దానిని ననుగ్రహించును. మన భూమి దాని ఫలము నిచ్చును. నేడు భూమి ముండ్ల తుప్పలను గచ్చ పొదలను మొలిపిస్తున్నది. ఆనాడు మంచి ఫలాలను ఇస్తుంది. ప్రభువు తానే వెయ్యేండ్లు పరిపాలన చేస్తాడు. కాబట్టి నీతి ఆయనకు ముందు నడచును ఆయన అడుగు జాడలలో అది నడచును. ఆయన పరిపాలన అంతా నీతే. (సామె16:6).

## 86వ కీర్తన (3 + 4 + 3 + 3 + 2 + 2 = 17వ)

**సారాంశం:-** దావీదు కీర్తన. 6,7 వచనాలలో యెహోవా, నా ప్రార్థనకు చెవి యొగ్గుము. నా మనవుల ధ్వని ఆలకింపుము, నీవు నాకు ఉత్తరమిచ్చువాడవు. గనుక నా ఆపత్కాలమందు నేను నీకు మొఱ్ఱపెట్టెదను. అని ఉంది. మొఱ్ఱపెట్టుట, ఉత్తరమిచ్చుట అనే మాటలు ఉన్నాయి. కాబట్టి ఇందులో ప్రార్థన, ప్రార్థనకు జవాబు ప్రాముఖ్యమైన అంశం అని చూడగలము ఇది దావీదు గారి ప్రార్థన. 72 కీర్తన చివరిలో యెష్షయి కుమారుడగు దావీదు ప్రార్థనలు ముగిసెను అని ఉంది అంటే ఆయన సమకూర్చిన కీర్తనలు అంతటితో ముగిశాయి. కాని అయన ప్రార్థన కీర్తనలు ఉన్నాయి. రాజైన హిజ్కియా ఆజ్ఞ ప్రకారము సమకూర్చినపుడు ఈ కీర్తన సమకూర్చబడింది.

ప్రార్థన, మనవి, మొఱ్ఱపెట్టుట, ఒకటే. వాటికి ఉత్తరమిచ్చుట ఎంత మనోహరము. ఉత్తరమిచ్చినపుడు కృతజ్ఞతాస్తుతులు చెల్లించాలి. నేను ప్రార్థించే వాడిని, నీవు ఉత్తరమిచ్చే వాడవు అన్న మాటలు ఎక్కువగా ఉన్నాయి. కాబట్టి ఎవరికి వారు ప్రార్థించి ఉత్తరము పొందుట శ్రేయష్కరము.

**1-3వ. దేవుని కాపుదల కొరకైన ప్రార్థన:-** 1. నేను దీనుడను. మన మెట్లున్నాము. గర్విష్ఠులు నా మీదికి లేచి యున్నారు (14) గర్విష్ఠులు ఇతరుల మీదికి లేస్తారు. తిరుగబడే వారు గర్విష్టులు. దావీదు ఎవరి మీద కూడా తిరుగబడలేదు. నాతాను ప్రవక్త వస్తే సిగ్గుతో తలదించు కున్నాడు. తిరుగబడలేదు. ఎందరో రాజులు తిరుగ బడినారు.

2. దరిద్రుడగు దావీదు 6000 మణుగుల సువర్ణము దేవునికి ఇచ్చాడు. దేవునికే అంత ఇస్తే ఆయన దగ్గర ఎంత ఉండాలి. వెండి సంగతి చెప్పడానికే లేదు (1దిన 29:4) ఆరువేల మణుగుల ఓఫీరు బంగారమును పదునాలుగువేల మణుగుల పుటము వేయబడిన వెండిని ఇచ్చుచున్నాను. మనము తులాల లెక్క చెప్తాము కాని అయన మణుగుల లెక్కలో ఇచ్చాడు మరి దరిద్రుడా? ఈలోకములో ఎంత ధనవంతులమైన మనము ఆత్మీయముగా దరిద్రులము అంత సమర్పణ ఉన్న దావీదే దరిద్రుడను అంటే మనమెంత దరిద్రులమో గమనించాలి (II కొరి 8:9) మీరు మన ప్రభువైన యేసుక్రీస్తు కృపను ఎరుగుదురుగదా? ఆయన ధనవంతుడై యుండియు మీరు తన దారిద్ర్యము వలన ధనవంతులు కావలెనని, మీ నిమిత్తము దరిద్రుడాయెను. శరీర రీత్యా గాని ఆత్మీయ రీత్యా గాని మనలని ధనవంతులను చేశాడు.

3. నీ భక్తుడను మనము చెప్పుకోగలమా భక్తులమని ఎన్నోసార్లు మనము అన్యుల ఎదుట తలదించుకునే పనిచేస్తూ ఉంటాము. భక్తులలాగా జీవించడానికి ప్రయాస పడాలి. నాప్రాణము కాపాడుము అంటున్నాడు. ఏదో ఆపదలో ఉన్నట్లున్నాడు 1.నీతిమంతునికి కలుగు ఆపదలు అనేకములు. వాటి అన్నిటిలోనుండి యెహోవా వానిని విడిపించును (కీర్త 34:19) 2 లెక్కలేని అపాయములు నన్ను చుట్టుకొనియున్నవి. నా దోషములు నన్ను తరిమి పట్టుకొనగా నేను తలయెత్తి చూడలేకపోతిని లెక్కకు అవి నా తల వెంద్రుకలను మించియున్నవి నా హృదయము అధైర్యపడి యున్నది. (కిర్త 40:12) దోషము వల్ల కూడా అపాయాలు వస్తాయి (107:13).

4. నీ సేవకుడను రాజు అయినా యూదా గోత్రము వాడైనా నీ సేవకుడను అని చెప్తూ ఉన్నాడు. మనము నీ సేవ చేస్తూ ఉన్నాము అని చెప్పగలమా, నిన్ను నమ్ముకొనియున్న

నీ సేవకుడను నిజముగా దేవున్నే నమ్ముకున్నామని చెప్పగలమా ఆయనను నమ్ముకున్నాము అంటాముగానీ మరల మనుష్యుల మీద అధారపడతాము.

**4-7వ. ప్రార్థనకు జవాబు ఇచ్చువాడు:-** నీ సేవకుని ప్రాణము సంతోషింపచేయుము అంటున్నాడు. మన దేహము ఆత్మ ప్రాణములలో దేనికైనా ఆపద రావచ్చు. దేనికి ఆపద వచ్చిననూ ప్రభువుకే మొఱపెట్టాలి. ఎందుకంటే ఆయన దయాళుడు, క్షమించుటకు సిద్ధమనస్సు గలవాడు, ఎక్కువ కృప గలవాడు, ప్రార్థనకు చెవియొగ్గువాడు, ఉత్తరము ఇచ్చువాడు. మనవులను ఆలకించువాడు కనుక ఆయనకు ప్రార్థించాలి.

**8-10వ. మహిమ గల దేవుడు(ఆయన ఏమై ఉన్నడో) అని స్తుతించాలి:-** మహాత్మ్యము గలవాడు, ఆశ్చర్య కార్యములు చేయువాడు, అద్వితీయ దేవుడు. దేవతలలో అయన వంటి వాడు లేడు. ఆయన కార్యములకు సాటియైన కార్యములు లేవు. అయన మరణ పునరుత్థానములు చాలు. యేసు చేసిన కార్యములు అనేకములు కలవు. వాటిలో ప్రతిదానిని వివరించి వ్రాసిన యెడల అట్లు వ్రాయబడిన గ్రంథములకు భూలోకమైనను చాలదని నాకు తోచుచున్నది (యోహాను 22:25). నీవు సృజించిన అన్యజనులందరును వచ్చి నీ సన్నిధిని నమస్కారము చేయుదురు. నీ నామమును ఘనపరచుదురు.ఇది వెయ్యేండ్ల రాజ్యములో జరుగుతుంది.

**11-13వ. అయన ఇచ్చిన రక్షణ(ఏమిచేసాడో)బట్టి స్తుతించాలి:-** యెహోవా, నేను నీ సత్యము ననుసరించి నడచుకొనునట్లు నీ మార్గమును నాకు బోధింపుము. నీ మార్గము బోధించువాడు. ఏ చదువు చదవాలి ఏ ఉద్యోగము చెయ్యాలి నీ భవిష్యత్తులో ఏమేమి చెయ్యాలి భోదిస్తాడు ఆయనకు భయపడునట్లు మనహృదయములకు ఏకదృష్టి కలుగజేస్తాడు. అందును బట్టి పూర్ణ హృదయముతో మనము ఆయనకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించాలి. అయన నామమును నిత్యము మహిమ పరచాలి. ఆయన మన యెడల చూపిన కృప అధికమైనది. పాతాళపు అగాధమునుండి మన ప్రాణమును తప్పించి యున్నాడు అంటే రక్షించాడు.

**14-15వ. ఆయన గుణములను జ్ఞాపకము చేసుకొని ప్రార్థన:-** గర్విష్ఠులు, బలత్కారులు, నిన్ను లక్ష్యపెట్టనివారు. గుంపు కూడి నా ప్రాణము తీయ జూచుచున్నారు ప్రభువా, నీవు దయా దాక్షిణ్యములు గల దేవుడవు, ధీర్ఘశాంతుడవు, కృపాసత్యములతో నిండినవాడవు.

**16-17వ. కాపుదల,ఆదరణ కొరకై ప్రార్థన:-** నాతట్టు తిరిగి నన్ను కరుణింపుము. నీ సేవకునికి నీ బలము అనుగ్రహింపుము నీ సేవకురాలి కుమారుని రక్షింపుము. యెహోవా, నీవు నాకు సహాయుడవై నన్నాదరించు చున్నావు నా పగవారు చూచి సిగ్గుపడునట్లు శుభకరమైన ఆనవాలు నాకు కనుపరచుము.

## 87వ కీర్తన (3 + 3 + 1 = 7వ)

### అంశము:- మందిరము మహిమ.

**1-3వ. సీయోను మీద ప్రభువు ప్రేమ:-** 1.ఆయన పట్టణపు పునాది పరిశుద్ధ పర్వతము లమీద వేయబడియున్నది. మన దేవుడు పరిశుద్ధుడు ఆయన నివాసమైన మోరీయా కొండ ఆయన పట్టణము ఆయన గ్రంధము పరిశుద్ధమైనది. ప్రభువు జన్మము, జీవితము, ఆయన రాజ్యము పరిశుద్ధమైనది. 2వ. యాకోబు నివాసములన్నిటికంటె సీయోను గుమ్మములు యెహోవాకు ప్రియములై యున్నవి అంటే ఇశ్రాయేలు పట్టణములన్నిటికంటే యెరుషలేము ప్రియమైనది. 3వ. దేవుని పట్టణమా,అంటే యెరూషలేమా అని. మనుష్యులు నిన్ను గూర్చి మిక్కిలి గొప్ప సంగతులు చెప్పుకొందురు. ఆ పట్టణము 1900 సంవత్సరములు పాడై ఉంది. అయినా దేవుని పిల్లలు దానిగురించి గొప్పగా చెప్పు కుంటునే ఉన్నారు. నేడు అది మనోహరముగా కట్టబడినది ప్రభువు పరిపాలించడానికి రాబోవుతున్నాడు.

**4-6వ.ఇశ్రాయేలు ప్రభువుకు ప్రియమైనది:-** 4. రాహాబును ఐగుప్తు బబులోనును ఫిలిష్తీయ తూరు కూషులను చూడుము. ఈ దేశాలు ప్రభువుకు విరోధమైనవి అయినా వీరు పరిచయులు అని యేరూషలేములో జన్మించిరని యందురు. అంటే ప్రభువులో కొత్తగా జన్మించారు అని అర్థము. ఇప్పుడు వారిలో కొద్దిమంది నమ్ముతున్నారు. 5వ.ఆనాడు ప్రతి జనము దానిలోనే జన్మించెనని అన్నట్లు అనేక మంది నమ్ముతారు. సర్వోన్నతుడు తానే దాని స్థిరపరచెననియు సీయోనును గూర్చి చెప్పుకొందురు. 6వ. యెహోవా జనముల సంఖ్య వ్రాయించు నప్పుడు ఈ జనము అక్కడ జన్మించెనని సెలవిచ్చును. నమ్మిన వారి పేరులు జీవగ్రంధములో వ్రాయబడ్డాయి అని అర్థము.

**7వ. యెరూషలేముపై సంతోష గానము:-** పాటలు పాడుచు వాద్యములు వాయించుచు మా ఊటలన్నియు నీయందే యున్నవని వారందురు అనగా జీవజలము ఆయనే, జీవపు మాటలు ఆయనవే. జీవజలనదులు ఆయనవే, దప్పిగొనిన వానిని రానిమ్ము ఇచ్ఛయించినవానిని జీవజలమును ఉచితముగా పుచ్చుకొననిమ్ము(ప్రక22:17).

## 88వ కీర్తన (3 + 4 +3 + 4 +4 = 18వ.)

### అంశము:- ప్రార్థన,మొర్ర, మనవి దేవునితోనే.

**పీఠిక:** లేవికిముని మనుమడైన కోరహు ఇశ్రాయేలీయులలో పేరుపొందిన రెండు వందల యేబది మందితో మోషే అహరోనులను ఎదిరించాడు. నేడు దైవజనులను ఎదిరించే

వారు ఉన్నారు. దీనికి మోషే సాగిలపడ్డాడు. ఇది మనకు మాదిరి (సంఖ్యా 16:1-4). అప్పుడు యెహోవా మోషేతో కోరహు దాతాను అబీరాముల యొక్క నివాసముల చుట్టుపట్ల నుండి తొలగిపొండని సెలవిచ్చాడు. మనుష్యులందరికి వచ్చు మరణమువంటి మరణము కాకుండా యెహోవా గొప్ప వింత పుట్టించుటవలన వారు ప్రాణములతో పాతాళములో కూలునట్లు భూమి తన నోరు తెరచి వారిని వారికి కలిగిన సమస్తమును మింగివేసిన యెడల వారు యెహోవాను అలక్ష్యము చేసిరని మీకు తెలియును అన్నాడు. అతడు ఆ మాటలన్నియు చెప్పి చాలించగానే వారి క్రింది నేల నెర విడిచెను. భూమి తన నోరు తెరచి వారిని వారి కుటుంబములను కోరహు సంబంధులందరిని వారి సమస్త సంపాద్యమును మింగి వేసెను(సంఖ్యా 16:23 -32). ఆ సమూహపువారు మృతి బొందినప్పుడు అగ్ని రెండువందల ఏబది మందిని భక్షించినందునను, భూమి తన నోరు తెరచి వారిని కోరహును మింగి వేసినందునను, వారు దృష్టాంతములైరి. అయితే కోరహు కుమారులు చావలేదు. (సంఖ్యా 26:9-11). ఇది దేవుని గొప్ప కృప. ఆ దృశ్యము ఎల్లపుడు మదిలో మెదులుతుండగా ప్రభువును అర్థించిన విధానము అయన చూపిన కృపను స్తుతిస్తూ ఈ కీర్తన ఎప్పుడైనా వ్రాయబడి ఉ ండవచ్చు అని గ్రహించగలము.

**1-4, 5-7వ. ఆపదలో దేవునికి మొరపెట్టుట:-** నేను ఆపదలతో నిండి యున్నాను నా ప్రాణము పాతాళమునకు సమీపించియున్నది. సమాధిలోనికి దిగువారిలో నేనొకనిగా ఎంచబడితిని. నేను త్రాణలేనివానివలె అయితిని. భూమి నెర విడిచిన దృశ్యము కళ్లముందు కనపడగా మొర్రపెట్టాడు. యెహోవా, నాకు రక్షణకర్తవగు దేవా, రాత్రివేళ (దివారాత్రములు అని ఇంగ్లీషు బైబిలులో ఉంది) నేను నీ సన్నిధిని మొఱ్ఱపెట్టుచున్నాను అంటున్నాడు చనిపోయి సమాధిలోపడి స్మరణకురానివాని వాడనైతిని. అగాధములో నన్ను పడుకోబెట్టావు, నీ ఉగ్రత నీ తరంగములన్నియు నన్ను ముంచుచున్నవి అయినా నా ప్రార్థన నీ సన్నిధిని చేరును గాక నా మొఱ్ఱకు చెవి యొగ్గుము అంటున్నాడు.

**8-10వ. విశ్వాసముతో దేవుని స్తుతించుట:-** నా నెళవరులను నాకు దూరముగా నీవు ఉంచి యున్నావు నీవు వారి దృష్టికి నన్ను హేయునిగా చేసియున్నావు వెలుపలికి రావల్ల లేకుండ నేను బంధింపబడియున్నాను. బాధచేత నా కన్ను క్షీణించుచున్నది. యెహోవా, ప్రతి దినము నేను నీకు మొఱ్ఱపెట్టుచున్నాను. నీవైపు నా చేతులు చాపుచున్నాను. మృతులకు నీవు అద్భుతములు చూపెదవా? ప్రేతలు లేచి నిన్ను స్తుతించెదరా? అంటే బ్రతికించు నేను నీ అద్భుతములు చూస్తాను నిన్ను స్తుతిస్తాను అంటున్నాడు.

**11-14వ. నన్ను విడువ వద్దని ఉదయమున ప్రార్ధనతో దేవుని ఎదుర్కొనుట:-** సమాధిలో నీ కృపను ఎవరైన వివరింతురా? నాశన కూపములో నీ విశ్వాస్యతను ఎవరైన చెప్పు కొందురా? అంధకారములో నీ అద్భుతములు తెలియనగునా? పాతాళములో నీ నీతి తెలియనగునా? యెహోవా, నేను నీతోనే మనవి చేయుచున్నాను ఉదయమున నా ప్రార్ధన నిన్ను ఎదుర్కొనును. యెహోవా, నీవు నన్ను విడుచుట యేల? నీ ముఖము నాకు చాటు చేయుట యేల? అంటే నన్ను సమాధికి పంపితే నీ కృపను ఎట్లు వివరించగలను. నాశనకూపములోనికి పంపిస్తే నీవు నమ్మదగిన వాడవని నేను ఎలా చెప్పగలను. . అంధకారములో నీ అద్భుతములు పాతాళములో నీ నీతి ఎలా తెలుస్తుంది అందుకే యెహోవా, నేను నీతోనే మనవి చేయుచున్నాను అంటున్నాడు నన్ను విడుచుట నీ ముఖము నాకు చాటు చేయుట యేల అంటున్నాడు

**15-18వ. కలవరపడుచు ప్రార్థించుట:-** బాల్యము నుండి నేను బాధపడి చావునకు సిద్ధమైతిని నీవు పెట్టు భయముచేత నేను కలవరపడుచున్నాను. నీ కోపాగ్ని నా మీదికి పొర్లియున్నది నీ మహా భయములు నన్ను సంహరించి యున్నవి. నీళ్లు ఆవరించునట్లు అవి దినమంత నన్ను ఆవరించుచున్నవి అవి నన్ను చుట్టూర చుట్టుకొని యున్నవి. నా ప్రియులను స్నేహితులను నీవు నాకు దూరముగా ఉంచియున్నావు చీకటియే నాకు బంధువర్గ మాయెను. నీవు పెట్టు భయము నీ కోపాగ్ని దినమంత నన్ను ఆవరించుచున్నవి. చీకటియే నాకు బంధువర్గ మాయెను అని వేదన పడుతూ ప్రార్థిస్తున్నాడు. ఇక్కడ క్రీస్తు పోలికలు కనపడుచున్నాయి (లూకా 23:49).

## 89వ కీర్తన (4 + 6 +4 + 4 +5 +5 +4 +5 +4 +4 +4 + 3= 52వ.)

**అంశము: దేవుని కృప,విశ్వాస్యతనుబట్టి కలిగిన రద్దుకాజాలని నిబంధన.**

**1-4వ.కృపను బట్టి దావీదుతో చేసిన నిబంధన:-** యెహోవా నీ నిత్యమైన కృపాతిశ యమును నీ స్థిరమైన విశ్వాస్యతను బట్టి తరతరములకు నా నోటితో కీర్తించెదను అంటున్నాడు. ఆయన కృపను ఆయన విశ్వాస్యతను (నమ్మకత్వమును) గురించి మనము ఎంతైనా ధ్యానించి (కీర్త117:1,ఎఫే2:8). ఎల్లప్పుడూ స్తుతించాలి, దావీదును ఏర్పరచుకొని నీ సంతానమును నిత్యము స్థిరపరచెదను. నీ సింహాసనమును తరతరములకు స్థాపించెదనని దేవుడు ప్రమాణము చేశాడు. ఇశ్రాయేలులో నేడు దావీదు సింహాసనము లేదు. అయినా యేసు ప్రభువు వెయ్యేండ్ల రాజ్యాన్ని, యుగయుగముల పరిపాలనను జ్ఞాపకమునకు తెస్తున్నాడు (ప్రక 11:15)

**5-10వ. భుమ్యాకాశములలో కార్యములలోను, బలములోను సాటిలేని దేవుడు:-**

ఆకాశములో యెహోవాకు సాటియైన వాడెవడులేడు. పరిశుద్ధ దూతల సభలో ఆయన మిక్కిలి భీకరుడు, భయంకరుడు. సముద్రపొంగును దాని తరంగములను అణచువాడు. రహాబును, ఐగుప్తును, శత్రువులను ఆయన బాహుబలముచేత చెదర గొట్టువాడు కాబట్టి ఆకాశ వైశాల్యము పరిశుద్ధ దూతల సమాజము ఆయనను స్తుతిస్తున్నది. మనము కూడా స్తుతించ వలసిన వారమై ఉన్నాము.

**11-14వ. సాటిలేని నిర్మాణకుడు - నీతి న్యాయములలో సాటిలేనివాడు:-** ఆకాశము, భూమి, ఉత్తర దక్షిణములు, లోకము దాని పరిపూర్ణత ప్రభువునివే. ఆయన హస్తము బలమైనది.ఆయన నీతిన్యాయములు, కృపాసత్యములు ఆయన సింహాసనమునకు ఆధారము. అందువలన తాబోరు హెర్మోనులు (ఇశ్రాయేలు పర్వతములు) ఆయన నామమును బట్టి ఉ త్సాహ ధ్వని చేయుచున్నవి. మనమెలా ఉన్నాము.

**15-18వ. తన ప్రజలను హెచ్చించి ధన్యులుగా చేసిన దేవుడు:-** ప్రభువునందు సతోషించు వారు ధన్యులు. వారు ఆయన ముఖకాంతిలో నడచుకొనుచున్నారు, దినమెల్ల హర్షించు చున్నారు. ఆయన నీతిచేత హెచ్చింపబడుచున్నారు. మన హెచ్చింపు (promotion) ప్రభువు నీతి ద్వారానే అని మనము తెలుసుకోవాలి. మన ఏ నిర్ణయమైన అయన ముఖకాంతిలో జరగాలి.

**19-23వ. భక్తుడైన దావీదుకు తోడైయుండు దేవుని కృప:-** దేవుడు ప్రజలలోనుండి శూరుడైన దావీదును కనుగొని ఏర్పరచుకొని పరిశుద్ధ తైలముతో నభిషేకించాడు. హెచ్చించాడు. బలపరచాడు. శత్రువులందరి మీద జయమిచ్చాడు. విరోధులందరిని మొత్తాడు. గొర్రెలు కాచుకునే కుర్రాడి పట్ల దేవుని కృప ఎంత గొప్పదో కదా! అదే కృప మనపట్ల కూడా ఉందని మరచి పోవద్దు.

**24-28వ.భక్తుడైన దావీదును హెచ్చించిన దేవుని కృప:-** దేవుడు తన విశ్వాస్యతతో తన కృపతో దావీదును హెచ్చించాడు. సముద్రము మీద నదుల మీద అధికారము ఇచ్చాడు. దావీదు కూడా దేవుని కృపను కనుగొని దేవుని నిత్యమూ స్తుతించాడు. కనుక దావీదును ప్రధమమైన వానిగా చేసి తన నిబంధనను స్థిరపరచాడు. మనమెట్లు మన స్థానమును కాపాడు కొనుచున్నమా?

**29-32వ. భక్తిహీనులను క్రమపరచుటకు శిక్షించు దేవుని కృప:-** దావీదు సింహాసనమును అతని సంతానమును శాశ్వతకాలము వరకు ఆకాశమున్నంత వరకు నిలుపుతాడు ఆత్మీయముగా క్రీస్తు సింహాసనమును ఆయన సంతానమైన మనలను శాశ్వత

కాలము వరకు నిలుపుతాడు అయితే మనము ఆయన విధులను ఆచరించక అపవిత్రపరిస్తే శిక్షిస్తాడు.

**33-37వ. భక్తిహీనులను శిక్షించినను నిబంధనను రద్దుపరచని దేవుని కృప:-** శిక్షిస్తాడు కానీ ఆయన కృపను దూరపరచడు. విశ్వాస్యతను విడువడు. అబద్ధము ఆడి మాటను మార్చడు. నిబంధనను రద్దుపరచడు. ఇట్టి ఆయన కృపను కొంతైనా గ్రహించామా (2కోరి 9:8) సూర్యుడున్నంతకాలము చంద్రుడున్నంతకాలము స్థిరపరుస్తాడు ఆయన నమ్మకత్వము ఎంత గొప్పది. ఇట్టి ఆయన నమ్మకత్వాన్నిబట్టి ఆయనను ఎంతైనా స్తుతించాలి.

**38-41, 42-45వ. ప్రజల దుస్థితి - క్రీస్తును సిలువలో విడనాడిన కృప:-** పై విధముగా సెలవిచ్చినప్పటికీ మమ్ము విడనాడి విసర్జించియున్నావు. నీ అభిషిక్తుని మీద నీవు అధిక కోపము చూపియున్నావు. అని భక్తుడు అంటున్నాడు. అవును ఇశ్రాయేలీయులు దేవుడేర్పరచుకున్న జనాంగము. క్రీస్తు వారిలో నుండి రావడానికి క్రమశిక్ష కొరకై బహు శ్రమపరచాడు. పాపమానవాళిని విమోచించుటకై క్రీస్తును అంత కంటే ఎక్కువ శ్రమపరచాడు. యూదుల శ్రమలు. దేవుడు మనరక్షణకై సిలువలో తన కృపను విడనాడి ప్రభువును శ్రమపెట్టిన విధానము ఇక్కడ కనపడుతుంది. ఆయన శ్రమలు తలంచుకొని ప్రభువును స్తుతించుదుము గాక.

**46-49వ.దేవుని విశ్వాస్యత,కృపను జ్ఞాపకము చేయుట-** శ్రమలు మనకు కలిగినపుడు ఎన్నో ప్రశ్నలు వస్తాయి. లోకపాపమును మోసికొనిపోవు దేవుని గొఱ్ఱపిల్ల అని యేసును గురించి గొప్పగా చెప్పిన యోహాను భక్తుడు రాబోవువాడవు నీవేనా మరియొకని కొరకు కనిపెట్ట వలేనా అన్నాడు. మన ప్రభువైన ఏసుక్రీస్తు కూడా నాదేవా నాదేవా నన్నేల చెయ్యి విడిచితివి అన్నాడు అయినా దేవుడు కృప గలిగినవాడు నిన్ను విడువను ఎడబాయను అన్నాడు తాత్కాలిక ఎడబాటే గాని శాశ్వత ఎడబాటు కాదు అని నమ్మాలి. ఎంత వరకు? కొంతవరకు అని జవాబు

**50-52వ. శత్రువు చేసిన నిందను తొలగించుమని ప్రార్థన:-** అవి నీ శత్రువులు చేసిన నిందలు యెహోవా తొలగించి నిత్యము స్తుతినొందును గాక ఆమేన్ ఆమేన్.

**చతుర్థ స్కందము. కీర్తన 90-106 (5 + 6 + 6 = 17 కీర్తనలు)**

ఎజ్రా కాలములో మందిరము అలంకరించబడినపుడు సమకూర్చబడినవి.

దావీదు = 2,మోషే = 1, అనాద కీర్తనలు = 14.

1. 90-94 - అవసరతలు. 2. 95-100౹-ఆశించినవి.

3. 101-107 అనుభవించు విశ్రాంతి.

## 90వ కీర్తన (2 + 2 + 2 + 2 + 2 + 2 + 3 + 2 = 17వ.)

**అంశము:- భూమి మీద జీవిత కాల యాత్రలో నివాస స్థలమైన దేవుడు.**

**1-2వ.భూమిమీద నివాసస్థలమైన దేవుడు:-** పర్వతములు భూమి పుట్టక మునుపు తరతరములనుండి యుగయుగముల వరకు దేవుడు ఆయనే, తరతరముల నుండి ఇశ్రాయేలీయులకు నివాసస్థలము ఆయనే. (ద్వితీ 33:27, కీర్తన 91:9, 1 తిమో 6:16) మన నివాసస్థలము ఆయనే.

**3-4వ. నరులను మంటికి మార్చి తన యొద్దకు పిలుచుకొను దేవుడు:-** దేవుడు మనుష్యులను మంటికిమార్చుచున్నాడు.నరులారా, తిరిగిరండని సెలవిచ్చు చున్నాడు ఈ లోకము మన నివాసముకాదు ఆయన దృష్టికి వేయి సంవత్సరములు గతించిన నిన్నటివలెనున్నవి. రాత్రియందలి యొక జామువలె నున్నవి. ఒక దినము వెయ్యి సంవత్సరాలు (2పేతు 3:8) జాము అంటే 4 గంటలు అంటే దేవుని దృష్టిలో ఒక అర్థగంట మనజీవితము అని. ఈకొద్దిసేపటికే మనము ఎంత మిడిసిపడుచున్నమో గమనించండి

**5-6వ. వరదవలె పారగొట్టు దేవుడు:-** వరద వస్తే కొట్టుకొని పోయినట్లు మన జీవిత కాలము ఉంటుంది. ప్రొద్దున పచ్చగడ్డిలాగా చిగురిస్తారు. యవ్వన కాలములో ఎవరైనా పచ్చగా ఉంటారు. సాయంకాలమున వాడిపోతారు. మనము ఆధారపడే మన బలము సౌందర్యము మనలను విడిచి పోతాయి.

**7-8వ. జీవిత కాల యాత్రలో దోషములనుబట్టి క్షీణించి మరణించుట:-** మనము క్షీణించు చున్నాము దిగులుపడుచున్నాము. ఎందుకు? మన దోషములను బట్టి మన రహస్య పాపములను బట్టి మన దోషములు మన రహస్యపాపములు ప్రభువు దగ్గరకు వచ్చినపుడు మనకు కనపడుతున్నవి సరిదిద్దుకుంటున్నామా? లేకుంటే దేవుని ఉగ్రత భరించాలి

**9-10వ. జీవిత కాలము దుఃఖముతో నిట్టూర్పుతో గడుపుట:-** దేవుని ఉగ్రతను భరించుచునే మన దినములన్నియు గడుస్తున్నాయి నిట్టూర్పులతోనే మన జీవితకాలము ఉంది. మన ఆయుష్కాలము డెబ్బది సంవత్సరములు అధిక బలమున్నయెడల ఎనుబది సంవత్సరములు అయినను వాటి వైభవము ఆయాసమే దుఃఖమే అది త్వరగా గతించును మేము ఎగిరిపోవుదుము. మోషే అంతటి భక్తునికే జీవితము ఆయాసకరమైతే మనము ఎంతటివారము.

**11-12వ. జీవిత కాల దినములను లెక్కించుట.:-** ఆయన ఆగ్రహ బలము క్రోధము

మనము సంపూర్ణముగా అర్థము చేసుకోలేము ఏసుక్రీస్తు శ్రమలలో వ్యక్తమైంది. జ్ఞానియైన వాడు గుర్తించగలడు జ్ఞానము (head knowledge) వేరు.అది అనుదిన జీవితములో ఉపయోగించు కోవడము జ్ఞానహృదయము. మా దినములు లెక్కించుటకు మాకు నేర్పుము.అపుడు మా ఆయుష్కాలము ఎంత కొద్దో గ్రహించగలము.

**13-15వ. శ్రమ పరచిన దినముల కొలది సంతోష పరచుమని ప్రార్థించుట.:-** నీ సేవకులమైన మమ్మును చూచి సంతాపపడి తిరుగుము. ఉదయమున నీ కృపతో మమ్మును తృప్తి పరచుము అప్పుడు మేము మా దినములన్నియు ఉత్సహించి సంతోషించెదము. నీవు మమ్మును శ్రమ పరచిన దినముల కొలది మేము కీడనుభవించిన యేండ్ల కొలది మమ్మును సంతోషపరచుము.

**16-17వ. వాగ్దాన దేశములో ప్రవేశపెట్టి దేవుని మహిమను చూపుమని ప్రార్థించుట.:-** నీ సేవకులకు నీకార్యము కనుపరచుము వారి కుమారులకు నీ ప్రభావము చూపింపుము. మా దేవుడైన యెహోవా ప్రసన్నత మామీద నుండునుగాక మా చేతి పనిని మాకు స్థిరపరచుము మా చేతి పనిని స్థిరపరచుము అని ప్రార్థించుదుముగాక. కాగా నాప్రియ సహోదరులారా, మీ ప్రయాసము ప్రభువునందు వ్యర్థముకాదని యెరిగి, స్థిరులును, కదలనివారును, ప్రభువు కార్యాభివృద్ధియందు ఎప్పటికిని ఆసక్తులునైయుండుడి (1 కొరి 15:58).

## 91వ కీర్తన (4 + 4 + 4 +4 = 16వ.)

### అంశము:- భూమి మీద అనుదినము మహోన్నతుని కాపుదల.

సారాంశం:-కీర్తన వ్రాసిన వారి పేరు తెలియదు. మహోన్నతుని చాటున నివసించినవాడు సర్వశక్తుని నీడను విశ్రమించినవాడు, ఆయనను ఆశ్రయముగా, కోటగా చేసుకుని యెహోవాను దేవునిగా చేసుకున్న వాడు వ్రాశాడు.

భక్తుడు దేవునితో మాట్లాడటం. దేవుడు జవాబివ్వడం ఇందులో చూస్తున్నాము

ఇక్కడ దేవుడు మహోన్నతుడు (అందరికంటే ఉన్నతమైనవాడు) సర్వశక్తుడు (శక్తి అంతా ఆయనలో ఉన్నది) యెహోవా (చిరంజీవి) (1,2,9,)అని పిలువబడు తున్నాడు. ఆయనను ఎన్నిపేర్లతోనైనా పిలుచుకోవచ్చు.యుద్ధంలో కాపాడు వాడు దీన్నిబట్టి దావీదు గారే ఈ కీర్తన వ్రాసి ఉంటారని అనుకోవచ్చు (7). మనలను అన్నివిషయాలలో కాపాడువాడు.అట్లని దేవుని శోధించకూడదు(11)

**1-4వ. మహోన్నతుని ఆశ్రయము:-** మహోన్నతుడు, సర్వశక్తుడైన యెహోవాను

నమ్ముకొని తన దేవునిగా, ఆశ్రయముగా, కోటగా చేసుకొని నివసించువారికి విశ్రాంతి దొరుకుతుంది అని భక్తుడు చెప్పుచున్నాడు. మహోన్నతుడు, సర్వశక్తుడు (ఆది14:19,17:1) ఉన్నాడు. వేటగాడు కూడా ఉన్నాడు. వేటకాడు అపవాదియని 1 పేతురు 5: 9 ప్రకారం గుర్తించవచ్చు. మనము నమ్ముకున్నది మహోన్నతుని, మనము ప్రేమించేది మహోన్నతుని, మన ఆశ్రయించేది మహోన్నతుని, కానీ వేటగాడు కూడా మన కొరకు కనిపెట్టుకొని ఉన్నాడు. మరిచిపోవద్దు. కోడి పిల్లను జాగ్రత్తగా కాపాడుతుంది. అయినా పిల్లలను తినుటకు గ్రద్ద ఎదురుచూస్తూ ఉంటుంది. అలాగే ఆత్మీయులైన మనలను కూడ మ్రింగాలని సాతాను కనిపెట్టుకుని ఉన్నాడు. అయినా సాతాను బారి నుండి మనల్ని కాపాడే మహోన్నతుడు సర్వశక్తుడు అయిన దేవుడు. ఉన్నాడు. పక్షులు వేటగానికి చాలా దొరుకుతాయి. ఏనుగు లాంటి బలమైన జంతువులు కూడా దొరుకుతాయి. సాతాను కూడా లోకములో మనకు అటువంటి వల వేస్తాడు. మహోన్నతుని చాటున వుంటే విడుదల. లేకుంటే లేదు. నాశనకరమైన తెగులు కూడా ఉంది. ఇప్పుడు తెగుళ్లు తగ్గిపోయాయి. పూర్వము కలరా వస్తే ఊరికి ఒకరో ఇద్దరో మిగిలేవారు. ఇప్పుడు మెడికల్ అవేర్నెస్ పెరిగి శరీర తెగులు తగ్గింది. కానీ ఆత్మీయ తెగుళ్లు పెరిగి పోతున్నాయి. మన దేవుడు నాశనకరమైన తెగులు నుండి అంటే నరకము నుంచి రక్షించేవాడు. తన రెక్కలతో కప్పే వాడు రక్షించబడి ఉన్నారా లేదా?

**5-8వ. అపాయములలో కాపుదల:-** రాత్రి పగలు చీకటి మధ్యాహ్నము అని తేడా లేకుండా ఎల్లవేళలా నిర్భయముగా ఉండగలము. ఇరుప్రక్కల ఎంతమంది కూలినను అపాయము రాదు. భక్తిహీనులకు కలిగే ప్రతిఫలమును చూస్తాము. తెగులు రోగము అపాయము మన యొద్దకు రాదు. ఇంత భద్రత కలుగజేసిన దేవుని ఎల్లప్పుడు స్తుతించుదుము గాక. గాఢాంధకారపు లోయలో నేను సంచరించినను ఏ అపాయమునకు భయపడను. నీవు నాకు తోడైయుందువు నీదుడ్డు కఱ్ఱయు నీ దండమును నన్ను ఆదరించును అని దావీదు భక్తుడన్నాడు (కీర్త 23:4)

**9-12వ. దూతల ద్వారా మహోన్నతుని కాపుదల:-** మహోన్నతుడైన యెహోవాను ఆశ్రయముగాను నివాసస్థలముగాను చేసుకున్న మనకు అపాయము తెగులు మన గుడారమును (ఇల్లు) సమీపించదు. మన మార్గములన్నిటిలో అపాయము లేకుండా మనలను కాపాడుటకు దేవుడు ఆయన దూతలకు ఆజ్ఞాపిస్తాడు. వారు మన పాదములకు రాయి తగులకుండా తమ చేతులతో ఎత్తి పట్టుకుంటారు. అయితే కావాలని దేవుని శోధిస్తే అపాయంలో పడతాం జాగ్రత్త. దేవుని వాక్యము ద్వారానే సాతాను మనల్ని మోసం చెయ్యగలడు. మత్తయి4:7-8లో నీవు దేవుని కుమారుడవైతే క్రిందికి దుముకుము. ఆయన నిన్ను గూర్చి తన దూతల కాజ్ఞాపించును,

నీ పాదమెప్పుడైనను రాతికి తగుల కుండ వారు నిన్ను చేతులతో ఎత్తికొందురు అని ఈ వాక్యాన్ని చూపించినాడు... అందుకు యేసు ప్రభువైన నీ దేవుని నీవు శోధింపవలదని మరియొక చోట వ్రాయబడియున్నదని వానితో చెప్పెను (ద్వితీ 6:16). మనమైతే గొప్ప భక్తులమని చూపించు కొనుటకుదుమికేవారము. ప్రభువు మాదిరిని మనము అనుసరించునుగాక.

**13-16వ. దేవుడు కాపాడు వివరము:-** సింహములు, నాగుపాములు, కొదమ సింహములు, భుజంగములుఇవన్నీ అపవాదికి గుర్తు. బహువచనము ఎందుకు God, Christ, Spirit దేవుని త్రిత్వము. అలాగే అపవాది లో కూడా త్రిత్వముంది. AntiGod (సాతాను), AntiChrist (క్రీస్తువిరోధి) AntiSpirit (అబద్ధ ప్రవక్త). దేవుని ఆత్మ సత్య ప్రవచనాలలోనికి నడిపిస్తాడు. సాతాను ఆత్మ అనగా అబద్ధ ప్రవక్త అసత్య ప్రవచనాల లోనికి నడిపిస్తాడు. సింహములు ఎదురుగా వచ్చి చంపుతాయి పాములు వెనక వచ్చి మన పట్టుకుంటాయి కనుక శత్రువు అరకాలు మొదలుకొని తలవరకు ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ పట్టుకుంటాడు. అయితే వీటన్నింటి నుంచి విడిపించే దేవుడు మనకు ఉన్నాడు. నీ పాదముల క్రింద దేవుడు సాతానును చితుక త్రొక్కిస్తాడు. చిత్రీకరిస్తాడు. దేవుని ప్రేమించు వారిని దేవుని ఎరిగిన వారిని కాపాడు 7 వివరములు చెప్పబడ్డాయి అంటే ఏడు సంపూర్ణ సంఖ్య. 7 రెట్లు గా కాపాడేవాడు అంటే సంపూర్ణముగా కాపాడేవాడు అని. 1. నేనతని తప్పించెదను అన్ని అపాయాల నుండి తప్పిస్తాడు 2. నేనతని ఘనపరచెదను తప్పించాడు బైబిల్ మన చేతిలో ఉండగా మనము ఘనపరచబడుతాము 3. నేనతనికి ఉత్తరమిచ్చెదను మొరపెడితే ఉత్తరమిచ్చే దేవుడు 4. నేనతనికి తోడై యుండెదనుదేవుడు మనకు తోడుగా ఉన్నాడు అప్పుడప్పుడు మన అవివేకం వల్ల రాజకీయ నాయకులను ఆశ్రయించి ప్రభువునకు అవమానము తెస్తూఉంటాము 5. అతని గొప్ప చేసెదను 6. దీర్ఘాయువుచేత అతనిని తృప్తిపరచెదను 7. నా రక్షణ అతనికి చూపించెదను. ఇటువంటి ఆశీర్వాదాలతో నింపబడుదుము గాక.

## 92వ. కీర్తన (3 + 3 + 3 + 2 + 2 + 2 = 15వ.)

**అంశము:-** విశ్రాంతి దినమునకు తగిన కీర్తన అనగా యూదులు విశ్రాంతి దినమును ప్రభువు కొరకు గడుపుదురు. వారములో చివరి దినమున దేవుని సన్నిధిలో తమ్మును తాము పరీక్షించుకొని సరిచేసుకొందురు. సంఘకాలమునకు చెందిన మనకు వారములో మొదటి దినమైన ఆదివారము ప్రభువుతో మనము గడిపి మన జీవితములను పరీక్షించుకొను దినము. ఈ కీర్తనను మనము ఆదివారమైన ప్రభువు దినమునకు తగిన కీర్తనగా ధ్యానించ వచ్చును.

**1-3వ. మహోన్నతుడైన దేవునికి ఏమి చేయుట మంచిది:-** మహోన్నతుడైన దేవుని నామమును స్తుతించుట, కీర్తించుట, ప్రచురించుట మంచిది. ఎందుకనిన అపో4:12 ప్రకారము ఆయన నామము రక్షణార్ధమైన నామము. (అపో4:12 మరి ఎవని వలనను రక్షణ కలుగదుబీ ఈ నామముననే మనము రక్షణ పొందవలెను గాని,ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్య బడిన మరి ఏ నామమున రక్షణ పొందలేము అనెను). ఉదయమున దేవుని కృపను ప్రతి రాత్రి దేవుని విశ్వాస్యతను ఎందుకు ప్రచురించాలి? ఎఫే2:8 మీరు విశ్వాసము ద్వారా కృపచేతనే రక్షింపబడియున్నారు. ఇది మీవలన కలిగినదికాదు, దేవుని వరమే. 9 అది క్రియలవలన కలిగినది కాదు గనుక ఎవడును అతిశయపడ వీలులేదు. ఎఫే2:7 క్రీస్తుయేసునందు మనలను ఆయనతో కూడ లేపి, పరలోకమందు ఆయనతో కూడ కూర్చుండబెట్టెను. 10 మరియు వాటియందు మనము నడుచుకొనవలెనని దేవుడు ముందుగా సిద్ధపరచిన సత్క్రియలు చేయుటకై, మనము క్రీస్తుయేసునందు సృష్టింపబడినవారమై ఆయనచేసినపనియైయున్నాము. పది తంతుల స్వరమండలము గంభీరధ్వని గల సితారా అనగా వున్నతమైన వాయిధ్యము, హెచ్చయిన స్వరముతో మహోన్నతుడైన దేవుని నామమును స్తుతించుట, కీర్తించుట, ప్రచురించుట మంచిదని గుర్తింతము.

**4-6వ. దేవుని కార్యములు, చేతి పనుల గంభీరత:-** దేవుని కార్యములు, చేతి పనులు, ఆలోచనలు ఎంతో దొడ్డవి! అతిగంభీరములు, సంతోషపరచునవి, ఉత్సహించునవి. ఎందుకనగా యెహోవా, నీ కార్యముచేత నీవు నన్ను సంతోష పరచుచున్నావు, నీ చేతిపనులబట్టి నేను ఉత్సహించుచున్నాను అని పశుప్రాయులు వాటిని గ్రహింపరు. అవివేకులు వివేచింపరు అని కీర్తనాకారుడు చెప్పుచున్నాడు. అలాగే మనము కూడా ప్రభువుదినమగు ఆదివారమున ఆయన చేతిపనులు, ఆలోచనల గొప్పతనము, గంభీరతలను జ్ఞాపకము చేసికొని మహోన్నతుడైన దేవుని నామమును స్తుతించి, కీర్తించి, ప్రచురించాలి. అది మంచిది ప్రభువు దినమైన ఆదివారమునకు తగినది.

**7-9వ.భక్తిహీనులు చెడుపనులు చేయువారందరు గడ్డివలె చిగుర్చుట, పుష్పించుట నిత్యనాశనము నొందుటకే:-** భక్తిహీనులు గడ్డివలె చిగుర్చుదురు. చెడు పనులు చేయు వారందరు పుష్పించుదురు. కీర్తన 37:1-6లో చెడ్డవారిని చూచి నీవు వ్యసనపడకుము. దుష్కార్యములు చేయు వారిని చూచి మత్సర పడకుము. 2 వారు గడ్డి వలెనే త్వరగా ఎండి పోవుదురు. పచ్చని కూరవలెనే వాడి పోవుదురు, 3 యెహోవా యందు నమ్మిక యుంచి మేలు చేయుము దేశమందు నివసించి సత్యము ననుసరించుము. 4 యెహోవానుబట్టి సంతోషించుము ఆయన నీ హృదయ

వాంఛలను తీర్చును. 5 నీమార్గమును యెహోవాకు అప్పగింపుము, నీవు ఆయనను నమ్ము కొనుము ఆయన నీ కార్యము నెరవేర్చును.

**10-11వ.రక్షణనిచ్చి రక్షణ కొమ్ము పైకెత్తి క్రొత్త తైలముతో అనగా పరిశుద్ధాత్మ నిచ్చి అభిషేకించిన దేవుడు:-** కీర్త 148:14 ఆయన తన ప్రజలకు ఒక శృంగమును (రక్షణ అను కొమ్ము) హెచ్చించి యున్నాడు. అందుకే 10వ. నేను అంటబడితిని గురుపోతు కొమ్మువలె నీవు నాకొమ్ము పైకెత్తితివి. క్రొత్త తైలముతో నేను అంటబడితినని కీర్తనాకారుడు చెప్పుచున్నాడు. కీర్తన 37:10 ప్రకారము ఇక కొంత కాలమునకు భక్తిహీనులులేక పోవుదురు. వారి స్థలమును జాగ్రత్తగా పరిశీలించినను వారు కనబడక పోవుదురు. అందుకే 11వ. నా కొరకు పొంచిన వారి గతి నా కన్నులు ఆశతీర చూచెను. నాకు విరోధముగా లేచిన దుష్టులకు సంభవించినది నా చెవులకు వినబడెను అని కీర్తనాకారుడు అన్నాడు.

**12-13వ. నీతిమంతులు ఖర్జూర వృక్షము దేవదారు వృక్షమువలె ఎదుగుట:-** కీర్తన 37: 11 దీనులు భూమిని స్వతంత్రించు కొందురు బహు క్షేమము కలిగి సుఖించెదరు అని వున్నది. అందుకే 12వ వచనములో నీతిమంతులు ఖర్జూర వృక్షమువలె మొవ్వువేయుదురు. లెబానోను మీది దేవదారు వృక్షమువలె వారు ఎదుగుదురు. 13 యెహోవా మందిరములో నాటబడినవారై వారు మన దేవుని ఆవరణములలో వర్ధిల్లుదురు అని కీర్తనాకారుడు చెప్పుచున్నాడు.

**14-15వ.దేవుని యదార్థత, పరిశుద్ధతను ప్రసిద్ధిచేయుటకే ముసలితనమందు ఇంక చిగురు పెట్టుచుందురు:-** నాకు ఆశ్రయదుర్గమైన యెహోవా యథార్థవంతుడనియు ఆయన యందు ఏ చెడుతనమును లేదనియు ప్రసిద్ధి చేయుటకై దేవుడు తనవారిని ముసలితనమందు చిగురు పెట్టుచుచూ, సారము కలిగి పచ్చగా నుంచుచున్నాడు.

### కీర్తనలు 93-99.

రారాజు రాజ్య పాలనను గూర్చిన కీర్తనలు - రాజ్యమును గూర్చిన వచనములు

93:1 యెహోవా రాజ్యము చేయు చున్నాడు భూలోకము స్థిరపరచ బడి యున్నది.

94:2 భూలోక న్యాయాధిపతీ లెమ్ము.

95:1 రండి యెహోవాను గూర్చి ఉత్సాహ ధ్వని చేయుదము.

96:10 యెహోవా రాజ్యము చేయుచున్నాడు లోకము స్థిరపరచబడియున్నది.

97:1 యెహోవా రాజ్యము చేయుచున్నాడు,భూలోకము ఆనందించునుగాక

98:9భూమికి తీర్పుతీర్చుటకై నీతిని బట్టి లోకమునకు తీర్పు తీర్చుటకై న్యాయమునుబట్టి జనములకు తీర్పుతీర్చుటకై యెహోవా వేంచేసి యున్నాడు.

99:1 యెహోవా రాజ్యము చేయు చున్నాడు జనములు వణకును భూమి కదలును.

## 93వ కీర్తన (2 + 2 + 1 = 5వ.)

**అంశము:- ప్రభావముగల రాజ్యము- పరిశుద్ధత గల మందిరము.**

సారాంశము: ఐదు వచనాలు ఉన్నాయి. అయినా వెయ్యేండ్ల రాజ్యము గురించి చక్కగా వివరించబడింది. ప్రభావము గల రాజ్యమని పరిశుద్ధత గల మందిరమని మనకు కనపడుతుంది. ఆయనేమో ప్రభావము గలవాడు. ఆయన మందిరము పరిశుద్ధతగలది. వెయ్యేళ్ల రాజ్యములో ఆయన మందిరం ఉంటుంది.నిత్యకాలంలో ఆయన మందిరం ఉండదు. వెయ్యేండ్ల పరిపాలన ప్రకటన గ్రంథం 20 లో నిత్యకాలపు పరిపాలన 21, 22 లో కనబడుతుంది. 21:22లో ఏ దేవాలయము లేదు. ప్రభువు,గొర్రెపిల్ల దేవాలయమై ఉన్నారు.యేసు దేహమైన దేవాలయము సిలువలో చినిగిపోయినపుడు యెరూషలేము దేవాలయంలోని బెత్తెడు మందము తెర కూడా చినిగింది. ఎంత అద్భుతమో కదా! వెయ్యేళ్ల పరిపాలన కాలంలో ఆయన వస్తూ పోతూ ఉంటాడు.

**1-2వ.ప్రభావముగల రాజ్యము:-** యెహోవా రాజ్యము చేయుచున్నాడు. ప్రభావమును ఆయన వస్త్రముగా ధరించియున్నాడు. రాబోవు రాజ్యపాలనలో ఆయనకు కలిగిన మహిమ ప్రభావము కీర్తి ప్రస్తావించబడింది. యేసు ప్రభువు మొదటిసారి భూలోకానికి మానవ దేహముతో వచ్చాడు గనుక ఆయన మహిమ, ప్రభావము, కీర్తి కనిపించలేదు. రక్తస్రావరోగి స్వస్థతలాంటి కొన్ని సమయాలలో మాత్రమే ప్రభావము కనిపించింది. రూపాంతరము కొండ మీద మహిమ కనిపించింది. అందుకే మనము మహిమను వీడి ఈ లోకానికి వచ్చావా ప్రభువా అని పాడుకుంటూ ఉంటాము. కానీ రెండవ రాకడలో, వెయ్యేండ్ల రాజ్యములో ఆయన ప్రభావమును వస్త్రంగా ధరిస్తాడు. అప్పుడు అందరూ చూస్తారు. ఆయన మహిమ, ప్రభావము, కీర్తి కలిగి ఉంటాడు. ప్రభావముతో వెయ్యేండ్లు పరిపాలించిన రాజులు ఎవరు లేరు. ఆదాము కూడ 1000 ఏండ్లు జీవించలేదు. యేసు ఇప్పుడు కూడ రాజ్యము చేయుచున్నాడు. ఆయన శాసనములను మీరిన వారికి వెంటనే కీడు కలగలేదు. ఆయన దీర్ఘశాంతము, సహనము, ఓర్పు కలిగిన వాడు. మనకే ఓర్పు తక్కువ ఎప్పుడు తీర్పు ప్రభువా అంటాము( ప్రక 6:10). మనకు కలిగే హింస, నష్టాలు ఆయన చూస్తున్నాడు. ఆయన రాజ్యం చేస్తూనే ఉన్నా కొన్నిసార్లు మనకు

ఇష్టంలేనివి జరుగుతాయి. వాటిని ఆయన సెలవిచ్చియున్నాడని మనము గమనించాలి. వెయ్యేండ్లపాలనలో ఆయన బలమును ధరించి ఉన్నాడు.

ఆయన బలము కూడా ఆనాడు అందరూ చూస్తారు. ఆయన మానవుడిగా వచ్చినప్పుడు ఒకరిద్దరు ఆయనను కొరడాలతో కొట్టి మేకులు కొట్టారు. బలము లేనివాడుగా చనిపోయినట్లు కనపడింది. 1000 ఏండ్ల పరిపాలనలో ఆయన బలం కనిపిస్తుంది. భూమిని నెమ్మదిగా ఉంచుతాడు పురాతన కాలము నుండి అయన సింహాసనము స్థిరముగాఉంది. అయన ఎల్లప్పుడూ ఉన్నవాడు, ఉన్నవాడను అను వాడనైయున్నానని మోషేతో చెప్పిన వాడు.

**3-4వ.గోగు మాగోగుల యుద్దము:-** భూమి స్థిరముగా ఉన్నది అని చెప్పబడింది అయితే వరదలు అలలు విస్తార జలములు సముద్ర తరంగములు హోరెత్తుచున్నవి అంటున్నాడు జలములు జనములను సూచించుచున్నవి (యెష 57:20, ప్రక17:15). ప్రక20:1-3లో అపవాది బంధించబడ్డాడు. ఆ వెయ్యేండ్ల రాజ్య కాలపు చివరలో అపవాది వదిలి పెట్టబడతాడు (7 ) భూమి నలుదిశలయందుండు జనములను, లెక్కకు సముద్రపు ఇసుకవలె ఉన్న గోగు మాగోగు అనువారిని మోసపరచి వారిని యుద్ధమునకు పోగుచేయుటకై వాడు బయలు దేరును. (9) ఇది ఆఖరు మోసము. మనల్ని కూడా చాలాసార్లు మోసపరిచాడు. సంఘాలను, సహోదరులను, అందరిని మోసపరుస్తున్నాడు. జనములను ప్రోగు చేసుకొని దేవుని మీదికే యుద్దానికి బయలుదేరుతున్నాడు 20:18 ఇంతవరకు దేవుడు దీర్ఘశాంతముతోనే ఉన్నాడు పరలోకము నుండి అగ్ని దిగివచ్చి వారిని నాశనము చేస్తుంది. అపవాది అగ్ని గంధకములో పడతాడు. అపవాది త్రిత్వములో ఉన్న antichrist అంటే క్రూరమృగము antispirit అంటే అబద్ధ ప్రవక్త వీళ్లు అంతకు ముందే అగ్నిగంధకాలలో కాలుచున్నారు. వారితోపాటు anti god అంటే అపవాది అగ్ని గంధకములలో వేయబడతాడు. వీటన్నిటి మీద ఆకాశమునందున్న యెహోవా బలిష్ఠుడు.

**5వ. దేవుని శాసనములు:-** వెయ్యేండ్ల రాజ్యములో కూడా దేవుని శాసనములు ఉంటాయి ఆప్రకారమే జరుగుతుంది పరిపాలన ఇప్పుడు కూడా ఆయనే కనబడకుండా పరిపాలిస్తున్నాడు. తనకు ఇష్టం వచ్చిన వారికి రాజ్యాధికారం ఇస్తున్నాడు. ఎవరికి ఇచ్చినా ఆయన ఇష్టప్రకారమే జరుగుతుంది. ఆయన రాజులను నియమించేవాడు. ఆయనే మన ఉద్యోగ జీవితంలో కుటుంబ జీవితంలో వ్యక్తిగత జీవితంలో హెచ్చించేవాడు. ఆయన శాసనాలు మనకు పరమావధిగా ఉండాలి. కుల కట్టడలు గాని వంశాల కట్టడలు గాని ఏవీ ఇందులో ప్రవేశించకూడదు. ఆయన గురించి ఆయనశాసనములను అనుసరించుటకు ఎన్నడూ మనము

తప్పకూడదు. రాజు గారు శాసిస్తే ఎవరు మీరగలరు? మరి విశ్వచక్రవర్తి అయిన దేవుని శాసనాన్ని మనం ఎన్నడూ మరవకూడదు మీరకూడదు. ఆయన మందిరమునకు పరిశుద్ధతయే అనుకూలము. పరిశుద్ధముగా జీవిస్తూ అయన ఆజ్ఞలు మీరకుందుము గాక.

## 94వ. కీర్తన. (4 + 3 + 4 + 4 + 4 + 4 = 23వ)

**అంశము:- దేవుడు విచారించుట లేదని దేవుని ప్రజలను నలుగ గొట్టు భక్తిహీనులకు కలుగు శిక్ష.**

**1-4వ. భక్తిహీనులకు ప్రతీకారము చేయమని ప్రార్థించుట.:-** యెహోవా, ప్రతికారముచేయు దేవా అని రెండుసార్లు చెప్పుచున్నాడు. ప్రతీకారము చేయమని ప్రార్థించుట. గర్విష్టులకు భక్తిహీనులు ఉత్సహించు చుండగా వారి క్రియల చొప్పున వారికి ప్రతిఫలమిమ్మని కీర్తనా కారుడు దేవుని అడుగు చున్నాడు. దేవుడు నీతిగల న్యాయాధిపతి భూలోకమునకు న్యాయాధిపతి కనుక ప్రతిఫలమిచ్చువాడు దేవుడే కనుక వదరుచు కఠోరమైన మాటలు పలుకుచు దోషము చేయువారందరు బింకములాడు వారికి ప్రతిఫలమిమ్మని దేవునికి చేయు ప్రార్ధన. కీర్తన 6:3,13:1-2,35:17 లో కూడా ఇటు వంటి ప్రార్ధనలే కలవు. రోమా 12:19 లో ప్రియులారా, మీకు మీరే పగతీర్చుకొనక, దేవుని ఉగ్రతకు చోటియ్యుడి పగతీర్చుట నా పని, నేనే ప్రతి ఫలము నిత్తును అని ప్రభువు చెప్పుచున్నాడని వ్రాయబడి యున్నది. గలతీ 6:7 మోసపోకుడి, దేవుడు వెక్కిరింపబడడు. మనుష్యుడు ఏమి విత్తునో ఆ పంటనే కోయును. 8 ఏలాగనగా తన శరీరేచ్ఛలనుబట్టి విత్తువాడు తనశరీరము నుండి క్షయమను పంట కోయును. కాబట్టి, రోమా 12:20 ప్రకారము నీ శత్రువు ఆకలి గొనియుంటే అతనికి భోజనము పెట్టుము, దప్పిగొనియుంటే దాహమిమ్ము. ఆలాగు చేయుటవలన అతని తల మీద నిప్పులు కుప్పగా పోయుదువు. 21 కీడువలన జయింపబడక, మేలుచేత కీడును జయించుము అని వ్రాయబడినందున సంఘ కాలములో వున్న మనము ఆలాగు ప్రార్థించ కూడదు..

**5-7వ. భక్తిహీనులు దేవుని ప్రజలను బాధించుట:-** దేవుడు దీర్ఘశాంతుడు కనుక వెంటనే శిక్షించక పోయినందున యెహోవా చూచుట లేదు యాకోబు దేవుడు విచారించుటలేదు అనుకొని వారు దేవుని ప్రజలను నలుగగొట్టుచు విధవరాండ్రను పరదేశులను తండ్రిలేనివారిని చంపుచున్నారు. యెష1:17-23,10:2 ఈలాగే జరుగుట చూచుచున్నాము. అందులకై కీర్తనా కారుడు ఈ రీతిగా ప్రార్థించుచున్నాడు. యెష3:15లో నా ప్రజలను నలుగగొట్టి మీరేమి చేయుదురు? బీదల ముఖములను నూరి మీరేమి చేయుదురు? అని యెహోవా సెలవిచ్చుచున్నాడు. కనుక దేవుడు మౌనముగా వుండడని మనము గుర్తించుదము.

**8-11వ. బుద్ధిహీనుల వ్యర్థమైన ఆలోచనలను దండించు దేవుడు:-** కీర్తన 10:11 దేవుడు మరచిపోయెను ఆయన విముఖుడై యెప్పుడును చూడకుండును అని వారు తమ హృదయములలో అనుకొని తామే కీడు చేయ పూనుకొందురు. కీర్తన 10:13 దుష్టులు దేవుని తృణీకరించుట యేల? నీవు విచారణ చేయవని వారు తమ హృదయములలో అనుకొనుటయేల? బుద్ధిహీనుల వ్యర్థమైన ఆలోచనలను దండించుమని దేవుని ప్రార్థించుచున్నాడు. జవాబుగా దేవుడు అన్యజనులను శిక్షించువాడు మనుష్యులకు తెలివి నేర్పువాడు దండింపక మానడని,1 నరుల ఆలోచనలు వ్యర్థములని 10 -11 వచనములలో చెప్పుచున్నాడు.

**12-15వ. దేవుడు నీతిమంతులను శిక్షించినను నెమ్మది కలుగచేయును.:-** యెహోవా, శిక్షించువాడు, ధర్మశాస్త్రమునుబట్టి బోధనొందువాడు ధన్యుడు. యెహోవా తన ప్రజలను ఎడబాయువాడుకాడు తన స్వాస్థ్యమును విడనాడు వాడుకాడు. నీతినిస్థాపించుటకై న్యాయపు తీర్పు జరుగించును కనుక శిక్షించబడుట ధన్యతయే.

**16-19వ. దేవుడు దుష్టుల నుండి నీతిమంతులను కాపాడి ఆదరణ కలుగ చేయను:-** దుష్టులమీదికి,దోషము చేయు వారికి విరోధముగా మన పక్షమున దేవుడే నిలుచును. యెహోవా మనకు సహాయము చేసియుండని యెడల మన ప్రాణము శీఘ్రముగా మౌనమందు నివసించి యుండును. 18 మన కాలు జారకుండ యెహోవా కృప బలపరచుచున్నది. 19నా అంతరంగ మందు విచారములు హెచ్చుకాగా నీ గొప్ప ఆదరణ నా ప్రాణమునకు నెమ్మది కలుగ జేయుచున్నదని కీర్తనాకారుడు చెప్పుచున్నాడు..

**20-23వ.దుష్టులనుశిక్షించి నీతిమంతులకు ఆశ్రయముగానున్న దేవుడు.:-** దుష్టులు నీతిమంతుల ప్రాణము తీయుటకై వారిమీద పడుదురు దోషులని నిర్దోషులకు మరణము విధించుదురు. కాని యెహోవా మనకు ఎత్తయిన కోట ఆశ్రయదుర్గమై దుష్టుల దోషము వారి మీదికి రప్పించి వారి చెడుతనమును బట్టి వారిని సంహరించును.

## కీర్తన 95 (7+4) = (2 + 2 + 2 + 1 + 2 +2) = 11వ)

**అంశము:- దేవుని స్తుతించుట కొరకైన పిలుపు(1-7వ.).**

**హృదయ కాఠిన్యమును బట్టి తప్పి పోకూడదను హెచ్చరిక (8-11వ.)**

**1-7వ. దేవుని స్తుతించుట కొరకైన పిలుపు:-1-2వ. ఏరీతిని స్తుతించాలి:** 1వ. 1) ఉత్సాహ ధ్వని చేయుదము అనగా బహుశా వాయిద్యములతో స్తుతి. 2) సంతోష గానము చేయాలి. 2వ. 3) కృతజ్ఞతతో స్తుతించాలి. 4) ఆయన సన్నిధికి వచ్చి స్తుతించాలి. 5) కీర్తనలు

పాడాలి. 6) ఆయన పేరట సంతోష గానము చేయాలి. 7) ఆయన మన రక్షణ దుర్గము. ఎఫె2:8-9వ. మీరు విశ్వాసముద్వారా కృపచేతనే రక్షింపబడియున్నారు. ఇది మీ వలన కలిగినది కాదు, దేవుని వరమే. 9 అది క్రియలవలన కలిగినదికాదు. కనుక ఆయనే మన రక్షణకు కారణము. రక్షించబడిన మనలను దుర్గము వలె కాపాడువాడు కూడా ఆయనే అను గుర్తింపుతో స్తుతించాలి. 7వ. స్తుతించ వలసిన విధము: రండి 8) నమస్కా రము చేయాలి. 9) సాగిల పడుదము. మనలను సృజించిన 10) యెహోవా సన్నిధిని మోకరించుదము. 11) నేడే ఆయన మాట నంగీకరించి స్తుతించిన యెడల ఎంతో మేలు.

**3-6వ. ఎందుకు స్తుతించాలి:-** 3వ. ఆయన గొప్పతనమునుబట్టి: యెహోవా మహా దేవుడు. తీతు 2:13 ప్రకారము ఈయన మహా దేవుడు మన రక్షకుడునైన యేసుక్రీస్తు. మహిమతో ప్రత్యక్షమగువాడు. దేవతలు అనబడినవారు లోకములో ఉన్నను వారికి మహాత్మ్యము లేదు. ఈయన ఒక్కడే మహాత్తుగల కార్యములు చేయువాడు కనుక దేవతలందరికిపైన మహాత్మ్యముగలవాడు. మహారాజు అనగా రాజులు ఎవ్వరును వేయ్యేండ్లు పాలించలేరు. ఆయన ఒక్కడే వేయి సంవత్సరములు పాలించువాడు కనుక మహా రాజు.

**4-5వ. ఆయనచేసినసృష్టినిబట్టి:** భూమ్యగాధస్థలములు,పర్వత శిఖరములు, సముద్రము, భూమి, ఆయన హస్తములే నిర్మించెను. కీర్తన 115:15-16వ. ప్రకారము భూమ్యాకాశములను సృజించి యెహోవా ఆకాశములను తన వశములో ఉంచుకొని భూమిని నరులకు నివాసముగా ఇచ్చియున్నాడు. ఆకాశమందలి జ్యోతుల ద్వారా మానవులకు వెలుగు, వేడిమినిఇచ్చాడు. సముద్రముద్వారా వర్షమిచ్చి, భూమిని తడిపి పంటలను ఆహారముగా ఇచ్చుచున్నాడు. పర్వతముల ద్వారా అనేక విలువైన ఖనిజముల నిచ్చుచున్నాడు.

6వ. ఆయన మనకు చేసిన కార్యములను బట్టి: అన్నిటికంటే ముఖ్యకారణముగా ఆయన మన దేవుడై రక్షించుట మాత్రమేకాక మనలను ఆయనే పాలించుచున్నాడు. ఆయనే మన లను గొర్రెలవలె మేపు విధానము యెహెజ్కేలు 34:11-16వ. లో చెప్ప బడినది. ప్రభువైన యెహోవా సెలవిచ్చున దేమనగా 1) ఇదిగో నేను నేనే నా గొఱ్ఱలను వెదకి వాటిని కనుగొందును. 2) తమ గొఱ్ఱలు చెదరిపోయినప్పుడు కాపరులు వాటిని వెదకునట్లు నేను నా గొఱ్ఱలను వెదకి, చీకటిగల మబ్బు దినమందు ఎక్కడెక్కడికి అవి చెదరిపోయెనో అక్కడ నుండి నేను వాటిని తప్పించి, 3) ఆయా జనులలో నుండి వాటిని తోడుకొని వచ్చి, 4) ఆ యా దేశములలోనుండి వాటిని సమకూర్చి వాటి స్వదేశము లోనికి వాటిని తెచ్చి 5) పర్వతములమీదను వాగుల యొద్దను దేశమందున్న సకలమైన కాపురపుస్థలములందును వాటిని మేపెదను. 6)నేను మంచి

మేతగలచోట వాటిని మేపెదను, 7) ఇశ్రాయేలు యొక్క ఉన్నత స్థలములమీద వాటికి దొడ్డి యేర్పడును, 8) అక్కడ అవి మంచి దొడ్డిలో పండుకొనును, 9) ఇశ్రాయేలు పర్వతముల మీద బలమైన మేతగల స్థలమందు అవి మేయును, 10) నేనే నా గొఱ్ఱలను మేపి పరుండ బెట్టుదును. ఇదే ప్రభువగు యెహోవా వాక్కు. 11) తప్పిపోయిన దానిని నేను వెదకుదును, 12) తోలి వేసిన దానిని మరల తోలుకొని వచ్చెదను, 13) గాయపడిన దానికి కట్టు కట్టుదును, 14) దుర్బలముగా ఉన్నదానిని బలపరచుదును. 15) అయితే క్రొవ్విన వాటికి బలముగల వాటికి శిక్షయను మేతపెట్టి లయపరచెదను. మనము దేవునిచే కాల్చబడుచున్నామా? శిక్షగా మనలను లయపరచుచున్నాడా? మనము అందరము పరీక్షించు కొనాలి. యెహెజ్కేలు 34:3-4వ. ఇశ్రాయేలు కాపరులు క్రొవ్విన గొఱ్ఱలను వధించి, క్రొవ్వును తిని, బొచ్చును కప్పుకొందురని గొఱ్ఱలను మేపరని, బలహీనమైనవాటిని బలపరచరని, రోగముగల వాటిని స్వస్థపరచరని, గాయపడిన వాటికి కట్టుకట్టరని, తోలివేసిన వాటిని మరల తోలుకొనిరారని, తప్పిపోయినవాటిని వెదకరని, అది మాత్రమేగాక కఠిన మనస్కులై బలాత్కారముతో వాటిని ఏలుదురని చెప్పుచున్నాడు. కనుక మన దేవుని ఎంతగా స్తుతించాలో చెప్పుచున్నాడు.

**8-11వ.హృదయ కాఠిన్యమునుబట్టి తప్పిపోకూడదను హెచ్చరిక:-** 8-9వ. పితరుల వలె మనము హృదయమును కఠిన పరచుకొన కూడదు: 8వ. పితరులు అరణ్యమందు మెరీబాయొద్ద, మస్సా దినమందు హృదయములను కఠినపరచుకొనిన వివరములు నిర్గ 17:6-7వ. లో కలదు. 6 రేఫీదీములో నీళ్ళు లేవని మోషే మీద సణగగా అక్కడ హోరేబులోని బండను మోషే కొట్టగా ప్రజలు త్రాగుటకు దానిలో నుండి నీళ్లు వచ్చెను. 7 అప్పుడు ఇశ్రాయేలీయులు చేసిన వాదము బట్టి యెహోవా వారి మధ్యఉన్నాడో లేడో అని వారు యెహోవాను శోధించుటనుబట్టి అతడు ఆ చోటికి మస్సా అనియు మెరీబా అనియు పేర్లు పెట్టెను.

**10-11వ. హృదయమున తప్పిపోయిన ప్రజల మీద దేవుని కోపము:** నలువది ఏండ్ల కాలము ఆ తరము వారివలన దేవుడు విసికి వారు హృదయమున తప్పిపోవు ప్రజలని అనుకొని కోపించి విశ్రాంతిలో ప్రవేశింపకూడదని ప్రమాణము చేసాడు. చివరకు మోషే కూడా తప్పిపోయాడు. నిర్గ 20:5-13వ.లో ఈ స్థలములో త్రాగుటకు నీళ్లేలేవనిరి.దేవుడు మోషేతో నీ కఱ్ఱను తీసికొని, సమాజమును పోగుచేసి వారి కన్నుల యెదుట ఆ బండతో మాటలాడుము అది నీళ్ల నిచ్చును అన్నాడు. కాని మోషే అహరోను ఆ బండ యెదుట సమాజమును పోగుచేసి నప్పుడు అతడు వారితో ద్రోహులారా వినుడి. మేము ఈ బండలోనుండి మీకొరకు నీళ్లు

రప్పింపవలెనా? అని బండను రెండుసార్లు కొట్టాడు. దేవుడు వారి మధ్యను తన్ను పరిశు ద్ధపరచుకొని నీళ్ళను ఇచ్చాడు. 12వ. యెహోవా మోషే అహరోనుతో మీరు ఇశ్రాయేలీయుల కన్నుల యెదుట నా పరిశుద్ధతను సన్మానించునట్లు నన్ను నమ్ము కొనకపోతిరి అన్నాడు. ద్వితీ3:26-27లో యెహోవా మిమ్మునుబట్టి నా మీద కోపపడి నా మనవి వినకపోయెను. మరియు యెహోవా నాతో ఇట్లనెను చాలును. ఇకను ఈ సంగతిని గూర్చి నాతో మాటలాడవద్దు. 27 నీవు ఈ యొర్దానును దాటకూడదు గాని నీవు పిస్గా కొండ యెక్కి పడమటి వైపును ఉత్తర వైపును దక్షిణ వైపును తూర్పు వైపును తేరి చూడుము అన్నాడు. ఈ రీతిగా మోషే కనాను విశ్రాంతిని అనుభవించలేదు. యెహె 34:10లో క్రొవ్విన వాటికి శిక్షయను మేత పెట్టి లయపరచెదను అన్నట్లు ఇది మోషెకు శిక్షయే. రక్షణ శాశ్వతము కనుక రూపాంతరపుకొండపై మోషే ఎలియాతో కూడా కనిపించాడు. కాని ఇశ్రాయేలీయులను 1) ద్రోహులారా అన్నందుకు, బండతో మాటలాడుమని దేవుడు చెప్పగా 2) రెండుమారులు కొట్టినందుకు కనానులోని విశ్రాంతిని అనుభవించు భాగ్యమును పోగొట్టుకొన్నాడు. అంతేకాక నీతిమంతుల తీర్పులో దేవునికి లెక్కచెప్పాలి. మనము ఆలాగు ప్రవర్తించక జాగ్రత్తగా నుందుము గాక.

## 96వ కీర్తన (3 + 3 + 3 + 3 +1 = 13వ.)

### సందర్భము :- మందసము యెరూషలేముకు తెచ్చిన సందర్భము.

### అంశము :- స్తుతికి పాత్రుడైన యెహోవా ఔన్నత్యము.

సారంశము:-96,97 కీర్తనలలో యెహోవా రాజ్యము చేయుచున్నాడు(10,97:1) అని ఉంది కనుక రెండు కలిపి ఉన్నట్లు చూడగలం ఈ రెండు స్తుతి కీర్తనలు, వెయ్యేండ్ల రాజ్య పాలన కీర్తనలు కూడా. 96లో 13 వచనాలు 97 లో 12 వచనాలు ఉన్నాయి 96లో 12 తీసుకొని ఒక వచనము ప్రక్కన పెడితే అది 97 కు 13 వ వచనం పీఠిక అనుకోవచ్చు అలాగైతే 96 ను, 97 ను నాలుగు భాగాలుగా విభజించవచ్చు. 96వ కీర్తనలో స్తుతులు ఎక్కువగానూ రారాజు రాజ్యపాలన తక్కువగా వ్రాయబడింది 97వ కీర్తనలో రారాజు రాజ్య పాలన ఎక్కువగా స్తుతులు కొద్దిగా వ్రాయ బడింది. 96వ కీర్తనలోని అన్ని వచనాలు, 1 దిన16:8-36లోని స్తుతికీర్తనలో ఉన్నాయి. 1దిన 16:7 ను బట్టి 96 వ కీర్తన దావీదు వ్రాసాడు అని చెప్పవచ్చు. 97, 96కు అనుబంధ కీర్తన కాబట్టి 97 కూడ దావీదే వ్రాసాడని అనుకోవచ్చు. మందసమును యెరూషలేముకు తెచ్చిన సందర్భమున వ్రాయబడినది అనుకోవచ్చు ఫిలిష్తీయులు మందసము పట్టుకొని పోయిన తర్వాత మందసము కిర్యత్యారీములో ఉండి

పోయింది. 20 ఏండ్లు సౌలు పట్టించుకోలేదు.  దావీదుమందసమును తీసుకు వచ్చేటప్పుడు ఉజ్జా మరణించాడు. మందసము ఓబెదేదోము  ఇంటిలో ఉంచాడు  ఆయన మందసమును భద్రంగా కాపాడాడు. అందువల్ల దేవుడు ఓబెదేదోము ఇంటివారిని ఆశీర్వదించాడు. మందసమును దావీదు యెరూషలేమునకు తెచ్చిన సందర్భములో ప్రభువును స్తుతించడము ఈ కీర్తనలో వ్రాయబడింది. దావీదు మందిర సేవ కొరకై కొందరిని, ఓబెదేదోము సహోదరులను ద్వారపాలకులుగా నియమించాడు ఎందుకంటే  ఓబెదేదోము అంతకు ముందు మందసము భద్రంగా కాపాడాడు కాబట్టి. కాపాడువారినే కాపరులను నియమించడం అన్నది ఇక్కడ మనం నేర్చుకోవలసిన సత్యం

**1-3వ. స్తుతించుట కొరకైన పిలుపు:-** యెహోవా మీద క్రొత్త కీర్తన పాడుడి. కొత్త కీర్తనలు కట్టేవారు కావాలి భూజనులందరూ పాడాలి. యెహోవా మీద పాడాలి. అంటే యేసు మీద పాడాలి. కొన్ని పాటలు మన గురించి ఉంటాయి.ఆయన మరణము పునరుద్ధానము పరిశుద్ధత ఔన్నత్యము ఆయన గుణ లక్షణాల మీద పాడాలి. ఆయన నామమును స్తుతించాలి అనుదినము ఆయన రక్షణసువార్తను ప్రకటించాలి నేడు సువార్త తగ్గిపోయింది అభ్యాసము చేద్దాము రోజుకు ఒక పత్రిక అయినా  ఇవ్వడానికి అలవాటు పడదాము. సువార్తే కాదు. ఆయన మహిమను, ఆశ్చర్య కార్యములను సమస్త అన్య జనులలో ప్రచురించాలి.

**4-6వ. స్తుతించుట కొరకైన కారణములు.:-** 1. యెహోవా మహాత్మ్యముగలవాడు 2. అధిక స్తోత్రము పొందతగినవాడు 3. సమస్త దేవతలకంటె ఆయన పూజనీయుడు. 4. యెహోవా ఆకాశ విశాలమును సృజించినవాడు. 5.ఘనతా ప్రభావములు గలవాడు 6.ఆయన బల సౌందర్యములు గలవాడు, 7.ఆయన స్థలము, జీవితము, మందిరము, పరిశుద్ధము, అయన నిలువెల్లా పరిశుద్ధుడు. ఈ కారణాలను బట్టి స్తుతించాలి.

**7-9వ. స్తుతించు వలసిన వివరము:-** కుటుంబములలో  యెహోవా మహిమ బలములనుబట్టి స్తుతించాలి. యెహోవా నామమునకు తగిన మహిమ ఆయనకు చెల్లించాలి. నైవేద్యము అంటే ప్రార్థన(కీర్త141:2)తో ఆయన ఆవరణముల లోనికి (మందిరానికి ) రావాలి. ఇంటిలోనే కాదు మందిరానికి వచ్చి కూడా ప్రార్థించాలి. పరిశుద్ధతతో యెహోవాకు అంటే యేసుకు నమస్కారము చేయాలి. సర్వ భూజనులు ఆయన సన్నిధిని వణకాలి. ముందు అయన జనులమైన మనము  వణికితే అందరు వణుకుతారు.

**10-12వ. సంతోష ఆనందముల కొరకైన పిలుపు.:-** యెహోవా రాజ్యములో అంటే యేసు వెయ్యేండ్లరాజ్యములో లోకము కదలకుండ స్థిరపరచబడి ఉంటుంది. న్యాయమునుబట్టి

ఆయన జనములను పరిపాలన చేస్తాడు. ఈ వార్తను అన్యజనులలో ప్రకటించాలి. యేసు రాకడలో ఆకాశము సంతోషిస్తుంది భూమి ఆనందిస్తుంది. సముద్రమును దాని సంపూర్ణత ఘోషిస్తుంది. పొలమును దాని యందుగల సర్వమును యెహోవా సన్నిధిని ప్రహర్షిస్తాయి . వన వృక్షములన్నియు ఉత్సాహధ్వని చేస్తాయి. అటువంటి మహిమ గల రాజ్యములో మనకు భాగమిచ్చిన మన తండ్రి మహిమ పొందును గాక.

13వ. భూజనులకు తీర్పు తీర్చుటకై యెహోవా వేంచేయుచున్నాడు న్యాయమును బట్టి లోకమునకు తన విశ్వాస్యతను బట్టి జనములకు ఆయన తీర్పు తీర్చును.

## 97వ కీర్తన (3 + 3 + 3 + 3 = 12వ.)

**అంశము: యెహోవా వేయి ఏండ్ల రాజ్యపాలన. 13వ. 97 అధ్యాయమునకు పీఠిక – యెహోవా రాజ్యపాలన.**

**1–3వ. యెహోవా రాజ్యముద్వారా సంతోషము:–** యెహోవా అనగా యేసు వెయ్యేండ్ల రాజ్యములో భూ లోకము ఆనందిస్తుంది. ద్వీపములన్నియు సంతోషిస్తాయి. నీతిన్యాయములు ఆయన సింహాసనమునకు ఆధారము. ఇప్పుడు అవినీతి అన్యాయము రాజ్యమేలుచున్నాయి.పవిత్ర అగ్ని ఆయనకు ముందు నడచుచున్నది అది చుట్టునున్న ఆయన శత్రువులను (అన్యాయస్తులను అవినీతిపరులను) కాల్చివేయు చున్నది..కనుక ఆయన రాజ్యములో సంతోషముంటుంది.

**4–6వ. ఆయన రాకడలో సంభవములు:–** ఆయన మెరుపులు లోకమును ప్రకాశింపజేయుచున్నవి. భూమి దానిచూచి కంపించుచున్నది. యెహోవా సన్నిధిని సర్వ లోకనాధుని సన్నిధిని పర్వతములు మైనమువలె కరగుచున్నవి. ఆకాశము ఆయన నీతిని తెలియజేయుచున్నది సమస్త జనములకు ఆయన మహిమ కనబడుచున్నది

**7–9వ. వ్యర్థ విగ్రహములు–యెహోవా ఔన్నత్యము.:–** వ్యర్థ విగ్రహములను బట్టి అతిశయపడుచు చెక్కిన ప్రతిమలను పూజించు వారందరు సిగ్గుపడుదురు. సకల దేవతలు ఆయనకు నమస్కారము చేయును. యెహోవా, సీయోను నివాసులు ఆసంగతివిని నీ న్యాయవిధులనుబట్టి సంతోషించుచున్నారు. యూదా కుమార్తెలు ఆనందించుచున్నారు. ఏలయనగా యెహోవా, భూలోకమంతటికి పైగా నీవు మహోన్నతుడవై యున్నావు సమస్త దేవతలకు పైగా నీవు అత్యధికమైన ఔన్నత్యము పొందియున్నావు.

**10–12వ. ముగింపులో దేవుడిచ్చు హెచ్చరికలు – పురికొలుపు.:–** యెహోవాను ప్రేమించువారలారా, చెడుతనమును అసహ్యించుకొనుడి. ఆయన్ను ప్రేమించే మనము

చేడుతనాన్ని అసహ్యించుకోవాలి. మన ప్రాణములను ఆయన కాపాడు చున్నాడు. భక్తిహీనుల చేతిలో నుండి మనలను విడిపించు చున్నాడు. నీతిమంతుల కొరకు వెలుగును యథార్థ హృదయుల కొరకు ఆనందమును విత్తబడియున్నవి. నీతిమంతులారా, యెహోవా యందు సంతోషించుడి ఆయన పరిశుద్ధనామమును బట్టి ఆయనకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి. మనకు ఎన్ని పేర్లు పెట్టుచున్నాడో చూడండి 1. యెహోవాను ప్రేమించువారు 2.భక్తులు 3.నీతిమంతులు 4. యథార్థహృదయులు ఇట్టి పేర్లకు అర్హులముగా జీవించుదుము గాక.

### కీర్తన 98 - కీర్తన 99.

98:9వ.భూమికి తీర్పు తీర్చుటకై నీతినిబట్టి లోకమునకు తీర్పు తీర్చుటకై న్యాయమునుబట్టి జనములకు తీర్పుతీర్చుటకై యెహోవా వేంచేసియున్నాడు. 99:1వ.లో యెహోవా రాజ్యము చేయుచున్నాడని చెప్పబడినందున ఈ రెండు కీర్తనలు ఒకదాని తరువాత ఒకటి ధ్యానించుట ప్రయోజనకరము.

## కీర్తన 98 (3 + 3 + 3 = 9వ.)

**అంశము:- రాజుగా చేయు రాజ్యపాలన. రారాజుకు చేయు స్తుతి యొక్క ఔన్నత్య వివరము - ఔన్నత్యము.**

**1-3వ. దేవుని గుణములను బట్టి స్తుతి:-** యెహోవా గుణములు-1.ఆశ్చర్య కార్యములు చేయువాడు, 2. క్రొత్త కీర్తన పాడుడి, 3. ఆయన దక్షిణ హస్తము విజయము కలుగజేసియున్నది. మన పాపక్షమాపణ నిమిత్తము హస్తములలో గాయములు పొందినందుకు, 4.ఆయన పరిశుద్ధ శరీరము మన పాపముల విషయమై పోరాడి విజయము పొందినందున ఆయనకు కీర్తనలు పాడిస్తుతించాలి. శరీరము ఆయన చేతులు పొడవబడగా కారిన రక్తము ద్వారా మనలను పాపము నుండి విడిపించాడు. నిర్గ 15:11 యెహోవా, వేల్పులలో నీ వంటివాడెవడు పరిశుద్ధతను బట్టి నీవు మహానీయుడవు స్తుతి కీర్తనలను బట్టి పూజ్యుడవు అద్భుతములు చేయువాడవు నీ వంటివాడెవడు అని వున్నది. నీవు విమోచించిన యీ ప్రజలను నీ కృపచేత తోడుకొనిపోతివి. నీ బలము చేత వారిని నీ పరిశుద్ధాలయమునకు నడిపించితివి. రక్తము కార్చుట మాత్రమే కాక రక్షించుటకై ఆహ్వానించుచూ తన చేతులు దినమెల్ల చాపుచున్నందుకు ఆయనను స్తుతించాలి. 2వ. యెష 65:2 'తమ ఆలోచనల ననుసరించి చెడుమార్గమున నడచుకొనుచు లోబడనొల్లని ప్రజలవైపు దినమంతయు తన చేతులు చాపుచూ యెహోవా తన రక్షణను వెల్లడి చేసియున్నాడు. అన్యజనుల యెదుట తన నీతిని బయలుపరచియున్నాడు.

అన్యుడైన  పిలాతుభార్య ఆయన నీతిమంతుడు, ఆయన జోలికి పోవద్దని పలికినది. 3వ. అన్యజనులకు తన నీతిని, ఇశ్రాయేలు సంతతికి  కృపా విశ్వాస్యతలను, వీరిద్దరినుండి దేవుని నమ్మిన భూదిగంత నివాసులందరు అనగా సంఘము  మన దేవుడు కలుగజేసిన రక్షణను చూచిరి.

**4-6వ. దేవునికి స్తుతి చేయ వలసిన విధము:-** 4వ. సర్వభూజనులు, యెహోవానుబట్టి 1.ఉత్సహించుచూ 2. ఆర్భాటముతో 3.సంతోషతో 4.గానముచేయుచూ. 5. కీర్తనలు పాడుచూ 6.సితారా స్వరముతో యెహోవాకు 7.స్తోత్రము చేయుచు, 8.గీతములు పాడాలి. సితారా అనగా1.తంతివాయిద్యములతో, 2.సంగీత స్వరములతో అనగా గానము చేయాలి. 3. బూరలతోను కొమ్ముల నాదముతోను అనగా శబ్దము చేయు వాయిద్యములతో రాజైన యెహోవా సన్నిధిని సంతోషముగా ధ్వనితో స్తుతించాలి.

**7-9వ.దేవుని రాకడనుబట్టి స్తుతి-సృష్టి యొక్క స్తుతి :-** 7వ.  సముద్రమును దాని సంపూర్ణతయు ఘోషించును గాక ( కీర్తన 148:8 హిమమా, ఆవిరీ, ఆయన ఆజ్ఞను నెరవేర్చు తుఫానూ యెహోవాను స్తుతించుడి.) లోకమును (భూమి) దానినివాసులును కేకలు వేయుదురు గాక (కీర్త148:11 భూరాజులారా, సమస్త ప్రజలారా, భూమి మీదనున్న అధిపతులారా, సమస్త న్యాయాధిపతులారా, యెహోవాను స్తుతించుడి) 8వ.ఆయన సన్నిధిని నదులు (కీర్త148:7 భూమి మీదనున్న అగాధ జలములారా, యెహోవాను స్తుతించుడి) చప్పట్లు కొట్టును గాక కొండలు కూడి ఉత్సాహధ్వని చేయునుగాక (కీర్త148:9  పర్వతములారా, సమస్తమైన గుట్టలారా, ఫలవృక్షములారా, సమస్తమైన దేవదారు వృక్షములారా యెహోవాను స్తుతించుడి) 9 భూమికి తీర్పు తీర్చుటకై నీతినిబట్టి లోకములోని జనులకు తీర్పు తీర్చుటకై న్యాయమునుబట్టి జనములకు తీర్పుతీర్చుటకై  యెహోవా వేంచేసియున్నాడు. రోమా8:20 ఏలయనగా సృష్టి, నాశనమునకు లోనయిన దాస్యములో నుండి విడిపింపబడి, దేవుని పిల్లలు పొందబోవు మహిమగల స్వాతంత్ర్యము పొందుదునను నిరీక్షణ కలదై,.22  సృష్టి యావత్తు ఇది వరకు ఏకగ్రీవముగా మూలుగుచు ప్రసవవేదన పడుచున్నదని యెరుగుదుము.

## కీర్తన 99 (3 + 2 + 2 + 2 = 9వ.)

### అంశము:- దేవుని గొప్పతనము, యదార్థత బట్టి స్తుతి.

**1-3వ. దేవుని గొప్పతనమును బట్టి స్తుతి:-** 1-3వ. దేవుడు  వేయియేండ్లు రాజ్యము చేయునపుడు 1.జనములు వణకుదురు, 2.ఆయన కెరూబుల మీద ఆసీనుడైయుండగా భూమి

కదలును. 3. సీయోనులో యెహోవా మహోన్నతుడు మరియు జనములన్నిటిపైన ఆయన హెచ్చియుండును. 4. భయంకరమైన నీ గొప్ప నామమును వారు స్తుతించెదరు. 5. యెహోవా పరిశుద్ధుడు.

**4-5వ. దేవుని యదార్థత బట్టి స్తుతి:-** 4-5వ. దేవుడు యథార్థవర్తనుడు, న్యాయమును ప్రేమించువాడు కనుక దేవుని స్తుతించాలి. మన స్వభావము మోసగాడగు యాకోబు వంటిదైనను దేవుడు మనమధ్య నీతిన్యాయములను జరిగించియున్నాడు. అందులకై దేవుని స్తుతించాలి. మన దేవుడైన యెహోవాను ఘనపరచాలి. ఆయన పాదపీఠము ఎదుట సాగిలపడాలి. ఆయన పరిశుద్ధుడు.

**6-7వ. యదార్థతనుబట్టి ప్రార్థనకు జవాబు ఇచ్చిన దేవుడు:-** 6-7వ. ఆయన నామమును బట్టి ప్రార్థన చేయు వారిలో యాజకులగు మోషే అహరోను సమూయేలులు ఉండిరి. వారు యెహోవాకు మొఱ్ఱపెట్టగా ఆయన వారికుత్తరమిచ్చాడు. 7 ఆయన పగటిలో మేఘ స్తంభములోనుండి రాత్రి అగ్ని స్తంభములో నుండి వారితో మాటలాడగా వారు ఆయనను స్తుతించుచు కట్టడను శాసనములను అనుసరించిరి.

**8-9వ. దేవుని నమ్మకత్వమును బట్టి స్తుతి:-** 8-9వ. యెహోవా మా దేవా, నీవు వారికుత్తరమిచ్చితివి కాని వారి క్రియలను బట్టి ప్రతికారము చేయుచునే వారి విషయములో నీవు పాపము పరిహరించు దేవుడవైతివి. ఇందులో ఆయన చేయు ప్రతీకారము చెప్పబడినది. దేవుని హృదయానుసారుడైన దావీదు జన సంఖ్యలు లెక్కించి పాపము చేయగా ప్రతీకారముగా ఒక్క దినము 70 వేల మందిని సంహరించాడు. 9 మన దేవుడైన యెహోవా పరిశుద్ధుడని ఈ కీర్తనలో 3,5,9 వచనములలో మూడు పర్యాయములు చెప్పబడినది. ఆయన మూటికిముమ్మాటికి పరిశుద్ధుడే. మన దేవుడైన యెహోవాను ఆయన పరిశుద్దతనుబట్టి ఘనపరచాలి, ఆయన పరిశుద్ధ పర్వతము ఎదుట సాగిలపడుదుము గాక.

యెహోవా పరిశుద్ధతను గూర్చిన ఇతర లేఖనములను గమనింతము. - నిర్గ15:11వ. యెహోవా, వేల్పులలో నీవంటివాడెవడు పరిశుద్ధతనుబట్టి నీవు మహానీయుడవు స్తుతికీర్తనలనుబట్టి పూజ్యుడవు అద్భుతములు చేయువాడవు నీవంటివాడెవడు .

లేవీ 11:44, నేను మీ దేవుడనైన యెహోవాను. నేను పరిశుద్ధుడను గనుక మీరు పరిశుద్ధులై యుండునట్లు మిమ్మును మీరు పరిశుద్ధపరచుకొనవలెను. యెష6:3 వారు సైన్యములకధిపతియగు యెహోవా, పరిశుద్ధుడు, పరిశుద్ధుడు, పరిశుద్ధుడు. యెష5:16 సైన్యములకధిపతియగు యెహోవాయే తీర్పు తీర్చి మహిమ పరచబడును పరిశుద్ధుడైన దేవుడు నీతిని బట్టి తన్ను పరిశుద్ధపరచుకొనును (ఒక్క యెషయా గ్రంథములోనే 60 పర్యాయములు

దేవుని పరిశుద్ధత ప్రస్తావించ బడినది):

ఆపో 3:14. మీరు పరిశుద్ధుడును నీతిమంతుడునైన వానిని నిరాకరించి, 1 పేతు1:14 నేను పరిశుద్ధుడనైయున్నాను గనుక మీరును పరిశుద్ధులై యుండుడని వ్రాయబడియున్నది. ప్రక 3:7 ఫిలదెల్ఫియలో ఉన్న సంఘపు దూతకు ఈలాగు వ్రాయుము దావీదు తాళపుచెవి కలిగి, యెవడును వేయలేకుండ తీయువాడును, ఎవడును తీయలేకుండ వేయువాడునైన సత్య స్వరూపియగు పరిశుద్ధుడు చెప్పుసంగతులేవనగా

ప్రక 4:8ఈ నాలుగు జీవులలో ప్రతి జీవికి ఆరేసి రెక్కలుండెను, అవి చుట్టును రెక్కల లోపటను కన్నులతో నిండియున్నవి. అవి భూతవర్తమాన భవిష్యత్కాలములలో ఉండు సర్వాధికారి దేవుడునగు ప్రభువు పరిశుద్ధుడు, పరిశుద్ధుడు, పరిశుద్ధుడు, అని మానక రాత్రింబగళ్లు చెప్పుచుండును.

ప్రక6:10వారు నాథా, సత్యస్వరూపీ, పరిశుద్ధుడా, యెందాక తీర్పు తీర్చకయు, మా రక్తము నిమిత్తము భూని వాసులకు ప్రతిదండన చేయకయు ఉందువని బిగ్గరగా కేకలువేసిరి.

**కీర్తన 100-101**

92 నుంచి 99 వ కీర్తన వరకు స్తుతి ఔన్నత్యాన్ని గురించి చెప్పబడింది 100, 101 కీర్తనలు ఆయన మందిరములో ఎలా ప్రవేశించాలో ఆయనను ఎలా స్తుతించాలో చెప్పబడింది.

## 100వ కీర్తన (3+2+1= 5వ.)

### అంశము:- మందిరము ప్రవేశించి స్తుతించుట

**1-2వ. సమస్త దేశాల వారు:-** యెహోవాకు ఉత్సాహధ్వని చేయాలి. సంతోషముతో యెహోవాను సేవించాలి. దేవుని సేవకొరకు ప్రత్యేకించబడినవారు ఉన్నారు. వారిని తక్కువ చేయకూడదు.కాని విశ్వాసులందరు కూడా సేవకులే. ఆయన శిరస్సయి యున్నాడు, ఆయన నుండి సర్వశరీరము చక్కగా అమర్చబడి, తనలోనున్న ప్రతి అవయవము తన తన పరిమాణము చొప్పున పనిచేయుచుండగా ప్రతి కీలు వలన గలిగిన బలముచేత అతుకబడి, ప్రేమయందు తనకు క్షేమాభివృద్ధి కలుగునట్లు శరీరమునకు అభివృద్ధి కలుగజేసికొనుచున్నది (ఎఫెసీ4:16). మన పరిమాణము చొప్పున పని చేయాలి. ఉత్సాహగానము చేయాలి. వారమంతా ఆయన సన్నిధికి రావాలి. ఎప్పుడో ఒకసారి కాదు ప్రతిరోజు రావాలి చేతనయిన దేవుని పని చేయాలి.
3-**3-4వ. యెహోవాయే దేవుడని తెలిసికోవాలి:-** ఈయన ఒక్కడే దేవుడని, ఆయనే మనలను పుట్టించెనని మనము ఆయన వారము. మనము ఆయన ప్రజలము ఆయన మేపు గొఱ్ఱెలము

అని గ్రహించాలి అప్పుడు ఎవరిని పూజించలేము సేవించలేము. మనము ఆయనవారము ఆయన దాసులము ఆయన ప్రజలము ఆయన మేపు గొర్రెలము ఇవన్నీ గుర్తుపెట్టుకుని స్తుతించాలి. కృతజ్ఞతార్పణలు చెల్లించుచు ఆయన గుమ్మములలో ప్రవేశించాలి. కీర్తనలు పాడుచు ఆయన ఆవరణములలో ప్రవేశించాలి. ఆయనను స్తుతించాలి ఆయన నామమును ఘనపరచాలి.

**5వ. యెహోవా దయాళుడు:-** ఆయన కృప నిత్యముండును కనుక ఆయన రక్షణ కూడా నిత్యము ఉంటుంది ఆయన సత్యము తరతరములుండును. స్తుతించకముందు ఏమి చెయ్యాలో 101లో చెప్తున్నాడు 1కొరి 11:28. కాబట్టి ప్రతిమనుష్యుడు తన్నుతాను పరీక్షించుకొనవలెను. ఆలాగు చేసి ఆ రొట్టెను తిని, ఆ పాత్రలోనిది త్రాగవలెను.

## 101వ కీర్తన (2 + 2 + 1 + 2+ 1 = 8వ.)

### అంశము:-మందిరములో ప్రవేశించిన తర్వాత ఏమిచేయాలి

**1-2వ. చేయవలసినవి:-** దేవుని కృపా న్యాయమును గూర్చియు పాడాలి, కీర్తించాలి. నిర్దోష మార్గమున వివేకముతో ప్రవర్తించాలి. యథార్థ హృదయముతో నడుచుకోవాలి. ఆదివారము మాత్రమే పాడుతారా అన్ని సమయాలలో అన్నిచోట్లా పాడాలి. యెహోవా కీర్తనలే పాడాలి. అల్లరితో కూడిన ఆటపాటలు గాని అన్యదేవతల స్తుతి గాని వద్దు వివేకముతో ప్రవర్తించాలి. మత్త10:16 పాము వివేకమైనది. అనవసరముగా కాటు వేయదు. తప్పించుకొనిపోతుంది. పావురమునకు ప్రశాంతత కావాలి మనము అలా వివేకముగా ప్రశాంతముగా ఉండాలి.

**3-4వ. చేయకూడనివి:-** దుష్కార్యములు కన్నుల ఎదుట ఉంచుకొనకూడదు. భక్తి హీనులక్రియలు అంటనియ్యకూడదు. మూర్ఖత్వమును తొలగించుకోవాలి. దౌష్ట్యమున అనుసరింపకూడదు. దుష్కార్యము చేయుటయేకాదు. అవి కన్నుల ఎదుట కూడా ఉండకూడదు అంటే టీవీ, సెల్‌ఫోన్‌లోని చెడుగాని, ఊహలలోని చెడుగాని ఉండకూడదు. భక్తిహీనులతో పాలుండకూడదు, మూర్ఖచిత్తుల నుండి తొలగిపోవాలి, దుర్మార్గమును అనుసరించకూడదు, ఇందుకొరకు ప్రయాసపడాలి.

**5వ. సహించ కూడనివి:-** పొరుగువారిని చాటున దూషించకూడదు. విశ్వాసులనయితే గద్దించాలి, సాక్షులతో పోయి హెచ్చరించాలి. వినకపోతే సంఘానికి తెలియచేయాలి. ఇంకా వినకపోతే అన్యునిగా ఎంచాలి అంతేగాని చాటున దూషించకూడదు. మత్త 18:15-17. అహంకారదృష్టి గలవారిని గర్వించిన హృదయము గలవారిని సహింపకూడదు. కానీ దాని కంటే ముందు మనలోని అహంకారమును గర్వమును సహింపకూడదు. అహంకారము

వచ్చినపుడు పాపులలో ప్రధానుడను అని జ్ఞాపకము తెచ్చుకుంటే గర్వము పోతుంది.

**6-7వ. ఇంటిలో ఉండకూడనివి:-** దావీదు తన యొద్ద నమ్మకస్థులైన వారిని నివసించాలని, నిర్దోష మార్గమందు నడచువారిని పరిచారకులుగా నియమించుకోవాలని, మోసము చేయువాడు తన యింట నివసింపరాదని అబద్ధములాడువాడు తన కన్నులయెదుట నిలువకూడదని అనుకుంటున్నాడు. దావీదుకే ఈ కోరిక ఉంటే పరమ దావీదైన మన ప్రభువైన యేసు ఇంత కంటే తక్కువ కోరుతాడా యేసు ఇంటిలో(సంఘములో). మోసము చేయువారిని ఒప్పుకుంటాడా? ఆయన కృపలో నమ్మకస్తులముగా, నిర్దోషులముగా, మోసము చేయనివారముగా మన హృదయములను స్థిరపరచు కొందుము గాక.

**8వ. పాపమునకు దూరముగా ఉండాలి:-** దావీదు పాపము చేయువారిని భక్తిహీనులను ప్రతి ఉదయమున సంహరించెదను అంటున్నాడు. మన హృదయములోని పాపమును భక్తిహీనతను ప్రతి ఉదయము ప్రార్థన సమయములో సంహరిస్తూ ఆదివారము ఆయన సన్నిధిలో స్తుతించాలి. ఆలోచన లేకుండా స్తుతించుటకు పరుగెత్తకుందుము గాక!

## 102వ కీర్తన (5 + 6 + 5 + 6 + 6 = 28)

**అంశము: గెత్సమనే వనములో దుఃఖముచేత ప్రాణము సొక్కినవాడు (యేసు) యెహోవా సన్నిధిని పెట్టిన మొర. మన ప్రభువైన యేసుక్రీస్తు సిలువ శ్రమలు వర్ణించబడ్డాయి.**

**1-5వ.సిలువ శ్రమలు-దుఃఖము:-** అది ప్రచండ కోపదినము, మానవాళి పాపము నకు యేసును శిక్షించిన దినము అయినా ప్రభువు కష్టదినము అన్నాడు. (2)పొయిలోనిది కాలిపోయినట్లు నా యెముకలు కాలిపోయి యున్నవి. (3)“ పరము నుండి ఆయన నాయెముకల-మీదికి అగ్ని ప్రయోగించియున్నాడు. అది యెడతెగక వాటిని కాల్చుచున్నది. నా పాదములను చిక్కుపరచుటకై వల నొగ్గియున్నాడు, నన్ను వెనుకకు త్రిప్పియున్నాడు. ఆయన నన్ను పాడు చేసి దినమెల్ల నన్ను సొమ్మసిల్ల జేసియున్నాడు. (విలా1:13) యిర్మీయా చూశాడు. సువార్తికులు ఈ అగ్నిని చూడలేదు. ఎందుకంటే ఆ సమయములో గాఢాంధకారము కమ్మింది. ఈ అగ్నిలో మనుష్యులు కాలిపోవాలి. ఆ అగ్ని ప్రభువు ఎముకలను కాల్చింది “కాడి కట్టినట్లుగా తానే నా యపరాధములను నాకు కట్టియున్నాడు అవి పైన వేయబడినవై నా మెడ మీది కెక్కెను .నాబలమును ఆయన బలహీనతగా చేసియున్నాడు. ప్రభువు శత్రువులచేతికి నన్ను అప్పగించియున్నాడు నేను వారి యెదుట లేవలేకపోతిని” (విలా1:14) మన పాపములు యేసుకు కట్టబడ్డాయి. పిల్లల తప్పులను తల్లితండ్రులు క్షమిస్తారు. అలానే మన పరమతండ్రి మనపాపములను మన

మీద మోపలేదు. హృదయము వాడిపోయినా, భోజనము చేయుటకుమరచినా (4) ఎముకలు దేహమునకు అంటుకొని పోయినా (5)మన పాపము మన మీద మోపక ప్రభువే భరించాడు.

**6-11వ. సిలువ శ్రమల పోలికలు:-** గూడబాతు, పైడికంటె(6) పిచ్చుక వాటిని పోలి ఉన్నాను (7) అంటున్నాడు. యేసు ఆ పక్షుల రూపము ఎత్తలేదు. వాటిని పోలి ఉన్నాడు. హిందువులు దేవుడు పక్షిరూపము ఎత్తాడు అనుకొని వాటిని పూజిస్తున్నారు, మనము ఆలా చేయకూడదు ఆలా తలంచకూడదు. అడవిలోని గూడ బాతు ఏకాంతముగా ఉన్నట్లు ఆయన ఉన్నాడు, పాడైన స్థలములలో పైడికంటె వాలే పాడైన మన మధ్య ఉన్నాడు. మన రక్షణ కొరకై ఒంటిగానున్న పిచ్చుకవలే ఉన్నాడు. శత్రువులు (సాతాను వాని అనుచరులు) నిందిస్తూ శపిస్తున్నారు (8) బూడిదను ఆహారముగా(9) తినే దుస్థితి ప్రభువుకు వచ్చింది. కన్నీటి రోదనము చేస్తున్నాడు (10) తండ్రి ఆకాశమునకు భూమికి మధ్యలోకి ఎత్తబడ్డాడు ఆయన దినములు సాగిపోయిన నీడను పోలియున్నవి గడ్డివలె ఆయన వాడి యున్నాడు (11).

**12-16 వ. సీయోనును కరుణించుట - కట్టుట (కరుణించు దేవుడు):-** యెహోవా అనగా యేసు నిత్యము సింహాసనాసీనుడై ఉన్నాడు. ఆయన నామస్మరణ తరతరములు ఉండును (12) అంటే ఆయనను ఆయన క్రియలను జ్ఞాపకము చేసికొని స్తుతించుట అని కాని, యేసు ప్రభువా అని స్మరించడం కాదు. నేడు ఇలాంటి సంఘాలు కూడా ఉన్నాయి. సీయోను మీద దయ చూపుటకు నిర్ణయ కాలము వచ్చెను (13) ఎన్నిటికో ఆయన నిర్ణయ కాలములను ఏర్పరచాడు (ఆది18:10, అపొ17:26-27) మానవాళి మీద దయ చూపుటకు కాలము సంపూర్ణమైనప్పుడు యేసుక్రీస్తు వచ్చాడు (గల 4:4-5). ఇదే అనుకూలసమయం ఇదే రక్షణ దినం (2 కొరి 6:2) నమ్మనివారు నమ్మి రక్షించబడండి. నమ్మినవారు ఆయన దయలో ఎదగండి. రెండవ రాకడలో సీయోను మీద దయ చూపుతాడు. మొదటి రాకడలో మహిమను వదలివచ్చాడు, సంఘమును కట్టుటకు వచ్చాడు, రెండవ రాకడలో మహిమలో వచ్చి సీయోను కట్టుతాడు (16)

**17-22 వ. సీయోను విమోచన (కరుణించ బడిన మానవుడు):-** దిక్కులేని దరిద్రుల ప్రార్థన వింటాడు. దిక్కు దిశ లేని దరిద్రులము అని మనము గుర్తిస్తే మన ప్రార్థన వింటాడు (17) జనములు రాజ్యములు కూడి ఆయనను స్తుతిస్తారు. ఆయనను స్తుతించునట్లు వారిని విమోచించుటకు పరలోకము నుండి భూలోకానికి వచ్చాడు (20,21). ఈ విమోచన గురించి ముందుగానే వ్రాయబడింది (1పేతురు 1:10,11) అర్థం చేసుకున్నవారు ఆయనను నమ్మి స్తుతిస్తున్నారు(22).

**23-28 వ. ముగింపులో తండ్రి కుమారుల సంభాషణ:-** విమోచనకై మన ప్రభువైన ఏసుక్రీస్తు వచ్చినప్పుడు ఆయన దినములు కొద్దివాయెను (23) నన్ను మధ్యలోనే కొనిపోవద్దు (24) అని కుమారుడు వేడుకున్నాడు. తండ్రి అంటున్నాడు నిన్ను కొనిపోయిన నీ సంవత్సరములు తరతరములు ఉంటాయి.(24) నీవే కదా నాయనా భూమికి పునాది వేసింది. ఆకాశం నిర్మించినది. (25) భూమ్యాకాశములు గతించిన నీవు తరతరములు ఉంటావు (26-27). నీ సంతానము నీ సేవకుల సంతానము కూడా తరతరములు ఉంటుంది (28). తండ్రి ఆలోచించాడు. కుమారుడు జరిగించాడు. పరిశుద్ధాత్మ ఆ విషయం మనకు తెలియజేశాడు. త్రియేక దేవునికి మహిమ కలుగును గాక.

## 103వ కీర్తన (5 + 5 + 6 + 6 = 22) అంశము: దేవునికి స్తుతి.

**1-5వ. వ్యక్తిగత ఆశీర్వాదముల కొరకై దేవునికి స్తుతి:-** మన ప్రాణము మన అంతరంగముననున్న సమస్తము యెహోవాను,ఆయన పరిశుద్ధ నామమును ఎవరికి వారు స్తుతించాలి. ఆయన మనకు అనుగ్రహించు ఆశీర్వాదాలను దేనిని మరువకూడదు అవి 1. ఆయన ఉపకారములు చేయువాడు. 2. దోషాలను క్షమించువాడు. 3.సంకటములన్నిటిని కుదుర్చువాడు. 4.సమాధిలో నుండి ప్రాణమును విమోచించువాడు. 5.కరుణాకటాక్షములను కిరీటముగా ఉంచువాడు 6. మన యవనము పక్షిరాజు యవ్వనమువలె క్రొత్తదగునట్లు చేయువాడు. 7.మేలుతో మన హృదయమును తృప్తి పరచువాడు యెహోవా అందరికి ఉపకారి (కీర్త 145:9) ఆయన, కృతజ్ఞత లేనివారి యెడలను దుష్టుల యెడలను, ఉపకారియై యున్నాడు. (లూకా 6:35) ఇలా ఉపకారము చేయడము ఎవరికి సాధ్యము? అయన మహోపకారము చేయువాడు. మన రక్షణే మహోపకారము. ఇది ఎవ్వరు చేయలేనిది మన రక్షణనుబట్టి ఎంత స్తుతించినా తక్కువే. 1.దోషములన్నిటిని క్షమించువాడు. 2. సంకటములన్నిటిని (రోగములను) కుదుర్చువాడు. 3. సమాధి నుండి ప్రాణమును విమోచించువాడు అంటే ఆత్మ దేహప్రాణములను విమోచించువాడు ఇటువంటి విమోచనకు ఎన్ని స్తుతులు అర్పించాలి?

**6-10 వ. దేవుని గుణ లక్షణములను బట్టి దేవునికి స్తుతి:-** 1. న్యాయము తీర్చువాడు, 2. మార్గము తెలుపువాడు, 3. దయామయుడు, 4.దాక్షిణ్యపూర్ణుడు, 5.దీర్ఘశాంతుడు, 6. కృపాసమృద్ధి గలవాడు, 7. వ్యాజ్యెమాడువాడు కాడు, 8. కోపగించుకొనని వాడు, 9. ప్రతీకారము చేయనివాడు, 10. దోషములనుబట్టి మనకు ప్రతిఫలము ఇవ్వనివాడు. పై పది లక్షణాలు ప్రభువునకే ఉన్నాయి. వాటిని బట్టి స్తుతించుదుము గాక

**11-15వ. జాలి, క్షమాగుణములను బట్టి దేవునికి స్తుతి:-** భూమికంటె ఆకాశము

ఎంత ఉన్నతముగా ఉన్నదో ఆయనయందు భయభక్తులు గలవారియెడల ఆయన కృప అంత అధికముగా ఉన్నది. భూమి ఆకాశము మధ్య దూరము నేటి శాస్త్రజ్ఞుల లెక్క ప్రకారం మన ఊహకు అందదు. కోట్లకోట్లఅని కోట్లసార్లువ్రాస్తే అంతకంటే ఎక్కువ కిలోమీటర్లు ఉంటుంది. దేవుని కృప అంతకంటే ఉన్నతమైనది. పడమటికి తూర్పు ఎంతదూరమో ఆయన మన అతిక్రమములను మనకు అంత దూరపరచియున్నాడు. పడమటికి తూర్పుకు మధ్య దూరమును లెక్కించలేము. మన అతిక్రమాలను లెక్కించలేనంత దూరపరచి ఉన్నాడు. తండ్రి తన కుమారులయెడల జాలిపడునట్లు యెహోవా తనయందు భయభక్తులు గలవారి యెడల జాలిపడును. మనబిడ్డలమీద మనజాలిని లెక్కించండి. మన పిల్లలు ఎన్ని పొరపాట్లు చేసినా కడుపులో ఉంచు కుంటాము. మరి మన పరలోకపు తండ్రి అంతకంటే ఎక్కువగా జాలిపడతాడు. మనము నిర్మించ బడిన రీతి ఆయన జ్ఞాపకము చేసుకుంటున్నాడు. మన ఆయువు పువ్వు వలె వాడి పోతుంది. మన అందము మన గొప్పతనము వాడి పోతుంది. ఇటువంటి మనమీద ఆయన జాలిని బట్టి క్షమను బట్టి స్తుతించాలి.

**17-22వ. భవిష్యత్కాల ఆశీర్వాదములకై దేవునికి స్తుతి:-** మనము ఆయన యందు భయభక్తులు గలిగి జీవిస్తే ఆయన కృప, నీతి మన పిల్లల తరము నిలుస్తుంది. ఆయనే అన్నిటి మీద పరిపాలిస్తున్నాడు. యహెూవా దూతలమైన , సైన్యములమైన , పరిచారకులమైన మనము ఆయనను స్తుతిద్దాము ఘనపరుద్దాము!

## 104 వ కీర్తన (6 + 6 + 6 + 5 + 7 + 5 = 35వ.)

### అంశము:సృష్టిలో దేవుని ఘనత మహోత్యము ప్రభావం.

**1-6వ. పంచ భూతముల కలుగచేయుటలో ఘనుడు:-** నా ప్రాణమా, యెహోవాను సన్నుతించుము. ఎందుకు? ఆయన అధిక ఘనతవహించిన వాడు. మహోత్మ్యమును ప్రభావమును ధరించినవాడు. వస్త్రమువలె వెలుగును కప్పుకొన్నవాడు ఆకాశ విశాలమును తెరవలె పరచిన వాడు. మేఘములను వాహనముగా వాయువులను దూతలుగా అగ్ని జ్వాలలను పరిచారకులుగా చేసుకున్నవాడు భూమిని స్థిరపరచి దాని మీద అగాధజలములను కప్పినవాడు. మానవుడిగా వచ్చినప్పుడు ఆయన ఘనతను మహత్యమును ప్రభావమును ప్రక్కనబెట్టి వచ్చాడు. ఆయన మహత్యమును ప్రభావమును ఘనతను కొందరు మాత్రమే ఆనాడు గుర్తించారు నేడు అనేకమంది గుర్తిస్తున్నారు గుర్తించిన మనము ఆయనను స్తుతించాలి.

**7-12వ. భూమి జలములను వేరు చేయుట:-** దేవుడు ఆకాశము క్రిందనున్న

జలములొకచోటనే కూర్చబడి ఆరిననేల కనబడునుగాకని పలుకగా ఆ ప్రకారమాయెను (ఆది1:6). ఆయన శబ్దమువిని జలములు పారి పోయాయి. పర్వతము లెక్కాయి. పల్లములకు దిగాయి అవి మరలి వచ్చి భూమిని కప్పకయుండునట్లు అవి దాటలేని సరిహద్దులు వాటికి నియమించాడు. అవి అడవి జంతువు లన్నిటికి దాహమిస్తాయి వాటివలన అడవి గాడిదలు దప్పి తీర్చుకుంటాయి. వాటి ఒడ్డున ఆకాశపక్షులు వాసము చేస్తాయి. జలరాశికి సముద్రమని ఆరిన నేలకు భూమి అని పేరుపెట్టాడు. మృగములు,ఆకాశపక్షులు, భూమి,ఆయన సృష్టించిన వస్తువులు మనకు బోధిస్తాయి (యోబు12:7,8, రోమా1:20) మనుషులకంటే ఎక్కువగా సృష్టి మనకు బోధిస్తుంది భూమి బరువు భూ భ్రమణము గురించి తెలుసుకుంటే చాలు అది ఎంత అద్భుతమో! కనపడే నక్షత్రాలన్నీ భూమికంటే ఎన్నోరెట్లు పెద్దవి అందుకు ఆయనను స్తుతించాలి

**13-18వ. జలధారలను  కూర మొక్కలను మొలిపించుట:-** దేవుని చేత భూమి తృప్తిపొందు చున్నది. పశువులకు గడ్డిని నరుల ఉపయోగమునకు కూర మొక్కలను ఆయన మొలిపించుచున్నాడు. భూమిలో నుండి ఆహారమును నరుల హృదయమును సంతోషపెట్టు ద్రాక్షారసమును వారి మొగములకు మెరుగు నిచ్చు తైలమును నరుల హృదయమును బలపరచు ఆహారమును ఆయన పుట్టించుచున్నాడు. మానవులు కష్టపడి సంపాదించుకుంటున్నాము అనుకుంటున్నారు. ఆయన పుట్టించకపోతే మన ప్రయాస వ్యర్థమే యెహోవా వృక్షములు తృప్తి పొందుచున్నవి. ఆయన నాటిన లెబానోను దేవదారు వృక్షములు తృప్తి పొందుచున్నవి. అచ్చట పక్షులు తమ గూళ్లు కట్టుకొనును అచ్చట కొంగలు నివాసము చేయుచున్నవి. మేకలు కుందేళ్ళు ఆశ్రయము పొందుచున్నవి వీటన్నిటిని బట్టి ఆయనను స్తుతించాలి. వృక్షములకు తృప్తి ఉన్నది మరి మానవులకు తృప్తి ఉన్నదా?

**19-23వ. సూర్యుని చంద్రుని నియమించుట:-** ఋతువులను తెలుపుటకై ఆయన చంద్రుని నియమించాడు. సూర్యునికి తన అస్తమయకాలము తెలియును నీవు చీకటి కలుగచేయగా రాత్రియగుచున్నది. అప్పుడు అడవి జంతువులన్నియు తిరుగులాడుచున్నవి. అవి తమ ఆహారమును దేవుని చేతిలో నుండి తీసికొనజూచుచున్నవి. రాత్రి అడవిజంతువులు పగలు మనుష్యులు పనులు చేసుకునే దేవుని ఏర్పాటును బట్టి ఆయనను స్తుతించాలి. జంతువులు తమ ఆహారము దేవుని చేతిలో నుండి తీసుకుంటున్నాయి. మనము మన చేతుల మీద ఆధారపడి శ్రమలు పడుతున్నాము.

**24-30వ. లెక్కలేనన్ని జలచరములతో మహా సముద్రము నిలబడుట:-**దేవుని కార్యములు ఎన్నో విధములుగా నున్నవి! జ్ఞానముచేత దేవుడు కలుగ జేసిన వాటితో. భూమి

నిండియున్నది. విశాలమైన మహాసముద్రము అందులో లెక్కలేని జలచరములున్నవి అందులో ఓడలు నడుచుచున్నవి మకరములు ఆడుచున్నవి. తగినకాలమున దేవుడువాటికి ఆహారమిచ్చునని ఆయన దయ కొరకు కనిపెట్టుచున్నవి. ఆయన గుప్పిలి విప్పగా అవి మంచి వాటిని తిని తృప్తి పొందుచున్నవి. కాని మనుష్యులకు తృప్తి లేదు సంతుష్టి సహితమైన దైవభక్తి గొప్పలాభసాధనమై యున్నది (1 తిమో6:6).

**31-35వ.దేవుని మహిమగల క్రియలనుగూర్చిన ఇంపైన ధ్యానము:-** యెహోవా మహిమ నిత్యముండును గాక. యెహోవా తన క్రియలను చూచి ఆనందించును గాక. మనము ఆనదించుదుము గాక. ఆయన భూమిని చూడగా అది వణకును ఆయన పర్వతములను ముట్టగా అవి పొగరాజును మానవులకు భయములేదు. దైవ భయము కలిగి ఉండుము గాక ఇందును బట్టి మన జీవితకాలమంతయు యెహోవాకు కీర్తనలు పాడెదను గాక మనమున్నంత వరకు మన దేవుని కీర్తించెదము గాక, ఆయనను గూర్చిన మన ధ్యానము ఆయనకు ఇంపుగా నుండునుగాక. మనము యెహోవా యందు సంతోషించెదము గాక. యుగాంతమందు పాపులు భూమి మీద నుండి లయమగుదురు గాక. భక్తిహీనులు ఇక నుండకపోదురు గాక. నా ప్రాణమా, యెహోవాను సన్నుతించుము.

## 105 వ కీర్తన (6 + 3 + 6 + 5 + 5 + 7 + 6 + 7 = 45వ.)

### అంశము:- ఇశ్రాయేలీయులు తమ చరిత్రను బట్టి దేవుని స్తుతించుట.

**పీఠిక:** ఇది స్తుతి కీర్తన.దావీదు వ్రాసాడని 1 దిన 16అ నుబట్టి చెప్పవచ్చు. మందసము యెరూషలేము పట్టణమునకు తేబడింది. ఇదే ప్రాముఖ్యమైన సంఘటన. దావీదుకు మందసమన్నా, మందిరమన్నా ప్రాణము. అలాగే రక్షించబడిన మనము అపొస్తలుల బోధయందును ,సహవాసమందు,రొట్టె విరుచుటయందును, ప్రార్థన చేయుట యందు ఎడతెగక ఉండాలి (అపో2:42). మనకు మందిరము, సంఘము, సంఘ నియామక కూడికలు అంటే ప్రియముగా ఉండాలి. చాలామందికి ఇవి ప్రియముగా లేవు. సంఘములో వాక్యము కంటే టి.వి.లలో వాక్యము బాగుంది అనే వాళ్ళు ఉన్నారు. ఉండవచ్చు కాని సంఘము ప్రియమైనది గా ఉండాలి. ఇందులో ఇశ్రాయేలీయులు తమ చరిత్రను జ్ఞాపకము చేసుకుంటూ స్తుతిస్తున్నారు. మనము కూడా ఆలాగు స్తుతించాలి.

**1-6వ. యెహోవాను కీర్తించి పాడి స్తుతించుట:-** యెహోవాకే కృతజ్ఞతాస్తుతులు చెల్లించాలి. ఆయన నామమునే ప్రకటించాలి. జనములలో ఆయన కార్యములను తెలియచేయాలి

ఆయనను గూర్చి పాడాలి, ఆయనను కీర్తించాలి. ఆయన ఆశ్చర్యకార్యములన్నిటిని గూర్చి సంభాషించి, ఆయన పరిశుద్ధనామమునుబట్టి అతిశయించాలి. యెహోవాను వెదకాలి. ఆయన బలమును వెదకాలి. ఆయన సన్నిధిని నిత్యము వెదకాలి. ఆయన చేసిన ఆశ్చర్యకార్యము లను, సూచక క్రియలను జ్ఞాపకము చేసికోవాలి దేవుని స్తుతించుటలో ఇదంతా భాగమే.

**7-9వ. పితరులతో చేసిన నిబంధన జ్ఞాపకము చేసుకొనుట.:-** దేవుడు తను ఇచ్చిన మాటను వెయ్యి తరముల వరకు జ్ఞాపకము ఉంచుకుంటాడు అబ్రహాము, ఇస్సాకుతో చేసిన నిబంధనను నిత్యము జ్ఞాపకము చేసుకుంటాడు. అని గ్రహించాలి. మనము మూడు తరముల వరకే ఆలోచిస్తాము. నిత్యము గుర్తుంచుకునే దేవుని ప్రేమకు ఎన్ని స్తుతులు చెల్లించినా తక్కువే.

**10-15వ. పితరులతో చేసిన నిబంధన స్థిరపరచి,నెరవేర్చుట.:-** ఇశ్రాయేలీయుల సంఖ్య కొద్ది మందే, వారు పరదేశులు. వారికి కనాను దేశమును స్వాస్థ్యముగా ఇస్తానన్నాడు, దానిని స్థిరపరచాడు. వారి సంఖ్య ఇప్పుడు కొద్దే! మన రెండు జిల్లాల అంతే వారి దేశము. దేశము చిన్నదే కాని ప్రపంచములో ఇశ్రాయేలీయులుఅంటే తెలియనివారు లేరు.వారి ప్రయాణాలలో ఆయన అభిషేకించిన తన ప్రవక్తలకు ఎవరు కీడు చేయకూడదని ఆజ్ఞ ఇచ్చి వారిని ముట్టనివ్వలేదు. రాజులను గద్దించి హింస చేయనివ్వలేదు ఆది 12లో ఫరోను 20లో, 26 లో అబీమెలెకును గద్దించాడు.

**16-20వ. యోసేపును దాసుడుగాపంపి,పరిశోధించుట.:-** దేవుడే యోసేపును ఐగుప్తుకు పంపాడు.పరిశోధించాడు. యోసేపు దాసునిగా అమ్మబడినా, సంకెళ్ళచేత ప్రాణము నొప్పింప బడినా,నిందలు మోపి జైలుకు పంపబడినా తను చెప్పిన కల నెరువేరు వరకు సహించాడు. రాబోయే కరువును విడుదలను చెప్పిన యోసేపును ఐగుప్తు రాజు చెర నుండి విడిపించాడు.

**21-25వ. యోసేపును అధికారిగా నియమించి, ఇశ్రాయేలును వృద్ధి చేయుట.:-** ఫరో యోసేపును తన ఇష్ట ప్రకారము తన రాజ్యము మీద తన ఇంటి మీద అధికారిగా నియ మించాడు. ఇశ్రాయేలు ఐగుప్తు లోనికివచ్చి పరదేశిగా జీవించాడు. దేవుడు తన ప్రజలకు బహు సంతానవృద్ధి కలుగజేసి వారి విరోధులకంటె వారికి అధిక బలము దయ చేశాడు.

ఐగుప్తీయులకు తన ప్రజల మీద అసూయ కలిగి కుయుక్తిగా నడచు నట్లు చేశాడు. దేవుని ప్రేమించువారికి, అనగా ఆయన సంకల్పము చొప్పున పిలువబడినవారికి, మేలు కలుగుటకై సమస్తమును సమకూడి జరుగుచున్నవని యెరుగుదుము (రోమా 8:28).

**26-32వ. మోషే, అహరోనుల ద్వారా సూచక క్రియలను చేయుట.:-** ఆయన తన

సేవకులైన మోషేను, అహరోనును పంపాడు. వారు ఐగుప్తీయుల మధ్య ఆయన సూచక క్రియలను మహత్కార్యములను జరిగించారు. ఆయన చీకటి కలుగచేసాడు. వారి జలములను రక్తముగా మార్చాడు. వారి చేపలను చంపాడు. వారి దేశములో కప్పలు నిండెను అవి వారి రాజుల గదులలోనికి వచ్చెను. ఆయన ఆజ్ఞ ఇయ్యగా జోరీగలు పుట్టెను, వారి ప్రాంతములన్నిటిలోనికి దోమలు వచ్చెను. ఆయన వారి మీద వడగండ్ల వాన కురిపించెను. వారి దేశములో అగ్నిజ్వాలలు పుట్టించెను.

**33-38వ.సూచక క్రియల ద్వారా ఐగుప్తునుండి ఇశ్రాయేలీయులకు విడుదల:-** వారి ద్రాక్ష తీగెలను,అంజూరపు చెట్లను పడగొట్టెను వృక్షములను విరుగకొట్టెను. ఆయన ఆజ్ఞ ఇయ్య గా పెద్దమిడతలును లెక్కలేనిచీడపురుగులును వచ్చెను, అవి వారి దేశపు కూర చెట్లన్నిటిని వారి భూమి పంటలను తినివేసెను. వారి ప్రథమ సంతానమును ఆయన హతము చేసెను. అక్కడ నుండి తన జనులను వెండి బంగారములతో ఆయన రప్పించెను వారి గోత్రములలో నిస్సత్తువ చేత తొట్రిల్లు వాడొకడైనను లేకపోయెను. వారి వలన ఐగుప్తీయులకు భయము పుట్టెను. వారు బయలు వెళ్లినప్పుడు ఐగుప్తీయులు సంతోషించిరి. ఎన్ని అద్భుతములు మహాత్కార్యములు చేసి ఇశ్రాయేలు వారిని విడిపించాడు, అందుకే ఆయనను స్తుతించాలి.

**39-45వ. అరణ్య ప్రయాణము-వాగ్దాన దేశము చేరుట.:-** వారికి చాటుగా నుండుటకై ఆయన మేఘమును, రాత్రి వెలుగిచ్చుటకై అగ్నిని కలుగజేసెను. వారు మనవి చేయగా ఆయన పూరేళ్లను రప్పించెను. ఆకాశములో నుండి ఆహారమునిచ్చి వారిని తృప్తి పరచెను. బండను చీల్చగా నీళ్లు ఉబికి వచ్చెను ఎడారులలో అవి యేరులై పారెను. ఏలయనగా ఆయన తన పరిశుద్ధ వాగ్దానమును తన సేవకుడైన అబ్రాహామును జ్ఞాపకము చేసికొని ఆయన తన ప్రజలను సంతోషముతో తాను ఏర్పరచుకొనిన వారిని ఉత్సాహధ్వనితోను వెలుపలికి రప్పించెను. వారు తన కట్టడలను గైకొనునట్లునుతన ధర్మశాస్త్ర విధులను ఆచరించునట్లును అన్యజనుల భూములను ఆయన వారికప్పగించెను జనముల కష్టార్జితమును వారు స్వాధీనపరచుకొనిరి. యెహోవాను స్తుతించుడి. ఇశ్రాయేలీయులు లేకుంటే ప్రభువు లేడు మనకు రక్షణ లేదు అందుకే మనము స్తుతించాలి.

## 106వ కీర్తన (6 + 6 + 6 + 6 + 6 + 6 + 6+ 6 = 48వ.)

**పీఠిక:** ఇందులో స్తుతి ప్రార్థన కలిసి ఉన్నాయి ఇందులో ఇశ్రాయేలీయుల జీవిత కాలపు చరిత్ర ఉంది 105 కూడా ఇశ్రాయేలీయుల చరిత్ర అయితే ఇశ్రాయేలు చేసిన మేలులనుబట్టి

అది స్తుతి. కాని 106 ఇశ్రాయేలీయులు ఎన్నో పొరపాటులు (7,13,14) చేసినా ఆయన తన కృపాబాహుళ్యము విస్తరింపజేసి కాపాడాడు. అందునుబట్టి స్తుతి ఇది ఎంతో ఆశ్చర్యం. 105 ను బట్టి ఇది కూడా దావీదు గారే వ్రాశారు అని నమ్మవచ్చు.

**అంశము:-** దేవుని ప్రజల అపనమ్మకత్వము,అవిశ్వాసము, సణుగులు మరియు పాపము చేయుట ఉన్నను దేవుని సహనమును బట్టి దేవునికి స్తుతి ప్రార్థన.

**1-6వ. పాపము చేసినను ప్రజల యందు ఆయనకున్న దయనుబట్టి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుట:-** యెహోవా దయాళుడు ఆయన కృప నిత్యముండును. గనుక కృతజ్ఞతాస్తుతులు చెల్లించాలి యెహోవా పరాక్రమ కార్యములను ఆయన కీర్తియంతటిని మనము ప్రకటించాలి.ఎల్లవేళల, (అప్పుడప్పుడు కాదు) నీతి,న్యాయము ననుసరించి నడుచుకుంటే ధన్యులము. యెహోవా ఏర్పరచుకొనినవారి క్షేమముబట్టి మనము సంతోషించాలి. వారితో కూడి కొనియాడునట్లు మనలను రక్షింపమని దేవుని వేడుకొనాలి. మన పితరుల వలెనే మనము పాపము చేసితిమి దోషములుకట్టుకొని భక్తిహీనులమైతిమి అని ఒప్పుకోవాలి దానియేలు యోహాను లాంటి భక్తులు పొరపాట్లు చేయకపోయినా మనము అని ఒప్పుకున్నారు (1 యోహాను 1:9).

**7-12వ. ఐగుప్తు నుండి ఎర్ర సముద్రము దాటించిన క్రియ:-** ఐగుప్తులో మన పితరులు దేవుని అద్భుతములను గ్రహింపలేదు. ఆయన కృపా బాహుళ్యమును జ్ఞాపకమునకు తెచ్చు కోలేదు. ఎఱ్ఱ సముద్రమునొద్ద వారు తిరుగుబాటు చేసిరి. అయినను తన మహా పరాక్రమమును ప్రసిద్ధి చేయుటకై ఆయన తన నామమును బట్టి వారిని రక్షించెను. ఆయన ఎఱ్ఱ సముద్రమును గద్దించి మైదానము మీద నడిపించాడు శత్రువుల చేతిలో నుండి వారిని రక్షించి విమోచించాడు. నీళ్లు వారి శత్రువులను ముంచివేసెను వారిలో ఒక్కడైనను మిగిలియుండలేదు. అప్పుడు వారు ఆయన మాటలు నమ్మిరి. ఆయన కీర్తి గానము చేసిరి. మనము గానము చేయాలి.

**13-18వ. దేవుని శోధించిన దాతాను, అబైరాములు శిక్షించబడుట.:-** అయినను వారు ఆయన కార్యములను వెంటనే మరచి పోయిరి. ఆయన ఆలోచన కొరకు కనిపెట్టుకొనక పోయిరి. మన పరిస్థితి ఎట్లు? అరణ్యములో వారు బహుగా ఆశించి దేవుని శోధించిరి వారు కోరినది ఆయన వారికిచ్చెను. అయినను వారి ప్రాణములకు ఆయన క్షీణత కలుగ జేసెను. దేవుని విసిగించినపుడు ఇస్తాడు గాని మేలు ఉండదు. వారు మోషే యందును అహరోను నందును అసూయపడిరి. భూమి నెరవిడిచి దాతానును మింగెను అది అబీరాము గుంపును కప్పివేసెను. వారి సంఘములో అగ్నిరగిలెను దాని మంట భక్తిహీనులను కాల్చి వేసెను. చేసిన తప్పులకు శిక్ష తప్పదు.

**19-24వ. దేవుని కార్యములను మరచి పోయి దూడను పూజించిన ఇశ్రాయేలు.:-** హోరేబులో వారు దూడను చేసికొని నమస్కారము చేసిరి. ఆయన మహిమను గడ్డిమేయు ఎద్దు రూపమునకు మార్చిరి. ఐగుప్తులో గొప్ప కార్యములను, ఆశ్చర్య కార్యములను,భయము పుట్టించు క్రియలను చేసిన తమ రక్షకుడైన దేవుని మరచిపోయిరి. అప్పుడు ఆయన నేను వారిని నశింపజేసెదననెను. అయితే ఆయన కోపము చల్లార్చుటకై ఆయన ఏర్పరచుకొనిన మోషే ఆయన సన్నిధిని నిలిచి అడ్డుపడెను వారు రమ్యమైన దేశమును నిరాకరించిరి ఆయన మాట నమ్మకపోయిరి.మోషే అడ్డుపడ్డాడు మనము చేసే పాపాలకు ప్రభువు ప్రాయశ్చిత్తమై ఉన్నాడు లేకుంటే మనగతి మరణమే రమ్యమైన పరలోకము నిరాకరించక నమ్ముదుముగాక.

**25-30వ. మోయాబీయులతో వ్యభిచారము:-** యెహోవా మాట ఆలకింపక వారు తమ గుడారములో సణుగుకొనిరి. అప్పుడు ఆయన అరణ్యములో వారిని కూలచేయుటకు వారి మీద చెయ్యి యెత్తెను. వారిలో తెగులు రేగెను. ఫీనెహాసులేచి పరిహారము చేయగా ఆ తెగులు ఆగిపోయెను. మన ప్రభువు కుడా పరిహారము చేస్తున్నాడు గనుక మనము నిలిచియున్నా మని గమనించాలి.

**31-36వ. మోషేకు బాధ కలిగించి అతని ఆత్మ మీద తిరుగుబాటుచేసి అన్యజనులతో సహవాసము చేసినందున వారు అన్యజనులను నాశనము చేయలేక పోయిరి:-** నిత్యము తరములన్నిటను అతనికి ఆపని నీతిగా ఎంచబడెను.పాపపరిహారము నీతిగా ఎంచబడుచున్నది. మెరీబా జలములయొద్ద వారు ఆయనకు కోపము పుట్టించిరి కావున వారి మూలముగా మోషేకు బాధ కలిగెను. ఎట్లనగా వారు అతని ఆత్మ మీద తిరుగుబాటు చేయగా అతడు తన పెదవులతో కానిమాట పలికెను. పాపపరిహారము చేయక మాటజారాడు. అందుకే మోషేకు కూడా శిక్ష పడింది. పాపమునుబట్టి శిక్ష తప్పదు రక్షింపబడకపొతే నరకము. రక్షింపబడినవారు పాపము చేస్తే ఈ లోకంలో శిక్ష తప్పదు బహుమానాలు ఈ లోకములో, పరలోకంలో పోతాయి.

**37-42వ. కుమారులను విగ్రహములకు బలి అర్పించి వ్యభిచరించి దేశము అపవిత్ర పరచినందున శత్రువులచేతి క్రింద అణపబడిరి.:-** మరియు వారు తమ కుమారులను తమ కుమార్తెలను దయ్యములకు బలిగా అర్పించిరి. దేవునికి అర్పించుటకు మనస్సురాదు.పాపానికి దేనినైనా అర్పిస్తాము దేవునికి అర్పించలేము. ఈ బుద్ధి మార్చుకుందుము గాక. వారు అపవిత్రులైరి వ్యభిచరించిరి. కావున ఆయన వారిని అన్యజనుల చేతికి అప్పగించెను. వారి పగవారు వారిని ఏలుచుండిరి మన పరిస్థితి ఇంతే.

**43-48వ. అనేక పర్యాయములు వారు దేవునికి మొరపెట్టగా ఆయన తన నిబంధనను**

**జ్ఞాపకము చేసుకొని వారిని విడిపించెను:-** అయినా అనేక పర్యాయములు ఆయన వారిని విడిపించాడు అయినను వారు తమ ఆలోచనను అనుసరించి తిరుగుబాటు చేయుచువచ్చిరి. అయినను వారి రోదనము తనకు వినబడగా వారికి కలిగిన శ్రమను ఆయన చూచెను. వారిని తలంచుకొని ఆయన తన నిబంధనను జ్ఞాపకము చేసికొనెను. తన కృపాబాహుళ్యమును బట్టి వారిని కరుణించెను. వారిని చెరగొనిపోయిన వారికందరికి వారి యెడల కనికరము పుట్టించెను. యెహోవా మా దేవా, మమ్మును రక్షింపుము మేము నీ పరిశుద్ధ నామమునకు కృతజ్ఞతా స్తుతులు చెల్లించునట్లును నిన్ను స్తుతించుచు మేమతిశయించునట్లును అన్యజనులలో నుండి మమ్మును పోగుచేయుము. ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవా యుగములన్నిటను స్తుతినొందును గాక. ప్రజలందరు ఆమేన్ అందురు గాక. యెహోవాను స్తుతించుడి.

**పంచమ స్కందము. కీర్తన 107-150 (13 + 15 + 16 = 44 కీర్తనలు.)**

సకల ప్రాణులు యెహోవాను స్తుతించుదురు గాక. 150:6.

ఈ కీర్తనలు నెహెమ్యా కాలములో పట్టణ ప్రాకార ప్రతిష్ఠకు సమకూర్చబడినవి.

(దావీదు-15, సొలొమోను.-1, అనాద కీర్తనలు -28)

బహుశా దావీదు రచించి ఉండవచ్చు.

1. 107-119 - స్తుతులు, వాక్యము యొక్క ప్రాముఖ్యత.
2. 120-134 - యెరూషలేము యాత్ర.
3. 135-150ు- ప్రార్థనలు, స్తుతులు.

## 107వ కీర్తన (7 + 7 + 6 + 5 + 5 + 7+ 6 = 43వ.)

**అంశము:-** బహుశా యూదులు బబులోనుచెరలో బాధపడి దేవునికి మొరపెట్టినపుడు దేవుడు చెర నుండి విడిపించగా దేవుని స్తుతించిన కీర్తన. 105, 106, 107 ఈ మూడు కీర్తనలలో ఆయనకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి అను మాటలు ప్రారంభములోనే కలవు. కష్టకాలమందు వారు యెహోవాకు మొఱ్ఱపెట్టిరి. ఆయన వారి ఆపదలలో నుండి వారిని విడిపించెను అని 6,13,19,28 వచనములలో వున్నది. దేవుడు కష్టకాలమందు వారు మొఱ్ఱపెట్టగా ఆయన ఆపదలలో నుండి వారిని విడిపించిన మేలు నిమిత్తము హృదయములో నింపబడిన కృతజ్ఞతాపూర్వకమైన స్తుతిని దేవునికి చెల్లించుట ఈ కీర్తన సారాంశము.

**1-7వ. యెహోవా విమోచించి నివాసపురము చేరునట్లు చక్కని త్రోవను వారిని**

**నడిపింనందుకు దేవునికి స్తుతి:-** యెహెూవా దయ నిత్యముండు కృప కలవాడు గనుక ఆయనకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించాలి. ఎఫే 2:8 మీరు విశ్వాసముద్వారా కృపచేతనే రక్షింపబడియున్నారు. ఇది మీ వలన కలిగినది కాదు, దేవుని వరమే. ఎఫే 2:7. క్రీస్తుయేసునందు మనలను ఆయనతో కూడ లేపి, పరలోకమందు ఆయనతో కూడ కూర్చుండబెట్టెను. 2వ. కృపచేతనే రక్షణ, పరలోక ప్రవేశము. కనుక యెహెూవా విమోచించినవారు నిత్యముండు ఆయన కృపనుబట్టి ఆయనకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించాలి. 3వ.తూర్పునుండి పడమటి నుండి ఉత్తరము నుండి దక్షిణము నుండి నానాదేశముల నుండియు ఆయన పోగుచేసినవారు అనగా భూదిగంతములలో సువార్త ప్రకటన ద్వారా రక్షించబడినవారు తమ రక్షణనుబట్టి ఆ మాట పలుకుదురుగాక. 4వ. ఇశ్రాయేలీయులు ఐగుప్తు నుండి విడిపించబడి నివాసపురమేదియు లేక సీనాయి అరణ్యమందలి యెడారిత్రోవలలో తిరుగులాడుచు కష్టకాలమందు యెహెూవాకు మొఱ్ఱపెట్టిరి. యెహెూషువ ద్వారా కనానులోనికి నడిపించి నివాసపురముగా కనాను దేశమును అనుగ్రహించాడు కనుక యెహెూవా దయాళుత్వమును బట్టి ఆయనకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించాలి. అందుకే ఈరీతిగా 6-7వ. చెప్పబడినది. వారు కష్టకాలమందు యెహెూవాకు మొఱ్ఱపెట్టిరి. ఆయన వారి ఆపదలలో నుండి వారిని విడిపించెను. వారొక నివాసపురము చేరునట్లు చక్కని త్రోవను ఆయన వారిని నడిపించెను.

**8-14వ.దేవుని ఆజ్ఞలకు లోబడక తృణీకరించినందున ఇనుపకట్ల చేతను బంధింప బడి మొఱ్ఱపెట్టగా ఆయన వారి ఆపదలలోనుండి విడిపించిన మేలు నిమిత్తము హృదయములో నింపబడిన కృతజ్ఞతాపూర్వకమైన స్తుతిని చెల్లించుట:-** 8వ. ఆయన కృపనుబట్టియు నరులకు ఆయన చేయు ఆశ్చర్యకార్యములనుబట్టియు వారు యెహెూవాకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుదురు గాక. దేవుని ఆజ్ఞకు వ్యతిరేకముగా విగ్రహారాధన చేయగా బానిసలుగా సంకెళ్లతో బంధించబడి బబులోనుకు కొనిపోబడిరి. దేవుని తృణీకరించినందున వారిని ఇనుపకట్లచేత బంధించి చీకటిలో నివాసము చేయుచు ఆయాసముచేత బబులోనులో క్రుంగునట్లు దేవుడు జేసెను. ఇట్టి స్థితినుండి విడిపించుటకు సహాయుడు లేక పోగా కష్టకాలమందు యెహెూవాకు మొఱ్ఱపెట్టిరి. యెహెూవా పారశీకుడగు కోరెషుకు రాజ్య అధికారమనుగ్రహించి బానిసత్వము నుండి యూదా వారిని విడిపించి యెరూషలేముకు రప్పించెను. అందుకు ఆయనకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించాలి.

**15-20వ. దుష్ట ప్రవర్తనచేత బాధ తెచ్చుకొని శిక్షగా మరణద్వారములను సమీపించి యెహెూవాకు మొఱ్ఱపెట్టగా ఆయన వారి ఆపదలలో నుండి విడిపించినందుకు స్తుతిని చెల్లించుట:-** 15వ.ఆయన కృపను బట్టియు నరులకు ఆయనచేయు ఆశ్చర్యకార్యములను బట్టియువారు యెహెూవాకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుదురుగాక.

**16-18వ. బెల్షజ్జర్ బుద్ధిహీనత:-** బబులోను రాజగు బెల్షజ్జర్ బుద్ధిహీనుడై ఒక రాత్రి యెరూషలేము నుండి తేబడిన దేవుని మందిర ఉపకరణములలో త్రాగుచు కర్ర, వెండితో చేయబడిన విగ్రహములను పూజించుచుండగా ప్రాకారపు ఇత్తడి తలుపులు తెరువబడి మాదీయుల సైన్యము కోట లోపలికి ప్రవేశించి బబులోను రాజును చంపిరి.

**19-20వ. కష్టకాలమందు మొరపెట్టుట:-** కష్టకాలమందు యూదావారు యెహోవాకు మొఱ్ఱపెట్టిరి. ఈ రీతిగా దేవుడు వారి ఆపదలలో నుండి వారిని విడిపించెను. ఆయన తన వాక్కును పంపి యూదా వారిని బాగుచేసి బానిసత్వమను గుంటలలో నుండి వారిని విడిపించెను.

**21-30 వ. మహాజలములమీద సంచరించుచు వ్యాపారముచేయువారు తుపాను తరంగములచే, శ్రమపడి యెహోవాకు మొఱ్ఱపెట్టగా ఆయన ఆపదలలో నుండి వారిని విడిపించగా స్తుతిని చెల్లించుట:-** 21ఆయన కృపను బట్టియు నరులకు ఆయన చేయు ఆశ్చర్య కార్యములనుబట్టి వారు యెహోవాకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుదురుగాక. 22వారు కృతజ్ఞ తార్పణలు చెల్లించుదురుగాక ఉత్సాహధ్వనితో ఆయన కార్యములను ప్రకటించుదురు గాక. 23వ. ఓడ లెక్కి సముద్ర ప్రయాణము చేయు వ్యాపారస్తులు తుపాను పుట్టి దాని తరంగములను పైకెత్తగా శ్రమకు తాళలేక వారు యెహోవాకు మొఱ్ఱపెట్టిరి. ఆయన వారి ఆపదలలో నుండి వారిని విడిపించెను. 29 ఆయన తుపానును ఆపివేయగా దాని తరంగములు అణగిపోయెను. 30 అవి నిమ్మళమైనవని వారు సంతోషించిరి వారు కోరిన రేవునకు ఆయన వారిని నడిపించెను. మార్కు 4:37 అప్పుడు పెద్ద తుపాను రేగి ఆయన యున్న దోనెమీద అలలు కొట్టినందున దోనె నిండిపోయెను. 38 ఆయన దోనె అమరమున తలగడ మీద తల వాల్చుకొని నిద్రించుచుండెను. వారాయననులేపి బోధకుడా, మేము నశించిపోవుచున్నాము. నీకు చింత లేదా? అని ఆయనతో అనిరి. 39అందుకాయన లేచి గాలిని గద్దించి నిశ్శబ్దమై ఊరకుండుమని సముద్రముతో చెప్పగా, గాలి అణగి మిక్కిలి నిమ్మళమాయెను. ఆలాగే జీవిత యాత్రలో అనేక తుఫానులు రేగి మనలను నిస్సహాయులుగా చేయును. దేవునికి మొఱ్ఱపెట్టగా దేవుడు ఆపదలలో నుండి అనగా అట్టి నిస్సహాయ స్థితి నుండి మనలను విడిపించును. యెహోవాకు కృతజ్ఞతా స్తుతులు చెల్లించుదుముగాక.

**31-37వ. కృపను బట్టి స్తుతి:-** దేశనివాసుల చెడుతనమును బట్టి నీటి బుగ్గలను ఎండిన నేలగాను సత్తువగల భూమిని చవిటి పఱ్ఱగాను మార్చి శిక్షించగా యెహోవాకు మొఱ్ఱ పెట్టగా వారికి సస్యఫలసమృద్ధి నిచ్చినందున స్తుతిని చెల్లించుట. 31వ. ఆయన కృపను బట్టియు నరులకు ఆయన చేయు ఆశ్చర్యకార్యములనుబట్టి వారు యెహోవాకు కృతజ్ఞతాస్తుతులు

చెల్లించుదురు గాక. జనసమాజములో వారాయనను ఘనపరచుదురు గాక. పెద్దల సభలో ఆయనను కీర్తించుదురు గాక. 32-33వ. దేశ నివాసుల చెడు తనమునుబట్టి సత్తువగల భూమిని చవిటిపఱ్ఱగాను మార్చాడు. 35-36వ. దేవునికి మొఱ్ఱపెట్టగా దేవుడు వారి ఎండిన నేలను నీటి ఊటల చోటుగాను మార్చివేశాడు. 36-37వ. వారు అచ్చట నివాస పురము ఏర్పరచుకొనునట్లును పొలములో విత్తనములు చల్లి ద్రాక్షతోటలు నాటి వాటి వలన సస్యఫలసమృద్ధి పొందునట్లును ఆయన ఆకలిగొనిన వారిని అచ్చట కాపురముంచెను.

**38-43వ. బాధలలో యెహోవాకు మొఱ్ఱపెట్టగా బాధను పోగొట్టి వారిని లేవనెత్తి వారి వంశమును మందవలె వృద్ధిచేసి నందుకు స్తుతిని చెల్లించుట:-** యోహా 16:33 లోకములో మీకు శ్రమ కలుగును. అయినను ధైర్యము తెచ్చుకొనుడి, నేను లోకమును జయించియున్నానని నెను. నాయందు మీకు సమాధానము కలుగునట్లు ఈ మాటలు మీతో చెప్పుచున్నాను. లోక జీవితములో మనకు శ్రమలు సహజముగానే కలుగును.

38-40వ. దేవుడు వారిని ఆశీర్వదింపగా వారు అధికముగా సంతానాభివృద్ధినొందిరి ఆయన వారి పశువులను తగ్గిపోనియ్యలేదు. వారు బాధ వలన, ఇబ్బంది వలనను, దుఃఖము వలనను తగ్గిపోయినప్పుడు రాజులను తృణీకరించుచు త్రోవలేని యెడారిలో వారిని తిరుగులాడ జేయువాడు.

41-43వ. అట్టి దరిద్రుల బాధను పోగొట్టి వారిని లేవ నెత్తెను వాని వంశమును మందవలె వృద్ధిచేసెను. యథార్థవంతులు దానిచూచి సంతోషించుదురు. మోసగాండ్రందరును మౌనముగా నుందురు. బుద్ధిమంతుడైనవాడు ఈ విషయములను ఆలోచించును యెహోవా కృపాతిశయములను జనులు తలపోయుదురు గాక.

## 108వ కీర్తన (2 + 3 + 3 + 2 + 3 = 13వచనములు)

**అంశము-సందర్భము:-** 9వ.లో ఎదోము మీద నా చెప్పు విసరి వేయుదును అన్నందున 2 సమూ 8:12-14వ. లో ఎదోముపై యుద్ధమునకు వెల్లినపుడు రచించినది. దావీదు ఉప్పు లోయలో సిరియనులగు పదునెనిమిది వేలమందిని హతము చేసి తిరిగిరాగా అతని పేరు ప్రసిద్ధమాయెను. అతడు సిరియనులను, మోయాబీయులను, అమ్మోనీయులను, ఫిలిష్తీయులను, అమాలేకీయులను హదదెజెరు అను సోబారాజును, పట్టుకొను సమయమున ఎదోమీయులు తిరుగబడిరి కనుక ఎదోము దేశమందు అతడు దండునుంచెను. ఎదోమీయులు దావీదునకు దాసులు కాగా దాసుడు యజమాని చెప్పులు విప్పాలి, పాదములు కడుగాలి. ఆ సమయములో విప్పబడిన చెప్పులు యజమాని విసిరివేయగా మరొక దాసుడు పట్టుకొని తుడిచి శుభ్రపరచి

భద్రపరచాలి. కనుక 9వ.లో ఎదోము మీద నా చెప్పు విసరివేయుదును అన్నందున 2 సమూ 8:12-14వ. లో ఎదోముపై యుద్ధమునకు వెల్లునపుడు రచించినదని తలంచ గలము.

**1-2వ. పాడుచు స్తుతిగానము చేయుచు దేవుని స్తుతించుట:-** 7-8వ. దావీదు హృదయము నిబ్బరము కాగా దేవా, నా హృదయము నిబ్బరముగా నున్నది. నేను పాడుచు స్తుతిగానము చేసెదను అని నా ప్రాణమా మేలుకొనుము, స్వరమండలమా, సితారా, మేలుకొనుడి, స్తుతించుటకై నేను వేకువనే లేచెదను అన్నాడు.

**3-5వ. కృపాసత్యములను బట్టి, సర్వ భూమిలో నున్న దేవుని ప్రభావమునుబట్టి జనములలో అతున్నతుడైన ప్రభువును కీర్తించి, స్తుతించుట:-** 3వ. ప్రభువా, జనములలో నీకు కృతజ్ఞతాస్తుతులు నేను చెల్లించెదను. ప్రజలలో నిన్ను కీర్తించెదను. 4వ. నీ కృప ఆకాశముకంటె ఎత్తయినది. నీ సత్యము మేఘమండలము వరకు వ్యాపించియున్నదని దేవుని కృపను గూర్చి పలికాడు.

5 దేవా, ఆకాశములకంటె అత్యున్నతుడవుగా నిన్ను కనుపరచు కొనుము. నీ ప్రభావము సర్వ భూమిమీద కనబడనిమ్ము అన్నందున ఆకాశములోనున్న ఆయన నీతి, కీర్తి ఎంత గొప్పవో చూతము. కీర్త 71:19 దేవా, నీ నీతి మహాకాశమంత ఉన్నతమైనది. కీర్త 89:5 యెహోవా, ఆకాశ వైశాల్యము నీ ఆశ్చర్య కార్యములను స్తుతించుచున్నది. కీర్త 48:10 దేవా, నీ నామము ఎంత గొప్పదో, నీ కీర్తియు భూదిగంతముల వరకు అంత గొప్పది. నీ కుడిచెయ్యి నీతితో నిండి యున్నది. కీర్త97:9 ఏలయనగా యెహోవా, భూలోకమంతటికి పైగా నీవు మహోన్నతుడవై యున్నావు. సమస్త దేవతలకుపైగా నీవు అత్యధికమైన ఔన్నత్యము పొందియున్నావు. కీర్త89:5 పరిశుద్ధ దూతల సమాజములో నీ విశ్వాస్యతనుబట్టి నీకు స్తుతులు కలుగుచున్నవి. కీర్త 8:1 యెహోవా మా ప్రభువా, ఆకాశములలో నీ మహిమను కనుపరచువాడా, భూమియందంతట నీ నామము ఎంత ప్రభావము గలది. కీర్త 113:4 యెహోవా అన్యజనులందరి యెదుట మహోన్నతుడు. ఆయన మహిమ ఆకాశ విశాలమున వ్యాపించి యున్నది.

**6-8వ. పలు పట్టణములపై విజయమిచ్చు దేవునికి ప్రార్థన - స్తుతి:-** 6వ. నీ ప్రియులు విమోచింపబడునట్లు నీ కుడిచేత నన్ను రక్షించి నాకుత్తరమిమ్ము. 7-8వ. తన పరిశుద్ధత తోడని దేవుడు మాట యిచ్చియున్నాడు. నేను ప్రహర్షించెదను. షెకెమును, సుక్కోతును, గిలాదును, మనష్షేను, ఎఫ్రాయిమును దేవుడు స్థిరపరచాడు. యూదాను రాజదండముగా అనగా పాలకులుగా చేసాడు.

**9-10వ. దాసులైన మోయాబు ఎదోములు:-** 9వ. పరిచయములో చెప్పినట్లు దాసులైన మోయాబు కాళ్లు కడుగుకొను పళ్లెము కాగా ఎదోము మీద నా చెప్పు విసరివేయుదును అనగా ఎదోమీయులు చెప్పులు తుడిచి బద్రపరచు దాసులైరి. చెప్పులు/జోడులు సువార్త ప్రకటనకు సిద్ధమనసుకు గుర్తు. సాతానుకు గుర్తైన ఫిలిష్తీయులు కూడా దాసులైరి. 10వ. కోటగల పట్టణమగు ఎదోములోనికి నన్నెవడు నడిపించును? తోడుకొని పోవును? అన్నందున ఎదోమీయుల ముఖ్య పట్టణము కోటగోడలు గల పట్టణము. ఎదోము మీదకు యుద్ధమునకు బయలుదేరు సందర్బము. ఎదోము అనగా ఏశావు ఆహారమును శరీరమును ప్రేమించి నందున శరీరమను శత్రువుకు గురుతు. మోయాబు లోకమును ప్రేమించిన లోతు సంతానము కనుక లోకమను శత్రువుకు గురుతు. దావీదు అనేక దేశములను జయించినట్లు విశ్వాసి ఆత్మీయముగా ముందుకు సాగునపుడు శరీరము,లోకమను శత్రువులలో గర్వము ప్రవేసించగలదు. శరీరము, లోకము అను శత్రువులను జయించి మనకు దాసులుగా వుంచుకొనాలి. లేనియెడల మనము గర్వించి ఆత్మీయముగా పతనము కాగలము.

**11-13వ. దేవుని వలన జయింతుమన్న విశ్వాసముతో ప్రార్థన చేయుట:-** 11-12వ. దేవా, నీవు మమ్ము విడనాడి యున్నావు గదా? దేవా, మా సేనలతో కూడ నీవు బయలుదేరుట మానియున్నావు గదా? మనుష్యుల సహాయము వ్యర్థము. శత్రువులను జయించుటకు మాకు సహాయము దయచేయుము అని ప్రార్థించుచున్నాడు. 13వ. దేవుని వలన మేము శూరకార్యములు జరిగించెదము, మా శత్రువులను అణగద్రొక్కువాడు ఆయనే అను విశ్వాసముతో యుద్ధమునకు వెళ్లి 2 సమూ8:14లో జయించాడు.

## 109వ కీర్తన (5 + 5 + 5 + 5 + 6 = 26వ.)

**అంశము:-** కృప గల దేవుడు తన సేవకులను శత్రువులగు భక్తిహీనుల చేతి నుండి కాపాడును, గనుక దేవుని స్తుతించుట.

**పీఠిక:-** దేవుని నామఘనతకై ఆయన పిల్లలు సాగిలపడి స్తుతించుట కీర్తనల గ్రంథము యొక్క ముఖ్య ఉద్దేశ్యం. ఆరాధన కొరకై చేరివచ్చినప్పుడు తమ యొక్క గతకాల చరిత్రను, ప్రస్తుతకాలపు స్థితిని, భావినిరీక్షణను జ్ఞాపకము చేసుకుని ప్రార్థిస్తారు, ధ్యానిస్తారు, స్తుతిస్తారు. కీర్తనల గ్రంథము ఆత్మీయ దిద్దుబాటు కలిగినది. కీర్తనల గ్రంథంలో యావే అనే పదం ఎక్కువగా కనపడుతుంది. యావే అంటే యేసుక్రీస్తు అన్నమాట మన ఆరాధనకు యేసే ప్రాముఖ్యం. ఈ కీర్తన స్తుతి, ప్రార్థన, ప్రవచన కీర్తన (1,30,27,8)

**1-5వ. శత్రువులగు భక్తిహీనుల కొరకు దేవునికి ప్రార్థన:** ఈ కీర్తన వ్రాసినప్పుడు దావీదుకుశత్రువులు సౌలు, షిమీ, అహీతోపెలు, అబ్షాలోము, దోయేగు, ఇంకెవరో తెలియదు. వారి నాశనము కొరకు ప్రార్థిస్తున్నాడు. ఈ ప్రార్థన కొత్త నిబంధన కాలంలో మనము చేయకూడదు. యేసు శత్రువుల కొరకు ప్రార్థించాడు మనము కూడా శత్రువుల కొరకు ప్రార్థించాలి. శత్రువులు ఏమిచేస్తారు? భక్తులను చెరుపుటకై కపటము, అబద్ధములు, ద్వేషపు మాటలు, నిర్నిమిత్త పోరాటము, పగ, కీడు కల్పిస్తారు. మనము ఏమి చేయాలి? మానక ప్రార్థన చేయాలి. (4).

**6-10వ. శత్రువుపై దేవుడు తీర్పు తీర్చవలెనని ప్రార్థన.:-** శత్రువులకు తీర్పు తీర్చాలనే ప్రార్థన కొనసాగుతున్నది. 8-9వ. ఇస్కరియోతు యూదానుగూర్చిన ప్రవచనము (8-15వ.) వాని జీవితదినములు కొద్దివగునుగాక. వాని ఉద్యోగము వేరొకడు తీసికొనును గాక. (అపో1:20) ఉద్యోగమే కాదు భక్తిహీనునికి కలిగే నష్టాలు కూడా చెప్పబడ్డాయి. కుడిప్రక్క అపవాది నిలుస్తాడు, విమర్శలో దోషియని తీర్పు నొందుతాడు, ప్రార్థన పాపమవుతుంది, జీవిత దినములు కొద్దివవుతాయి, వాని బిడ్డలు తండ్రిలేని వారవుతారు, వాని భార్య విధవరాలవు తుంది వాని బిడ్డలు దేశద్రిమ్మరులై భిక్షమెత్తుతారు.

**11-15వ. శత్రువుపై దేవుడు తీర్పుతీర్చవలెనని మరింత ప్రార్థన:-** భక్తిహీనునికి ఇంకా జరిగేనష్టాలు. వాని ఆస్తి అంతయు అప్పులవారు ఆక్రమించుకుంటారు, వాని కష్టార్జితమును పరులు దోచుకుంటారు, వానికి కృప చూపువారు ఉండరు, వాని బిడ్డలకు దయచూపువారు ఉండరు వాని వంశము నిర్మూలమవుతుంది, వాని పితరుల దోషము తుడుపుపెట్టక యెహోవా నిత్యము జ్ఞాపకములో నుంచుకుంటాడు.

**16-20వ. శత్రువుపై దేవుడు తీర్పు తీర్చుటకుగల కారణము:-** ఏదనగా కృప చూపుట మరచి శ్రమనొందినవానిని దరిద్రుని నలిగిన హృదయము గలవానిని చంపవలెనని వాడు అతని తరిమెను. శపించుట వానికి ప్రీతి దీవెనయందు వాని కిష్టము లేదు తాను పైబట్ట వేసికొనునట్లు వాడు శాపము ధరించెను. అది నీళ్ల వలె వాని కడుపులో చొచ్చియున్నది. తైలమువలె వాని యెముకలలో చేరియున్నది. తాను కప్పుకొను వస్త్రమువలెను తానునిత్యము కట్టుకొను నడికట్టు వలెను అది వానిని వదలకుండునుగాక. భక్తులకు విరోధముగా మాట్లాడు వారికి యెహోవా వలన కలుగు ప్రతికారము ఇదే.

**21-25వ. తన దీనస్థితి నుండి దేవుడు విడిపించి, రక్షించి కాపాడవలెనని ప్రార్థన:-** యెహోవా ప్రభువా, నీ నామమునుబట్టి నాకు సహాయము చేయుము. నేను దీనదరిద్రుడను.

నా హృదయము నాలో గుచ్చబడియున్నది. సాగిపోయిన నీడవలె నేను క్షీణించియున్నాను. మిడతలను పారదోలునట్లు నన్ను పారదోలుదురు. ఉపవాసముచేత నా మోకాళ్లు బలహీనమాయెను, నా శరీరము పుష్టి తగ్గి చిక్కిపోయెను. వారి నిందలకు నేను ఆస్పదుడనైతిని. వారు నన్ను చూచి తమ తలలు ఊచెదరు. నీ కృపతో విడిపింపుము. మన ప్రార్థన కూడా ఇదే అయి ఉండును గాక.

**26-31వ. దేవుడు తన కృపనుబట్టి తన సేవకుని రక్షించునని విశ్వాసముతో దేవుని స్తుతించుట:-** యెహోవా నా దేవా, నీవే దీని చేసితివని వారికి తెలియునట్లు నాకు సహాయము చేయుము. నీ కృపనుబట్టి నన్ను రక్షింపుము. వారు శపించుచున్నారు గాని నీవు దీవించుదువు. వారు లేచి అవమానము పొందెదరు గాని నీ సేవకుడు సంతోషించును. నా విరోధులు అవమానము, సిగ్గు నొందుదురు గాక. నా నోటితో నేను యెహోవాకు కృతజ్ఞతాస్తుతులు మెండుగా చెల్లించెదను. అనేకుల మధ్యను నేనాయనను స్తుతించెదను. దరిద్రుని (భక్తుని) ప్రాణమును విమర్శకు లోపరచువారి చేతిలో నుండి అతని రక్షించుటకై యెహోవా అతని కుడిప్రక్కను నిలుచుచున్నాడు. అపవాది భక్తిహీనుని కుడిప్రక్కను నిలుచును (6) యెహోవా భక్తుని కుడిప్రక్కను నిలుచును (31). మన కుడిప్రక్కన ఎవరు నిలిస్తే మంచిదో ఎరిగి మనము జాగ్రత్తపడుదుము గాక.

## 110వ కీర్తన (3 + 1 + 3 = 7వ.)

**అంశము:- మెస్సియాయగు క్రీస్తు యాజకత్వము - రాజరికము.**

**1-3వ. మెస్సియా గొప్పతనము:-** 1-2వ. ప్రభువు నా ప్రభువుతో చెప్పెను అనగా ప్రభువగు తండ్రియైన దేవుడు ప్రభువగు క్రీస్తుతో చెప్పిన మాటలు. దావీదు ప్రవచనముగా చెప్పుచున్నాడు. కనుక ఇది ప్రవచన కీర్తన, మెస్సియా కీర్తన. నేను నీ శత్రువులను నీ పాదములకు పీఠముగా చేయువరకు నా కుడిపార్శ్వమున కూర్చుండుము. క్రీస్తు మొదటి రాకడలో ఈ లోకములో పాపుల కొరకు ప్రాణముపెట్టి మరణించి, సమాధి చేయబడి, పునరుత్థానుడై పరలోకమునకు ఆరోహణుడాయెను. రోమా 8:34వ. ప్రకారము తండ్రి కుడిపార్శ్వమున కూర్చుండి మన కొరకు విజ్ఞాపన చేయుచున్నాడు. తన శత్రువులగు సాతాను, క్రీస్తు విరోధి, అబద్ధ ప్రవక్తలు రాబోవు కాలములో ఆయన పాదముల క్రింద అనగా బంధకములలో (నరకములో) ఉందురు. ఇది క్రీస్తు రెండవ రాకడలో శ్రమలకాలము తరువాత, వేయి ఏండ్ల చివర జరుగును. ప్రస్తుతము సాతాను స్వతంత్రతకలవాడై యోబు 1:7లో భూమిమీద అటుఇటు తిరుగులాడుచు సంచరించుచు

వచ్చినట్లు దేవునితో చెప్పాడు. ఈ దినములలో స్వతంత్రత కలిగి మానవులను శోధించుచు పాపములో పడవేయ ప్రయత్నించుచున్నాడు. దినముల అంతమందు క్రీస్తు విరోధి ఏడేండ్ల పాలన తరువాత ప్రకటన 19:14-20లో క్రీస్తు విరోధి, అబద్ధ ప్రవక్త ఇద్దరు అగ్ని గుండములో వేయబడుదురు. ప్రక 20:9-10వ.లో అపవాది అగ్నిగుండములో వేయబడును. ప్రస్తుత కాలములో క్రీస్తు శత్రువుల మధ్యలోనే సీయోను నుండి నీవు పరిపాలన చేయుచున్నాడు. 3వ. యుద్ధసన్నాహ దినమున నీ ప్రజలు ఇష్టపూర్వకముగా వచ్చెదరు. నీ యవనస్థులలో శ్రేష్ఠులు పరిశుద్ధాలంకృతులై మంచువలె అరుణోదయ గర్భమునుండి నీయొద్దకు వచ్చెదరు అనుట ప్రక19:11-14లో నేరవేరుట చూతుము.-పరలోకము తెరువబడి తెల్లనిగుఱ్ఱము మీద కూర్చుండియున్న నమ్మకమైన వాడగు క్రీస్తు యుద్ధము జరిగించుటకై రాగా14వ.లో పరలోక మందున్న సేనలు (క్రీస్తునందుండి మృతి పొందిన వారు) శుభ్రమైన తెల్లని నారబట్టలు ధరించు కొని (పరిశుద్ధాలంకృతులై) తెల్లని గుఱ్ఱము లెక్కి ఆయనను వెంబడించుచుండిరి.

**4వ. మెస్సియా యాజకత్వము:-** క్రీస్తు మెల్కీసెదెకు క్రమము చొప్పున నిరంతరము యాజకుడై యుండును. మెల్కీసెదెకు పేరు ఆది 14:18 ఒకసారి, కీర్త 110:4 ఒకసారి, హెబ్రీ 5-7అ.లలో తొమ్మిదిసార్లు ఉన్నను ఆయన ఎవరో స్పష్టముగా చెప్పలేము. హెబ్రీ 7:2-3వ. లో సమాధానపురాజని తండ్రి లేనివాడు, తల్లి లేనివాడును, వంశావళి లేనివాడును జీవితకాలమునకు ఆదియైనను జీవనమునకు అంతమైనను లేనివాడునైయుండి దేవుని కుమారుని పోలియున్నందున క్రీస్తును పోలివాడు మాత్రమే కాక క్రీస్తే అని తలంచగలము. పై వచనములలో క్రీస్తు యాజకుడని, రాజని చూతుము.

**5-7వ. రాజైన యాజకుడుగా మెస్సియా హెచ్చింపు:-** 5వ.ప్రభువు నీ కుడిపార్శ్వమందుండి తన కోప దినమున రాజులను నలుగగొట్టును. ఈ కోపదినము శ్రమల కాల చివరేనని గమనించాలి. 6అన్యజనులకు ఆయన తీర్పుతీర్చును. దేశము శవములతో నిండియుండును. విశాలదేశము మీది ప్రధానుని ఆయన నలుగగొట్టును. ప్రక 19:19-21వ. ఆ గుఱ్ఱము మీద కూర్చున్నవానితోను ఆయన సేనతోను యుద్ధము చేయుటకై ఆ క్రూరమృగమును (విశాలదేశము మీది ప్రధాని) భూరాజులు వారి సేనలు కూడి యుండగా మృగమును, దాని యెదుట సూచకక్రియలు చేసి దాని ముద్రను వేయించుకొనిన వారిని ఆ మృగపు ప్రతిమకు నమస్కరించిన వారిని మోసపరచిన ఆ అబద్ధ ప్రవక్తయు, పట్టబడి వారిద్దరు అగ్నిగుండములో వేయబడిరి. ఇదియే దేశ ప్రధానుని ఆయన నలుగగొట్టుట చూతుము. కడమవారగు భూరాజులు వారి సేనలు గుఱ్ఱము మీద కూర్చున్నవాని నోట నుండి వచ్చిన ఖడ్గముచేత వధింపబడిరి.

దేశము శవములతో నిండియుండగా వాటి మాంసము పక్షులన్నియు కడుపార తినెను. 7 మార్గమున ఏటి నీళ్లు పానము చేసి ఆయన తల యెత్తును. నీళ్ళు జనములను సూచించును. నీళ్ళు పానము చేయుట జనుల పాపములు భరించుట. తన జీవిత కాలమున జనుల పాపముల శిక్షను భరించి, తలఎత్తుట పాప క్షమాపణ కార్యముగింపును సూచించును.

## 111వ కీర్తన (1+3+2+3+1=10వ.)

### అంశము:- యెహూవాను నిత్యము స్తుతించుట.

**పీఠిక:** ఆయన నామము పరిశుద్ధమైనది పూజింపదగినది ఆయన పరిశుద్ధతలో మహనీయుడు సువార్త ప్రకటన భూలోకము వరకే ఉంటుంది స్తుతించడం నిత్యము ఉంటుంది.

**1వ.యెహూవాను స్తుతించుటకైన పిలుపు:** ఎవరిని స్తుతించాలి? యెహూవాను స్తుతించాలి ఎక్కడ స్తుతించాలి? యథార్థవంతుల సభలోను సమాజములోను స్తుతించాలి. యథార్థ వంతుల సభ అంటే సంఘము అని. యథార్థవంతులు అంటే ఎవరు? యెహూవా యందు భయభక్తులు గలవారు. (5) వారిని తన ప్రజలు అని పిలుస్తున్నాడు (9) సమాజము అంటే బయటి ప్రపంచంలో అని ఎలా స్తుతించాలి? పూర్ణ హృదయముతో ఎవరు స్తుతించాలి? నేను అంటే నీవు నేను మనము అని యెహూవాకు కృతజ్ఞతాస్తుతులు హృదయపూర్వకముగా చెల్లించుదుము గాక. స్త్రీలు మౌనముగా ఉండుట ప్రభువును స్తుతించుటే. (కీర్తన 65:1)

**2-4వ. యెహూవాను స్తుతించుట కొరకు కారణములు:-** 2-4వ. దేవుని కార్యములను బట్టి యెహూవా క్రియలు గొప్పవి ఎవరు ఎన్నడూ చేయనికార్యాలు ఆయన చేశారు అన్నిటికంటే గొప్పక్రియ ఏమంటే మానవులకు పాపము పరిహారము జరిగించి పరలోకము చేర్చుట వాటియందు అనగా రక్షణయందు ఇష్టముగల వారు దేవుని విషయాలను ఎక్కువగా ఆలోచిస్తారు. ఆయన కార్యములు 1.మహిమ 2.ప్రభావములుగలవి 3. ఆయన నీతి నిత్యము నిలుకడగా నుండును. 4.ఆయన తన ఆశ్చర్యకార్యములకు జ్ఞాపకార్థ సూచనను నియమించియున్నాడు. పాతనిబంధనలో దినములను పండుగలను జ్ఞాపకార్థము ఉంచాడు. ఇప్పుడు రొట్టెను ద్రాక్షారసమును ఉంచాడు 5.యెహూవా దయాదాక్షిణ్యపూర్ణుడు. అందుకు ఆయనను స్తుతించాలి.

**5-6వ.ఆయన ఆహారము, స్వాస్థ్యములనుబట్టి:-** 6.తనయందు భయభక్తులు గల వారికి ఆయన ఆహారమిచ్చియున్నాడు ఇశ్రాయేలీయులు ఎంత తిరుగబడినా 40 సంవత్సరములు మన్నాను కురిపిస్తూనే ఉన్నాడు. నేడు మన అనుదిన ఆహారము అందిస్తున్నాడు 7. ఆయన నిత్యము తన నిబంధన జ్ఞాపకము చేసికొనువాడు మనలను విడువనివాడు ఎడబాయనివాడు 8. ఆయన తన ప్రజలకు 7 జనాంగాల అన్యజనుల స్వాస్థ్యము అప్పగించియున్నాడు 9. తన క్రియల మహాత్మ్యమును వారికి వెల్లడిచేసి యున్నాడు.

**7-9వ.ఆయనకార్యములు,పరిశుద్ధతనుబట్టి:-** 10.ఆయన చేతికార్యములు సత్యమైనవి న్యాయమైనవి 11.ఆయన శాసనములన్ని నమ్మకమైనవి. అవి శాశ్వతముగా స్థాపింప బడియున్నవి12. సత్యముతోను యథార్థతతోను అవి చేయబడియున్నవి. 13.ఆయన తన ప్రజలకు విమోచనము కలుగజేయువాడు 14. తన నిబంధన ఆయన నిత్యముగా ఉండ నిర్ణయించు వాడు. 15. ఆయన పరిశుద్ధుడు ఆయన నామము పరిశుద్ధమైనది పూజింపదగినది. పూజింపదగిన అను పదము Reverend అని ఇంగ్లీషులో ఉంది. ఆయనకు మాత్రమే చెందవలసిన రెవరెండ్ అనే పదమును మనము వాడుకొనుట మంచిదేనా ఆలోచించండి. ఆయన గ్రంథము ఆయన ఆజ్ఞలు పరిశుద్ధమైనవి.

**10వ. యెహోవాకు నిత్యము స్తోత్రము:-** యెహోవా యందలి భయము జ్ఞానమునకు మూలము దేవునియందలి భయము తగ్గిపోవుచున్నది అంటే జ్ఞానము తగ్గిపోవుచున్నది. ఆయన శాసనముల ననుసరించువారందరు మంచి వివేకము గలవారు. వివేకము పెరగాలంటే ఆయన శాసనములను అనుసరించాలి ఆయనకు నిత్యము స్తోత్రము కలుగుచున్నది.ఆయనను నిత్యము స్తుతించుదుము గాక

## 112వ కీర్తన (1 + 4 + 4 + 1 = 10వ)

### అంశము:- యెహోవాయందు భయభక్తులు గలవారి ధన్యత.

**పీఠిక:** యెహోవాయందు భయభక్తులు గలవారు అని ప్రారంభించి భక్తి లేనివారు అని ముగిస్తున్నాడు. భక్తి గలవారిని నీతిమంతులు అని పిలుస్తున్నాడు నిజముగా నీతి మంతులు లేరు గాని క్రీస్తు నందలి విశ్వాసము ద్వారా నీతిమంతులుగా తీర్చబడుతున్నాము మనకు1. యెహోవా యందు భయభక్తులు గలవారు 2 యదార్థ వంతుల వంశపు వారు 3. నీతిమంతులు 4. భాగ్యవంతులు అని పిలుస్తున్నాడు.

**1వ. యెహోవాయందు భయభక్తులుగలవారు:-** యెహోవాను స్తుతించాలి ఆయన ఆజ్ఞలను బట్టి అధికముగా ఆనందించి ధన్యులవ్వాలి. యెహోవాయందు భయభక్తులు గల వారికి ఆజ్ఞలు ఉన్నాయి ఆజ్ఞలు భారంగా ఉంటాయి కానీ విశ్వాసులు వాటిని నేర్చుకుంటే భారంగా ఉండవు పైగా ఆనందించగలరు. సులభంగా ఉంటాయి దేవుని ప్రేమించిన వారికి ఆయన ఆజ్ఞలు భారంగా ఉండవు (1 యోహాను 5:3)ఆయన ఆజ్ఞలు బంగారము కంటే మేలయి నవి కీర్త 19:10,119:127.విధి రూపకమయిన ఆజ్ఞలు కొట్టివేశాడు ఎఫెసీ 2:14. విశ్రాంతి దినము అమావాస్య పండుగలు లాంటి విధిరూపక ఆజ్ఞలు కొట్టి వేయబడ్డాయి నైతిక

ఆజ్ఞలు కొట్టివేయబడలేదు. ఇశ్రాయేలీయులు ఆయన ఆజ్ఞలను పాటించలేదు. అందుకే శ్రమలపాలయ్యారు మనము జాగ్రత్తగా ఆయన ఆజ్ఞలను పాటించుదుము గాక.

**2-5వ. యెహోవాయందు భయభక్తులు గల వారికి దేవుడిచ్చు ఆశీర్వాదములు- యధార్థవంశపు వారు:-** 1. భూమి మీద బలవంతులగుదురు 2. దీవింపబడుదురు 3.కలిమియు సంపదయు వాని యింట నుండును 4. వాని నీతి నిత్యము నిలుచును. యథార్ధ వంతులకు (వ్యక్తిగత ముగా) 1. చీకటిలో వెలుగు పుట్టును, 2.కటాక్షము, 3.వాత్సల్యత, 4. నీతి కలిగి ఉంటారు, 5. దయాళులును, 6.అప్పిచ్చువారును, 7. భాగ్యవంతులు, 8.న్యాయ విమర్శలో వారి వ్యాజ్యెము గెలుచును, 9.అట్టివారు ఎప్పుడును కదలింపబడరు.

**6-9వ. నీతిమంతులు:-** 1. నిత్యము జ్ఞాపకములో నుందురు, 2. వాని హృదయము యెహోవాను ఆశ్రయించి స్థిరముగా నుండును, 3. వాడు దుర్వార్తకు జడియడు, 4. వాని మనస్సు స్థిరముగా నుండును, 4. తన శత్రువుల విషయమైన తన కోరిక నెరవేరు వరకు వాడు భయపడడు, 5.వాడు దాతృత్వము కలిగి బీదలకిచ్చును, 6.వాని నీతి నిత్యము నిలుచును, 7.వాని కొమ్ము ఘనతనొంది హెచ్చింపబడును.

**10వ. భక్తిహీనులు:-** భక్తి గలవారికి జరిగిన దానిని చూచి చింతపడుదురు వారు పండ్లుకొరుకుచు క్షీణించి పోవుదురు భక్తిహీనుల ఆశ భంగమైపోవును.మనకు ఏ జీవితం కావాలి భక్తిగా జీవించుదుము గాక.

## 113 వ కీర్తన.

**అంశము: స్తుతి చేయు విధము. ఏమి చేయాలి?- యెహోవాను స్తుతింఛాలి.**

ఎవరు, ఎందుకు, ఎప్పుడు, ఎక్కడ, ఎవరిని, ఏమి చేశాడని స్తుతించాలి?అను ప్రశ్నలకు జవాబుగా ఈ కీర్తనను ధ్యానించ వచ్చును.

ఏమి చేయాలి? యెహోవాను స్తుతించుడి

**ఎవరు స్తుతించాలి?:-** యెహోవా సేవకులారా(యాజకులు),ఆయనను స్తుతించుడి.. 1 పేతు 2:9 ప్రకారము ప్రతి విశ్వాసి ఒక యాజకుడే. అయితే మీరు చీకటిలో నుండి ఆశ్చర్యకరమైన తన వెలుగు లోనికి మిమ్మును పిలిచిన వాని గుణాతిశయములను ప్రచురము చేయు నిమిత్తము, ఏర్పరచబడిన వంశమును, యాజక సముహమును.....

**ఎందుకు స్తుతించాలి?-** యెహోవా నామమును స్తుతించుడి-రక్షణార్దమైన నామము- అపో 4:12 ఈ నామముననే మనము రక్షణ పొందవలెను.

**ఎప్పుడు స్తుతించాలి?:-** 2 ఇది మొదలుకొని యెల్లకాలము యెహోవా నామము సన్నుతింపబడునుగాక. కీర్త63:6 కాగా నా జీవితకాలమంతయు నేనీలాగున నిన్ను స్తుతించెదను, నీ నామమునుబట్టి నా చేతులెత్తెదను.

**ఎక్కడ స్తుతించాలి?:-** 3 సూర్యోదయము మొదలుకొని సూర్యాస్తమయము వరకు అనగా ప్రపంచమంతట ఎక్కడెక్కడ సూర్యోదయము సూర్యాస్తమయము జరుగుచున్నవో అక్కడ అంతయు యెహోవా నామము స్తుతి నొందదగినది.

**ఎవరిని స్తుతించాలి?:-** 4 యెహోవా అన్యజనులందరి యెదుట మహోన్నతుడు ఆయన మహిమ ఆకాశవిశాలమున వ్యాపించియున్నది. ఆకాశ విశాలమున ఎన్ని నక్షత్రములున్నవో మానవునికి ఇప్పటికీ తెలియదు. కనుక ఆకాశ విశాలమున వ్యాపించిన మహిమ పరిమాణము మానవుని వూహకు మించినది. అంతగొప్ప మహిమగల దేవుని స్తుతించుట ఎంత గొప్పగా వుండాలో గుర్తించుదము.

**ఎందుకు స్తుతించాలి?:-** 5ఉన్నతమందు ఆసీనుడైయున్న మన దేవుడైన యెహోవాను పోలియున్నవాడెవడు? ఆయనను పోలినవాడుకాని ఆయనవంటి వాడు కాని ఎవరు లేరని దీని భావము.అత్యున్నతుడైన దేవుని అత్యున్నతముగా స్తుతించాలి.

6 ఆయన భూమ్యాకాశములను వంగి చూడననుగ్రహించుచున్నాడు. -ఈ అత్యున్నతుడైన దేవుడు తన్నుతాను తగ్గించుకొని తన క్రింద వున్న ఆకాశమును దాని క్రిందవున్న భూమిని తొంగిచూశాడు.

**ఏమి చేశాడని స్తుతించాలి?:-** 7 ప్రధానులతో తన ప్రజల ప్రధానులతో వారిని కూర్చుండ బెట్టుటకై 8 ఆయన నేలనుండి దరిద్రులను లేవనెత్తువాడు, పెంట కుప్ప మీద నుండి బీదలను పైకెత్తువాడు. నేల మీద దరిద్రులు, బీదలు పాపమను పెంట కుప్పల మీద కూర్చుండి కనబడ్డారు. వారిని పైకెత్తి క్రీస్తు కలువరిలో కార్చిన రక్తముతో కడిగి పరిశుద్ధపరచి పరలోకములో తన ప్రధానులతో కూర్చుండబెట్టాడు. ఈ గొప్ప కార్యము చేసినందుకు ఆయనను స్తుతించాలి.

9 ఆయన సంతులేని దానిని ఇల్లాలుగాచేయుట,కుమాళ్ల సంతోషముగల తల్లిగా చేయుట - ఇల్లు తల్లి సంఘమునకు గురుతు. నమ్మిన వారిని సంఘములో చేర్చిసందుననను అనగా సువార్త ప్రకటనలో ఆత్మలనిచ్చి సంఘముగా వృద్ధి చేసినందుకు యెహోవాను స్తుతించాలి.

## 114వ కీర్తన (2 + 2 + 2 + 2 = 8వ.)

**అంశము:- బానిసత్వము నుండి విడిపించుటలో దేవుని సన్నిధి, ఆయన కార్యములు.**

**1-2వ. ప్రారంభమునసున్న ఇశ్రాయేలు:-** 1వ. ఐగుప్తులో నుండి ఇశ్రాయేలు అన్య భాష గల జనులలో నుండి యాకోబు బయలువెళ్లినప్పుడు అనగా 400 ఏండ్లు ఇశ్రాయేలీయులు అన్యభాష మాటలాడు ఐగుప్తీయుల మధ్య నివసించిరి. తరువాత సొలోమోను కుమారుడైన రెహబాము కాలమందు రాజ్యము రెండుగా విభాగింపబడెను. యూదాలో మందిరముండి ఆయనకు పరిశుద్ధ స్థలముగను, ఇశ్రాయేలు ఆయనకు రాజ్యముగను ఉండెను. కనుక ఈ కీర్తన బహుశా యూదా రాజుల పాలన కాలమున వ్రాయబడెను.

**3-4వ.సమస్త భూమిలో దేవునివంటివారెవరును లేరు:-** 3వ. సముద్రము దానిని చూచి పారిపోయెను. యొర్దానునది వెనుకకు మళ్లెను. నిర్గ 14:21లో మోషే సముద్రము వైపు తనచెయ్యి చాపగా నీళ్లు విభజింపబడి ఇశ్రాయేలీయులు సముద్రము మధ్య ఆరిన నేలమీద నడిచిపోయిరి. ఆ నీళ్లు వారి కుడి యెడమ ప్రక్కలను వారికి గోడవలె నుండెను. 2 రాజు 2:14లో ఒంటిమీది నుండి క్రింద పడిన ఆ దుప్పటిని పట్టుకొని నీటిమీద కొట్టగా అది ఇటు అటు విడిపోయినందున ఎలీషా అవతలి యొడ్డునకు నడిచి పోయెను. యెహో 3:13 సర్వలోక నాధుడగు యెహోవా నిబంధన మందసమును మోయు యాజకుల అరకాళ్లు యొర్దాను నీళ్లను ముట్టగానే యొర్దాను నీళ్లు, అనగా ఎగువ నుండి పారు నీళ్లు ఆపబడి యేకరాశిగా నిలిచెను. 4వ. కొండలు పొట్టేళ్ల వలె, గుట్టలు గొఱ్ఱపిల్లలవలె గంతులు వేసెను. నీటి మార్గమును మళ్లించుటకు కొండలు, గుట్టలు గంతులు వేసినట్టు పైకిలేవాలి. నిర్గ9:14లో సమస్త భూమిలో నావంటి వారెవరునులేరని తెలిసికొనవలెనని దేవుడు తెగుళ్లన్నియు ఐగుప్తీయుల మీదికి పంపెను, నీటిని ఆరిపోచేయుట, మరల ప్రవహింప చేయుట జరిగెను.

**5-6వ. సముద్రము, కొండలమార్గమును మళ్లించిన దేవుడు:-** సముద్రమా, నీవు పారిపోవుటకు నీకేమి తటస్థించినది? యొర్దానూ, నీవు వెనుకకుమళ్లుటకు నీకేమి తటస్థించినది? కొండలారా, మీరు పొట్లేళ్లవలె గుట్టలారా, మీరు గొఱ్ఱ పిల్లలవలె గంతులు వేయుటకు మీకేమి సంభవించినది? ఎఱ్రసముద్రము, యోర్దాను, కొండలు, గుట్టలు పారి పోవుట బహుశ భూకంపము జరిగెనని తలంచగలము. భూమిని అందలి సమస్తము సృజించిన సృష్టికర్త తన బిడ్డల క్షేమముకై ఏమైనను చేయగలడని చూతుము.

**7-8వ. భూమ్యా కాశములలో అపరిమితమైన శక్తి గల దేవుడు:-** 7వ. భూమీ, ప్రభువు సన్నిధిని యాకోబు దేవుని సన్నిధిని వణకుము. 8వ. ఆయన బండను నీటి మడుగు గాను చెకుముకిరాతి బండను నీటి ఊటలు గాను చేయువాడు. నిర్గ 17:6లో మోషే హోరేబు లోని బండను కొట్టగా ప్రజలు త్రాగుటకు దానిలో నుండి నీళ్లు బయలుదేరునని దేవుడు

మోషేతో సెలవియ్యగా మోషే ఇశ్రాయేలీయుల పెద్దల కన్నుల యెదుట అట్లు చేసెను. సంఖ్యా 20:11లో కూడా మోషే తన చెయ్యి యెత్తి రెండు మారులు తన కఱ్ఱతో ఆ బండను కొట్టగా నీళ్లు సమృద్ధిగా ప్రవహించెను. సమాజమును పశువులును త్రాగెను. కనుక భూమ్యాకాశములలో ఆయన శక్తి అపరిమితమని గమనించాలి.

## 115వ కీర్తన (3 + 4 + 4 + 3 = 18 వచనములు)

**అంశము:- ఆశీర్వదము, వృద్ధినిచ్చు నమ్మదగిన, మహిమ గల దేవుడు - మహిమలేని విగ్రహములు.**

**1-3వ. మహిమగల దేవుడు:-** మన దేవుడు కృపాసత్యములు కలవాడు, కృపా సత్యమును బట్టి రక్షించినవాడు.-ఎఫే2:8 మీరు విశ్వాసము ద్వారా కృప చేతనే రక్షింపబడి యున్నారు. నీ నామమునకే మహిమ కలగును గాక-అపో4:12ఈ నామముననే మనము రక్షణ పొందవలెను. 2 వారి దేవుడేడి అని అన్యజనులెందుకు చెప్పుకొందురు? 3 మాదేవుడు ఆకాశమందున్నాడు- యెషయా 66:1 యెహోవా ఈలాగు ఆజ్ఞ ఇచ్చుచున్నాడు ఆకాశము నా సింహాసనము భూమి నా పాదపీఠము. తనకిచ్ఛవచ్చినట్లుగా సమస్తమును ఆయన చేయుచున్నాడు

**4-7వ.మహిమలేని విగ్రహములు:-** 4 వారి విగ్రహములు వెండి బంగారువి అవి మనుష్యుల చేతి పనులు 5 వాటికి నోరుండియు పలుకవు కన్నులుండియు చూడవు. 6చెవులుండియు వినవు ముక్కులుండియు వాసన చూడవు. 7 చేతులుండియు ముట్టుకొనవు పాదములుండియు నడువవు గొంతుకతో మాటలాడవు. 8 వాటిని చేయువారును వాటియందు నమ్మికయుంచు వారందరును వాటి వంటివారై యున్నారు.

**8-11వ. నమ్మదగిన దేవుడు:-** 9 ఇశ్రాయేలీయులారా అనగా ఇశ్రాయేలు ప్రజలు, అహరోను వంశస్థులారా అనగా యాజకులు, యెహోవాయందు భయభక్తులుగల వారలారా అనగా భయభక్తులుగల ఇతరులు యెహోవాను నమ్ముకొనుడి. ఆయన వారికి సహాయము వారికి కేడెము-ఈ దేవుని నమ్మి రక్షించబడిన వారికి సహాయము చేయుచు కేడెముగా వుండి భద్రపరచును.

**12-15వ. ఆశీర్వదము, వృద్ధినిచ్చు దేవుడు:-** ఆయన ఇశ్రాయేలు ప్రజలను, యాజకులగు అహరోను వంశస్థులను, పిన్నలనేమి పెద్దలనేమి తన యందు భయభక్తులుగల ఇతరులను అందరిని భూమ్యాకాశములను సృజించిన యెహోవా మరచి పోకుండవృద్ధినిచ్చి ఆశీర్వదించును. ఆది1:1 ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను.

**16-18వ.ఆశీర్వదమునిచ్చు దేవునికి స్తుతి:-** ఆది1:1 ఆదియందు భూమ్యాకాశములను సృజించిన దేవుడు. ఆకాశములను తన వశమున వుంచుకొని భూమిని నరులకిచ్చియున్నాడు. 17 పాపములచేత మృతులైనవారు మౌనస్థితిలోనికి దిగిపోవువారు, కాని యెహోవాను నమ్మి రక్షించబడిన వారు ఇది మొదలు కొని నిత్యము యెహోవాను స్తుతించెదరు. అందరు యెహోవాను స్తుతించుడని చెప్పి ఈ కీర్తన ముగించుచున్నాడు.

## 116వ కీర్తన (2 + 2 + 2 + 2 + 2 + 2 + 3 +3+ 1 = 19వచనములు)

**అంశము:** యెహోవా నామమున మొరపెట్టుట జవాబు ఇచ్చిన దేవుని కృతజ్ఞతతో స్తుతించుట

**పీఠిక:** 12వ వచనములో "యెహోవా నాకు చేసిన ఉపకారములన్నిటికి నేనాయన కేమి చెల్లించుదును?" అనే ప్రశ్నకు జవాబే ఈ కీర్తన. దీన్ని ఈరీతిగా వివరించు కుందాము. యెహోవా చేసిన ఉపకారాలు- యెహోవాకు చెల్లించవలసినవి అంటే చేయబడినవి చెల్లించ వలసినవి ఈ కీర్తనలో ఉన్నాయి. 1 నేను ఎవరు 3-4 వ 2 యెహోవా ఎవరు 5-6వ. 3 చేసిన ఉపకారాలు ఏవి 7-8 వ. 4 చెల్లించవలసినవి 9-19 వ. అనే నాలుగు భాగాలుగా చేయవచ్చు. 1) నేను ఎవరు.

**1-2వ. మొరను ఆలకించు దేవునికి జీవితకాలమంతా మొఱ్ఱపెట్టుట:-** 1.యెహోవా నా మొరను నా విన్నపమును ఆలకించియున్నాడు. కాగా నేనాయనను ప్రేమించుచున్నాను. మన మొరవిన్న దేవుణ్ణి మనము ప్రేమించాలి. యేసు పేతురుతో సీమోనూ! వీరికంటె నీవు నన్ను ఎక్కువగా ప్రేమించుచున్నావా? అని అడిగాడు అసలు ప్రేమించ లేదు అనికాదు ఇతర శిష్యుల కంటే ఎక్కువగా అని. అవును ప్రభువా అన్నాడు అలా మూడుసార్లు అడిగాడు మూడుసార్లు ప్రభువు నా గొఱ్ఱెలను మేపుము కాయము అన్నాడు. ప్రభువును ప్రేమించడమంటే ఆయన గొఱ్ఱెలను మేపుట కాయుట అనగా ఆయన పని చేయుట. దేవుని పనిలో సాగుచున్నామా ఆలోచించండి. 2. ఆయన నాకు చెవి యొగ్గెను కావున నా జీవితకాలమంతయు నేనాయనకు మొఱ్ఱపెట్టుదును. మనకు జవాబు ఇచ్చిన దేవున్ని జీవితకాలమంతా అడుగుతూ పొందుతూ ఉండాలి.

**3-4వ. మన ప్రాణాత్మల స్థితి. ప్రాణమును మరణ బంధకముల నుండి పాతాళ వేదన నుండి విడిపించుమని మొరపెట్టుట:-** 3. మరణ బంధములు నన్ను చుట్టుకొని యుండెను పాతాళపు వేదనలు నన్ను పట్టుకొనియుండెను. శ్రమయు దుఃఖమును నాకు కలిగెను. మన

ఆత్మ మరణమునకు పాతాలమునకు సరిపోయినది మన శరీరమునకు శ్రమలు దుఃఖములు ఉన్నాయి యాకోబు 5:13 మీలో ఎవనికైనను శ్రమ సంభవించెనా? అతడు ప్రార్థన చేయవలెను అన్నట్లు 4.అప్పుడు– యెహోవా, దయచేసి నా ప్రాణమును విడిపింపుమని యెహోవా నామమునుబట్టి నేను మొఱ్ఱపెట్టితిని. ఎందుకనగా– ప్రభువు నామమునుబట్టి ప్రార్థన చేయు వాడెవడో వాడు రక్షింపబడును. (రోమా10:13) ఆత్మను శరీరమును రక్షించాడు.

**5–6వ. దేవుడెవరు? దేవుని గుణములు ప్రాముఖ్యముగా రక్షించువాడు:–** 5.యెహోవా a.దయాళుడు b. నీతిమంతుడు మన దేవుడు C.వాత్సల్యత గలవాడు. యెహోవా సాధువులను d. కాపాడువాడు. నేను క్రుంగియుండగా ఆయన నన్ను e.రక్షించెను. ఇన్ని లక్షణాలు గలవాడు ముఖ్యముగా రక్షించువాడు. ఆయన దయ నీతి వాత్సల్యత మనలను రక్షించింది.

**7–8వ.ప్రాణమునకు క్షేమమిచ్చి విశ్రాంతి నిచ్చిన దేవుడు – పాదములను పడి పోకుండా కాపాడిన దేవుడు:–** యెహోవా చేసిన ఉపకారాలు – నా ప్రాణమా, యెహోవా నీకు క్షేమము విస్తరింపజేసియున్నాడు. తిరిగి నీ విశ్రాంతిలో ప్రవేశింపుము. మరణము నుండి నా ప్రాణమును కన్నీళ్లు విడువకుండ నా కన్నులను జారిపడకుండ నా పాదములను నీవు తప్పించియున్నావు". క్షేమము, విశ్రాంతి, రక్షణ జారిపోకుండా కాపుదల ఇచ్చిన దేవుని స్తుతించుదుము గాక!

**9–10వ.సజీవులున్న దేశములో కాలము గడుపుట:–** సజీవులున్న దేశములలో యెహోవా సన్నిధిని నేను కాలముగడుపుదును. నేను ఆలాగు మాటలాడి నమ్మికయుంచితిని. నేను మిగుల బాధపడినవాడను."?మృతులలో మనము లేము సజీవులనుగా చేసిన దేవునికి స్తుతులు చెల్లించదుము గాక !

**11–12వ.నమ్మదగని మనుష్యుల మధ్య ఉపకారము చేసిన దేవునికి స్తుతి చెల్లించుట:–** "నేను తొందర పడినవాడనై ఏ మనుష్యుడును నమ్మదగిన వాడు కాడను కొంటిని. యెహోవా నాకు చేసిన ఉపకారములన్నిటికి నేనాయనకేమి చెల్లించుదును?"మన ఆలోచన మారుతుంది. ఒకప్పుడు ఎంతో నమ్మిన వ్యక్తిని ఒక్కోసారి నమ్మలేము మనము కూడా ఇతరులకు అలాగే కనిపిస్తాము. ఒకప్పుడు మనము ఇతరులకు ఎంతో నమ్మదగిన వారముగా కనిపించినా ఒక్కొక్క ప్పుడు మనలను కొంతమంది నమ్మలేరు. 2తిమోతికి2:13 మనము నమ్మదగని వారమైనను, ఆయన నమ్మదగినవాడుగా ఉండును ఆయన తన స్వభావమునకు విరోధముగా ఏదియు చేయలేడు. ఆయన స్వభావమైన ప్రేమకు కనికరమునకు విరోధముగా ఏమీ చేయడు గనుక మనసారా స్తుతిద్దాము

**13-15వ. చెల్లించిన స్తుతి వివరము:-** "రక్షణ పాత్రను చేతపుచ్చుకొని యెహోవా నామమున ప్రార్థన చేసెదను. యెహోవాకు నా మ్రొక్కుబళ్లు చెల్లించెదను. ఆయన ప్రజలందరియెదుటనే చెల్లించెదను యెహోవా భక్తులమరణము ఆయన దృష్టికి విలువ గలది" మన రక్షణను గూర్చి స్తుతులు చెల్లించెదనుగాక సంఘములో సంపూర్ణముగా స్తుతించెదముగాక మన మరణము ఆయన దృష్టికి ఎంతో విలువైనది కనుక మరణభయము వీడి సంతోషించుదుము గాక

**16-18వ. చెల్లించ వలసిన సేవ వివరము:-** "యెహోవా, నేను నిజముగా నీ సేవకుడను, నీ సేవకుడను నీ సేవకురాలి కుమారుడనై యున్నాను భక్తుడు అంటున్నాడు. ఆయన సేవకుడే ఆయన తల్లి సేవకురాలే. కొంతమంది తల్లులు సేవకురాళ్ళు కాకపోవచ్చు నమ్మిన మనమంతా ఆయన సేవకులము మన పాపపు కట్లు విప్పియున్నాడు. మనము కృతజ్ఞతార్పణ అర్పించాలి, యెహోవా నామమున ప్రార్థన చేయాలి ఆయన ప్రజలందరి యెదుటను యెహోవా మందిరపు అంటే సంఘ ఆవరణములలో స్తుతించాలి, సేవచేయాలి

**19వ ముగింపు:-** "యెరూషలేమా, నీ మధ్యను నేను యెహోవాకు నా మ్రొక్కుబళ్లు చెల్లించెదను. యెహోవాను స్తుతించుడి". అంటే సంఘములో ప్రభువును స్తుతించుదుము గాక !

## 117వ కీర్తన (1 + 1 = 2 వచనములు)

**అంశము:- సర్వజనములు యెహోవాను స్తుతించుట.**

**ఈ కీర్తన 116వ కీర్తనకు ముగింపుగా చూడగలము.**

1వ.యెహోవా కృప మనయెడల హెచ్చుగానున్నది. ఆయన విశ్వాస్యత నిరంతరము నిలుచును. మన యెడల మొదటిదిగా ఆయన కృప రెండవదిగా ఆయన విశ్వాస్యత(నమ్మకత్వము) నిరంతరము హెచ్చుగా నున్నవి.

ఎఫే2:8 మీరు విశ్వాసముద్వారా కృపచేతనే రక్షింపబడియున్నారు. ఇది మీ వలన కలిగినది కాదు, దేవుని వరమే. 7 క్రీస్తుయేసునందు మనలను ఆయనతో కూడ లేపి, పరలోకమందు ఆయనతో కూడ కూర్చుండబెట్టెను. 9 అది క్రియలవలన కలిగినదికాదు గనుక ఎవడును అతిశయపడ వీలులేదు. 10 మరియు వాటియందు మనము నడుచు కొనవలెనని దేవుడు ముందుగా సిద్ధపరచిన సత్క్రియలు చేయుటకై, మనము క్రీస్తుయేసునందు సృష్టింపబడిన వారమై ఆయన చేసిన పనియైయున్నాము.

2 తిమో 2:13 మనము నమ్మదగని వారమైనను, ఆయన నమ్మదగిన వాడుగా ఉండును. ఆయన తన స్వభావమునకు విరోధముగా ఏదియు చేయ లేదు. పై లేఖనములను బట్టి ఆయన కృపచేత రక్షించబడి పరలోకములో కూర్చుండబెట్టబడితిమి. ఆయన నమ్మకత్వమును బట్టి నిత్యము కాపాడబడుచున్నాము.

2వ. కాబట్టి సమస్త అన్యజనులారా యెహెూవాను స్తుతించుడి. సర్వజనములారా, ఆయనను కొనియాడుడి యెహెూవాను స్తుతించుడి.

మొదటి వచనములో చెప్పబడిన కృపచేత రక్షణ మరియు నమ్మకత్వముచే కాపాడ బడుట అన్యులకును వర్తించును కనుక రోమా15:11లో సమస్త అన్యజనులారా, ప్రభువును స్తుతించుడి సకల ప్రజలు ఆయనను కొనియాడుదురు అని చెప్పబడినది.

## 118వ కీర్తన (4 + 5 + 5 + 5 + 5 + 5 = 29 వ)

### అంశము:- యెహోవా నిరంతర దయ కృప కొరకై ఆయనకు స్తుతి.

**1-4వ. కృపను బట్టి దేవునికి స్తుతి:-** యెహెూవా దయాళుడు ఆయన కృప నిరంతరము నిలుచును ఇశ్రాయేలీయులారా అనగా ఇశ్రాయేలు ప్రజలు, ఆయనకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి. అహరోను వంశస్థులారా అనగా యాజకులు, యెహెూవా యందు భయభక్తులు గల వారలారా అనగా భయభక్తులుగల ఇతరులు తమ్మును రక్షించిన నిరంతరము నిలుచు దేవుని కృపను బట్టి యెహెూవాకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించాలి. తీతు3:4 మన రక్షకుడైన దేవుని యొక్క దయయు, మానవుల యెడల ఆయనకున్న ప్రేమయు ప్రత్యక్షమైనప్పుడు 5 మనము నీతిని అనుసరించి చేసిన క్రియల మూలముగాకాక, తన కనికరముచొప్పుననే పునర్జన్మ సంబంధమైన స్నానము ద్వారాను, పరిశుద్ధాత్మ మనకు నూతనస్వభావము కలుగ జేయుట ద్వారాను మనలను రక్షించెను. 6మన మాయన కృప వలన నీతిమంతులమని తీర్చబడి, 7 నిత్యజీవమును గూర్చిన నిరీక్షణనుబట్టి దానికి వారసులమగుటకై ఆ పరిశుద్ధాత్మను మన రక్షకుడైన యేసుక్రీస్తు ద్వారా ఆయన మన మీద సమృద్ధిగా కుమ్మరించెను.

**5-9వ. మన పక్షమున ఉండి సహాయము చేయు దేవుడు:-** 5-7వ. కీర్తన 115:9 ఇశ్రాయేలీయులారా, యెహెూవాను నమ్ముకొనుడి. ఆయన వారికి సహాయము, వారికి కేడెము. కీర్తనాకారుడు యెహెూవాకు మొఱ్ఱపెట్టగా విశాల స్థలమందు యెహెూవా ఉత్తర మిచ్చెనని చెప్పుచున్నాడు. యెహెూవా నా పక్షముననున్నాడు నేను భయపడను నరులు నాకేమి చేయ గలరు? 8-9వ. మనుష్యులను నమ్ముకొనుటకంటె యెహెూవాను ఆశ్రయించుట మేలు. రాజులను నమ్ముకొనుటకంటె యెహెూవాను ఆశ్రయించుట మేలు.

**10-14వ. శత్రువులనుండి కాపాడు దేవుడు:-** 10-12వ.అన్యజనులందరు నలు దిశలను కందిరీగలవలె నన్ను చుట్టు కొనియున్నారు. ముండ్ల కాల్చిన మంట ఆరిపోవునట్లు వారు నశించిపోయిరి. యెహోవా నామమును బట్టి నేను వారిని నిర్మూలము చేసెదను. 13-14వ. శత్రువు గట్టిగా తోసివేసి పడునట్లుగా చేశాడు.కాని యెహోవా నాకు సహాయము చేసెను. యెహోవా నా దుర్గము నా గానము ఆయన నాకు రక్షణాధారమాయెనని కీర్తనాకారుడు చెప్పుచున్నాడు. అపో 4:12 ఈ నామముననే మనము రక్షణ పొందవలెను.

**15-19వ.గుడారములో స్తుతి:-** కొలొ 2:14 దేవుడు వ్రాతరూపకమైన ఆజ్ఞల వలన మనమీద ఋణముగాను మనకు విరోధముగాను నుండిన పత్రమును (యేసు చేతులపై) మేకులతో సిలువకు కొట్టి, దానిమీది చేవ్రాతను తుడిచివేసి, మనకు అడ్డములేకుండ దానిని ఎత్తివేసి మన అపరాధములనన్నిటిని క్షమించి ఆయనతోకూడ మిమ్మును జీవింపచేసెనని చెప్పబడినది. ఈ విషయమును నమ్మి రక్షించబడిన వారు నీతిమంతులు.

15-17వ. నీతిమంతుల గుడారములలో రక్షణనుగూర్చిన ఉత్సాహసునాదము వినబడును. యెహోవా దక్షిణహస్తము మహోన్నతమాయెను. యెహోవా సాహస కార్యములను చేయును. నేను చావను సజీవుడనై యెహోవా క్రియలు వివరించెదను.

18-19వ. దేవుడు నన్ను కఠినముగా శిక్షించెను గాని ఆయన నన్ను మరణమునకు అప్పగింపలేదు. నేను వచ్చునట్లు నీతి గుమ్మములు తీయుడి. నేను వాటిలో ప్రవేశించి యెహోవాకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించెదను అని చెప్పుచున్నాడు.

**20-24వ. గుడిలో యెహోవా ఏర్పాటు చేసిన దినమున స్తుతి:-** ఇది యెహోవా గుమ్మము అనగా సంఘము. నీతిమంతులు అనగా రక్షించబడిన వారు దేవుడు ఏర్పాటు చేసిన దినమున అనగా ఆదివారమున దీనిలో ప్రవేశించెదరు. ఇల్లు కట్టువారు నిషేధించిన రాయియగు క్రీస్తు మన కన్నులకు ఆశ్చర్యముగా ఈ సంఘమునకు మూలకు తలరాయి అయ్యాడు. రక్షించబడిన సహోదరులు నీవు నాకు రక్షణాధారుడవై యున్నావని ఉత్సహించి సంతోషముతో క్రీస్తుకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించెదరు.

**25-29వ.ఎందుకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించాలి:-** యెహోవా, దయచేసి మమ్ము రక్షించుము అభివృద్ధి కలిగించుమని కీర్తనాకారుడు ప్రార్థించుచున్నాడు. యెహోవా పేరట ఈ లోకమునకు వచ్చిన క్రీస్తు మందిరములో నుండి దీవించాడు. యెహోవా దేవుడు, క్రీస్తును ఈ లోకమునకు, మనకు వెలుగుగా అనుగ్రహించియున్నాడు. ఈ క్రీస్తు ఉత్సవ బలిపశువుగా త్రాళ్లతో బలిపీఠపు కొమ్ములకు కట్టబడి మన పాపములను కడిగివేయుటకు రక్తము కార్చి

మరణించాడు. అందుకై నీవు నా దేవుడవు, నేను నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించెదనని దేవున్ని ఘనపరచాలి. 29 యెహోవా దయాళుడు ఆయన కృప నిరంతరము నిలుచుచున్నదని ఆయనకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించాలి.

## 119 కీర్తన (8 + 8 + 8... + 8 = 176వ.)

**పరిచయము:-** దేవుని వాక్య ఔన్నత్యమును బట్టి దేవునికి స్తుతి. గ్రంథ కర్త దావీదు కావచ్చు. ఎజ్రా అను వారు కూడా కలరు.

హెబ్రీ భాషలో నున్న 22 అక్షరముల వరుసలో వ్రాయబడిన 9 కీర్తనలు కలవు. 9,10,25,34,37,111,112,119,145. అందులో119 కీర్తనలో 176 వచనాలు కలవు. ప్రతి ఎనిమిది వచనములు ఒక భాగముగా విభాగింపబడి ఒక హెబ్రీ అక్షరము క్రింద ఉన్నవి. ప్రతి వచనములో రెండు వేరువేరు లైనులు వున్నవి. ఈ ఎనిమిది వచనములలోని మొదటి లైనులు అన్ని ఆ విభాగపు హెబ్రీ అక్షరముతో ప్రారంభమగును. రెండవ లైనులో ఉన్న ఎనిమిది వచనములు ఆ రీతిగా లేవు. దేవుని వాక్యమునకు ఈ గ్రంథమునకున్న ఇతర పేరులు.

అంశములు: కీర్తన గ్రంథములో/119లో

1. యెహోవా ధర్మశాస్త్రము -33సార్లు/24సార్లు
2. ఆయన శాసనము - 32/23.
3. ఆయన మార్గము - 56/22.
4. ఆయన ఆజ్ఞలను - 45/24.
5. ఆయన కట్టడలను - 34/22.
6. ఆయన న్యాయవిధులు - 30/15.
7. ఆయన వాక్యము - 32/24.
8. ఆయన ఉపదేశము-24/20.

అంశము:-అతిక్రమములకు పరిహారమునొందినవాడు ధన్యుడు ఆయన శాసనములను గైకొనుచు పూర్ణహృదయముతో ఆయనను వెదకువారు ధన్యులు అని ప్రారంభించబడినందున రక్షించబడిన వారి జీవిత విధానములోని విషయములు ప్రాముఖ్యము. సేవకుడు అను పదము 13 పర్యాయములు కలదు. గర్విష్ఠులు, భక్తిహీనులు, ద్విమనస్కులు, దుష్క్రియలు చేయువారు అను పదములు సుమారు ఇరువది పర్యాయములు కలవు. శ్రమ కలుగుట ఏడు పర్యాయములు

ఉన్నది. కనుక పాపపరిహారము నొందినవాడు దేవునికి సేవకుడుగా జీవించుచుండగా గర్విష్ఠులు, భక్తిహీనులు,ద్విమనస్కులు, దుష్క్రియలు చేయువారు అధికారులు సేవకులను సంహరింపవలెనని పొంచి యుండి మిక్కిలి శ్రమల పాలు చేయుదురు. యెహోవా, నేను మిక్కిలి శ్రమపడుచున్నాను. నీ మాటచొప్పున నన్ను బ్రదికింపుము అని మొరపెట్టగా నీ వాక్యములో నీవు సెలవిచ్చిన చొప్పున నీ సేవకునికి నీవు మేలు చేసియున్నావు. శ్రమ కలుగకమునుపు నేను త్రోవ విడిచినను నీ వాక్యము నీ సేవకుని వెదకి పట్టుకొనెను. కనుక నేను నీ ఆజ్ఞలను మరువక నీ వాక్యము ననుసరించి నడుచుకొనుచున్నాను. నీ ధర్మశాస్త్రము నాకు సంతోషమియ్యని యెడల నా శ్రమ యందు నేను నశించియుందును. యవనులు తప్పక తొట్రిల్లుదురు కాని హృదయములో వాక్యమును ఉంచుకొనిన వారు పాపము చేయకుందురు. దీనిని బట్టి యెహోవా, నీకు స్తోత్రము స్తుతి కలుగు చున్నది.

**1-8వ. పూర్ణ హృదయముతో వాక్యమును అనుసరించి నడచుకొనుట ద్వారా ధన్యులగుట:-** దేవుని వాక్యము యెహోవా ధర్మశాస్త్రమని, ఆయన శాసనములని, ఆయన మార్గములని, ఆయన ఆజ్ఞలని, ఆయన కట్టడలని, ఆయన న్యాయవిధులని, ఆయన ఉపదేశములని కీర్తనల గ్రంథములో చెప్పబడినది. పూర్ణహృదయముతో ఆయన వాక్యమును వెదకి, గైకొనాలి, అనుసరించి నడచుకొనాలి. ఆయన మార్గములలో నడుచుకొనువారు ఏ పాపము చేయకుండ కాపాడబడుదురు. వారి ప్రవర్తన స్థిరపడును, వారికి ఏ విషయములోను అవమానము కలుగదు. న్యాయవిధులను ధర్మశాస్త్రమును నేర్చుకొనునప్పుడు యథార్థ హృదయముతో నిర్దోషముగా నడుచుకొనువారు నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించి ధన్యులగుదురు.

**9-16వ. యవనస్థులు వాక్యమును జాగ్రత్తగా చూచుకొనుటచేత తమ నడత శుద్ధి పరచు కొనుట:-** ఈ భాగము యవనస్థులు పాపముచేయకుండ శుద్ధిగల నడతను ఏరీతిగా కలిగియుందురో తెలుపుచున్నది. తీతు 2:6-7లో యవన పురుషులు స్వస్థబుద్ధిగలవారై యుండవలెనని పరపక్షమందుండు వాడు మనలను గూర్చి చెడుమాట యేదియు చెప్పనేరక సిగ్గుపడునట్లు యవనులు పాపము చేయకుండ అన్నిటియందు సత్కార్యముల విషయమై మాదిరిని కనుపరచాలని చెప్పుచున్నాడు. యెష 40:30 బాలురు సొమ్మసిల్లుదురు, అలయుదురు. యవనస్థులు తప్పక తొట్రిల్లుదురు. 31 యెహోవా కొరకు ఎదురుచూచుట అనగా దేవుని వాక్యమునుబట్టి జాగ్రత్తగా చూచుకొనుట అనగా నడచుకొనుటయే, వారు నూతనబలము పొందుదురు. వారు పక్షిరాజుల వలె రెక్కలు చాపి పైకి ఎగురుదురు. అలయక పరుగెత్తుదురు సొమ్మసిల్లక నడిచిపోవుదురు. నీ కట్టడలను నాకు బోధించుము. నీ ఆజ్ఞలను నేను ధ్యానించెదను.

నీ త్రోవలను మన్నించెదను. నీ వాక్యమును నేను మరువక యుందును. నీ కట్టడలను బట్టి నేను హర్షించెదను అంటున్నాడు.

**17-24 వ.దేవుని శాసనముల ననుసరించుచు వారు తమ మీదకి నింద రాకుండ కాపాడబడుట:-** మానవుడు భూమిమీద పరదేశి. దేవుని ఆజ్ఞలను విడిచి తిరుగువారు శాపగ్రస్తులు. దేవుని శాసనములు మానవుని అనుదిన జీవితమునకు ఆలోచనకర్తలైయున్నవి. కనుక దేవుని సేవకులైనవారు దేవుని వాక్యమందు ఆశ్చర్యమైన సంగతులను చూచి సంతోషింతురు. ధర్మశాస్త్రము నందు ఎడతెగని ఆశకలిగి దాని కట్టడలను ధ్యానించి వాక్యమును బట్టి నడుచుకొనుచుందురు. దేవుడు మన హృదయమును విశాలపరచునప్పుడు ఆజ్ఞల మార్గమున పరుగెత్తాలి. కనుక దేవుణ్ణి తన ఆజ్ఞలను నాకు మరుగు చేయవద్దని దాని కట్టడల ప్రకారము నడచుకొనుచున్నందున దేవుడు తన ప్రాణమును క్షీణించకుండ కాపాడవలెనని నింద, తిరస్కారము రాకుండ కాపాడవలెనని కీర్తనాకారుడు అడుగుచున్నాడు.

**25-32వ.వ్యసనమువలన ప్రాణము నీరై పోగా వాక్యము నన్ను స్థిరపరచును:-** 25 వ్యసనము వలన నా ప్రాణము నీరైపోగా నా ప్రాణము మంటిని హత్తుకొనుచున్నది. నా చర్య అంతయు నేను చెప్పుకొనగా నీవు నాకు ఉత్తరమిచ్చితివి నీ కట్టడలను నీ ఉపదేశ మార్గమును నాకు బోధపరచి నన్ను బ్రదికింపుము. నీ ఆశ్చర్యకార్యములను నేను ధ్యానించెదను. సత్య మార్గమును నేను కోరుకొని నీ శాసనములను హత్తుకొనియున్నాను. నా హృదయమును నీవు విశాలపరచునప్పుడు నేను నీ ఆజ్ఞల మార్గమున పరుగెత్తెదను నన్ను సిగ్గుపడనియ్యకుము.

**33-40వ. వ్యర్థమైన వాటియందుకాక నీ శాసనములతట్టు నాకన్నులు, మనసు, హృదయము, పాదములు త్రిప్పుము:-** లోకములో లోభము వ్యర్థమైనవి అనేకములున్నవి. వాటిని చూడకుండ వాటి తట్టుతిరుగక నీ శాసనముల ననుసరించునట్లు నీ శాసనములతట్టు నా కన్నులు, మనసు, పాదములు హృదయమును త్రిప్పుము. అప్పుడు నా పూర్ణ హృదయముతో నేను దాని ప్రకారము నడుచుకొందును. నీవిచ్చిన వాక్యము మనుష్యులలో నీ భయమును పుట్టించుచున్నది. నీ సేవకునికి దాని స్థిరపరచుము. నీ న్యాయవిధులు ఉత్తములు. నీ ఉపదేశములు నాకు అధిక ప్రియములు నీతిని బట్టి నన్ను బ్రదికింపుము.

**41-48వ. ఆజ్ఞలను,కట్టడలను ధ్యానించుచు వాటి చొప్పున నడుచుకొనుట:-** ఈ లోకములో దేవుని కనికరమునుబట్టి రక్షించబడి దేవున్ని సత్యవాక్యమును నమ్ముకొని జీవించువారిని అనవసరముగా నిందించువారున్నారు. నిరంతరము దేవుని ధర్మశాస్త్రము ననుసరించుచు, ఉపదేశములను వెదకుచు, నిర్బంధము లేక నడుచుకొనుచు సిగ్గుపడక రాజుల

యెదుట దేవుని శాసనములను గూర్చి మాటలాడాలి. మనకు ప్రియముగానున్న దేవుని ఆజ్ఞలను బట్టి నేను హర్షించి, చేతులెత్తి ప్రార్థనతో నీ కట్టడలను ధ్యానించుచుండాలి.

**49-56వ. వాక్యము సేవకులను బాధలలో బ్రదికించి నెమ్మదిని కలిగించియున్నది:-**

49-53వ.గర్విష్ఠులు దేవుని సేవకులను మిగుల అపహసింతురు. అయినను నీ ధర్మశాస్త్రము నుండి దయచేయబడిన మాట నిరీక్షణ పుట్టించినది.యెహోవా, పూర్వ కాలమునుండి యుండిన నీ న్యాయవిధులను జ్ఞాపకముచేసికొని నేను ఓదార్పు నొందితిని. నీవాక్యము నన్ను బ్రదికించియున్నది. నా బాధలో ఇదే నాకు నెమ్మది కలిగించుచున్నది. 54-56వ. యాత్రికుడనైన నేను నా బసలో పాటలు పాడుటకు నీ కట్టడలు హేతువులాయెను. యెహోవా, రాత్రివేళ నీ నామమును స్మరణచేయుచున్నాను. నీ ధర్మశాస్త్రమునను సరించి నడుచుకొనుచున్నాను. నీ ఉపదేశము ననుసరించి నడుచుకొనుచున్నాను. ఇదే నాకు వరముగా దయచేయబడియున్నది. నీ ధర్మశాస్త్రమును విడిచి నడుచుచున్న భక్తిహీనులను చూడగా నాకు అధిక రోషము పుట్టుచున్నది.

**57-64వ. భక్తిహీనుల పాశములు చుట్టుకొనియున్నను ధర్మశాస్త్రమును మరువక ఆజ్ఞలను అనుసరించి నడచుకొనుట:-** 57-60వ. యెహోవాను నమ్ముకొని ఆయన మీద ఆధారపడి, ఆయన వాక్యముల ననుసరించి నడుచుకొందునని భక్తుడు నిశ్చయించుకొన్నాడు. తన మార్గములు పరిశీలన చేసికొని నీ శాసనముల తట్టు మరలుకొన్నాడు. కటాక్షముంచుమని కరుణింపుమని నా పూర్ణ హృదయముతో దేవుని బతిమాలుకొనుచున్నాను.

61-64వ. అపవాది భక్తిహీనుల పాశములచేత తనను చుట్టు ముట్టినను దేవుని ధర్మశాస్త్రమును మరువక అర్ధరాత్రి వేళ మేల్కొని దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించువాడు. యహోవా కృపతో, భూమి నిండియున్నది. దేవుని యందు భయభక్తులు గలవారందరితో కలిసి ఉపదేశములను అనుసరించుచూ దేవుని కట్టడలను నాకు బోధింపుమని ప్రార్థించు చున్నాడు.

**65-72వ. దయాళుడైన దేవుని మేలైన ధర్మశాస్త్రమును వెండి బంగారు నాణముల కంటె మేలైన దానిని శ్రమలలో నేర్చుకొనుట:-** 65-68వ. యెహోవా సేవకుడు త్రోవవిడిచి నపుడు శ్రమ కలిగెను. గర్విష్ఠులు నామీద అబద్ధము కల్పించిరి. వారి హృదయము క్రొవ్వువలె మందముగా ఉన్నది. నీవు దయాళుడవై మేలు చేసియున్నావు. ఇప్పుడు నీ వాక్యము ననుసరించి నడుచుకొనుచున్నాను 69-72వ. నేను నీ ఆజ్ఞలయందు నమ్మిక యుంచియున్నాను మంచి వివేచన మంచి జ్ఞానము నాకు నేర్పుము. అయితే పూర్ణహృదయముతో నేను నీ ఉపదేశములను

అనుసరింతును. నేను నీ కట్టడలను నేర్చుకొనునట్లు శ్రమ నొందియుండుట నాకు మేలాయెను. వేలకొలది వెండి బంగారు నాణముల కంటె నీ విచ్చిన ధర్మశాస్త్రము నాకు మేలు.

**73-80వ. నీ చేతులు నన్ను శ్రమపరచి నన్ను నిర్మించి, నీ ధర్మశాస్త్రముతో సంతోషపరచి, నాకు రూపు ఏర్పరచెను:-** 73-76వ. దేవుని చేతులు నన్ను నిర్మించుట అనగా ఆయన చేతులలో నుండి కారిన రక్తము ద్వారా మన పాపములు కడుగబడినందున నూతన సృష్టిగా చేయబడగా మనకు రూపు ఏర్పడెను. యెహోవా, నీ తీర్పులు న్యాయమైనవనియు విశ్వాస్యతగలవాడవై నీవు నన్ను శ్రమపరచితివని నేనెరుగుదును. నీ సేవకునికి నీవిచ్చిన మాట చొప్పున నీ కృప నన్ను ఆదరించునుగాక. నేను నీ ఆజ్ఞలను నేర్చు కొనునట్లు నాకు బుద్ధి దయచేయుము. 77-80వ. గర్విష్ఠులు నా మీద అబద్ధము లాడినందుకు వారు సిగ్గు పడుదురుగాక. నీ ధర్మశాస్త్రము నాకు సంతోషకరము. నేను బ్రదుకునట్లు నీ కరుణా కటాక్షములు నాకు కలుగును గాక. నేను నీ ఉపదేశములను ధ్యానించుచున్నాను. నీ యందు భయభక్తులు గలవారు నీ శాసనములను తెలిసికొనువారును నా పక్షమున నుందురు గాక. నేను సిగ్గుపడకుండునట్లు నా హృదయము నీ కట్టడల విషయమై నిర్దోష మగును.

**81-88వ. దేవుని సేవకుని గర్విష్ఠులు పగవారు తరుముచు భూమి మీద నుండ కుండ నాశనము చేయుటకు ప్రయత్నించుచుండ సేవకుడు క్రుంగిపోయి దినములు కొద్దివాయెనని తలంచుచున్నాడు:-** ధర్మశాస్త్రము ననుసరింపని గర్విష్ఠులు పగవారై నిర్నిమిత్తముగా దేవుని సేవకుని తరుముచు చిక్కించుకొనుటకై గుంటలు త్రవ్విరి. సేవకుడు భూమిమీద నుండకుండ నాశనము చేయుటకు ప్రయత్నము చేయగా కొంచెమే తప్పెను. రక్షణ కొరకు సేవకుని ప్రాణము సొమ్మసిల్లగా సేవకుడు వాక్యము మీద ఆశ పెట్టుకొని దేవుడు ఎప్పుడు ఆదరించునో అని దేవుడు సెలవిచ్చిన మాటకొరకు కనిపెట్టగా కన్నులు క్షీణించుచున్నవి. సేవకుడు పొగతగులు చున్నసిద్దెవలె అయ్యాడు. అయినను దేవుని కట్టడలను మరచుటలేదు. సేవకుడు ఇట్టి స్థితిలో క్రుంగిపోయి తన దినములు ఎంత కొద్దివాయెనని తరుము వారికి యెప్పుడు తీర్పుతీర్చుదువని అడుగుచున్నాడు. దేవుని ఉపదేశములను విడువక యున్నందున నాకు సహాయము చేయుమని మొరపెట్టుచున్నాడు.

**89-96వ.అంశము:- దేవుని వాక్యము, విశ్వాస్యత ఆకాశమందు నిత్యము స్థిరపడి నిలకడగా ఉండగా నా శ్రమయందు నేను నశించలేదు. దేవుని శాసనములు నన్ను బ్రదికించగా నేను అపరిమితమైన శాసనములను తలపోయుచున్నాను:-** 89-92వ. దేవుని వాక్యము విశ్వాస్యత ఆకాశమందు తరతరములు, నిత్యము నిలకడగా నున్నది. కనుక ఆయన స్థాపించిన

భూమి స్థిరముగా ఉండి ఆయనకు సేవ చేయుచున్నది. దేవుని ధర్మశాస్త్రము నాకు సంతోషమియ్యని యెడల శ్రమ యందు నేను నశించియుందును. 93-96వ. నీ ఉపదేశము వలన నీవు నన్ను బ్రదికించగా వాటిని మరువక, నేను వెదకుచున్నాను. నన్ను సంహరింప వలెనని భక్తిహీనులు నా కొరకు పొంచి ఉండగా నేను నీ శాసనములను తలపోయు నీవాడనే కనుక నన్ను రక్షించుము. సకల సంపూర్ణతకు పరిమితికలదని గ్రహించితినని చెప్పుచూ దేవుని ధర్మోపదేశము అపరిమితమైనది తెలియచేయుచున్నాడు.

**97-107వ. అంశము:- దేవుని ధర్మశాస్త్రమును ధ్యానించిన నిత్యము మనకు తోడుగాఉండి, కాపాడి బోధకులందరి కంటె వృద్ధులకంటె మనకు విశేష జ్ఞానము కలిగించినవి:-** 97-100వ. నీ ధర్మశాస్త్రము ఎంతో ప్రియముగా దినమెల్ల నేను ధ్యానించుచుండగా ఆజ్ఞలు నిత్యము నాకు తోడుగానున్నవి. నీ శాసనములను లక్ష్యపెట్టి ధ్యానించుచుండగా బోధకులందరి కంటె వృద్ధులకంటె. నా శత్రువులను మించిన విశేషజ్ఞానమును కలుగజేసినవి. 101-102వ.నీవు బోధించిన వాక్యము ననుసరించగా దుష్ట మార్గములన్నిటిలోనుండి నా పాదములు తొలగించు కొను చున్నాను. 103-104వ. నీ వాక్యములు నా జిహ్వాకు ఎంతో మధురముగా, నా నోటికి తేనెకంటె తీపిగానుండి వివేకము కలిగించగా తప్పు మార్గములన్నియు నాకసహ్యములాయెను.

**105-112వ. దేవుని వాక్యము శ్రమలలో మన త్రోవకు వెలుగునైనందున వాక్యమును అనుసరించెదనని ప్రమాణము చేయుచున్నాడు. భక్తిహీనులు తనను పట్టుకొనుటకు ఉరియొడ్డినను తన ప్రాణము ఎల్లప్పుడు దేవుని అరచేతిలో భద్రముగా ఉన్నందున నీ ధర్మ శాస్త్రమును నేను మరువను అంటున్నాడు:-** 105-108వ. దేవుని వాక్యము మన జీవిత యాత్రకు మార్గదర్శి. పాదములకు దీపమగు వాక్యపు వెలుగులో దేవుని న్యాయవిధులను అనుసరించి కొనసాగాలి. నేను మిక్కిలి శ్రమపడుచున్నానని మొరపెట్టచూ వాక్యము చొప్పున నన్ను బ్రదికించి, నీ న్యాయవిధులను నాకు బోధింపుము అంటున్నాడు. 109-112వ. నన్ను పట్టుకొనుటకై భక్తిహీనులు ఉరియొడ్డినను నాప్రాణము ఎల్లప్పుడు నా అరచేతిలో నీవు భద్రపరచి నందున నీ ధర్మశాస్త్రమును నేను మరువను. నీ ఉపదేశముల నుండి తొలగను. నీ శాసనములు హృదయానందకరములు, నిత్య స్వాస్థ్యములు. నీ కట్టడలను గైకొనుటకు నా హృదయమును నేను లోపరచుకొనియుందునని నిత్యము నిర్ణయించుకొన్నాను అంటున్నాడు.

**113-120వ. ద్విమనస్కులను దుష్ క్రియలు చేయువారు దేవునిచేత లయపరచబడుదురు. మనమును వారిని ద్వేషించుచు వారియొద్దనుండి తొలగి దేవుని ధర్మ శాస్త్రమును ప్రేమించాలి:-** 113-116వ. ద్విమనస్కులను దుష్క్రియలు చేయువారిని నేను

ద్వేషించుచు వారియొద్ద నుండి తొలగి నీ ధర్మ శాస్త్రమును ప్రేమించుచున్నాను. నాకు మరుగుచోటు కేడెమగు వాక్యము మీద ఆశపెట్టుకొని అనుసరించెదను. నేను బ్రదుకునట్లు నీ మాట చొప్పున నన్ను ఆదుకొనుము. నా ఆశభంగమై నేను సిగ్గునొందక యుందును గాక.

117-120వ. నాకు రక్షణ కలుగునట్లు నీవు నన్ను ఉద్ధరింపుము అప్పుడు నీ కట్టడలను నిత్యము లక్ష్యము చేసెదను. నీ కట్టడలను మీరిన భక్తిహీనులనందరిని నీవు నిరాకరించి మష్టువలె లయపరచుదువు. నీ న్యాయవిధులకు నేను శరీరములో వణకుచు భయపడుచున్నాను. నీ శాసనములు నాకిష్టమైయున్నవి.

**121-128వ.అంశము:- గర్విష్ఠులు నన్ను బాధింపకయుండునట్లు మేలు కొరకు నీ సేవకునికి పూటపడుము-బంగారు కంటె అపరంజి కంటె నాకు ప్రియముగా నున్న నీ శాసనములను గ్రహించునట్లు నాకు జ్ఞానము కలుగజేయుము.**

121-124వ. నేను నీతి న్యాయముల ననుసరించుచున్నాను గనుక గర్విష్ఠులు నన్ను బాధించువారి వశమున నన్ను విడిచిపెట్టకుము. గర్విష్ఠులు నన్ను బాధింపకయుండునట్లు మేలు కొరకు నీ సేవకునికి పూటపడుము. నేను నీ రక్షణ కొరకు నీతి గల నీ మాట కొరకు కనిపెట్టుచున్నాను కనుక నీ కృప చొప్పున నీ సేవకునికి మేలుచేసి నీ కట్టడలను బోధింపుము.

125-128వ. జనులు నీ ధర్మశాస్త్రమును నిరర్థకము చేయగా నీ సేవకుడనైన నేను నీ శాసనములను గ్రహించునట్లు నాకు జ్ఞానము కలుగ జేయుము. బంగారుకంటెను అపరంజి కంటెను నీ ఆజ్ఞలు నాకు ప్రియముగానున్నవి. నీ ఉపదేశములన్నియు యథార్థములని అబద్ధ మార్గములన్నిటిని అసహ్యించుకొనుచు నీ ఉపదేశములను మన్నించుచున్నాను.

**129-136వ. జనులు నీధర్మశాస్త్రము ననుసరించరు - నీ శాసనములు ఆశ్చర్యములు తెలివిలేని వారికి తెలివి కలిగించును కనుక నేను వాటిని గైకొనుచున్నాను:-**129-132వ.నీ శాసనములు ఆశ్చర్యములు తెలివిలేనివారికి తెలివి కలిగించును. కనుకనే నేను వాటిని గైకొనుచున్నాను. నీ వాక్యములు వెల్లడి అగుటతోడనే వెలుగు కలిగినది. నీ ఆజ్ఞలయందు యధిక వాంఛ నాకున్నందున నా తట్టు తిరిగి నన్ను కరుణింపుము. 133-136వ. జనులు నీ ధర్మశాస్త్రము ననుసరింపకపోయినందుకు నా కన్నీరు ఏరులై పారుచున్నది కనుక మనుష్యుల బలాత్కారము నుండి నన్ను విమోచింపుము. నీ వాక్యమునుబట్టి నీ సేవకుని మీద నీ ముఖకాంతి ప్రకాశింపజేసి నీ కట్టడలను నాకు బోధించి నా యడుగులు స్థిరపరచుము ఏ పాపమును నన్ను ఏల నియ్యకుము.

**137-144వ. యెహోవా, నీవు నీతిమంతుడవు. నీ మాట మిక్కిలి స్వచ్ఛమైనది యథార్థమైనది నీ సేవకునికి ప్రియమైనవి:-** 137-140వ. యెహోవా, నీవు నీతిమంతుడవు. నీ మాట మిక్కిలి స్వచ్ఛమైనది యథార్థమైనది. అది నీ సేవకునికి ప్రియమైనది. యెహోవా, నీవు నీతిమంతుడవు నీ న్యాయవిధులు యథార్థములు. నా విరోధులు నీ వాక్యములు మరచిపోవుదురు. కావున నా ఆసక్తి నన్ను భక్షించుచున్నది. నీతిని బట్టి పూర్ణవిశ్వాస్యతను బట్టి నీ శాసనములను నీవు నియమించితివి. నీ మాట మిక్కిలి స్వచ్ఛమైనది అది నీ సేవకునికి ప్రియమైనది. 141-144వ. నేను అల్పుడను నిరాకరింపబడినవాడను శ్రమయువేదనయు నన్ను పట్టియున్నవి. సత్యము శాశ్వతమైన నీతిగల ఉపదేశములను నేను మరువను. నీ ఆజ్ఞలు నాకు సంతోషము కలుగజేయుచున్నవి.

**145-152వ. దేవుని కట్టడలను గైకొని, నడుచుకొనునట్లు నాకు ఉత్తర మిమ్మని తెల్ల వారక మునుపే మొఱ్ఱపెట్టుట:-** 145-148వ. యెహోవా, వాక్యమును నేను ధ్యానించుటకై నా కన్నులు రాత్రిజాములు కాకమునుపే తెరచుకొని, హృదయపూర్వకముగా నేను తెల్లవారక మునుపే మొఱ్ఱపెట్టుచున్నాను. నీ మాటలమీద నేను ఆశపెట్టుకొని యున్నాను కనుక నీ కట్టడలను నేను గైకొని, నడుచుకొనునట్లు నాకు ఉత్తరమిమ్ము. 149-152వ. దుష్కార్యములు చేయువారు నా యొద్దకు సమీపించుచున్నారు కనుక నీ కృపను బట్టి నా మొఱ్ఱ ఆలకించి, నీ వాక్య విధులనుబట్టి నన్ను బ్రదికింపుము. యెహోవా, నీవు సమీపముగా ఉన్నావు. నీ ఆజ్ఞలన్నియు సత్యమైనవి. నీ శాసనములను నీవు నిత్యములుగా స్థిరపరచితివని నేను పూర్వము నుండి వాటి వలననే తెలిసికొనియున్నాను.

**153-160వ. భక్తిహీనులు, ద్రోహులు దేవుని కట్టడలను వెదకరు. గనుక వారికి రక్షణ దూరముగా నున్నది- నాకైతే నీ ఉపదేశములు ఎంతో ప్రీతికరములు నీ కృప చొప్పున నన్ను బ్రదికింపుము:-** 153-156వ. భక్తిహీనులు నీ కట్టడలను వెదకుటలేదు గనుక వారికి రక్షణ దూరముగా నున్నది. నేను నీ ధర్మశాస్త్రమును మరచువాడను కాను నా శ్రమను విచారించి నన్ను విడిపింపుము. యెహోవా, నీ కనికరములు మితిలేనివి. నీ న్యాయవిధులను బట్టి నాపక్షమున వ్యాజ్యెమాడి నన్ను బ్రదికింపుము.

157-160వ. ద్రోహులు, నా విరోధులు, నన్ను తరుమువారు అనేకులు. నీవిచ్చిన మాటను లక్ష్యపెట్టని వారిని చూచి నేను అసహ్యించుకొంటిని. యెహోవా, చిత్తగించుము నీ ఉపదేశములు నాకెంతో ప్రీతికరములు. న్యాయశాసనముల నుండి నేను తొలగకయున్నాను. నీ కృపచొప్పున నన్ను బ్రదికింపుము. నీ వాక్యసారాంశము సత్యము, నీవు నియమించిన న్యాయవిధులన్నియు నిత్యము నిలుచును.

**161-168వ. అధికారులు నిర్నిమిత్తముగా తరిమినను, ప్రీతికరమైన ధర్మశాస్త్రమును దినమునకు ఏడుమారులు ధ్యానించుచు దేవుని స్తుతించుట:-** 161-164వ.అధికారులు నిర్నిమిత్తముగా నన్ను తరుముదురు అయినను నీ వాక్య భయము నా హృదయమందు నిలుచు చున్నది. విస్తారమైన దోపుసొమ్ము సంపాదించిన వానివలె సంతోషించు చున్నాను. నీ ధర్మ శాస్త్రము నాకు ప్రీతికరము. నీ న్యాయవిధులను బట్టి దినమునకు ఏడు మారులు నేను నిన్ను స్తుతించుచున్నాను.

165-168వ. యెహోవా నీ రక్షణ కొరకు నేను కనిపెట్టుచున్నాను. నీ ఆజ్ఞలను అనుసరించి నడుచుకొనుచున్నాను. నీ శాసనములు నాకు అతి ప్రియములు. నీ ధర్మ శాస్త్రమును ప్రేమించువారికి ఎంతో నెమ్మది కలదు. నా మార్గములన్నియు నీ యెదుటనున్నవి. నీ ఉపదేశములను నీ శాసనములను నేను అనుసరించుచున్నాను.

**169-176వ. తప్పిపోయిన గొఱ్ఱవలె నేను త్రోవవిడిచి తిరిగితిని నీ సేవకుని వెదకి పట్టుకొనుము. నీ ఉపదేశములను కోరుకొనియున్నాను నీ చెయ్యి నాకు సహాయము చేయును:-** 169-172వ.యెహోవా, నామొఱ్ఱ నీసన్నిధికి వచ్చునుగాక. నా విన్నపము నీ సన్నిధిని చేరనిమ్ము. నీవిచ్చిన మాట చొప్పున నన్ను విడిపింపుము. నీవు నీ కట్టడలను నాకు బోధించుచున్నావు. నా పెదవులు నీ స్తోత్రము నుచ్చరించును. నీ వాక్యమును గూర్చి నా నాలుక పాడును. 173-176వ. తప్పిపోయిన గొఱ్ఱవలె నేను త్రోవవిడిచి తిరిగితిని. నీ సేవకుని వెదకి పట్టు కొనుము. ఎందుకనగా నేను నీ ఆజ్ఞలను మరచువాడనుకాను. నేను నీ ఉపదేశములను కోరుకొనియున్నాను నీ చెయ్యి నాకు సహాయమగును గాక. యెహోవా, నీ రక్షణ కొరకు నేను మిగుల ఆశపడుచున్నాను. నీ ధర్మశాస్త్రము నాకు సంతోషకరము. నీవు నన్ను బ్రదికింపుము. నేను నిన్ను స్తుతించెదను.

## యాత్రా కీర్తనలు - కీర్తన 120 -134.

పీఠిక : 120 నుండి 134 కీర్తనలను యాత్రా కీర్తనలు అంటారు. ఇవి వరుసగా ఉన్నాయి. ఈ15కీర్తనలు కలిపినా 101 వచనాలే ఉన్నాయి. ఇశ్రాయేలీయులు సంవత్సరమునకు 3 సార్లు యెరూషలేమునకు యాత్ర చేయాలని చెప్పబడింది. (ద్వితీ16:16). ఇశ్రాయేలు దేశము కొండలు లోయలు గల దేశము. కొండలు ఎక్కునపుడు లోయలు దిగునపుడు అలసి పోకుండా ఈ కీర్తనలు పాడేవారు.

విభజన :ఈ 15 కీర్తనలను 3 + 3 + 3 + 3 + 3 గా విభజింపవచ్చును

అంశము: మొదటి మూడు ( 120 - 122 ) లో వ్యక్తి గత అనుభవాలు

రెండవ మూడు (123-125 ) లో సామాజిక అనుభవాలు

మూడవ మూడు (126 - 128 ) లో కుటుంబ అనుభవాలు

నాలుగవ మూడు (129 - 131) లో జీవితకాల అనుభవాలు

ఐదవ మూడు (132 - 134) లో మందిరలో స్తుతి అనుభవము ఉన్నాయి.

120:1లోను మిగిలిన వచనాలలోను నా, నేను, నాకు అనే మాటలు కనబడతాయి. అలాగే 121,122 కీర్తనలలో కూడా ఈ మాటలు కనబడతాయి. దీన్నిబట్టి ఇవి వ్యక్తిగత అనుభవాలను సూచిస్తున్నాయి.

అలాగే 123 -125 వరకు మన మేము మనకు అనే మాటలు కనబడుతాయి. దీనిని బట్టి ఇవి సామాజిక అనుభవాలను సూచిస్తున్నాయి.

అలాగే 126 -128 కుటుంబ అనుభవాలు, 129-131 లో జీవితకాల అనుభవాలు, 132-134 లో స్తుతి అనుభవము గమనించగలము.

**యాత్రా కీర్తనల వివరణ: ప్రతి విభాగములోని మొదటి కీర్తనలు గమనించండి. అలాగే ప్రతి విభాగములోని రెండవ కీర్తనను గమనించండి.**

120 లో శ్రమలు 123లో తిరస్కారము 126 లో కన్నీరు 129లో అధిక బాధలు 132లో బాధలు కలవు.

121 లో సహాయము 124లో కాపుదల 127లో బహుమానం130లో కృప 133లో ఆశీర్వాదం కలదు.

122లో క్షేమం 125లో సమాధానము 128లో సమాధానము131లో నిత్య కాపుదల134లో స్తుతి కలదు.

3 భాగాలుగా చేసిన కీర్తనలలో ప్రతి మొదటి కీర్తనలలో శ్రమలు తిరస్కారము కన్నీరు బాధలు కనబడతాయి.

ప్రతి రెండవ కీర్తనలో సహాయము ఆశీర్వాదము కనబడుతుంది ప్రతి 3 వ కీర్తనలో క్షేమము ఆశీర్వాదము కనబడుతుంది. ఇది ఎంత రమ్యముగా ఉందో గమనించగలము.

## కీర్తన 120 విభజన (1 + 1 + 2 + 2 + 1 = 7వ.)

**అంశము:- ప్రయాణ ప్రారంభము- శ్రమలు తిరస్కారము కొరకు ప్రార్థన. (1వ) .**

1వ- శ్రమలలో మెరపెట్టగా జవాబు. 2. వ. మోసకరమైన నాలుక 3-4వ. మోసకరమైన నాలుకకు శిక్ష 5-6 కలహ ప్రియుల దగ్గర నివాసము 7. సమాధానము కోరుకొనుట

సారాంశము: వ్యక్తిగతముగా శ్రమలు ఎలా ఎదుర్కొంటాము అన్నది ఈ కీర్తన సారాంశము

1వ. శ్రమలు కలుగుతాయి మొరపెట్టాలి జవాబు వస్తుంది. స్తుతిస్తాము. "ఆపత్కాలమున నీవు నన్ను గూర్చి మొఱ్ఱపెట్టుము నేను నిన్ను విడిపించెదను నీవు నన్ను మహిమపరచెదవు". కీర్తన 50:15 ఆపత్కాలము రావచ్చునా, వచ్చింది. అయితే మొరపెట్టితే విడుదల బైబిలులో క్షామ కాలముంది క్షేమ కాలముంది. క్షామ కాలములో మొరపెడితే క్షేమ కాలమగును. వెలుగు ఉంటుంది చీకటి ఉంటుంది కేవలము జీవిత కాలమంతా వెలుగు ఉండకూడదు, చీకటి ఉండకూడదు రెండూ ఉండాలి

2.వ. "యెహోవా, అబద్ధమాడు పెదవులనుండియు మోసకరమైన నాలుక నుండియు నా ప్రాణమును విడిపించుము." దేని నుండి విడిపించాలి పెదవుల నుండి నాలుక నుండి ఇతర మనుషులనుండి కాదు మన నాలుక మన పెదవులే మనకు శత్రువులు. ఎముక లేని నాలుక ఏమైనా మాట్లాడుతుందని సామెత. ఈ రోజు మాట్లాడిన మాటను రేపు మారుస్తాము.

3-4వ. మోసకరమైన నాలుకను దేవుడు వదలడు "మోసకరమైన నాలుకా, ఆయన నీకేమి చేయును? ఇంతకంటె అధికముగా నీకేమి చేయును? తంగేడు నిప్పులతో కూడిన బాణములను బలాఢ్యుల వాడిగల బాణములను నీ మీద వేయును. నిప్పులు వేస్తాడు బాణాలను కురిపిస్తాడు. పిరికివారును, అవిశ్వాసులును, అసహ్యులును, నరహంతకులును, వ్యభిచారులును, మాంత్రికులును, విగ్రహారాధకులును, అబద్ధికులందరును అగ్ని గంధకములతో మండు గుండములో పాలుపొందుదురు. ఇది రెండవ మరణము." ప్రకటన 21:8. ఇది అవిశ్వాసులకు అబద్ధికులకు జరిగే శిక్ష .విశ్వాసులకు తంగేడు నిప్పులతో శిక్ష అంటే తాత్కాలిక శిక్ష జాగ్రత్త.

5-6వ. కేదారు వారు గుడారములలో నివసించేవారు. నేడు కొందరు జీవిత కాలమంతా గుడారాలలోనే నివసిస్తారు. దావీదు భక్తుడు మేము కూడా వారి దగ్గర ఉన్నాము అంటున్నాడు. వారు కలహ ప్రియులు. 7 వారు మాట రాగానే యుద్ధానికి వస్తారు. అయినా నేను సమాధానమే కోరుచున్నాను అంటున్నాడు. లోకమంతా కలహాన్ని కోరుతుంది మనము సమాధానాన్నే కోరుకోవాలి మనము ఎట్లున్నాము?

## 121వ కీర్తన (2 + 3 +3 = 8వ.)

**అంశము: ప్రయాణములో కాపుదల.**

1-2వ.సహాయకుడైన యెహోవా. 3-5వ.కాపాడు యోహావా.

6-8వ. కాపుదల వివరము.

పీఠిక : 120 నుండి 134 వరకు యాత్రా కీర్తనలు యాత్రా కీర్తనలలో ఇది రెండవది మొదటి కీర్తన లో శ్రమలు రెండవ కీర్తనలలో సహాయము. మూడవ కీర్తనలో క్షేమము ఉంటుంది. వీటి వివరణకు 120లోని వివరణ చూడండి

**1-2వ. సహాయకుడైన యెహోవా:-** "కొండలతట్టు నా కన్ను లెత్తుచున్నాను నాకు సహాయము ఎక్కడనుండి వచ్చును? యెరూషలేము కొండల మీద ఉంటుంది. అందుకే భక్తుడు కొండల తట్టు కన్నుతెత్తుచున్నాను అంటున్నాడు. ఒక కొండ మీద దావీదు తన ఇల్లు కట్టుకున్నాడు గనుక దానికి దావీదుపురము అని పేరు కలిగింది. 1. ఒలీవల కొండ 2. మోరియా కొండ 3. దావీదుపురము 4. మూడు సీయోను కొండలు 5. గొల్గొతా కొండ మొత్తం 7 కొండలు.

యెహెూవా వలననే నాకు సహాయము కలుగును ఆయన భూమ్యాకాశములను సృజించినవాడు.ఈయన ఎవరు? సహాయము చేయువాడు భూమ్యాకాశములను సృజించిన వాడు. ద్వితీయ 26:2 నీ దేవుడైన యెహెూవా నీకిచ్చుచున్న నీ భూమిలోనుండి నీవు కూర్చుకొను భూఫలములన్నిటిలోను ప్రథమ ఫలములను తీసికొని గంపలో ఉంచి, నీ దేవుడైన యెహెూవా తన నామమునకు మందిరమును ఏర్పరచుకొను స్థలమునకు వెళ్ళాలి. ద్వితీ 16:16,17లో ఏటికి మూడుమారులు, అనగా పొంగని రొట్టెల పండుగలోను వారముల పండుగలోను పర్ణశాలల పండుగలోను నీ దేవుడైన యెహెూవా ఏర్పరచుకొను స్థలమున నీ మగవారందరు ఆయన సన్నిధిని కనబడవలెను.?" "వారు వట్టిచేతులతో యెహెూవా సన్నిధిని కనబడక, నీ దేవుడైన యెహెూవా నీ కనుగ్రహించిన దీవెన చొప్పున ప్రతివాడును తన శక్తికొలది యియ్యవలెను. ఎక్కడకు వెళ్ళాలి ? ఎవరు వెళ్ళాలి? ఎందుకు వెళ్ళాలి? ఎన్నిసార్లు పోవాలి? ఎప్పుడెప్పుడు పోవాలి? ఏరీతిగా పోవాలి? అని వివరముగా చెప్పాడు దేవుని వాక్యము ఎంత స్పష్టముగా ఉందో చూడగలము.

మొదట గోధుమల కోత ప్రారంభమవుతుంది ఇది ప్రథమ ఫలముల పండుగ తర్వాత 50 రోజులకు యవలకోత ప్రారంభమవుతుంది. దీవెన చొప్పున శక్తి కొలది తీసుకొనిపోవాలి వారికి ఏటికి మూడు మార్లు మనకైతే "వీరు అపొస్తలుల బోధయందును సహవాసమందును, రొట్టె విరుచుటయందును ప్రార్థన చేయుటయందును ఎడతెగక యుండిరి. (అపో 2:42)

సాధారణముగా అపొస్తలుల బోధయందును అంటే బైబిల్ స్టడీ, సహవాసము అంటే గృహకూడిక, రొట్టె విరుచుట ఆదివారము ఆరాధన, ప్రార్థనకూడిక అంటే విజ్ఞాపనలో మనము ఎడతెగక ఉండాలి. ఇపుడున్న ఉద్యోగాలు చదువులను బట్టి చాలా కష్టమే అయినా వీలు చేసుకోవాలి. వచ్చినపుడు వట్టి చేతులతో కాక శక్తి కొలది ఇవ్వాలి. దేవునికి ఇస్తే ఆయన మనకు బాకీ ఉండడు. నూరంతలుగా ఇస్తాడు.

**3-5వ. కాపాడు యోహోవా:-** ఆయన నీ పాదము తొట్రిల్లనియ్యడు నిన్ను కాపాడు వాడు కునుకడు. ఇశ్రాయేలును కాపాడువాడు. కునుకడు నిద్రపోడు యెహోవాయే నిన్ను కాపాడువాడు నీకుడిప్రక్కను యెహోవా నీకు నీడగా ఉండును. ప్రతి వచనములో కాపాడువాడు అని ఉంది అందుకే ఈ భాగమునకు కాపాడు యెహోవా అని పేరు పెట్టు కున్నాము పాదములను అంటే నడకను నడవడిని తొట్రిల్ల నియ్యడు.ఆయన కునుకడు నిద్రపోడు ఆయనే కాపాడుతాడు నీడగా ఉంటాడు.

**6-8వ. కాపుదల వివరము:-** పగలు ఎండ దెబ్బయైనను నీకు తగులదు. రాత్రి వెన్నెల దెబ్బయైనను నీకు తగులదు. ఏ అపాయమును రాకుండ యెహోవా నిన్ను కాపాడును ఆయన నీ ప్రాణమును కాపాడును ఇది మొదలుకొని నిరంతరము నీ రాకపోకలయందు యెహోవా నిన్ను కాపాడును. మొత్తం 3-8 వచనాల్లో కాపాడు వాడు అని 6 సార్లు ఉంది.పగలు ఎండ దెబ్బ కాని రాత్రి వెన్నెల దెబ్బ గాని తగులదు. అపాయము రాకుండా ప్రయాణములన్నిటిలో కాపాడుతాడు సమయానికే దేవుని సన్నిధికి వచ్చి ఇవన్ని తలపోసుకుంటూ ప్రభువును స్తుతించుదుము గాక.

## 122వ కీర్తన (2 + 3 + 4 = 9వ.).

**అంశము:- ప్రయాణములో యెరూషలేము క్షేమముగా చేరుట-2వ.**

**1-2వ. ఎక్కడికి వెళుతున్నారు?:-** యెహోవా మందిరమునకు వెళ్ళెదము అనగానే సంతోషము కలిగింది. యెహోవా మందిరమునకు అంటే సంఘమునకు అని, దేవుని సన్నిధికి అని, ప్రభువు దగ్గరకు అని, ప్రార్థనకు అని, కొందరికి ప్రార్థనకు వెళ్లడం అంటే కష్టంగా ఉంటుంది. మనకు ఇష్టమైన వారి పేర్లు వింటే చాలా సంతోషంగా ఉంటుంది. ఇష్టం లేని వారి పేర్లు వింటే కష్టంగా ఉంటుంది ప్రార్థనకు వెళ్లడం కష్టంగా ఉంది అంటే ఏసుప్రభువు అంటే నీకు ఇష్టం లేదని. ఆయనకంటే దేన్నో ఎక్కువ ప్రేమిస్తున్నావు అని. ప్రభువును ప్రేమిస్తే ప్రార్థనకు వెళ్లడం సంతోషంగా ఉంటుంది. ప్రాణమిచ్చి రక్షించిన ప్రభువుని ప్రేమించడం

నేర్చుకుందాం. యెరూషలేమా మా పాదములు నీ గుమ్మములలో నిలుచున్నవి. దావీదు కాలము నాటికి యెరూషలేములో మందిరము కట్టబడలేదు ఆయన మరణము తరువాత 4 సంవత్సరములకు సొలోమోను మందిరము కట్టడం ప్రారంభించాడు. మందిరము కట్టక మునుపే ఊహించి ఈ కీర్తన వ్రాశాడు. యెరూషలేము అనగానే దేవాలయము గుర్తుకు వస్తుంది అలాగే మనకు మందిరము అనగానే ప్రార్ధన గుర్తుకు రావాలి

**3-5వ. ఎందుకు వెళ్లాలి?:-** యెరూషలేములో శాసనములు, న్యాయ సింహాసనము ఉన్నవి. 3. బాగుగా కట్టబడిన యెరుషలేము పట్టణం చూచుటకు వెళ్లాలి. మన సంఘము ఎలా కట్టబడింది. ఏ కట్టడమైన మంచి పునాది ఉంటే చక్కగా ఉంటుంది. మరి మన సంఘము ఏ పునాది మీద కట్టబడింది యేసుక్రీస్తు అనే పునాది మీద బంగారము వెండి వెలగల రాళ్లతో కట్టుచూ ఉన్నామా లేదా (1 కోరి3:10-25) మొదట నిన్ను నీవు చక్కగా కట్టుకుంటే నీ కుటుంబాన్ని కట్టుకోవచ్చు అప్పుడు సంఘము బాగుగా కట్టబడుతుంది.

4.ఇశ్రాయేలీయులకు నియమించిన శాసనములను బట్టి యెహోవా నామమునకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుటకు వెళ్ళాలి. యెహోవా గోత్రములు వెళ్లాలి. అనగా దేవుని సంబంధులు యేసుక్రీస్తు వంశమువారు వెళ్లాలి. (1పేతు2:9)

5. అచట దేవుని న్యాయసింహాసనము ఉన్నది.

**6-9వ ఏమి దొరుకుతుంది?:-** యెరూషలేములో క్షేమము, నెమ్మది కలవు.

6.యెరూషలేమును ప్రేమించి దాని కొరకు ప్రార్ధన చేస్తే మనము వర్ధిల్లుతాము. అంటే సంఘమును ప్రేమించి దాని కొరకు ప్రార్ధన చేస్తే మనము వర్ధిల్లుతాము. వర్ధిల్లిన వారి గురించి పాతనిబంధనలో కొంతమందిని గూర్చి వ్రాయబడి ఉంది. కొత్త నిబంధనలో యేసుక్రీస్తు ప్రభువు, గాయిని గూర్చి మాత్రమే వ్రాయబడి ఉంది. వర్ధిల్లుట ఎంత కష్టమో కదా. 7. ఇంకా నెమ్మదిగా కలుగుతుంది, క్షేమము కలుగుతుంది. 8.మన సహవాసులకు సహోదరులకు కూడా క్షేమం కలుగుతుంది. 9. మేలు కలుగుతుంది.

## 123వ కీర్తన (2 + 2 = 4వ.)

**అంశము:-దాసులు-తిరస్కరించబడిన వారు. 2-3వ.**

(కీర్త 123-125. సామాజిక అనుభవాలు. అని గుర్తించండి.).

**1-2వ. దాసులు యజమాని వైపు కన్నులెత్తుట:-** 1. ఆకాశమందు ఆసీనుడవైనవాడా, నీతట్టు నా కన్ను లెత్తుచున్నాను. ఆకాశమందు ఆసీనుడైన వాడు. అనగా ఇంగ్లీష్ బైబిలులో

పరలోకము అని ఉంది. పరలోకంలో ఉండు ప్రభువా అని. మనకు ప్రభువు కూడా పరలోకమందున్న మా తండ్రి అని ప్రార్థన నేర్పించాడు. మన ప్రతి అవసరము కొరకు మనము ఎవరివైపు చూడక పరలోకములో ఉండే తండ్రివైపున మన కన్నులు ఎత్తాలి. అవసరాలకు ఇతరుల వైపు చూడకూడదు గాని మన దృష్టి అంతా పరలోకపు తండ్రి మీదనే ఉండాలి. ప్రతి దానికి ఇతరుల వైపు చూస్తే మన తండ్రిని మనము అవమాన పరిచినట్లు మనము ప్రార్థన చేయగా ఇతరులు సహాయం చేయవచ్చు. ఆ సహాయం మనము స్వీకరించవచ్చు. కాని మనము దేవుని కంటే ఎక్కువగా మనుషులవైపు చూడడం అంత మంచిది కాదు కనుక ప్రభువు వైపు చూసి ముందుకు సాగుదుము గాక.

2.దాసుల కన్నులు తమ యజమానుని చేతితట్టును దాసి కన్నులు తన యజమానురాలి చేతితట్టును చూచునట్లు మన దేవుడైన యెహోవా మనలను కరుణించువరకు మన కన్నులు ఆయనతట్టు చూచుచున్నవి. నేడు దాసుల కష్టాలు తగ్గాయి. ఇప్పుడు అనేక పనులు యంత్రాలు చేస్తూ ఉన్నాయి. 60 ఏళ్ల క్రితం ప్రతిదానికి పశువులను వాడేవారు. బండ్లకు ఎద్దులను, కొన్నిటిని మోయుటకు గాడిదలను వాడేవారు. ఇంకా పాత కాలంలో అన్నిపనులు చేయడానికి పశువులలాగా మనుషులను వాడేవారు. మనుషులను దాసులుగా చేసుకొని బండ్లను ఈడ్వమనేవారు. అశ్రద్ధ చేస్తే పశువులను కొట్టినట్లు కొట్టేవారు. దాసులు పారిపోకుండా కాళ్లకు గాడిదలకు వేసినట్లు సంకెళ్లు కూడా వేసేవారు. అంత భయంకరమైన దాస్యము పూర్వకాలము ఉండేది. దాసులను చంపిన అది యజమానులకు నేరము కాదు. అలాంటి దాస్యాన్ని ఇశ్రాయేలీయులు ఈజిప్టులో అనుభవించారు. వారు రెండింటి కొరకు యజమానుల చేతుల వైపు చూసేవారు. భోజన పదార్థాల కొరకు, పనులు అశ్రద్ధ చేస్తే కొడుతారేమో అని వారి చేతుల వైపు చూడాలి. ఇప్పుడు మన యజమానుడు మన ప్రభువైన క్రీస్తు మనం సహాయం కొరకు ఆయనచేతి వైపు చూడాలి. అనవసరంగా ఆయన కొట్టడు గాని నిర్లక్ష్యంగా జీవించినప్పుడు దెబ్బలు పడతాయి కనుక దెబ్బలు పడకుండా జీవించాలి

**3-4వ. కరుణింపుమని ప్రార్థించుట:-** 3.యెహోవా, మేము అధిక తిరస్కారము పాలైతిమి. అహంకారుల నిందయు గర్విష్ఠుల తిరస్కారమును మా మీదికి అధికముగా వచ్చియున్నవి. ఇశ్రాయేలీయులు పొందినంత తిరస్కారం ఏ జాతి పొందలేదు ఎన్నోసార్లు శత్రువులను వారిని దాసులుగా చేసుకున్నారు. దాదాపు 400 ఏళ్లు ఐగుప్తులో కఠిన దాస్యము అనుభవించారు. క్రీస్తుశకం 70 నుండి 1948 వరకు పరాయి దేశాలలో ఎంతో కష్టం అనుభవించారు. కారణము ప్రభువు చెప్పినట్లు జీవించక పోవడమే. మనం కూడా చెప్పినట్లు

వినకపోతే క్రైస్తవులు పొందినంత తిరస్కారం ఏ జాతి పొందలేదు కనుక జాగ్రత్తగా జీవించాలి.

4. మమ్మును కరుణింపుము మమ్మును కరుణింపుము. అయితే మన దేవుడు కరుణించే వాడు. మనము చేసిన ప్రతి తప్పిదమును యథార్థముగా ఒప్పుకొని దేవుని కనికరము కొరకు వేడుకోవాలి. దేవా కరుణించు దేవా కరుణించు ఇదే మన ప్రార్థన అయి ఉండాలి.

## 124వ కీర్తన (3 + 2 + 3 = 8వ.)

**అంశము:- దేవుడిచ్చిన విడుదల. 7-8వ.**

**1-3వ. దేవుని తోడును తల పోయుట:-** ఇశ్రాయేలీయుల చరిత్రలో ఎంతోమంది వారి మీదికి లేచారు. వారి ఆగ్రహం రగులుకొనింది. ఇశ్రాయేలు జాతి ఆవిర్భావము నుండి వారికి శత్రువులు వున్నారు. దావీదుకు సొంత మామ మరియు కుమారుడు కూడా శత్రువులు అయ్యారు. నేటికీ ఇశ్రాయేలీయులకు అందరూ శత్రువులే. అరబ్ దేశాల వారందరూ శత్రువులే. హిట్లర్ లక్షల మంది యూదులను చంపించాడు. అయినా వారికి యెహోవా తోడుగా ఉన్నందున ఈనాటికీ వారి జాతి నిలిచింది. ప్రపంచంలో ఇదే గొప్ప అద్భుతం. ఎన్నో జాతులు లేకుండా పోయాయి.

**4-5వ. ఆపదలను ప్రవాహ జలములతో పోల్చుట:-** జలములు జనములకు కూడా సూచనగా ఉన్నవి. భక్తిహీనులు కదలుచున్న సముద్రమువంటివారు అది నిమ్మళింపనేరదు దాని జలములు బురదను మైలను పైకివేయును. (యెషయా 57:20) భక్తిహీనులు ఇశ్రాయేలీయులను లేకుండా చేయడానికి ఎంతో ప్రయాసపడ్డారు. నేడు కూడా ప్రయాస పడుతున్నారు.

**6-8వ. దేవుని స్తుతించుట:-** నిజమైన విశ్వాసులు కాపాడ బడుతూనే ఉన్నారు. దానికి కారణం యెహోవా. అందుకు ఆయనకే స్తుతి చెల్లించాలి. పక్షుల కొరకు వేటకాడు ఉరి వేస్తాడు. ఉరిలో చిక్కుకుపోయిన తరువాత పక్షులు బయటకు రాలేవు. మనకు వేటగాడు సాతాను. ఎన్నో ఉరులు వేస్తాడు. అప్పుడప్పుడు మనము చిక్కు కుంటూ ఉంటాము. అయితే ఆ ఊరిని దేవుడు తేంపేవాడు. దేవునికి స్తోత్రం. ఎన్నోసార్లు సాతాను మనలను అనేక పాపాలలో చిక్కించుకుంటున్నాడు. మనము ఒక్కొక్కసారి మన పాపాలను గ్రహించక పోయినా ఒప్పుకోక పోయినా ఆ పాపాల నుండి క్షమిస్తాడు. వేటకాని ఉరిని తెంపుతాడు. కారణం తెలుసా! నా చిన్నపిల్లలారా, మీరు పాపము చేయకుండుటకై యీ సంగతులను మీకు వ్రాయుచున్నాను. ఎవడైనను పాపము చేసినయెడల నీతిమంతుడైన యేసుక్రీస్తు అను ఉత్తరవాది తండ్రియొద్ద

మనకున్నాడు.? ఆయనే మన పాపములకు శాంతికరమైయున్నాడు. మన పాపములకు మాత్రమే కాదు. సర్వలోకమునకును శాంతికరమైయున్నాడు (1 యోహాను 2:1-2).

మనము మన పాపాలను వెంటనే ఒప్పుకోకపోయినా శాంతికరమై ఉన్నాడు అంటే ప్రాయశ్చిత్తం అయిఉన్నాడు అని చెప్పబడింది మన పాపములకే కాదు లోక పాపములకు కూడా ఆయన ప్రాయశ్చిత్తం అయిఉన్నాడు కనుక వెంటనే మనము శిక్షించబడడము లేదు. మనమే కాదు ఈ లోకంలోని వారు కూడా పాపము చేయగానే వారిని శిక్షించ లేదు. మారుమనసు పొంది పాపములు ఒప్పుకొని విడిచిపెట్టాలని అవకాశం ఇస్తూ ఉన్నాడు. అలా మారుమనసు పొంది పాపములు ఒప్పుకొని విడిచి పెడితే శాశ్వతంగా శిక్ష ఉండదు. ఆయన ఇప్పుడు నాకు ఏమి శిక్ష వేయలేదు అని నిర్లక్ష్యంగా జీవించి పాపమును పెంచుకుంటే అప్పుడు శిక్షించ బడతాం. అప్పుడు ఇక ఆయన ఆ ఉరిని తెంపడు. మనకు భూమ్యాకాశములను సృజించిన యెహోవా వలననే సహాయముగా ఉండి వేటగాని ఊరిలో నుండి తెంపుతున్నది మనము గమనించి మన జీవితాలను సరిదిద్దుకుందుము గాక. ఆయనకే స్తుతి చెల్లును గాక!

## 125వ కీర్తన (2 + 1 + 1 +1 = 5వ.)

**అంశము:-కదలని కొండవలె కాపాడు దేవుడు-దేవుని సమాధానము. 5వ.**

1-2వ. విశ్వాసుల చుట్టు పర్వతమువలె కాపాడు దేవుడు.

3వ. విశ్వాసులు పాపము చేయకుండ దేవుని కాపుదల. 4వ. యథార్థ హృదయులకు మేలుకై ప్రార్థన. 5వ. దుష్టులకు నాశనము - ఇశ్రాయేలుకు సమాధానము.

**1-2వ. యెహోవా యందు నమ్మికయుంచు వారి కాపుదల: 1** యెహోవాయందు నమ్మిక యుంచువారు కదలక నిత్యము నిలుచు సీయోను కొండవలెనుందురు. యెరూషలేముచుట్టు పర్వతములున్నట్లు యెహోవా ఇది మొదలుకొని నిత్యము తన ప్రజలచుట్టు ఉండును.

సీయోనుకొండ అంటే యెరూషలేము అని. యెరుషలేము ఏడుకొండల మీద కట్టబడిన పట్టణం. ఒలివల కొండ, మోరియా కొండ, మూడు సీయోను కొండలు, కల్వరి కొండ, దావీదు పురము అని పిలువబడే కొండ. మొత్తం 7. సీయోను కొండ చాలా పెద్ద కొండ అందులో రెండు చిన్న కొండలు అందుకనే యెరూషలేమును కొన్నిసార్లు సీయోను అని పిలుస్తారు. ఒలీవ కొండను పరిశీలిస్తే లోపల అగ్నిపర్వతం ఉందని శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. ప్రభువైన యేసుక్రీస్తు వారు ఒలీవల కొండ మీదికి దిగివస్తాడు. పాదం పెడతాడు అప్పుడు ఆ కొండ రెండుగా విడిపోతుంది అని చెప్పబడింది.. కానీ సీయోను కొండ కదలక నిలిచిపోయే కొండ

అని చెప్పబడింది. దేవుడు తన బిడ్డలను కదలకుండా నిలబెట్టుకుంటాడు. సీయోను కొండ ఎలాగా కదలకుండా ఉన్నదో అలాగా తన బిడ్డలను ఆయన కాపాడుతాడు.

యెరూషలేము చుట్టూ పర్వతములు ఉన్నట్లు మన చుట్టూ ఆయన ఉండి కాపాడతాడు. ఇవన్నీ జ్ఞాపకము చేసుకున్నప్పుడు మన హృదయం కృతజ్ఞతతో ఉండాలి, స్తుతించాలి.

3వ. నీతిమంతులు పాపము చేయుటకు తమ చేతులు చాప కుండునట్లు భక్తిహీనుల రాజదండము నీతిమంతుల స్వాస్థ్యము మీద నుండదు. మనము పాపము చేయుటకు చేతులు చాపకుండా భక్తిహీనులను మనమీద లేకుండా చేస్తాడు.

4వ. యెహోవా, మంచివారికి మేలుచేయుము. యథార్థహృదయులకు మేలు చేయుము. మంచిగా జీవిద్దాము. యథార్థముగా జీవిద్దాము. దేవుడు మనకు మేలు చేస్తాడు. యథార్థముగా అంటే తప్పులేకుండా జీవించే మనసు. తప్పు జరిగితే ఒప్పుకుని వదిలిపెట్టే మనసు ఉండాలి అని అర్థం.

5వ. తమ వంకర త్రోవలకు తొలగిపోవు వారిని పాపము చేయు వారితో కూడ యెహోవా కొనిపోవును. ఇశ్రాయేలుమీద సమాధానముండును గాక.

ఇంత భద్రత ఇస్తున్నా ఇంకా వంకర త్రోవలకు తొలగిపోతే పాపులతో మనలని చేరుస్తాడు. అయితే ఇశ్రాయేలు మీద ఆయన సమాధానం ఉంటుంది అంటే విశ్వాసుల మీద ఆయన కాపుదల ఉంటుంది. సమాధానం ఉంటుంది. దేవునికి స్తోత్రము.

## 126 వ కీర్తన. (1 + 2 + 1 + 2 = 6వ.)

**అంశము:- చెర నుండి వచ్చిన వారు కన్నీటితో విత్తిన సంతోషగానమిచ్చు దేవుడు.**

1వ. చెర నుండి తిరిగి వచ్చినవారు. బబులోను చెర నుండి యెహోవా ఇశ్రాయేలీయులను రప్పించాడు. ఆ సందర్భంలో వ్రాయబడి ఉండవచ్చు. ఈ చెర 70ఏళ్లు మాత్రమే. మానవాళి పాపపు చెరలో ఉన్నారు. పాపపుచెర ఈ జీవితకాలం మాత్రమే కాదు మరణించిన తర్వాత అగ్ని గంధకములతో మండు గుండములో యుగయుగములు ఉంటుంది. ఇట్టి పాపపు చెర నుండి విడిపించడానికి ప్రభువైన ఏసుక్రీస్తు ఈ లోకములోనికి వచ్చాడు (మత్త 1:21, లుకా 4:18) విడిపించబడండి.

**2-3వ. దేవుని కార్యములు చెప్పుకొనుచు సంతోషించుట:-** చెర నుండి విడిపించ బడడం కల కనినట్లు ఉంది. కష్టపడుతున్నట్లు వచ్చిన కల మెలకువ రాగానే కష్టములు తొలగి

పోయినట్లు చెరనుండి క్షణములో విడుదల కలిగి నోటి నిండా నవ్వు కలిగింది. నాలుక ఆనంద గానముతో నిండింది. మనము సంతోష భరితులము అయ్యాము. యెహోవా మన కొరకు గొప్ప కార్యములు చేశాడు. అంతే కాదు ఈ గొప్ప కార్యములు యెహోవా చేశాడని అన్యజనులు కూడా తెలుసుకున్నారు. దేవునికి స్తోత్రము. అలాగే పాప జీవితములో నలిగి, దుఃఖపడే సమయంలో ప్రభువైన యేసుక్రీస్తు మనలను విడిపించాడు. క్షణములోనే సంతోషము కలిగింది. కాగా ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతన సృష్టి. పాతవి గతించెను, ఇదిగో క్రొత్త వాయెను (2 కొరి 5:17). మన పాపపు విడుదల ఇతరులు గ్రహిస్తారు.బయటికి చెప్పక పోయినా లోపల వీరి దేవుడు గొప్పవాడు అనుకుంటారు. ప్రభువులో మన జీవితాన్ని చూసి ఇతరులు గొప్పగా చెప్పుకునేటట్లు దేవుడు చేస్తాడు.

పాపిని పరలోకం చేర్చడమే ప్రభువైన యేసు చేసిన గొప్ప కార్యాలు అన్నిటిలో గొప్పది దీనికై ఎల్లప్పుడు దేవుని స్తుతించుదుము గాక సంతోషించుదుము గాక.

**4వ. చెరపట్టబడిన వారి నిమిత్తము ప్రార్థన:-** బబులోను చెర నుండి కోరేషు రాజు విడుదల ప్రకటించినా ఇంకా చాలామంది చెరలోనే ఉన్నారు. వారి కొరకు ప్రార్థన జరుగు చున్నది. ప్రభువైన యేసుక్రీస్తు మానవాళి పాపపు చెరనుండి సిలువలో తప్పించినా అది గ్రహించని అనేకమంది పాపపు చెరలోనే ఉన్నారు. వారి కొరకు మనము ప్రార్థన చేయాలి.

**5-6వ. విత్తు వాని సంతోషము:-** కన్నీళ్లు విడుచుచు విత్తాలి. ఎన్నో యేండ్ల నుండి పాడుబడిన భూములు సాగుచేయాలంటే కష్టపడాలి. ఎన్నో ఏండ్ల నుండి పాపములో మునిగి పోయిన మానవులు రక్షించబడి బాగుపడాలంటే కన్నీటితో ప్రార్థించాలి. అప్పుడు సంతోష గానములతో పంట కోస్తారు. పిడికెడు విత్తనములు ఏడ్చుచు విత్తువారు సంతోషముగా పనలు మోసుకొని వస్తారు. దేవుని వాగ్దానములు రక్షణ కొరకైనా, రక్షణలో యెదుగుటకైనా వేలు ఉన్నాయి. వీటిలో కొన్ని వాగ్దానములు పట్టుకొని కన్నీటితో ప్రభువు దగ్గర ప్రార్థిస్తే గొప్ప ఫలము పొందగలం. పడి విత్తనములు వేస్తే లారీలకు పంట వస్తుంది కాబట్టి దేవుని వాగ్దానములు అన్ని అవసరం లేదు కొన్ని పట్టుకొని నమ్మి ప్రార్థిస్తే గొప్ప ఫలము వస్తుంది మానవులు రక్షింప బడుటకైనా మనము రక్షణలో ఎదుగుట కైనా కొన్ని వాగ్దానములు చాలు (2 పేతు 1:2-4).

## 127వ కీర్తన (2 + 3 = 5వ)

**అంశము:- ఇల్లు కట్టుట, కష్టపడుట - దేవుడిచ్చు బహుమానము.**

**1-2వ. యెహోవా ఇల్లు కట్టి, కాపాడుట:-** 1-2 యెహోవా ఇల్లు కట్టనియెడల పట్టణమును కాపాడనియెడల కష్టార్జితమును ఆశీర్వదించనియెడల మానవుని ప్రయాసము వ్యర్థము అని భక్తుడైన సొలొమోను చెప్పుచున్నాడు. తన జీవితాన్ని చాలా వ్యర్థపరచుకున్నాడు కనుక వ్యర్థము అన్న మాటను ఎక్కువ సార్లు సొలొమోను ప్రసంగి గ్రంధములో ఉపయోగించాడు.

సామె14:1జ్ఞానవంతురాలు తనయిల్లుకట్టును మూఢురాలు తనచేతులతో తన యిల్లు ఊడ బెరుకును. అని కూడా సొలొమోను చెప్పాడు. ఇల్లు కట్టేది దేవుడా మానవుడా? ఇద్దరి భాగస్వామ్యం ఉండాలి.సామె 24:3,4 లో జ్ఞానము వలన ఇల్లు కట్టబడును వివేచనవలన అది స్థిరపరచబడును. తెలివిచేత దాని గదులు విలువగల రమ్యమైన సర్వసంపదలతో నింపబడును అని చెప్పబడింది. ఇక్కడ ఇల్లు కట్టుటకు జ్ఞానము, వివేచన, తెలివి కావాలి అని రాయబడింది. అంటే దేవుడిచ్చిన జ్ఞానమువివేచన తెలివితో ఇల్లు కట్టుకోవాలి అని అర్థమవుతుంది.

మరియు లూకా 6:47 లో నా యొద్దకు వచ్చి, నా మాటలు విని వాటిచొప్పున చేయు ప్రతివాడు ఇల్లు కట్టవలెనని యుండి లోతుగా త్రవ్వి, బండమీద పునాది వేసిన బుద్ధిమంతుని, జ్ఞానవంతురాలును పోలి యుండును. వరదవచ్చి ప్రవాహము ఆ యింటిమీద వడిగా కొట్టినను, అది బాగుగా కట్టబడి పునాది బండ మీద వేయబడినందున దాని కదలింపలేక పోయెను (మత్త 7:24-25)

లూకా 6:49 అయితే నా మాటలు వినియు చేయనివాడు పునాది వేయక ఇసుక నేలమీద ఇల్లు కట్టిన బుద్ధిహీనుని, మూఢురాలును పోలియుండును. ప్రవాహము దానిమీద వడిగా కొట్టగానే అది కూలిపడెను. ఆ యింటిపాటు గొప్పదని చెప్పెను. (మత్త 7:26,27) కనుక నిలిచే ఇల్లును ఎలా కట్టుకోవాలో ఇక్కడ చెప్పబడింది.

నేడు ఇండ్లను కట్టుకొనుటను నేర్పించాల్సిన పని ఏమీ లేదు. చాలా గొప్పగా అందముగా ఇండ్లను కడుతున్నారు.అందమైన ఖరీదైన ఇంటిలో దుర్మార్గులు త్రాగుబోతులు నివసిస్తే లోకము పట్టించుకోదు. కానీ దేవుని దృష్టిలో అందమైన ఇంట్లో పందులు పొర్లాడుతున్నట్లు ఉంటుంది. మన ఇంటిలో మనము ఎట్లున్నాము?

ఇల్లు అనగా 1.మనము 2.మన కుటుంబము 3. దేవుని సంఘముతో పోల్చవచ్చు. మనమే ఆయన ఇల్లు (హెబ్రీ 3:6). గనుక మన జీవితాన్ని చక్కగా కట్టుకోవాలి. అపుడు మన

కుటుంబము బాగుంటుంది.మనకుటుంబాలు బాగుంటే దేవుని సంఘము బాగుంటుంది. దేవునికి మహిమ కలుగుతుంది. దేవునికి మహిమ కలుగులాగున మన జీవితాలను కట్టుకోవడానికి ప్రయాసపడదాము. మన జీవితాలను ఎలా కట్టుకోవాలి? ముందు చదివినట్లు 1. ఆయన వద్దకు రావాలి అంటే సరైన సంతృప్తికరమైన ప్రార్థన జీవితం కలిగి ఉండాలి. అలాంటి ప్రార్థన జీవితం కలిగి ఉందుము గాక!

2. ఆయన మాటలు వినాలి. అనగా దేవుని వాక్యాన్ని చదవాలి. ఇతరులు చెబుతూ ఉంటే వినాలి. ధ్యానించాలి. వాక్య సమృద్ధిని మనము కలిగి ఉండాలి.

3. వాక్యాన్ని విని అలాగు చేయాలి. అప్పుడు ఆయన జ్ఞానముతో బుద్ధిమంతులలాగా మన జీవితాన్ని మన ఇంటిని కట్టుకుంటాము. అప్పుడు తన ప్రియులు నిద్రించుచుండగా ఆయన వారికిచ్చును. అను వాక్యము నెరవేరుతుంది. సోమరీ! నిద్రపోతా! అన్న దేవుడు నిద్రించే వాళ్లకు ఎలాగు ఇస్తాడు? దాని అర్థం దేవుని చిత్తానుసారంగా జీవిస్తే మిగతావన్నీ సమకుర్చుతాడని భావము. కాబట్టి మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి. అప్పుడవన్నియు మీకను గ్రహింపబడును. (మత్త6:33) ద్రాక్షావల్లిని నేను, తీగెలు మీరు. ఎవడు నాయందు నిలిచియుండునో నేను ఎవనియందు నిలిచియుందునో వాడు బహుగా ఫలించును. నాకు వేరుగా ఉండి మీరేమియు చేయలేరు. (యోహ 15:5)

**3-5వ. యెహోవా అనుగ్రహించు స్వాస్థ్యము బహుమానమగు గర్భఫలము:-** మన కుమారులు దేవుని స్వాస్థ్యము. గర్భఫలము ఆయన బహుమానము. ఈ లోకములో సంతానము లేనివారు ఎంతో మంది ఉన్నారు మనకు పుట్టిన కుమారులే కాదు గాని మనము దేవుని దగ్గరకు నడిపించిన వారు కూడా మనకు కుమారుల లాంటివాళ్లే. ముందు మనము దేవునికి కుమారులము అయితే ఇతరులను కూడా దేవుని దగ్గరకు నడిపించగలము. యవ్వన కాలంలో మనం దేవునికి కుమారులమైతే దేవుని చేతిలో మనము బాణములలాగా ఉంటాము. యవ్వన కాలమందు కాడి మోయుట నరునికి మేలు అన్నాడు (విలా3:23). నీ బాల్య దినములలో సృష్టికర్తను జ్ఞాపకమునకు తెచ్చుకోమన్నాడు. కనుక మనము యవ్వనకాలములోనే దేవుని నమ్ముకుని అనేకమంది యవ్వనులను దేవుని దగ్గరికి నడిపించి అంబుల పొదిని అనగా సంఘమును నింపితే అదొక ధన్యత. అట్టివాడు సిగ్గుపడడు. ప్రభువు చెంతకు వెళ్ళినప్పుడు ఆత్మలను సంపాదించని వారిలాగా సిగ్గుపడకుందుము గాక.

అట్టివాడు విరోధులతో వాదిస్తాడు అనగా సాతాను వాని దూతలను జయించగలము ఇట్టి కృపను దేవుడు మనకనుగ్రహించును గాక!

## 128వ కీర్తన. (2 + 2 + 2 = 6వ.)

**అంశము:- యెహోవాయందు భయభక్తులు కలవారి ధన్యత (Work - wife - Worship)**

**1-2వ. సమాజము (work). కష్టార్జితం:**-1వ. త్రోవలయందు నడుచు. 1-2 యెహోవాయందు భయభక్తులు కలిగి ఆయన త్రోవలయందు నడుచువారందరు ధన్యులు. నిశ్చయముగా నీవు నీ చేతుల కష్టార్జితము ననుభవించెదవు. నీవు ధన్యుడవు నీకు మేలు కలుగును. 127 వ కీర్తనలో వ్యర్థము అని రెండుసార్లు ఉన్నది. 128 లో ధన్యత అని నాలుగు సార్లు ఉన్నది (ధన్యత ఆశీర్వాదము ఒకటే) కారణము 127వ కీర్తనలోనివ్యక్తి యెహోవాద్వారా పనులు జరిగించలేదు. 128 లోని వ్యక్తి యెహోవాయందు భయభక్తులు కలిగి ఆయనయందు నడుచుచున్నాడు. ఆయన యందు భయభక్తులు కలిగి ఆయన త్రోవలో నడిస్తే ధన్యత, ఆశీర్వాదము, క్షేమము మేలు, రక్షణ, ధైర్యము, జ్ఞానము, జీవము కలుగుతాయని అనేకచోట్ల చెప్పబడింది.

కీర్తన31:19. నీయందు భయభక్తులుగలవారి నిమిత్తము నీవు దాచి యుంచిన మేలు యెంతో గొప్పది. నరులయెదుట నిన్ను ఆశ్రయించువారి నిమిత్తము నీవు సిద్ధపరచిన మేలు ఎంతో గొప్పది. కీర్తన34:7. యెహోవాయందు భయభక్తులు గలవారి చుట్టు ఆయన దూత కావలియుండి వారిని రక్షించును. కీర్తన145:19. తనయందు భయభక్తులుగలవారి కోరిక ఆయన నెరవేర్చును వారి మొఱ్ఱ ఆలకించి వారిని రక్షించును.

**3-4వ. సంసారము (wife):-3వ.** నీ లోగిట నీ భార్య ఫలించు ద్రాక్షావల్లివలె నుండును నీ భోజనపు బల్లచుట్టు నీ పిల్లలు ఒలీవ మొక్కలవలె నుందురు. యెహోవా యందు భయభక్తులుగలవాడు ఈలాగు ఆశీర్వదింపబడును. నీ లోగిట అంటే నీ ఇంటిలో నీ భార్య ఫలించు ద్రాక్షావల్లి వలె,పిల్లలు భోజనపు బల్ల చుట్టూ ఒలీవ మొక్కల వలె ఉంటారు. ద్రాక్షావల్లి ఒలీవ మొక్కలు బలమును ఆరోగ్యము కలుగజేస్తాయి అలా భార్య పిల్లలు కలిగి సంతోషిస్తాము. అందరూ కలిసి భోజనము చేయడం ఎంత భాగ్యం.

**5-6వ. సంఘము** (wor**ship**)**:-** 5వ. యెరూషలేముకు క్షేమము. సీయోనులో నుండి యెహోవా నిన్ను ఆశీర్వదించును యెరూషలేమునకు నీ జీవితకాల మంతయు క్షేమము కలుగుట చూచెదవు నీ పిల్లల పిల్లలను నీవు చూచెదవు. ఇశ్రాయేలుమీద సమాధానముండును గాక.

సీయోను యెరూషలేమును సూచిస్తుంది యెరూషలేములో దేవుని మందిరము ఉన్నది అక్కడ నుండి దేవుడు నిన్ను ఆశీర్వదిస్తాడు అని. జీవిత కాలమంతా యెరూషలేమునకు క్షేమము

కలుగుతుంది. యెరూషలేము సంఘమునకు సూచన మన జీవితకాలమంతా సంఘమునకు క్షేమము కలగడం ఎంత భాగ్యము. మన జీవితకాలంలోనే ఎన్నో సంఘాలు పాడవు తున్నాయి.

మనమున్న సంఘము మన జీవితకాలమంతా క్షేమముగా ఉండుట ఎంత భాగ్యము. మనము యెహోవా యందు భయభక్తులు కలిగి ఆయన త్రోవలలో నడిస్తే మనం ఉన్న సంఘము క్షేమముగా ఉంటుంది. మన కుటుంబం క్షేమంగా ఉంటాయి. మనము కూడా క్షేమంగా ఉంటాం. ఈవిధముగా మనము నడుచు కొందము గాక మన పిల్లల పిల్లలను చూడడం ఎంత ఆశీర్వాదకరంగా ఎంత రమ్యముగా ఉంటుంది. అది ఈ లోకములో అవిశ్వాసులకు కూడా కలుగుచున్నది. కానీ ఆత్మీయముగా మనము, మన తరువాతి తరములు, అందరము సంఘములో ప్రభువుని స్తుతించడం అని. ఇది ఎంత రమ్యము ఎంత మనోహరం అలాగే మన సంఘము క్షేమంగా ఉండులాగున మనము ప్రవర్తించుదుము గాక అప్పుడు ఇశ్రాయేలు మీద సమాధానము ఉంటుంది. అంటే మనం ఉన్న దేశము కూడా సమాధానంగా ఉంటుంది

## 129వ కీర్తన. (2 + 2 + 2 + 2 = 8వ.)

**అంశము:-** ఇశ్రాయేలు-తండ్రియైన దేవుని కార్యములు. ఇందులో ప్రభువైన యేసు క్రీస్తు కూడా కనపడతాడు. 1వ వచనములో ఇశ్రాయేలు ఇట్లనును అంటున్నాడు. ఇక్కడ ఇశ్రాయేలు ఏక వచనములో సంబోధించబడుతున్నాడు. ఆ ఒకరు ప్రవక్త కావచ్చు సామాన్యుడు కావచ్చు. అందరి బాధలు ఇవే అందరి వేదన ఇదే. దున్నువారు 3 లో నా వీపును దున్నిరి. ఇక్కడ ప్రభువు కనబడుచున్నాడు. ప్రభువు కూడా ఇశ్రాయేలీయుడే. కాబట్టి ఆయన బాధలు కూడా వర్ణించబడ్డాయి. మనము దేవుని ఇశ్రాయేలు కాబట్టి (గల5:16) మనకు కూడా సరిపోతుంది.

**1-2వ. జీవిత కాలములోని బాధలు.:-** 1వ. ఎవరికి అధిక బాధలు జనాంగముగా ఇశ్రాయేలునకు అధిక బాధలు వచ్చాయి కారణం ఇశ్రాయేలు అవిధేయత. కానీ అందరి కంటే అధిక బాధలు యేసు ప్రభువునకు వచ్చాయి. కారణం యేసు ప్రభువు అవిధేయత కాదు. మానవాళి అవిధేయతనంత ఆయన మోసుకున్నాడు కాబట్టి ఆయనకు అధిక బాధలు ఎప్పటి నుండి యవ్వనకాలము మొదలుకొని. మిగిలిన కీర్తనలో ప్రత్యేక సందర్భంలో కలిగిన బాధలు ఉన్నాయి. ఇక్కడ ప్రత్యేక సందర్భం కాదు యవ్వనము మొదలుకొని జీవితకాలమంతా కలిగిన బాధలు ఉన్నాయి. ఐగుప్తు నుండి వీరికి బాధలు ప్రారంభమయ్యాయి. న్యాయాధిపతులు కాలంలో బాధలు 10 గోత్రాల వారు అష్షూరు చెరకు వెళ్లి 2 గోత్రాల వారు బబులోను చెరకు వెళ్లి

బాధలు క్రీస్తు శకం 70 నుండి 1948 వరకు ప్రపంచ దేశాలకు వెళ్లి బాధలు పడ్డారు. కారణం ఇశ్రాయేలు అవిధేయత. మనము దేవుని ఇశ్రాయేలు గనుక మనకు జీవితకాలమంతా బాధలు ఉంటాయి. యేసు ప్రభువును నమ్ముకుంటే జీవితం అన్ని సౌకర్యాలతో సంతోషంగా ఉంటుంది అనుకోవద్దు. యోహాను16:33 నాయందు మీకు సమాధానము కలుగునట్లు ఈ మాటలు మీతో చెప్పుచున్నాను. లోకములో మీకు శ్రమ కలుగును. అయినను ధైర్యము తెచ్చుకొనుడి, నేను లోకమును జయించి యున్నాననెను. శ్రమలు ఉంటాయి. విజయం ఉంటుందని మర్చిపోవద్దు. అవును ఇశ్రాయేలు ఇప్పటికీ స్థిరముగా ఉంది ప్రభువును సాతాను జయంప లేకపోయాడు విశ్వాసులను కూడా జయింప లేక పోతున్నాడు.

**3-4వ. బాధల నుండి తప్పించిన దేవుడు:-** 3వ. దున్నువారు నా వీపును దున్నిరి ఇశ్రాయేలీయులు ఎన్నో సార్లు బానిసలుగా ఉన్నారు. బానిసల జీవితము ఎంతోకష్టము బానిసలను పశువుల కంటే హీనంగా చూసేవారు బంధించి కొట్టేవారు. వీపున ఎన్నో దెబ్బలు పడేవి. ఇది వీరి అవిధేయత తిరుగు బాటును బట్టి. యేసు ప్రభువు వీపు కూడా దున్నబడింది.

కారణము మానవుల అవిధేయత. ఆయన దెబ్బల ద్వారా మనకు పాపము నుండి స్వస్థత శరీర స్వస్థత దొరుకుతున్నది. 4వ.యెహోవా న్యాయవంతుడు అయ్యుండి భక్తిహీనులు కట్టిన త్రాళ్లను తెంపి ఉన్నాడు. దేవుని వైపుకు మరలి నప్పుడు మన తప్పిదాలను జ్ఞాపకము చేసుకొనక మనలను విడిపించాడు కారణం మన అపరాధములను అన్నిటినీ యేసు క్రీస్తు మీద మోపాడు.

**5-6వ. పగవారు వెనుకకు త్రిప్పబడి వాడిపోవుట:-** 5వ. సీయోను పగ వారందరు సిగ్గుపడి వెనుకకు త్రిప్పబడుదురు గాక. నేడు మనకు పగవారు లేరు. కానీ మన మీద పగ పట్టిన వారు ఉన్నారు.వీరంతా సిగ్గుపడతారు. యోసేపును బాధించిన అన్నలు సిగ్గుపడ్డారు. దానియేలును సింహాల గుహలో వేసిన వారు సిగ్గుపడ్డారు. ప్రభువును అవమానించిన ఇశ్రాయేలీయులు చాలా మంది నమ్ముకున్నారు. అలాగే మన మీద పగపట్టిన వారు సిగ్గు పడతారు. 6వ. వీరు ఇంటి మీద పెరుగు గడ్డివలె ఉందురు. ఎదుగక మునుపే అది వాడిపోవును పూర్వకాలము మట్టికప్పు మిద్దెలు ఉండేటివి. వర్షం వచ్చినప్పుడు గడ్డి పెరుగుతుంది. చూడటానికి ముచ్చటగా ఉంటుంది. కానీ రెండు రోజులకే వాడిపోతుంది అలాగే భక్తిహీనులు చూడటానికి ముచ్చటగా ఉంటారు, త్వరగానే వాడిపోతారు.

**7-8వ.దారిని పోవు పగవారు శపించుట(దీవించకుండుట):-** 7వ.ఆ గడ్డి కోయ దానికి పనలు కట్టడానికి పనికిరాదు. అలాగే భక్తిహీనులు దేనికి పనికిరారు. మనలో ఇంకా ఏమైనా

భక్తిహీనత ఉంటే వదులుకొని ప్రభువుకు పనికివచ్చే వారముగా జీవించుదుము గాక! 8వ. అటువంటి గడ్డిని చూసి యెహోవా ఆశీర్వాదము నీమీద ఉండును గాక యెహోవా నామమున నిన్ను దీవించుదుము గాక అని ఎవరూ అనరు. రూతు 2:4 బోయజు బేత్లెహేము నుండి వచ్చి –యెహోవా మీకు తోడై యుండునుగాకని చేను కోయువారితో చెప్పగా వారు యెహోవా నిన్ను ఆశీర్వదించును గాకనిరి.

## 130వ కీర్తన (2 + 2 + 2 + 2 = 8వ.).

### అంశము:- కృప, క్షమాపణ కొరకు కనిపెట్టి ప్రార్థించు పశ్చాత్తాప కీర్తన.

సందర్భము:- ఇది వ్యక్తిగత పశ్చాతాపమును గూర్చినదైనను 7వ.లో ఇశ్రాయేలూ, యెహోవా మీద ఆశపెట్టుకొనుము.యెహోవాయొద్ద కృప దొరుకును అన్నందున వ్యక్తిగత పశ్చాతాపమును గూర్చినది మాత్రమే కాక ఇశ్రాయేలీయుల సమాజ పశ్చాతమును కూడా సూచించునదని తలంచాలి. సమాజముగా యెహోవాను విడిచి విగ్రహములను పూజించిన సందర్భము కావచ్చును. మనకు మేలు, క్షమాపణ, విమోచన దొరుకుతాయి (4,8)

**1-2వ.ప్రార్థన ఆలకించుమని మొరపెట్టుట:-** యెహోవా, అగాధస్థలములలో నుండి నేను నీకు మొఱ్ఱపెట్టుచున్నాను ప్రభువా, నా ప్రార్థన ఆలకింపుము. నీ చెవి యొగ్గి నా ఆర్తధ్వని వినుము. మొరపెట్టుచున్నాను, ప్రార్థన ఆలకింపుము, ఆర్తధ్వని వినుము. మూడు ప్రార్థన గురించే. అవసరానికి ప్రార్థన, ఇబ్బందులలో మొరపెట్టుట, కృంగినపుడు ఆర్తధ్వని చేయాలి. దేనికొరకు మొఱ్ఱ, దోషముల క్షమాపణ కొరకు. లేకుంటే శిక్ష ఉంది. ఇందులో 2 విషయాలు 1. రక్షణ కొరకై ఒకేసారి మొఱ్ఱపెట్టాలి. 2. రక్షింపబడిన తరువాత కూడా మనము పాపము లేకుండా ఉండగలమా 1 యోహా1:8,10 మనము పాపము లేనివారమని చెప్పుకొనినయెడల, మనలను మనమే మోసపుచ్చుకొందుము. మరియు మనలో సత్యముండదు. మనము పాపము చేయలేదని చెప్పుకొనినయెడల, ఆయనను అబద్ధికునిగా చేయువార మగుదుము. మరియు ఆయన వాక్యము మనలో ఉండదు. నాలో పాపం లేదని చెబితే మోసపుచ్చు కుంటున్నాము. మానవుడు తన జీవితంలో పాపము చేయని వాడుగా పాపం లేని వాడుగా ఉండ లేడు. మన పరిస్థితి ఏమి? ఈ విషయము ఇశ్రాయేలీయులు జ్ఞాపకం చేసుకుంటున్నారు నీవు నేను జ్ఞాపకం చేసుకోవాలి. ఇది ఒకసారి కాదు జీవితకాలమంతా చేయాలి.ఎన్నిసార్లు పాపాలు ఒప్పుకుంటే అన్నిసార్లు ఆయిన దోషముల నుండి రక్షిస్తాడు, విమోచిస్థాడు. మనం ఏమి చేయాలి ప్రార్థన చేయాలి మొరపెట్టాలి ఆర్తధ్వని చేయాలి అగాధ స్థలములలో నుండి నేను మొఱపెట్టుచున్నాను. పైనుండి కాదు. ఏమి ఆర్తధ్వని చేయాలి? ప్రభువా నా దోషములను కనిపెట్టిన ఎడల నీ ఎదుట నేను నిల్వలేను అని.

**3-4వ. దోషములు కనిపెట్టక క్షమించు ప్రభువు.:-** 3. యెహోవా, నీవు దోషములను కనిపెట్టి చూచిన యెడల ప్రభువా, ఎవడు నిలువగలడు? మన దోషాలు కనిపెడితే ఎవడు నిలువగలడు. స్పర్జన్ గారు చెప్పిన ప్రసంగము చెప్పడు. అందుకే ఆయనను ప్రసంగ చక్రవర్తి అన్నారు. ఆయన చేసే మొదటి ప్రార్ధన పాపినైన నన్ను క్షమించండి స్వామి. నా దోషము లెక్క పెడితే నేను నీ ఎదుట నిల్వలేను అని ప్రార్ధిస్తాడు.

ఆయన ఎప్పుడు తన దోషాన్ని ఒప్పుకొని తర్వాత ప్రసంగించేవాడు. రోడ్డు క్రాస్ చేసేటప్పుడు కూడా రోడ్డు మధ్యలో నిలబడి పాపాన్ని ఒప్పుకుంటాడట. ఎన్నిప్రసంగాలు చేసినను నేను దోషంలేకుండా ఉండలేను అని ఆయనకు గ్రహింపు ఉన్నది. మన పరిస్థితి ఏమి? 4. అయినను జనులు నీ యందు భయభక్తులు నిలుపునట్లు నీయొద్ద క్షమాపణ దొరుకును. ప్రార్ధన చేస్తే ఆయన ఏమి చేస్తాడు క్షమాపణ ఇస్తాడు కనుక మేము పాపము చేయ లేదన కుండా ఒప్పుకొని ముందుకు సాగుదాం క్షమాపణ దొరుకుతుంది. మనము. ఏ వైనా కొనడానికి వెళ్ళి నపుడు అది లేదంటే నిరాశ. ఈయన దగ్గర ఎల్లపుడూ క్షమాపణ దొరుకుతుంది.

**5-6వ. ఆశతో ప్రభువు కొరకు కనిపెట్టుట:-** 5,6 వచనాల్లో ఎక్కువగా కనిపెట్టుట కనపడుతుంది.ఎంతో ఆశతో కావలి వారు ఉదయం కొరకు కనిపెట్టుకొనినట్లు. రాత్రంతా నైట్ డ్యూటీ చేసే వాళ్ళు ఎప్పుడు ఎప్పుడు తెల్లవారుతుందా అని కనిపెట్టుకుంటారు. సారిసారి టైం చూసుకుంటారు శరీరము కనిపెడుతూ ఉంటుంది ఆత్మ కూడా కనిపెడుతూ ఉంటుంది.వారు ఉదయము కొరకు కనిపెట్టుతారు. మనము ఆయన మాట కొరకుకనిపెట్టుకోవాలి ఏ మాట క్షమాపణ ఇస్తాను అనే మాట ఆ మాట వచ్చేంతవరకు స్పర్జెన్ గారు కనిపెట్టేవారు అని నేను అనుకుంటాను. మనమైతే ఎన్ని రోజులైనా చనిపోయే వరకైనా పట్టించుకోము. నీ యందు భయభక్తులు కలిగినవారు కనిపెట్టుతారు. మన తప్పును క్షమించగలిగినవాడు యెహోవా అని ఆయన కొరకే కనిపెట్టాలి. ఆయన మాట మీద నేను ఆశ పెట్టుకుని ఉన్నాను. ప్రభువుతో మన సంబంధము సరిదిద్దబడువరకు ఆయన మాట కొరకు మనం కనిపెట్టుకుందాం.

**7-8వ. కృపతో విమోచించు ప్రభువు:-** యెహోవా కొరకు ఆశ పెట్టుకుంటాను. సంపూర్ణ విమోచన దొరుకుతుంది. యెహోవా వద్ద కృప దొరుకును దేని బట్టి మనల్ని రక్షిస్తాడు విమోచిస్తాడు. కృపను బట్టి క్షమిస్తాడు మనము పెనాల్టీ కడితే కాదు ఆయన కృపను బట్టి మన విమోచన మన పాపక్షమాపణ (ఎఫె 2:8). ఆయన దగ్గర ఎల్లప్పుడూ సంపూర్ణ విమోచన దొరుకుతుంది. ఇది ఎల్లప్పుడూ జరగవలసిన కార్యము. వారు మందిరమునకు ప్రతి సంవత్సరము మూడుసార్లు వెళతారు. అప్పుడు ఆ కీర్తన పాడుకుంటారు. మనము ఎల్లప్పుడూ దేవుని సన్నిధికి

వెళ్తాము గనుక  ఎవడు నీ ఎదుట నిలవగలడు. ప్రభువా అంటే నేను నిల్వ లేను ప్రభువా అని ఎల్లప్పుడూ ఒప్పుకోవాలి

## 131వ కీర్తన (1 + 2 = 3 వచనములు)

### అంశము:- హృదయములో దీనత్వము కలవానికి కలుగు ధన్యత.

1వ. యెహోవా, నా హృదయము అహంకారము గలది కాదు. నా కన్నులు మీదు చూచునవి కావు. నాకు అందని వాటియందైనను గొప్ప వాటి యందైనను నేను అభ్యాసము చేసికొనుట లేదు. దేవునికి లోబడియుండిన దేవుడు అహంకారులను ఎదిరించి దీనులకు కృప అనుగ్రహించును అని బైబిలు చెప్పుచున్నది. యాకోబు 4:6-7లో ఆయన ఎక్కువ కృప నిచ్చును. అందుచేత దేవుడు అహంకారులను ఎదిరించి దీనులకు కృప అనుగ్రహించును అని చెప్పబడినది. కాబట్టి దేవునికి లోబడియుండి, అపవాదిని ఎదిరించాలి. ఎందుకనగా అపవాది యెష14:14లో హృదయములో అహంకారము కలిగి దేవునితో సమానుడుగా తనను చేసి కోవాలని తలంచాడు. యెష14:14లో మేఘ మండలము మీది కెక్కుదును మహోన్నతునితో నన్ను సమానునిగా చేసికొందును అని నీవు మనస్సులో అనుకొంటివిగదా? కనుక వానిని అనుసరించకుండా ఎదిరించాలి, అప్పుడు వాడు మీ యొద్ద నుండి పారిపోవును.

1పేతు 5:5-6లో చిన్నలారా, మీరు పెద్దలకు లోబడియుండుడి. మీరందరు ఎదుటివాని యెడల దీనమనస్సు అను వస్త్రము ధరించుకొని మిమ్మును అలంకరించుకొనుడి. దేవుడు అహంకారులను ఎదిరించి దీనులకు కృప అనుగ్రహించును. దేవుడు తగిన సమయమందు మిమ్మును హెచ్చించునట్లు ఆయన బలిష్ఠమైన చేతిక్రింద దీనమనస్కులై యుండుడి.

మనస్సున గర్వించి చెడిపోయిన రాజు: 2 దిన 26:16 లో ఉజ్జియా స్థిరపడిన తరువాత అతడు మనస్సున గర్వించి చెడిపోయెను. అతడు ధూపపీఠము మీద ధూపము వేయుటకై యెహోవా మందిరములో ప్రవేశించి తన దేవుడైన యెహోవా మీద ద్రోహము చేసి యాజకుల మీద కోపము చూపెను. యెహోవా మందిరములో ధూపపీఠము ప్రక్కనతడు ఉండగా యాజకులు చూచుచునే యున్నప్పుడు అతని నొసట కుష్ఠ రోగము పుట్టెను.

2-3వ. చనుపాలు విడిచిన పిల్ల తన తల్లియొద్ద నున్నట్లు నా ప్రాణము నాయొద్ద నున్నది. ఇశ్రాయేలూ, నేను నా ప్రాణమును నిమ్మళపరచుకొనియున్నాను. సముదాయించు కొని యున్నాను. ఇది మొదలుకొని నిత్యము యెహోవా మీదనే ఆశ పెట్టుకొనుము.

చనుపాలు విడిచిన పిల్ల మరెన్నడు బీవలు తల్లి దగ్గర త్రాగడు కానీ తల్లి యొద్దనే

యుండును. ఆలాగే ప్రారంభదినములలో ఉన్న చెడు అలవాట్లనన్నిటిని విడిచి తల్లి యొద్దనే అనగా దేవుని యొద్ద యుండాలి. నిత్యము యెహోవా యొద్దనే ఆశ పెట్టుకొని యుండాలి.

## 132వ కీర్తన. (3 + 2 + 3 + 2 + 2 + 2 + 2 + 2 = 18వ.)

యాత్ర కీర్తనలన్నీ ఐదు భాగాలు చేస్తే ఐదో భాగంలో మందిరము స్తుతి అనే అంశం కింద ఇది మొదటి కీర్తన. ప్రతి విభాగంలోనూ దావీదు గాని సొలొమోను గాని రాసిన కీర్తనలు ఉన్నాయి. కీర్తన పైన లేకున్నా దావీదు బాధలు అని 1 వ లోఉన్నందున 132వ కీర్తన కూడా దావీదు గారు వ్రాసినారు అని చెప్పవచ్చు.

133 దావీదు గారు వ్రాశారు. 134 కూడా దావీదు గారు వ్రాసారని తలంచవచ్చు.

132–134 మందిరమునకు వచ్చారని తలంచవచ్చు. మొదటి భాగము (121–123) 121:1లో (యెరూషలేము) కొండల తట్టు నేను కన్నులెత్తుచున్నాను. తర్వాత మందిరానికి వచ్చారు అని తలంచవచ్చు.

132లో:– దావీదు బాధలలో మందిర నిర్మాణము వరకు మంచమెక్కకుండుట – మ్రొక్కుబడి చేయుట – దేవుని జవాబు.

**1–3వ. మందిరము, మందసము గూర్చిన మ్రొక్కుబడి.:–** యెహోవా, దావీదునకు కలిగిన బాధలన్నిటిని అతని పక్షమున జ్ఞాపకము చేసికొనుము. దావీదు రాజు గదా రాజుకు కూడా బాధలు ఉంటాయా? దావీదు చాలా బాధలు అనుభవించాడు మనకు తెలుసు. బాధలన్నిటిలో అతడు యెహోవాతో ప్రమాణ పూర్వకముగా మాట యిచ్చి దావీదు యెహోవాతో ప్రమాణం చేస్తూ ఉన్నాడు. యాకోబు యొక్క బలిష్ఠునికి మ్రొక్కుబడి చేశాడు. ఇశ్రాయేలు దేవుడు అంటే బాగుండేది కానీ యాకోబు దేవుడు అంటున్నాడు యాకోబు అంటే మోసగాడు అని మనకు తెలుసు. ఒకప్పుడు మోసగాడైన యాకోబు ఇశ్రాయేలుగా మారినాడు. అయినా యాకోబు అని దేవుడు పిలవడంలో మనలనందరిని కూడా మోసం నుండి విడిపించే దేవుడు అని అర్థం.

**4–5వ. మ్రొక్కుబడి విధాన వివరము.:–** ఎట్లనగా యెహోవాకు నేనొక స్థలము చూచు వరకు యాకోబు యొక్క బలిష్ఠునికి ఒక నివాస స్థలము నేను చూచు వరకు నా వాసస్థానమైన గుడారములో నేను బ్రవేశింపను నేను పరుండు మంచము మీది కెక్కను. నా కన్నులకు నిద్ర రానియ్యను నా కన్ను రెప్పలకు కునికిపాటు రానియ్యననెను. ఎంత గొప్ప తీర్మానమో గదా దేవునికి నివాసస్థలము చూచు వరకు గుడారములో ప్రవేశించడట పరుండడట, నిద్ర గాని

కునుకు పాటుగాని రానివ్వడట. దేవుని నివాసము అంటే ఇప్పుడు సంఘమే. కొలొ 1:24 ఇప్పుడు మీకొరకు నేను అనుభవించుచున్న శ్రమలయందు సంతోషించుచు, సంఘము అను ఆయన శరీరము కొరకు క్రీస్తు పడిన పాట్లలో కొదువైన వాటియందు నావంతు నా శరీరమందు సంపూర్ణము చేయుచున్నాను. సంఘము కొరకు క్రీస్తు పాట్లు పౌలు పాట్లు ఇక్కడ ఉన్నాయి. మనమెట్లు పాట్లు పడుతున్నాము. సంఘము కూడుకోడానికి స్థలము చూసే ఆశ మనకుందా. ఆత్మీయంగా ప్రభువు దగ్గరకు మనుష్యులను నడిపించాలి. వారిని సమాజముగా కూడుటకు స్థలము మందిరము ఏర్పాటు చేయాలి. ఇండ్లు కట్టుకుంటున్నాము. మంచిది సంఘమునకు స్థలము కానీ మందిరము ఏర్పాటు చేసుకోవడంలో శ్రద్ధ తీసుకుందాం.

**6-8వ. సహవాస స్థలముగా దేవుని నివాసము:-** (1). ఆది అనగా దేవుని మందసము గురించి దావీదు చిన్నవాడుగా ఉన్నప్పుడు ఎఫ్రాతాలో (బెత్లహేము) ఉండగా విన్నాడు. అప్పటి నుండి దావీదుకు మందసము అంటే మక్కువ. మందసము దేవుని నివాసము అని ఎరిగి అక్కడికి వెళ్లి సాగిలపడుతూ ఉండేవాడు. నేను నీకు ఒకనివాసస్థలము చూస్తాను మందసముతో కూడా అక్కడికిరమ్మని ప్రార్థించేవాడు.

**9-10వ. యాజకులు(2), భక్తులను (3,4) గూర్చిన ప్రార్థన:-** యాజకులు నీతి వస్త్రములు ధరించు కొనాలని భక్తులు ఉత్సాహగానము చేయాలని తన నిమిత్తము విముఖుడవై ఉండవద్దని దావీదు ప్రార్థించాడు

**11-12వ. దావీదు కుమారులకు దేవుని ఆశీర్వాదము:-** దావీదు ప్రార్థించినది మందిరమునిమిత్తము మందిర స్థలము నిమిత్తము యాజకుల నిమిత్తము భక్తుల నిమిత్తము ప్రార్థించాడు.కానీ దేవుడు దావీదు గర్భఫలమును దావీదు రాజ్యమందు నియమిస్తానని జవాబిచ్చాడు. ఎంత ఆశ్చర్యము కదా! దావీదుకు మందిరం మీద ఉన్న ఆసక్తిని చూసి దావీదు కుమారులకు రాజ్యం ఇస్తానని దేవుడు చెప్పాడు. దావీదు తన కుమారులకు రాజ్యము కావాలని అనుకోలేదు గాని దావీదు మందిరస్థలముకొరకు ఆశకలిగిఉన్నాడు.అయితే దావీదు కుమారులు దేవుని శాసనములను దేవుని నిబంధనలను గైకొంటేనే సింహాసనము నిత్యము ఉంటుందని చెప్పాడు.దేవుని ఆజ్ఞలను వారు గైకొనకపోవడం వల్ల దావీదు సంతానానికి ప్రస్తుతము సింహాసనము లేదు. అయితే దావీదు సంతానమైన ప్రభువైన యేసుక్రీస్తు ఆయన ఆజ్ఞలను శాసనములను సంపూర్ణంగా గైకొన్నాడు గనుక రాబోవు కాలంలో వెయ్యేండ్లు ఆయన సింహాసనం మీద ఉండి పరిపాలిస్తాడు

**13-14వ.దేవుని నివాసము.:-** దేవుడు సీయోనును ఏర్పరచుకున్నాడు. దానిని ఆయన

తన నివాస స్థలంగా కోరుకున్నాడు. ఇదే నేను కోరిన స్థానము. ఇది నాకు విశ్రాంతి స్థానంగా ఉండును. ఇక్కడ నేను నివసించెదను అని తెలియజేశాడు అందుకే యెరూషలేము ఇశ్రాయేలీయులకు ఎంతో ప్రాముఖ్యత చెందినది.

**15-16వ. దేవుని ప్రజలకు యాజకులకు ఆశీర్వాదము.:-** యెరూషలేమును నిండుగా దీవిస్తాను అన్నాడు పేదలను తృప్తి పరుస్తాను అన్నాడు. యాజకులకు రక్షణ దయ చేస్తాను అన్నాడు. రక్షణను వస్త్రముగా కప్పుతాను అన్నాడు. అందులో భక్తులందరూ ఆనంద గానము చేస్తారు అన్నాడు.ఆత్మీయముగా మనమందరము బీదలమే. దేవుని వాక్యమనే ఆహారముతో ఆయన తృప్తి పరుస్తున్నాడు. మనకు రక్షణను వస్త్రముగా ధరింప చేశాడు. సంతోషించి మనము ఆనంద గానము చేయుదురు గాక

**17-18వ. మెస్సియాను గూర్చినది.:-** (దావీదుకు దేవుని నిత్య ఆశీర్వాదము): -దావీదు కొమ్ము అనగా యేసు క్రీస్తే. అభిషిక్తుడు అనగా క్రీస్తే. ఆయనకు దీపము అనగా సంఘమును సిద్ధం చేస్తాను అన్నాడు. క్రీస్తు శత్రువులకు అవమానాన్ని వస్త్రముగా ధరింపచేస్తాడు. ప్రభువు యొక్క కిరీటము తేజరిల్లుతుంది. ప్రస్తుతం మన కొరకు ముళ్ళ కిరీటం ధరించాడు గాని మహిమ కిరీటాన్ని ధరించి ప్రపంచాన్ని పాలించ బోతున్నాడు. ఆ పరిపాలనలో మనము కూడా ఉందును గాక

## 133వ కీర్తన (1 + 1 + 1 = 3వ.)

**అంశము:- సహోదరుల ఐక్యత. (బహుషా దావీదుచే రచింపబడినది)**

**1వ.** సహోదరులు ఐక్యత కలిగి నివసించుట ఎంత మేలు! ఎంత మనోహరము. యేసు ప్రభువు యోహాను 17:21 లో వాక్యము వలన నా యందు విశ్వాస ముంచువారందరును ఏకమైయుండవలెనని వారి కొరకును ప్రార్థించుచున్నాను 22 మనము ఏకమై యున్నలాగున, వారును ఏకమై యుండవలెనని నీవు నాకు అనుగ్రహించిన మహిమను నేను వారికి ఇచ్చితిని అన్నాడు.

ఎఫే 4:1-6వ. మీరు సమాధానమను బంధముచేత ఆత్మకలిగించు ఐక్యమును కాపాడుకొనుటయందు శ్రద్ధ కలిగినవారై, ప్రేమతో ఒకనినొకడు సహించుచు, 2 మీరు పిలువబడిన పిలుపునకు తగినట్లుగా దీర్ఘశాంతముతో కూడిన సంపూర్ణ వినయముతోను సాత్వికముతోను నడుచుకొనవలెనని, 3 ప్రభువునుబట్టి ఖైదీనైన నేను మిమ్మును బతిమాలు కొనుచున్నాను. 4 శరీర మొక్కటే, ఆత్మయు ఒక్కడే. ఆ ప్రకారమే మీ పిలుపు విషయమై

యొక్కటే నిరీక్షణ యందుండుటకు పిలువబడితిరి. 5 ప్రభువు ఒక్కడే, విశ్వాస మొక్కటే, బాప్తిస్మ మొక్కటే, 6 అందరికి తండ్రియైన దేవుడు ఒక్కడే.ఆయన అందరికి పైగా ఉన్నవాడై అందరిలో వ్యాపించి అందరిలో ఉన్నాడు. సువార్తలలో యేసు ప్రభువు ఎఫెసి పత్రికలో పౌలు చెప్పిన దానిని బట్టి వ్యక్తిగతముగా మనమందరము,సంఘముగా సహోదరులందరు ఐక్యత కలిగి ఏకమనసుతో నివసించుటయే మేలని చెప్పుచున్నాడు.

**2వ.** అహరోను యాజకుడు. యాజకుడైన అహరోను తలమీద పరిమళ తైలము పోయబడగా అది అహరోను గడ్డము మీదుగా కారి అతని అంగీల అంచు వరకు దిగజారినపుడు ఆ పరిమళవాసన ఎంతో మనోహరముగా ఉండును. 1పేతు 2:9 అయితే మీరు చీకటిలోనుండి ఆశ్చర్యకరమైన తన వెలుగులోనికి మిమ్మును పిలిచిన వాని గుణాతిశయములను ప్రచురముచేయు నిమిత్తము, ఏర్పరచబడిన వంశమును, యాజక సముహము.- కనుక యాజకులైన సహోదరులు ఐక్యత కలిగి నివసించుట వారి మధ్య పరిమళతైలము ప్రవహించినట్లు మనోహరముగా నుండును.

**3వ.** సీయోను హెర్మోను 25 మైళ్ళ పొడవుగల రెండు మంచు కొండలు. ఆ కొండల మీద మంచు కరిగి వాటి మధ్యనున్న లోయలోనికి ప్రవహించగా యోర్దానునది అక్కడ పుట్టుచున్నది. ఆ కొండలమీద మంచు కరిగి వాటి మధ్యనున్న లోయలోనికి ప్రవహించుట చూడ ముచ్చటగాను ఎంత మనోహరముగా ఉండును. అందుకే కీర్తనాకారుడు-సీయోను కొండల మీదికి దిగి వచ్చుహెర్మోను మంచువలె నుండును అన్నాడు. ఆశీర్వాదమును శాశ్వత జీవమును అచ్చట నుందునని యెహోవా సెలవిచ్చియున్నాడు. అలాగే సహోదరులు ఐక్యత కలిగి నివసించుట ఎంతో మేలుకరముగాను ఆశీర్వాదముగాను ఉండును.

## 134వ కీర్తన (1 + 1 + 1 = 3వ.)

**అంశము:- యెహోవా మందిరములో స్తుతి - ఆశీర్వదించును.**

(బహుశా దావీదుచే రచింపబడినది)

**1వ.** యెహోవా సేవకులారా-ఈ సేవకులు యాజకులే,, యెహోవా మందిరములో రాత్రి నిలుచుండువారలారా మీరందరు యెహోవాను సన్నుతించుడి. అనగా మందిరమును దాని ఉపకరణములను రాత్రి కావలికాయువారు, వారు కావలివారు మాత్రమేకాక పట్టణములో ప్రజలందరూ నిద్రించుచుండ వీరు రాత్రి జాములలో మందిరమందు దేవునికి స్తుతిచేయు బాధ్యత కలిగి యుందురు. కనుక దేవునికి స్తుతి నిత్యము రాత్రి పగలు ఆగిపోకుండా జరుగాలి.

**2వ.** పరిశుద్ధ స్థలము వైపు మీ చేతులెత్తి యెహోవాను సన్నుతించుడి.

కీర్తన 63:4 నా మంచముమీద నిన్ను జ్ఞాపకము చేసికొని రాత్రి జాములయందు నిన్ను ధ్యానించునప్పుడు 5 క్రొవ్వు మెదడు నాకు దొరకినట్లుగా నా ప్రాణము తృప్తి పొందుచున్నది. ఉత్సహించు పెదవులతో నా నోరు నిన్నుగూర్చి గానము చేయుచున్నది. 6 కాగా నా జీవిత కాలమంతయు నేనీలాగున నిన్ను స్తుతించెదను నీ నామమునుబట్టి నా చేతులెత్తెదను.

కీర్తన119:48 నాకు ప్రియముగానున్న నీ ఆజ్ఞలతట్టు నా చేతు లెత్తెదను నీ కట్టడలను నేను ధ్యానించుదును. కీర్తన141:2 నా ప్రార్థన ధూపమువలెను నేను చేతులెత్తుట సాయంకాల నైవేద్యమువలెను నీ దృష్టికి అంగీకారములగును గాక. 1 తిమో 2:8 కావున ప్రతిస్థలమందును పురుషులు కోపమును సంశయమును లేనివారై, పవిత్రమైన చేతులెత్తి ప్రార్థన చేయవలెనని కోరుచున్నాను.

**ప్రార్థనకు జవాబు.**

3వ. జవాబిచ్చువాడు:- భూమ్యాకాశములను సృజించిన యెహోవా:

కీర్తన 121:2 యెహోవా వలననే నాకు సహాయముకలుగును ఆయన భూమ్యా కాశములను సృజించినవాడు. కీర్తన 124:8 భూమ్యాకాశములను సృజించిన యెహోవా నామము వలననే మనకు సహాయము కలుగుచున్నది. కీర్తన115:15భూమ్యాకాశములను సృజించిన యెహోవాచేత మీరు ఆశీర్వదింపబడినవారు. సీయోనులో నుండి అనగా మందిరములోనుండి నీకు సహాయము ఆశీర్వాదము కలుగును.

## 135వ కీర్తన (3 + 3 + 3 + 3 + 3 + 3 + 3 = 21వ.)

### ముఖ్య అంశము :- మందిరములో స్తుతి.

అంశ వివరము. మొదటి మూడు వచనాల్లో చివరి మూడు వచనాల్లో స్తుతించండి అని పదిసార్లు కనపడుతుంది. కనుక ఇది స్తుతి కీర్తన.స్తుతించడంలో పలు అంశాలుగా స్తుతించడం గురించి ఈ కీర్తన చెబుతోంది. రెండవ వచనములో మందిరములో స్తుతించండి అని ఉంది కనుక దీనికి మందిరములో స్తుతి అని పేరు పెట్టవచ్చు యెహోవా యెహోవా అని నామమును కూడా స్తుతించాలి అని చెప్పబడింది (3)

**1-3వ. ఎవరిని, ఎవరు, ఎక్కడ, ఎందుకు స్తుతించాలి?:-** ఈ ప్రశ్నలు వేసుకుంటే మొదటి మూడు వచనాల్లో జవాబు ఉంది.ఎవరిని స్తుతించాలి? యెహోవాను స్తుతించాలి.

యెహోవా నామమును స్తుతించాలి.ఎవరు స్తుతించాలి? యెహోవా సేవకులారా స్తుతించండి. ఆయన సేవకులు మాత్రమే స్తుతించాలి.ఆయన మందిరములో నిలుచుండువారు మాత్రమే ఆయన స్తుతించాలి. ఎక్కడ స్తుతించాలి? యెహోవా మందిరములో స్తుతించాలి. అంటే సంఘములో స్తుతించాలి. వ్యక్తిగతంగా ఇంకెక్కడైనా స్తుతించవచ్చు కానీ సంఘములో స్తుతించడం కూడా ముఖ్యమైనది. ఎందుకు స్తుతించాలి? యెహోవా దయాళుడు యెహోవా నామము మనోహరమైనది. అందుకు స్తుతించాలి. ఆయన దయాళుత్వమును బట్టి స్తుతించాలి. ఆయన మనోహరుడు అతిసుందరుడు పదివేలమందిలో శ్రేష్టుడు గనుక స్తుతించాలి.

**4-6వ. యెహోవా ఏర్పాటు, గొప్పతనమును బట్టి స్తుతించుడి:-** యెహోవా యాకోబు ఏర్పాటు చేసుకున్నాడని ఇశ్రాయేలును స్వకీయధనముగా ఏర్పరచుకున్నాడని యెహోవా సమస్త దేవతలకంటె గొప్పవాడనియు ఎరిగి ఇజ్రాయేలు జనాంగము స్తుతించాలి. యాకోబు ఎవరు? ఇజ్రాయేలు ఎవరు? మోసం ఉన్నప్పుడు యాకోబు. ఆశీర్వదించబడినప్పుడు ఇశ్రాయేలు యాకోబును దేవుడు ఏర్పరచుకున్నాడు మోసగాన్ని ఎవరు పిలుస్తారు అదే ఆశ్చర్యం. కానీ దేవుడు ఇజ్రాయేలుగా మార్చాడు. ఇది ఇంకా గొప్ప ఆశ్చర్యం. అందుకు ఇశ్రాయేలు ప్రజలు స్తుతించాలి.మనము స్తుతించాలి.

ఎందుకనగా మనము కూడ మునుపు అవివేకులమును అవిధేయులమును మోసపోయిన వారమును నానా విధములైన దురాశలకును భోగములకును దాసులమునైయుండి, దుష్టత్వమునందును అసూయయందును కాలము గడుపుచు, అసహ్యులమై యొకని నొకడు ద్వేషించుచు ఉంటిమి గాని మన రక్షకుడైన దేవుని యొక్క దయయు, మానవుల యెడల ఆయనకున్న ప్రేమయు ప్రత్యక్షమైనప్పుడు మనము నీతిని అనుసరించి చేసిన క్రియల మూలముగాకాక, తనకనికరము చొప్పుననే పునర్జన్మసంబంధమైన స్నానము ద్వారాను, పరిశుద్ధాత్మ మనకు నూతన స్వభావము కలుగజేయుట ద్వారాను మనలను రక్షించెను. అని ఎరిగి మనం స్తుతించాలి.

2 పేతు 1:10.యెహోవా సమస్త దేవతల కంటే గొప్పవాడు ఎందుకంటే ఎంతో మంది దేవతలున్నా మానవుని రక్షణ కొరకు ప్రాణము పెట్టినవాడు సమాధిని జయించి తిరిగి లేచిన వాడు ఈయనొక్కడే.ఆకాశము, భూమి, సముద్రములు, మహాసముద్రములన్నిటి యందును ఆయన తనకిష్టమైన దంతయు జరిగించు వాడు కనుక ఆయనను స్తుతించాలి.

**7-9వ. యెహోవా రక్షణను బట్టి స్తుతించుడి:-** భూదిగంతములనుండి ఆవిరి,వాన, మెరుపులు పుట్టించువాడు. ఆయనే తననిధులలోనుండి గాలిని ఆయన బయలు వెళ్లజేయును.

ఐగుప్తులో మనుష్యుల తొలిచూలులను పశువుల తొలిచూలులను ఆయన హతముచేసెను ఐగుప్త మధ్యను ఫరోయెదుటను అతని ఉద్యోగస్థుల యెదుటను అనేకసూచకక్రియలను మహత్కార్యములను జరిగించెను. ఐగుప్తులో నుండి రక్షించి కనానులోనికి నడిపించాడు. మనల్ని కూడా పాపజీవితం నుంచి రక్షించి పరిశుద్ధ జీవితంలోనికి నడిపించాడు అందుకు స్తుతించాలి.

**10-12వ. యెహోవా కాపుదలను బట్టి స్తుతించుడి:-** అనేకులైన అన్య జనులను బలిష్ఠులైన రాజులను ఆయన హతము చేసినవాడు. అంటే ఆత్మీయంగా అపవాది, అపద్ధప్రవక్త, క్రీస్తువిరోధి అను సాతాను త్రిత్వమును జయించినవాడు. అమోరీయుల రాజైన ఓగును హతముచేసెను కనాను రాజ్యములన్నిటిని పాడుచేసెను. అమోరీయులు శరీరానికి, కనానీయులు లోకానికి సాదృశ్యము. విశ్వాసికి అపవాది, శరీరము, లోకము ప్రధాన శత్రువులు. వీటిని జయించి వీటి నుండి ప్రభువు మనల్ని కాపాడుతున్నాడు. అందుకు స్తుతించాలి. ఆయన వారి దేశమును స్వాస్థ్యముగాను ఇశ్రాయేలీయులైన తన ప్రజలకు స్వాస్థ్యముగాను అప్పగించెను. మనకు పరలోకములో స్వాస్థ్యము అప్పగించాడు.

**13-15వ. 16-18వ. అసమానుడైన యెహోవా: యెహోవా - విగ్రహములు:-** ఈ భాగంలో యెహోవాకు విగ్రహాలకు భేదము వివరించబడింది అవి చేతి పనులు. ఈయనను ఎవరూ చేయలేరు. ఈయన అసమాన్యుడు ఈయనతో ఎవరిని పోల్చలేము. విగ్రహములు వెండి బంగారము ఇవి పలుక లేవు, వినలేవు, చూడలేవు. యెహోవా వింటాడు, చూస్తాడు మాట్లాడుతాడు మన ప్రార్ధన వింటాడు ఇశ్రాయేలీయుల మొర్ర విన్నాడు. చూడ్డానికి దిగివచ్చాడు.

**19-21వ.ఎవరు,ఎవరిని,ఏమిచేయాలి-స్తుతించాలి:-** ఇశ్రాయేలు వంశీయులారా, అంటే యాకోబువంశం నుండి మార్చబడ్డాము అహరోను వంశీయులారా, అంటే యాజకవంశంగా చేయబడ్డాము లేవి వంశీయులారా, హత్తుకునే వారిమిగా చేయబడ్డాము. యెహోవా యందు భయభక్తులు గలవారముగా చేయబడ్డాము.

యెరూషలేములో నివసించు యెహోవాను స్తుతించుడి అని 6 సార్లు చెప్పబడింది ప్రభువుని హృదయపూర్వకంగా స్తుతించును గాక!

## 136వ కీర్తన (3 + 3 + 3 + 3 + 4 + 4 + 4+ 2 = 26వ.)

**అంశము :- కృపను గూర్చి కృతజ్ఞతా స్తుతులు చెల్లించవలసిన కీర్తన.**

ఆయన కృప నిరంతరముండును. అని ప్రతి వచనంలో ఉన్నది. కనుక ఇది కృపను గురించిన కీర్తన. మొదటి నాలుగు వచనాల్లో కృతజ్ఞతా స్తుతులు చెల్లించండి అని ఉన్నది. ఇది కృపను గురించి మాత్రమే కాకుండా కృతజ్ఞతాస్తుతులు చెల్లించవలసిన కీర్తన.

ఎందుకు చెల్లించాలి? మనము ఎవరినైనా ఘన పరచాలి అంటే ఆయన ఎవరు? ఆయన ఏమి చేశాడు? అనేది ప్రాముఖ్యమైనది. ఈయన ఎవరు అంటే 1-3 వచానాలలో ఉంది. ఈయన ఏమి చేశాడు అంటే 4-26 లో జవాబు ఉంది.

**1-3వ. దేవదేవునికి ప్రభువుల ప్రభువుకు దయాళుడగు యెహోవాకు కృతజ్ఞతాస్తుతి. ఈయన ఎవరు?:-** యెహోవా దయాళుడు. దేవుళ్ళు అనబడిన వారున్నారు. ఈయన దేవదేవుడు. ప్రభువులు అనబడినవారున్నారు. ఈయన ప్రభువులకు ప్రభువు. మహాశ్చర్యకార్యములు చేయువాడు. ఈయన కృప నిరంతరముంటుంది. కనుక ఈయనకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించాలి.

**4-6వ. మహాశ్చర్య కార్యములు చేసి ఆకాశమును భూమిని మానవునికి నివాసముగా కలుగ జేసినందుకు స్తుతి:-** ఈయన ఏమి చేశాడు? ఈయన మహాశ్చర్యకార్యములు చేయు వాడు. ఈయన ఆకాశమును కలుగజేసినవాడు. భూమి మీద నీళ్లను పరచినవాడు. అంటే ఆకాశమును భూమిని చేసినవాడు. కీర్తన 115:16 లో ఆకాశములు యెహోవా వశము భూమిని ఆయన నరులకిచ్చియున్నాడు అని వ్రాయబడింది. భూమిని నరుల కోసమై సిద్ధ పరిచాడు. మానవుని సృజించక మునుపే భూమిని అందులోనే సమస్తాన్ని ఆయన సిద్ధపరచాడు. ఎంత ప్రేమగల దేవుడు గమనించండి.

**7-9వ. మానవ నివాసమునకు వెలుగునిచ్చు సూర్యుని, చంద్రుని కలుగ జేసి నందుకు స్తుతి:-** గొప్ప జ్యోతులను నిర్మించినవాడు. సూర్యుని చంద్రుని నక్షత్రములను చేసినవాడు. ఇవన్నీ మానవుని సృజించకమునుపే చేశాడు.

**10-12వ. ఐగుప్తు దాస్యము నుండి అనగా పాప దాస్యమునుండి విడిపించినందుకు (రక్షణను బట్టి) స్తుతి:-** సృజించిన మానవుడు పాపము చేత రకరకాల బాధలు అనుభవిస్తున్నాడు. ఇశ్రాయేలీయులు ఐగుప్తుకు వెళ్లి దాస్యములో చిక్కుకుపోయారు. అపుడు ఐగుప్తు దేశపు తొలిచూలులను హతము చేసి వారి మధ్య నుండి ఇశ్రాయేలీయులను తన బాహు బలముచేత రప్పించెను. మానవులందరూ పాపదాస్యము క్రింద ఉండగా కృప చేత మనలను రక్షించాడు ఎఫె 2:9. ఈయన చేసిన కార్యములన్నిటి కంటే ఇది మహా మహా గొప్ప కార్యం.

ఏ మానవుడు ఎవరిని రక్షించలేడు. ఈ నామమునే ఈయన వలననే మానవులకు రక్షణ కలుగుచున్నది. పాపము నుండి రక్షించాడు. పాపపు శిక్షనుండి రక్షించాడు. శాపమును గ్రహించినవాడు. మన శాపమును గ్రహించి శాపగ్రాహి అయ్యాడు. (గల 3:13)కనుక ఈ దయామయునికి ఈ కృపామయునికి కృతజ్ఞతగా స్తుతులు చెల్లించాలి.

**13-16వ. ఫరోను అతని సైన్యమును అనగా సాతాను వాని దూతల నుండి విజయమిచ్చినందుకు స్తుతి:-** ఎఱ్ఱ సముద్రమును పాయలు చేసి దాని మధ్య ఇశ్రాయేలును నడిపించెను. ఫరోను అతని సైన్యమును ముంచి వేశాడు.వారు గొర్రెపిల్ల రక్తమును బట్టి విమోచించబడి, సముద్రములో బాప్తీస్మం పొందారు (1 కోరి10: 3-4) బాప్తిస్మము పొందిన తరువాత వారికి కలిగిన ఆధిక్యత చెప్పబడింది.ఆయన ఫరో సైన్యమును ఎఱ్ఱసముద్రం అలలు ముంచి వేశాయి. అంటే ఇశ్రాయేలీయుల శత్రువులు వారిని ఏమి చేయలేరు. అలాగే మనము బాప్తిస్మము పొందిన తరువాత మన ప్రధాన శత్రువైన సాతాను అతని దూతలు ఏమీ చేయలేరు. వారిని తోడుకొని వచ్చాడు. మనకు తోడై ఉండి నడిపిస్తాడు.

**17-20వ. గొప్ప ప్రసిద్ధి నొందిన రాజులగు సీహోను, ఓగు అనగా లోకము, శరీరము, క్రీస్తువిరోధులు అను శత్రువుల నుండి విజయమిచ్చినందుకు స్తుతి:-** హతము అనేమాట ఈ నాలుగు వచనాలలో కనపడుతుంది. ఓగు శరీరమునకు, సీహోను లోకమునకు, గొప్ప రాజులు దుర్భోధకులకు సాదృశ్యము.వారిని హతము చేసే శక్తి మనకు ఇస్తాడు. ప్రార్థనకు వెళ్లాలా వద్దా అంటే శరీరము ఏమి వెళ్తావులే అని ఆటంక పరుస్తుంది. శరీరము లోకము మనము బ్రతికినంతకాలం ఉంటాయి. వీటిని మనము నలగగొట్టాలి.

**21-24వ. రాబోవు కాలములో (పరలోకములో) మనకివ్వబోవు స్వాస్థ్యమును బట్టి స్తుతి.:-** ఈ వచనాలలో స్వాస్థ్యము అని ఉంది శత్రువులను జయిస్తే పరలోకములో స్వాస్థ్యము.సేవ చేసే వారికి రెందంతలు స్వాస్థ్యము.

**25-26వ. పరలోకమందున్న దేవుడు సమస్త జీవులకును ఆయన ఆహారమిచ్చు చున్నందుకు స్తుతి:-** మానవులకు మాత్రమే కాదు సమస్త జీవులకు ఆహారము ఇచ్చువాడు.

కాబట్టి ఏమి తిందుమో యేమి త్రాగుదుమో యేమి ధరించు కొందుమో అని చింతింపకుడి. అన్యజనులు వీటన్నిటి విషయమై విచారింతురు. ఇవన్నియు మీకు కావలెనని మీ పరలోకపు తండ్రికి తెలియును. కాబట్టి మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి. అప్పుడవన్నియు మీకనుగ్రహింపబడును. (మత్త 6:31-33) ఇంత ధైర్యాన్ని కలుగజేసే ప్రభువుకు, దేవునికి స్తుతులు చెల్లించుదుము గాక! ధైర్యముగా ఉందుము గాక!

## 137వ కీర్తన (3 + 3 + 3 = 9వ.)

**సందర్భము :- బబులోను చెర.**

**1-3వ. చెరను గూర్చిన జ్ఞాపికలు:-** చెరపట్టిన వారు ఉల్లాసము కొరకు పాటలు పాడమన్నారు. 1000 మైళ్ళు నడిపించారు. చెప్పులు లేవు. గుండు గీయించారు. దేవుని క్రమశిక్షణ ఎంతో కఠినమైనది. నిరవంజి చెట్లకు వారి సితారాలను తగిలించారు. పాటలు లేవు. బబులోను నదుల యొద్ద కూర్చున్నారు. బానిసలు, ఇండ్లు లేవు. అక్కడనున్న నిరవంజి చెట్లకు వారి సితారాలు తగిలించారు. ఏమి సంతోషమని పాటలు పాడాలి. యెరూషలేములోని వారి దేవాలయము కాలిపోయింది. రమ్యతను కోల్పోయింది. సొలొమోను కట్టించిన బంగారు దేవాలయము పాడైంది. అది చూసిన యిర్మియాలాంటి వారు విలపించారు.

వీళ్ళేమో నదుల దగ్గర నివాసము చేయాలి. బబులోను వారు రమ్యమైన భవనాలలో నివసిస్తున్నారు. బబులోనులో వ్రేలాడే ఉద్యానవనములు ఉన్నాయి. ఇవి ప్రపంచ 7 వింతలలో ఒకటి. ఆనాడు నీరు పైకి పంపే పంపులు లేవు. ఈ బానిసల ద్వారా నీళ్ళు మోయించే వారు. ఈ ఉద్యాన వనాలు ఆనాడు దానియేలు జ్ఞానము ద్వారా కట్టబడి ఉంటాయి అని పండితులు చెప్తారు. ఐన్‌స్టైన్ యూదుడు, గొప్ప శాస్త్రవేత్త. యూదులలో ఎంతోమంది నోబెల్ ప్రైజ్ పొందిన శాస్త్రవేత్తలు ఉన్నారు. ఏ గొప్ప కార్యము జరిగినా యూదుల ద్వారా జరిగింది. యూదుల ద్వారానే రక్షణ అని యేసుప్రభువు కూడా అన్నాడు.

ఇలాంటి యూదులను తప్పు చేసినందున దేవుడు చెరకు పంపించాడు. వారు వారి స్త్రీలు కూడా యేడ్చుచున్నారు. మనకు కూడా అన్ని పరిస్థితులు బాగుంటే ప్రార్థన రాదు. దుఖము వస్తే ప్రార్థన వస్తుంది. అంతకు ముందు స్త్రీలు తమ్మూజు దేవతకు పిండి వంటలు చేసేవారు. ఇప్పుడు దుఃఖముతో సీయోనును జ్ఞాపకము చేసుకుని ఏడుస్తున్నారు.

అచ్చట మనలను చెరగొన్నవారు ఒక కీర్తన పాడుడి అనిరి. మనలను బాధించిన వారు సీయోను కీర్తనలలో ఒక దానిని మాకు వినిపించుడి అని మన వలన ఉల్లాసము గోరిరి. ఉల్లాసము కొరకు మన దేవుని కీర్తనలు పాడ కూడదు. ఇవి ఆత్మీయ పాటలు.

**4-6వ. యెరూషలేమును, మరువక యుండుట - హెచ్చుగా ఎంచుట:-** అన్యుల దేశములో యెహోవా కీర్తనలు మనమెట్లు పాడుదుము? అంటే పాడే చోటు ప్రత్యేకమైందిగా

ఉండాలి. పవిత్రమైనదిగా ఉండాలి. యెరూషలేమా, నేను నిన్ను మరచిన యెడల నా కుడిచేయి తన నేర్పు మరచును గాక. యూదులు ఎంతో నేర్పు గలవారు. శిక్ష వచ్చినపుడు నిన్ను మరవము అంటున్నారు. సాధారణముగా బైబిల్ స్టడీ, విజ్ఞాపన, సువార్త కూడికలు మరచి పోతాము. శ్రమలు వస్తే అన్ని జ్ఞాపకానికి వస్తాయి. అది కూడా మంచిదే. శ్రమలు వస్తే కొందరు దేవుని విడిచి వెళ్ళిపోతారు.

యెరూషలేమా, నేను నిన్ను జ్ఞాపకము చేసికొనని యెడల, నా ముఖ్య సంతోషము కంటె నేను యెరూషలేమును హెచ్చుగా ఎంచని యెడల నా నాలుక నా అంగిటికి అంటుకొనును గాక. అన్నిటికంటే యెరూషలేమును (అంటే సంఘము) హెచ్చుగా ఎంచుతాము అని తీర్మానం చేసుకుంటున్నారు. మన జీవితాల్లో అన్నిటికంటే సంఘము గొప్పదిగా ఎంచుదుము గాక. మనకు ముఖ్య సంతోషాలు ఏవి? ఆరాధన, ఇంకో ముఖ్య సంతోషమైన పని ఒకే సమయములో ఉంటే దేనికి ప్రాముఖ్యతనిస్తాము. దేవునికే ప్రాముఖ్యత నిచ్చే తీర్మానం చేయుదుము గాక.

**7-9వ. ఎదోము, బబులోను పాడుచేయ బడుట:-** యెహోవా, ఎదోము జనులు చేసినది జ్ఞాపకము చేసికొనుము, యెరూషలేము పాడైన దినమును జ్ఞాపకమునకు తెచ్చుకొనుము. దానిని నాశనముచేయుడి సమూల ధ్వంసము చేయుడి అని వారు చాటిరి గదా. ఎదోము అంటే ఏశావు.ఏశావు యాకోబు అన్నదమ్ములు. దాయాదులే. వీరి చెరకు కారణమయ్యారు.కనుక వారిని నాశనము చేయమని ప్రార్థిస్తున్నారు.

పాడు చేయబడబోవు బబులోను కుమారీ, నీవు మాకు చేసిన క్రియలనుబట్టి నీకు ప్రతికారము చేయువాడు ధన్యుడు. నీ పసిపిల్లలను పట్టుకొని వారిని బండకు వేసి కొట్టువాడు ధన్యుడు. ఇశ్రాయేలీయులు చెరలో ఉన్నపుడు వీరి పిల్లలను కనికరము లేకుండా చంపారేమో అందుకు బబులోను వారికి అలాగే ప్రతీకారము చేయమని ప్రార్థిస్తున్నారు. అయితే మనము ఈనాడు ఇలాంటి ప్రార్థన చేయకూడదని నేర్పించబడ్డాము. నీ పొరుగు వాని ప్రేమించి, నీ శత్రువును ద్వేషించుమని చెప్పబడిన మాట మీరు విన్నారు గదా. నేను మీతో చెప్పునదేమనగా, మీరు పరలోకమందున్న మీ తండ్రికి కుమారులై యుండునట్లు మీ శత్రువులను ప్రేమించుడి. మిమ్మును హింసించు వారి కొరకు ప్రార్థన చేయుడి. (మత్త5:43-44) ఇలాగు ప్రార్థించుదము గాక!

## 138 వ. కీర్తన (3 + 3 + 2 = 8వ.)

**అంశము:- దేవునికి స్తుతి.**

**1-3వ. రాజైన దావీదు స్తుతి:-** 1వ. నేను నా పూర్ణహృదయముతో నీకు కృతజ్ఞతా స్తుతులు చెల్లించుచున్నాను. మనము పెదవులతో స్తుతించవచ్చు. ఈ ప్రజలు తమ పెదవులతో నన్ను ఘనపరచుదురు గాని వారి హృదయము నాకు దూరముగా ఉన్నది అని మత్త 15:7 సెలవిస్తుంది దావీదు అయితే పూర్ణ హృదయముతో స్తుతిస్తున్నాడు మనమెట్లు? దేవతల యెదుట నిన్ను కీర్తించెదను. అన్య దేవతల విశ్వాసుల ముందుకూడా మనము ధైర్యముగాప్రభువును స్తుతించాలి. 2వ. నీ పరిశుద్ధాలయముతట్టు నేను నమస్కారము చేయుచున్నాను. దావీదు కాలానికి ఆలయము లేదు అయినా ఉన్నట్లే స్తుతిస్తున్నాడు. భవిష్యత్తులో మందిరము సొలొమోను కట్టిస్తాడని ఎరిగి స్తుతి చెల్లిస్తున్నాడు. కనుక ఇది ప్రవచన కీర్తన కూడా. నీ నామమంతటికంటె నీవిచ్చిన వాక్యమును నీవు గొప్ప చేసియున్నావు. దేవుని పేరు కంటే ఆయన వాక్యమును ఎక్కువ హెచ్చించి ఉన్నాడు. కనుక దేవుని వాక్యాన్ని మనము ఎంతో గౌరవించాలి. ఆయన నామమును స్తుతించాలి. సుతించేటప్పుడు ఆయన నామమును పాటించేటప్పుడు ఆయన వాక్యమును హెచ్చించాలి. పౌలు అంతటివాడు దేవుని వాక్యాన్ని చెప్పినా బెరయ కాపురస్తులు ఆవాక్యము అలా ఉన్నదో లేదో అని పరిశీలించారు. బోధకులు కాదు ముఖ్యం దేవుని వాక్యము ప్రాముఖ్యం. నీ కృపాసత్యములను బట్టి నీ నామమునకు కృతజ్ఞతాస్తుతులు నేను చెల్లించెదను. ఆయన కృప పాపిని ఉచితముగా రక్షించేది. ఆయన సత్యము పాపమును భరించేది. ఆయన పాపమునకు వచ్చు జీతము మరణము అన్నాడు గనుక మరణమునుంచి విడిపించడానికి తన్నుతాను అప్పగించుకొన్నాడు మరణించాడు. కలుగును గాక అంటే సమస్తము కలిగియున్నవి. పాపము పోవునుగాక అంటే పోతుంది కానీ అది ఆయన సత్యమునకు విరుద్ధం అందుకే ఆయన చనిపోయాడు. 3వ. నేను మొఱ్ఱపెట్టిన దినమున నీవు నాకు ఉత్తరమిచ్చితివి. నా ప్రాణములో త్రాణ పుట్టించి నన్ను ధైర్యపరచితివి.మొరపెడితే ఉత్తరం ఇచ్చేవాడు ధైర్యపరిచే వాడు కాబట్టి మనకు ఎన్ని శ్రమలు వచ్చిన మొరపెడదాం ధైర్యపరుస్తాడు.

**4-6వ. భూ రాజుల స్తుతి:-** 4వ. యెహోవా, భూరాజులందరు నీవు సెలవిచ్చిన మాటలువిని నీకు కృతజ్ఞతాస్తుతులుచెల్లించెదరు.నెబుకద్నెజరు, కోరేషులాంటి రాజులు ప్రభువుని స్తుతించారు. 5వ. వారు యెహోవా మహాప్రభావము గలవాడని వారు యెహోవా మార్గములనుగూర్చి గానము చేశారు. 6వ.యెహోవా మహోన్నతుడైనను ఆయన దీనులను లక్ష్యపెట్టును ఆయన దూరము నుండి గర్విష్ఠులను బాగుగా ఎరుగును. గర్వము అతిశయము

దేవుని ఎదుట పనికిరాదు  దీనత్వము ఆయన ఎదుట మనలను హెచ్చిస్తుంది. నేను సాత్వికుడును దీనమనసు  కలవాడను అన్నాడు. కనుక దీనమనసు గల వారికి ఆయన దగ్గర చోటున్నది.

**7-8వ. దావీదుకు దేవుని యందున్న విశ్వాసము:-** 7. నేను ఆపదలలో చిక్కుబడి యున్నను నీవు నన్ను బ్రదికించెదవు నా శత్రువుల కోపము నుండి నన్ను రక్షించుటకై నీవు నీచేయి చాపెదవు నీ కుడిచేయి నన్ను రక్షించును.

దావీదుకు వచ్చిన ఆపదలు ఇన్ని అన్ని కావు అన్నిటిలో నుండి దేవుడు కాపాడాడు.ఆ దేవుడే మనలను కాపాడుతాడు. వెనుకను ముందును నీవు నన్ను ఆవరించియున్నావు నీ చేయి నా మీద ఉంచియున్నావు. కీర్త139:5 అని ధైర్యముగా చెప్పుకొందుము గాక.

8. యెహోవా నా పక్షమున కార్యము సఫలము చేయును. యెహోవా, నీ కృప నిరంతరముండును నీ చేతికార్యములను విడిచిపెట్టకుము. క్రీస్తును నమ్మిన వారి జీవితాలు సుఖాంతమవుతాయి. పౌలు పత్రికలన్నీ కృపతో మొదలై కృపతో అంతమవుతాయి. అంటే అంతము వరకు ఆయన కృప తోడుగా ఉంటుందని అర్ధము.

## 139 వ. కీర్తన (6 + 6 + 6 + 6 = 24వ.)

### 1-6వ.  సర్వజ్ఞానియైన దేవుడు.

7-12వ. సర్వాంతర్యామియైన దేవుడు. 13-18వ. సర్వశక్తిమంతుడైన దేవుడు. 19-24వ. భక్తిహీనులకు దేవుడు చేయు తీర్పు.

**1-6వ. సర్వజ్ఞానియైన దేవుడు:-** 1 యెహోవా, నీవు నన్ను పరిశోధించి తెలిసి కొనియున్నావు. శాస్త్రజ్ఞులు అనేక విషయాలు పరిశోధన చేస్తున్నారు. మనుషులను  పరిశోధన చేసే వాడు ప్రభువు. 2-3వ. నేను కూర్చుండుట నేను లేచుట నీకు తెలియును. నాకు తలంపు పుట్టకమునుపే నీవు నా మనస్సు గ్రహించుచున్నావు. నా నడకను నా పడకను నీవు పరిశీలన చేసియున్నావు, నా చర్యలన్నిటిని నీవు బాగుగా తెలిసికొనియున్నావు.మన ప్రవర్తన అంతా ఆయనకు తెలుసు.మనము కూర్చుండుట లేచుట నడక పడక మనస్సు సమస్తము ఎరిగిన దేవుడు.అంటే సర్వజ్ఞాని  4-6వ. యెహోవా మాట నా నాలుకకు రాక మునుపే అది నీకు పూర్తిగా తెలిసియున్నది. వెనుకను ముందును నీవు నన్ను ఆవరించియున్నావు. నీ చేయి నా మీద ఉంచియున్నావు. ఇట్టి తెలివి నాకు మించినది. అది అగోచరము అది నాకందదు. ఆయన సర్వజ్ఞానాన్ని కొంచెం కూడా గ్రహించలేము.

**7-12వ. సర్వాంతర్యామియైన దేవుడు:-** 7-10 వ. నీ ఆత్మయొద్దనుండి నేనెక్కడికి

పోవుదును? నీ సన్నిధినుండి నేనెక్కడికి పారిపోవుదును? నేను ఆకాశమున కెక్కినను నీవు అక్కడను ఉన్నావు నేను పాతాళమందు పండుకొనినను నీవు అక్కడను ఉన్నావు. నేను వేకువ రెక్కలు కట్టుకొని సముద్ర దిగంతములలో నివసించినను అక్కడను నీ చేయి నన్ను నడిపించును నీ కుడిచేయి నన్ను పట్టుకొనును ఆకాశానికి ఎక్కిన పాతాళానికి దిగిన సముద్ర దిగంతములలో నివసించిన ఆయన ఉన్నాడు అంటే ఆయన సర్వాంతర్యామి.

11-12వ. అంధకారము నన్ను మరుగుచేయును నాకు కలుగు వెలుగు రాత్రివలె ఉండును అని నేననుకొనిన యెడల చీకటియైనను నీకు చీకటి కాకపోవును. రాత్రి పగటివలె నీకు వెలుగుగా ఉండును. చీకటియు వెలుగును నీకు ఏకరీతిగా ఉన్నవి. ఇట్టి సర్వాంతర్యామి నుండి మనము ఎక్కడకు వెళ్ళగలము.

**13-18వ. సర్వ శక్తిమంతుడైన దేవుడు:-**13-16వ. నా అంతరింద్రియములను నీవే కలుగజేసితివి. నా తల్లి గర్భమందు నన్ను నిర్మించినవాడవు నీవే. నీవు నన్ను కలుగజేసిన విధము చూడగా భయమును ఆశ్చర్యమును నాకు పుట్టుచున్నవి అందును బట్టి నేను నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాను. నీ కార్యములు ఆశ్చర్యకరములు. ఆసంగతి నాకు బాగుగా తెలిసియున్నది. నేను రహస్యమందు పుట్టిననాడు భూమియొక్క అగాధస్థలములలో విచిత్రముగా నిర్మింపబడిననాడు నాకు కలిగిన యెముకలును నీకు మరుగై యుండలేదు.

నేను పిండమునై యుండగా నీ కన్నులు నన్ను చూచెను నియమింపబడిన దినములలో ఒకటైన కాకమునుపే నా దినములన్నియు నీ గ్రంథములో లిఖితములాయెను. మనలను నిర్మించిన విధం ఇక్కడ కనబడుతుంది. అది తలచుకున్నపుడు భయమును ఆశ్చర్యమును కలుగుచున్నవి. అంటే సర్వశక్తి గల దేవుడు. 17-18వ.దేవా, నీ తలంపులు నా కెంత ప్రియమైనవి. వాటి మొత్తమెంత గొప్పది.వాటిని లెక్కించెద ననుకొంటినా అవి యిసుక కంటె లెక్కకు ఎక్కువైయున్నవి. నేను మేల్కొంటినా యింకను నీయొద్దనే యుందును.

కీర్తన 40:5,యిర్మి 29:11.

**19-24వ.భక్తిహీనులకు దేవుడు చేయుతీర్పు:-**19-20 దేవా,నీవుభక్తిహీనులను నిశ్చయముగా సంహరించెదవు. నరహంతకులారా, నాయొద్దనుండి తొలగిపోవుడి వారు దురాలోచనతో నిన్ను గూర్చి పలుకుదురు. మోసపుచ్చుటకై నీ నామముబట్టి ప్రమాణము చేయుదురు. భక్తిహీనుల పలుకు ప్రమాణము చెప్పబడింది అట్టివారిని దేవుడు సంహరిస్తాడు. 21-22వ.యెహోవా, నిన్ను ద్వేషించువారిని నేనును ద్వేషించుచున్నానుగదా? నీ మీద లేచువారిని

నేను అసహ్యించుకొనుచున్నాను గదా? వారియందు నాకు పూర్ణ ద్వేషము కలదు వారిని నాకు శత్రువులనుగా భావించుకొనుచున్నాను. కానీ ఇప్పుడు మనము ద్వేషించకూడదు. 23-24వ. దేవా,నన్ను పరిశోధించి నా హృదయమును తెలిసికొనుము. నన్ను పరీక్షించి నా ఆలోచనలను తెలిసికొనుము. నీకాయాసకరమైన మార్గము నాయందున్నదేమో చూడుము. నిత్యమార్గమున నన్ను నడిపింపుము. ఇది ఎంత మంచి ప్రార్థన మనము చేయుదుము గాక!

## 140వ. కీర్తన (3 + 2 + 3 + 3 + 2 = 13వ.)

**అంశము :- బలత్కారుల చేతి నుండి విడిపింపుమని చేసిన ప్రార్థన.**

సందర్భము:- దావీదునకు జీవిత కాలమంతయు దుష్టులు, భక్తి హీనులు ఇంటిలో, సమాజములో, రాజనగరులో నుండిరి. మొదట రాజైన సౌలు, దావీదు రాజైనపిమ్మట రాజ నగరులో మంత్రియగు ఆహీతోపెలు, సమాజములో షిమి, దోయేగు ఇంటిలో అబ్షాలోము మొదలగు దుష్టులు, భక్తిహీనులు దావీదును బాధించుచుండిరి. కనుక ఈ కీర్తన బలత్కారుల చేతి నుండి, విడిపింపుమని దావీదు చేసిన ప్రార్థన.

పీఠిక:- చివరి కీర్తనలు. 138-150 వరకు దావీదు గారు వ్రాసినట్లు చూడగలము. 140-143 వరకు ప్రార్థన 144-150 వరకు స్తుతి కలవు. ఎందుకు ప్రార్థన? మీలో ఎవనికైనను శ్రమ సంభవించెనా? అతడు ప్రార్థన చేయవలెను. ఎవని కైనను సంతోషము కలిగెనా? అతడు కీర్తన పాడవలెను. (యాకో 5:13) భక్తిహీనుల ద్వారా శ్రమలు వచ్చాయి గనుక దావీదు ప్రార్థన చేస్తున్నాడు.

**1-3వ. దుష్టుల బలాత్కారము,అపాయముల నుండి విడిపించుమని ప్రార్థన:-** 1.యెహోవా, దుష్టుల చేతిలో నుండి నన్ను విడిపింపుము. బలాత్కారము చేయువారి చేతిలో పడకుండ నన్ను కాపాడుము. 2.వారు తమ హృదయములలో అపాయకరమైన యోచనలు చేయుదురు. వారు నిత్యము యుద్ధము రేప జూచుచుందురు. 3. పామునాలుకవలె వారు తమ నాలుకలు వాడి చేయుదురు వారి పెదవులక్రింద సర్పవిషమున్నది. దుష్టుల బలత్కారుల లక్షణాలు వ్రాయబడ్డాయి. అపాయకరమైన యోచనలతో నిత్యము యుద్ధము చేస్తారు. పాము నాలుకలు కలిగిఉంటారు. వీరినుంచి విడిపించమని భక్తుడు ప్రార్థనచేస్తున్నాడు.

**4-5వ. గర్విష్టులు, భక్తిహీనుల చేతిలో పడకుండ కాపాడుమని ప్రార్థన:-** 4.యెహోవా,

భక్తిహీనుల చేతిలోపడకుండ నన్ను కాపాడుము. బలాత్కారము చేయువారి చేతిలో నుండి నన్ను రక్షింపుము. నేను అడుగు జారిపడునట్లు చేయుటకు వారు ఉద్దేశించుచున్నారు. 5. గర్విష్ఠులు నా కొరకు ఉరిని త్రాళ్లను చాటుగా ఒడ్డియున్నారు. వారు త్రోవప్రక్కను వల పరచియున్నారు. నన్ను పట్టుకొనుటకై ఉచ్చుల నొగ్గియున్నారు. భక్తిహీనులచేతిలోపడకుండ,గర్విష్ఠుల ఉచ్చులో పడకుండా రక్షింపుము అని ప్రార్థిస్తున్నాడు.

**6-8వ. యెహోవా, నీవే నా దేవుడవని విజ్ఞాపన చేయుట:-** 6.అయినను నేను యెహోవాతో ఈలాగు మనవి చేయుచున్నాను. యెహోవా, నీవే నా దేవుడవు నా విజ్ఞాపనలకు చెవియొగ్గుము. 7.ప్రభువైన యెహోవా నా రక్షణ దుర్గము యుద్ధదినమున నీవు నా తలను కాయుదువు. 8.యెహోవా, భక్తిహీనుల కోరికలను తీర్చకుము వారు అతిశయించకుండునట్లు వారి ఆలోచనను కొనసాగింపకుము. అయినను ఎన్ని శ్రమలు ఉన్నను యెహోవా, నీవే నా దేవుడవు నా విజ్ఞాపనలకు చెవియొగ్గుము.నా రక్షణ దుర్గము నీవే. భక్తిహీనుల ఆలోచనను కొనసాగింపకుము అని వేడుకుంటున్నాడు. మన వేడుకోలు అదే అయి ఉండాలి.

**9-11వ. తనను చుట్టుకొనువారు పడద్రోయబడవలెనని ప్రార్థన:-** 9.నన్ను చుట్టుకొనువారు తలయెత్తిన యెడల వారి పెదవుల చేటు వారిని ముంచును గాక 10. కణకణలాడు నిప్పులు వారి మీద వేయబడును గాక. వారు తిరిగి లేవ కుండునట్లు అగ్నిగుండములో వారు కూల్చబడుదురుగాక. అగాధ జలములలోనికి త్రోయబడుదురు గాక. 11. కొండెములాడువారు భూమి మీద స్థిరపడ కుందురుగాక ఆపత్తు బలాత్కారులను తరిమి వారిని పడద్రోయును గాక. దుష్టులకు పైరకమైన శిక్షలు కలగాలని ప్రార్థిస్తూ ఉన్నాడు. ఇప్పుడైతే మనము దుష్టులు రక్షించబడాలని ప్రార్థించాలి.

**12-13వ. యెహోవాయందు నమ్మకము, కృతజ్ఞతాస్తుతి. :-**12.బాధింపబడు వారిపక్షమున యెహోవా వ్యాజ్యెమాడుననియు దరిద్రులకు ఆయన న్యాయము తీర్చుననియు నేనెరుగుదును. 13.నిశ్చయముగా నీతిమంతులు నీ నామమునకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించెదరు యథార్థవంతులు నీ సన్నిధిని నివసించెదరు. బాధించబడిన వారు నీతిమంతులు యథార్థవంతులు దేవుని సన్నిధిలో నివసిస్తారు అని భక్తుడు చెబుతున్నాడు. నీతిమంతులు ఎవరు? దుష్టులు ఎవరు? రోమీయులకు 3:11 నీతిమంతుడు లేడు, ఒక్కడును లేడు గ్రహించు వాడెవడును

లేడు దేవుని వెదకువాడెవడును లేడు రోమీయులకు 3:23-24ఏ భేదమును లేదు. అందరును పాపముచేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు. కాబట్టి నమ్మువారు ఆయన కృపచేతనే, క్రీస్తుయేసు నందలి విమోచనము ద్వారా ఉచితముగా నీతిమంతులని తీర్చబడుచున్నారు. స్వభావసిద్ధంగా నీతిమంతులు కానీ పరిశుద్ధులు కానీ లేరు. కేవలం యేసు క్రీస్తును హృదయపూర్వకంగా నమ్ముకోవడం ద్వారా నీతిమంతులు అవుతున్నారు. మీరు అయ్యారా లేదా పరిశీలించుకోండి!

## 141 వ. కీర్తన (2+2+2+2+2=10వ.)

**అంశము-సందర్భము:-** బహుశ దావీదు సౌలుతో శ్రమలలో ఉన్నపుడు వ్రాసినది (1 సమూ 24, 26అ.).మొరపెట్టు,మొరపెట్టు చుండగా, ప్రార్థన, ప్రార్థన ఇలా ఒకటి రెండు వచనాలు లోనే కనపడుతుంది కనుక ఇది ప్రార్థన కీర్తన.

**1-2వ. మొఱ్ఱకు చెవి యొగ్గుమని ప్రార్థన:-** 1. యెహోవా నేను నీకు మొఱ్ఱపెట్టు చున్నాను నా యొద్దకు త్వరపడి రమ్ము నేను మొఱ్ఱపెట్టగా నా మాటకు చెవి యొగ్గుము. 2. నా ప్రార్థన ధూపమువలెను నేను చేతులెత్తుట సాయంకాల నైవేద్యము వలెను నీ దృష్టికి అంగీకారములగును గాక. త్వరపడి రమ్మని మాటకు చెవి యొగ్గమని వేడుకుంటూ ఉన్నాడు. పాతనిబంధనలోని ధూపానికి, నైవేద్యానికి వ్యాఖ్యానము చెప్పబడింది. మనకు ప్రార్తనే ధూప దీప నైవేద్యాలు. పాతనిబంధన ఎంతో సరళతరం చేయబడింది.

**3-4వ. నోటికి పెదవులకు,మనసుకు కావలియుంచుమని ప్రార్థన:-** 3. యెహోవా, నా నోటికి కావలియుంచుము నా పెదవుల ద్వారమునకు కాపు పెట్టుము. 4.పాపము చేయువారితో కూడ నేను దుర్నీతికార్యములలో చొరబడకుండునట్లు నా మనస్సు దుష్కార్యమునకు తిరుగనియ్యకుము వారి రుచిగల పదార్థములు నేను తినక యుందును గాక. శ్రమలలో ఉన్నపుడు నోటితో ఇతరులమీద దేవునిమీద ఆయాసకరమైన మాటలు మాట్లాడుతాము. అందుకే భక్తుడు నోటికి కాపు ఉంచమన్నాడు. మనస్సు అంటే హృదయము కూడా దుష్కార్యము చేయ వచ్చు అలా తిరగకుండా ప్రార్థన చేసుకోవాలి. తిండి వల్ల ఎన్నో పాపాలు జరిగాయి.అందుకే తినడములో కూడా జాగ్రత్తగా ఉండాలి.

**5-6వ. నీతిమంతులు కొట్టుట ద్వారా దిద్దబడవలెనని కోరుట:-** 5. నీతిమంతులు

నన్ను కొట్టుట నాకు ఉపకారము వారు నన్ను గద్దించుట నాకు తైలాభిషేకము నేను అట్టి అభిషేకమును త్రోసివేయకుందును గాక. వారి దుష్ట క్రియలను చూచి నేను తప్పక ప్రార్థనచేయు చున్నాను. 6. వారి న్యాయాధిపతులు కొండ పేటు మీద నుండి పడద్రోయబడుదురు. కావున జనులు నామాటలు మధురమైనవని వాటిని అంగీకరించుచున్నారు. నీతిమంతుల గద్దింపు తైలాభిషేకంగా ఎంత మంది భావిస్తారు. దావీదు అలా భావించాడు. ఎంత గొప్ప మనసో కదా. మనము అలాంటి మనసును కలిగి ఉందుము గాక!

**7-8వ. శ్రమలలో ఉన్నవారి ప్రాణము కొరకు ప్రార్థించుట.:-** 7. ఒకడు భూమిని దున్నుచు దానిని పగులగొట్టునట్లు మాయెముకలు పాతాళద్వారమున చెదరి యున్నవి. 8. యెహోవా, నా ప్రభువా, నా కన్నులు నీతట్టు చూచుచున్నవి నీ శరణు జొచ్చియున్నాను నాప్రాణము ధారపోయకుము. భూమి పగిలినట్లు ఎముకలు పగిలిపోయే శ్రమ వచ్చింది. అయినా నా కన్నులు శ్రమతట్టు కాక నీ తట్టు చూస్తున్నవి. మన శ్రమ ఎంతైనా మన ప్రార్థన ఇలా ఉండాలి.

**9-10వ. భక్తి హీనుల వలలో చిక్క కుండవలెనని ప్రార్థన.:-** 9. నా నిమిత్తము వారు ఒడ్డిన వల నుండి పాపము చేయువారి ఉచ్చుల నుండి నన్ను తప్పించి కాపాడుము. 10. నేను తప్పించుకొని పోవుచుండగా భక్తిహీనులు తమ వలలలో చిక్కుకొందురు గాక. భక్తి హీనులు వలలు ఉచ్చులు ఒడ్డుతారు. తప్పించమని ప్రార్థన. మనము అలాంటి ప్రార్థన చేసుకుందుము గాక!

## 142 వ కీర్తన (2+2+2+1=7వ.)

### అంశము:- గుహలో ఉన్నపుడు దావీదు చేసిన ప్రార్థన.

దైవ ధ్యానము. - తరుము వారి నుండి తప్పించు మని ప్రార్థన.

1-2వ. ఎలుగెత్తి, బహు వినయముగా దేవుని సన్నిధిని మొఱ్ఱ పెట్టుట. 3-4వ. క్రుంగి నపుడు మొరపెట్టుట. 5-6వ. తరుము వారి నుండి విడిపింపుమని ప్రార్థన. 7వ. స్తుతి.

**1-2వ. ఎలుగెత్తి, బహు వినయముగా దేవుని సన్నిధిని మొఱ్ఱపెట్టుట:-** 1వ. నేను ఎలుగెత్తి యెహోవాకు మొరలిడుచున్నాను. ఎలుగెత్తి యెహోవాను బతిమాలు కొనుచున్నాను.

2వ. బహు వినయముగా ఆయన సన్నిధిని నేను మొఱ్ఱపెట్టుచున్నాను. నాకు కలిగిన బాధ ఆయన సన్నిధిని తెలియజెప్పుకొనుచున్నాను. దావీదు ఒంటరిగా ఉన్నప్పటికీ, అతను బిగ్గరగా ప్రార్థిస్తున్నాడు. ప్రార్థనలు గుహగుండా ప్రతిధ్వనిస్తున్నాయి. అతను తన ఫిర్యాదును ప్రభువు ముందు కుమ్మరిస్తున్నాడు అతను కోపంగా లేడు, ఆగ్రహంతో లేడు, వినయముతో తన కష్టాలు మరియు దుఖము గురించి ప్రభువుకు చెప్పాలనుకుంటున్నాడు.

**3-4వ. క్రుంగినపుడు మొఱ్ఱపెట్టుట.:-** 3వ. నాలో నా ప్రాణము క్రుంగియున్నప్పుడు నా మార్గము నీకు తెలియును నన్ను పట్టుకొనుటకై నేను నడువవలసిన త్రోవలో చాటుగా పగవారు ఉరినొడ్డుచున్నారు. 4వ. నాకుడిప్రక్కను నిదానించి చూడుము. నన్నెరిగినవాడు ఒకడును నాకు లేకపోయెను. ఆశ్రయమేదియు నాకు దొరకలేదు. నాయెడల జాలి పడువాడు ఒకడును లేడు. దావీదు శత్రువులు ఎల్లప్పుడూ బెదిరిస్తున్నారు. అతను నడిచే దారిలో ఉరులను ఏర్పాటు చేస్తున్నారు. అతను కుడి వైపు చూసినప్పుడు ఉత్తరవాది గాని ఆదరణకర్త గాని ఎవరూ లేరు. అందరూ ఉదాసీనంగా కనిపిస్తున్నారు. అతని జీవితాన్ని ఎవరూ పట్టించుకోలేదు. “నా ప్రాణాన్ని ఎవరూ పట్టించుకోరు”, అనే వేదన దావీదుకుంది.ప్రాణము కృంగియున్నది. అయినా దేవుని సహాయము దావీదుకున్నట్లు ఒంటరి అయి దుఖించే వారి యెడల దేవుని సహాయము ఉంది.

**5-6వ. తరుము వారి చేతిలో నుండి విడిపింపుమని ప్రార్థన.:-** 5వ. యెహోవా, నీకే నేను మొఱ్ఱపెట్టుచున్నాను నా ఆశ్రయదుర్గము నీవే సజీవులున్న భూమి మీద నా స్వాస్థ్యము నీవే అని నేననుకొంటిని. 6వ. నేను చాలా క్రుంగియున్నాను నా మొఱ్ఱకు చెవియొగ్గుము. నన్ను తరుమువారు నాకంటె బలిష్ఠులు వారి చేతిలో నుండి నన్ను విడిపింపుము. నాకు ఎవరు దిక్కులేరు. యోహోవా నీకే మొరపెట్టుచున్నాను, నేను చాలా క్రుంగియున్నాను, నా మొఱ్ఱకు చెవి యొగ్గుము. నన్ను తరుమువారు నాకంటె బలిష్ఠులు వారి చేతిలో నుండి నన్ను విడిపింపుము. మనకంటే శత్రువులు బలవంతులైనపుడు మన బలము యెహోవాయే.

**7వ. స్తుతి:-** నేను నీ నామమునకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించునట్లు చెరసాలలో నుండి నా ప్రాణమును తప్పింపుము అప్పుడు నీవు నాకు మహోపకారము చేసియుండుట చూచి నీతిమంతులు నన్ను బట్టి అతిశయపడుదురు.చెరసాల అంటే ప్రస్తుతము తానున్న గుహ. ఈ

గుహ నుండి విడిపించుము. నా ప్రాణమును తప్పించుము. అందుకు కృతజ్ఞతాస్తుతులు చెల్లిస్తాను. నీవు చేసిన మహోపకారమును నీతిమంతులు చూసి నన్ను బట్టి అతిశయపడుతారు. మనకు చేసిన మహోపకారం రక్షణ.రక్షణను బట్టి స్తుతించినపుడు అందరికీ అతిశయం కలుగుతుంది.

## 143 వ కీర్తన (3 + 3 + 2 + 2 + 2 =12వ)

**అంశము - సందర్భము:- బహుశ దావీదు సౌలుతో/అబ్షాలోముతో శ్రమలలో ఉన్నపుడు వ్రాసినది.**

**1-3వ. ప్రార్థన -** విన్నపము. 4-6వ. ఆత్మలో క్రుంగినపుడు దేవుని కొరకు కనిపెట్టుట 7-8వ. ఆత్మ క్షీణించుచున్నపుడు త్వరగా ఉత్తరమిమ్మని ప్రార్థన. 9-10వ. శత్రువుల చేతిలో నుండి త్వరగా విడిపించుమని ప్రార్థన. 11-12వ. నీ నామమును బట్టి బ్రతుకుట నేర్పుమని ప్రార్థన.

**1-3వ. ప్రార్థన - విన్నపము:-** 1వ. యెహోవా, నా ప్రార్థన ఆలకింపుము. నా విన్నపములకు చెవి యొగ్గుము నీ విశ్వాస్యతను బట్టియు నీ నీతిని బట్టియు నాకు ఉత్తరమిమ్ము. 2వ. నీ సేవకునితో వ్యాజ్యెమాడకుము సజీవులలో ఒకడును నీ సన్నిధిని నీతిమంతుడుగా ఎంచబడడు. 3వ. శత్రువులు నన్ను తరుముచున్నారు. వారు నా ప్రాణమును నేల పడగొట్టు చున్నారు చిరకాలము క్రిందట చనిపోయిన వారితోపాటు గాఢాంధకారములో నన్ను నివసింపజేయు చున్నారు.

దేవా నా ప్రార్థన ఆలకించుము. నా విన్నపములు వినుము. నా విశ్వాసమును నా నీతిని బట్టి కాకుండా నీ విశ్వాసమును నీ నీతిని బట్టి నాకు సహాయము చేయుము. నాతో వాదించ వద్దు స్వామి అలాగా వాదిస్తే ఎవరు నీ సన్నిధిలో నిలవ గలరు నీతిమంతుడు ఒక్కడు లేడు కదా.

**4-6వ. ఆత్మలో క్రుంగినపుడు దేవుని కొరకు కనిపెట్టుట:-** 4వ. కావున నా ఆత్మ నాలో క్రుంగియున్నది. నాలో నా హృదయము విస్మయమొందెను. 5వ. పూర్వదినములు జ్ఞాపకము చేసికొనుచున్నాను నీ క్రియలన్నియు ధ్యానించుచున్నాను. నేను నీ చేతుల పని యోచించుచున్నాను. 6వ. నీ తట్టు నా చేతులు చాపుచున్నాను ఎండిపోయిన భూమివలె నా ప్రాణము నీ కొరకు ఆశ పడుచున్నది. నా ఆత్మ కృంగిపోయి ఉన్నది. నా హృదయము విస్మయం చెందుతున్నది. నేను

ఎండిపోయిన భూమివలె నా ప్రాణం మీ కొరకు ఆశపడుచున్నది. పూర్వదినములు జ్ఞాపకము చేసుకొని నీ క్రియలను నేను ధ్యానము చేస్తూ నీతట్టు  నా చేతులు చాపుతున్నాను.

**7-8వ. ఆత్మ క్షీణించుచున్నపుడు త్వరగా ఉత్తరమిమ్మని ప్రార్థన:-** 7వ. యెహోవా, నా ఆత్మ క్షీణించుచున్నది త్వరగా నాకు ఉత్తరమిమ్ము నేను సమాధిలోనికి దిగు వారివలె కాకుండునట్లు నీ ముఖమును నాకు మరుగు చేయకుము. 8వ.నీయందు నేను నమ్మిక యుంచియున్నాను. ఉదయమున నీ కృపావార్త నాకు వినిపింపుము. నీ వైపు నా మనస్సు నే నెత్తికొనుచున్నాను. నేను నడువవలసిన మార్గము నాకు తెలియ జేయుము. నా ఆత్మ క్షీణించు చున్నది త్వరగా ఉత్తరం ఇమ్ము. ప్రభువా సమాధి లోనికి పంపవద్దు. నీ యందు నేను నమ్మకముంచి ఉన్నాను. నీ ముఖము నాకు మరుగు చేయకుము. నీ మార్గము నాకు తెలియజేయుము. ఇది మనమందరము అనుదినము చేసుకోవలసిన ప్రార్థన అని కొందరు వేదాంతులు చెబుతారు.

**9-10వ. శత్రువుల చేతిలో నుండి త్వరగా విడిపించుమని ప్రార్థన:-** 9వ. యెహోవా, నేను నీ మరుగు జొచ్చియున్నాను నా శత్రువుల చేతిలో నుండి నన్ను విడిపింపుము. 10వ. నీవే నా దేవుడవు నీ చిత్తానుసారముగా ప్రవర్తించుటకు నాకు నేర్పుము. దయగల నీ ఆత్మ సమభూమిగల ప్రదేశమందు నన్ను నడిపించును గాక. నా శత్రువుల చేతిలోనుండి విడిపించుము. నీవే నా దేవుడవు నీ చిత్తానుసారముగా  నడిపించుము  నీ ఆత్మ సమతుల్యతతో నన్ను నడిపించును గాక. దావీదు జీవితంలో ఎన్నో ఎగుడుదిగుడులు ఉన్నాయి, అయినా ప్రార్థన చేస్తున్నాడు.

**11-12వ.నీ నామమునుబట్టి బ్రతుకుట నేర్పుమని ప్రార్థన:-** 11వ. యెహోవా, నీ నామమునుబట్టి నన్ను బ్రదికింపుము, నీ నీతిని బట్టి నా ప్రాణమును శ్రమలో నుండి తప్పింపుము. 12వ. నేను నీ సేవకుడను నీ కృపను బట్టి నా శత్రువులను సంహరింపుము. నా ప్రాణమును బాధపరచు వారినందరిని నశింపజేయుము. దేవా నీ నామమునుబట్టి నన్ను బ్రతికించుము. నీ నీతిని బట్టి నాప్రాణమును శ్రమలనుండితప్పించుము.నీసేవకుడిని నా శత్రువులను నన్ను బాధ పరచు వారిని నశింపజేయుము. ప్రభువు మొదటి రాకడలో క్షమాపణ ప్రకటించాడు. రెండవ రాకడలో నాశనము ఉన్నది. కాబట్టి  సంఘము గురించి పాత నిబంధన భక్తులకు తెలియదు గనుక అలాగు ప్రార్థించారు.

## 144 వ కీర్తన (2 + 2 + 4 + 3 + 4 = 15వ.)

**అంశము :-స్తుతి.**

**1-2వ. దేవుని గొప్పతనము:-** నాకు ఆశ్రయదుర్గమగు యెహోవా సన్నుతింప బడునుగాక. ఆయన నా చేతులకు యుద్ధమును నావ్రేళ్లకు పోరాటమును నేర్పు వాడై యున్నాడు. ఆయన నాకు కృపానిధి నాకోట నా దుర్గము నన్ను తప్పించువాడు నా కేడెము నేనాశ్రయించువాడు ఆయన నాజనులను నాకు లోబరచువాడై యున్నాడు.

**3-4వ. ఎన్నికలేని మానవుడు:-** యెహోవా, నీవు నరులను లక్ష్యపెట్టుటకు వారు ఏపాటివారు? నీవు వారిని ఎన్నికచేయుటకు మనష్యులు ఏపాటివారు? నరులు వట్టి ఊపిరిని పోలి యున్నారు. వారి దినములు దాటిపోవు నీడవలెనున్నవి. యాకొ 5:14 మీలో ఎవడైనను రోగియై యున్నాడా? అతడు సంఘపు పెద్దలను పిలిపింపవలెను. వారు ప్రభువు నామమున అతనికి నూనెరాచి అతని కొరకు ప్రార్థనచేయవలెను.

**5-8వ. దేవుడిచ్చు విజయము:-** యెహోవా, నీ ఆకాశమును వంచి దిగి రమ్ము పర్వతములు పొగ రాజునట్లు నీవు వాటిని ముట్టుము. మెరుపులు మెరిపించి వారిని చెదరగొట్టుము. నీ బాణములు వేసి వారిని ఓడగొట్టుము. పైనుండి నీ చెయ్యి చాచి నన్ను తప్పింపుము. మహాజలములలో నుండి అన్యులచేతిలో నుండి నన్ను విడిపింపుము. వారి నోరు వట్టి మాటలాడుచున్నది. వారి కుడిచేయి అబద్ధముతో కూడియున్నది. తండ్రీ సహాయు చేయమని వేడుకోలు.

**9-11వ. విజయనికై గొప్ప స్తుతి:-** దేవా,నిన్నుగూర్చి నేనొక క్రొత్త కీర్తన పాడెదను. పది తంతుల సితారాతో నిన్ను కీర్తించెదను.నీవే రాజులకు విజయము దయ చేయువాడవు. దుష్టుల ఖడ్గమునుండి నీవు నీసేవకుడైన దావీదును తప్పించు వాడవు.నన్ను తప్పింపుము అన్యుల చేతిలోనుండి నన్ను విడిపింపుము. వారి నోరు వట్టి మాటలాడుచున్నది. వారి కుడిచేయి అబద్ధముతో కూడియున్నది. చేసిన మేలులన్నిటిని బట్టి కొత్త గీతము పాడుదును అంటున్నాడు. పెద్ద వాయిద్యముతో అంటే మనసారా పాడుదును అంటున్నాడు.

**12-15వ. సంఘమందలి కుమారులు, కుమార్తెలు, కృపావరములు, పెద్దలు, ధన్యత:-** మా కుమారులు తమ యౌవనకాలమందు ఎదిగిన మొక్కలవలె ఉన్నారు. మా కుమార్తెలు

నగరునకై చెక్కిన మూలకంబములవలె ఉన్నారు. మా కొట్లు నింపబడి పలువిధములైన ద్రవ్యములకు నిధులుగా ఉన్నవి. మా గొఱ్ఱెలు వేలకొలదిగాను పదివేల కొలదిగాను మా గడ్డి బీళ్లలో పిల్లలు వేయుచున్నవి. మా యెద్దు గొప్ప బరువులు మోయగలవి. మా వీధులలో చొరబడుట యైనను ఉరుకులెత్తుటయైనను లేదు. వాటిలో శ్రమ గలవారి మొఱ్ఱ వినబడుటయైనను లేదు. ఇట్టి స్థితిగల వారు ధన్యులు. యెహోవా తమకు దేవుడుగా గల జనులు ధన్యులు. మా కుమారులు ఎదిగిన మొక్కల వలె,మా కుమార్తెలు మూల స్తంభములవలె ఉన్నారు మా కొట్లు నింప బడ్డాయి మా గొఱ్ఱెలు వేల వేలు పెరుగుచున్నవి. గొప్ప బరువులు మోసే ఎద్దులు ఉన్నాయి.దావీదు రాజ్యములో ఇలా జరగాలని కోరుకున్నాడు. కొంతవరకు జరిగింది పరిపూర్ణముగా ప్రభువు రాజ్యములో జరుగుతుంది. నెమ్మదిగల స్థితి ఉందా అలాగు మన సంఘములను కాపాడు కుందుముగాక. ప్రస్తుతము సంఘములో ఆ ఛాయ కనబడాలి సంఘములో కుమారులు ఎదుగుచున్నారా? కుమార్తెలు స్తంభముల లాగా అవుతున్నారా? గొర్రెలు అంటే విశ్వాసులు పెరుగుతున్నారా ఆత్మీయ సంపదతో కొట్లు నిండుతున్నాయా? బరువులు మోయగల ఎద్దుల లాంటి పెద్దలు ఉన్నారా?

## 145 వ కీర్తన (4 + 2 + 4 + 3 + 3 + 2 + 3 = 21వ.)

**అంశము:-** దేవునికి ఆయన మహాత్మ్యమును, రాజ్యమును, గుణములను బట్టి నిత్య స్తుతి (1-16వ.).- మొరపెట్టు వారికి అసన్నుడు, తృప్తిపరచు దేవుడు కనుక ఆయన పరిశు ద్ధ నామమునకు నిత్య స్తుతి(17-21వ.)

**1-4వ. దేవునికి నిత్య స్తుతి:-** దావీదు రాజై ఉండి కూడా దేవుణ్ణి రాజుగా గుర్తిస్తున్నాడు. ఘనపరస్తున్నాడు. స్తుతిస్తున్నాడు. ఆదివారము మాత్రమే స్తుతి కాదు. అనుదినము నిత్యము స్తుతించాలి. ఏమని స్తుతించాలి? ఆయన మహాత్మ్యముగల వాడు అని, ఆయన అధికస్తోత్రము నొందదగినవాడు అని ఆయన మహాత్మ్యము గ్రహింపశక్యము కానిది అని తెలుసుకొని స్తుతించాలి. ఒక తరము నుండి ఒక తరము వారు దేవుని క్రియలను తెలుసుకొని కొనియాడాలి తెలియజేయాలి. ఇది కూడా స్తుతిలోని భాగమే.

**5-6వ. మహాత్మ్యమును ధ్యానించి వర్ణించుట:-** దేవుని మహోన్నతమైన ప్రభావ మహిమను ఆయన ఆశ్చర్య కార్యములను ధ్యానించాలి. ఆయన భీకర కార్యముల విక్రమమును

మహాత్మ్యమును వివరించాలి వర్ణించాలి. పాతనిబంధనలోని ఆశ్చర్య కార్యములు కొత్త నిబంధనలోను అద్భుతకార్యములను జ్ఞాపకము చేసుకొని వర్ణిస్తూ స్తుతించాలి. అన్నిటికంటే ఆశ్చర్యకార్యము పాపులైన మనకు పరలోకమిచ్చినందున అత్యధికముగా స్తుతించాలి.

**7-10వ. ఆయన గుణములనుబట్టి ఆయనకు స్తుతి:-** ఆయన మహా దయాళుత్వమును కీర్తిని ప్రకటించాలి, నీతినిగూర్చి గానము చేయాలి. ఆయన దయా దాక్షిణ్యములు గలవాడు, దీర్ఘశాంతుడు కృపాతిశయము గలవాడు. అందరికి ఉపకారి. ఆయన కనికరము సమస్త కార్యముల మీద ఉన్నది. ఆయన క్రియలు కృతజ్ఞతా స్తుతులు చెప్తూ ఉన్నవి.

**11-13వ. రాజ్యమును బట్టి స్తుతి:-** దేవునిరాజ్య గొప్పతనము చెప్పబడింది. ఆయన రాజ్య ప్రభావము ఆయన బలము నరులకు తెలియజేయాలి. అంటే ఆయన భక్తులు అనగా మనము ముందు తెలుసుకోవాలి. ఇప్పుడు దేవుని రాజ్యము మన హృదయాల్లో ఉంది. రేపు వెయ్యి సంవత్సరాల రాజ్యము ఉంది. ఇది పరిపూర్ణమైనది కాదు. ఆయన శాశ్వత రాజ్యము పరిపూర్ణమైంది. అది యుగయుగములు ఉండేది. అందులో ప్రవేశించుటకు ప్రభువును నమ్ముకున్నారా?

**14-16వ. తృప్తిపరచు దేవుడు:-** సంరక్షించుటలో యెహొవా గొప్పవాడు. పడిపోవు వారినందరిని ఉద్ధరించువాడు. క్రుంగిపోయిన వారినందరిని లేవనెత్తువాడు. అనుదిన ఆహారము ఇవ్వడంలో నమ్మదగినవాడు. సర్వజీవులకన్నులు ఆయన వైపు చూచుచున్నవి. తగిన కాలమందు ఆయన వారికి ఆహారమివ్వగలడు. ఆయన గుప్పిలిని విప్పి ప్రతి జీవి కోరికను తృప్తిపరచుచు వాడు. ఎంతో గొప్పవాడు.

**17-18వ. మొరపెట్టువారికి అసన్నుడు:-** యెహోవా తన మార్గములన్నిటిలో నీతిగల వాడు తన క్రియలన్నిటిలో కృప చూపువాడు ఆయన ఏ తప్పూ చేయనివాడు. తనకు మొఱ్ఱపెట్టువారి కందరికి తనకు నిజముగా మొఱ్ఱపెట్టువారి కందరికి యెహోవా సమీపముగా ఉన్నాడు. అడగండి ఇవ్వబడును అని చెప్పాడు. యథార్థముగా అడిగితే ఇస్తాడు.

**19-21వ. పరిశుద్ధ నామమునకు నిత్య స్తుతి:-** రక్షించడములో గొప్పవాడు. తనయందు భయభక్తులుగలవారి కోరిక ఆయన నెరవేర్చును. వారి మొఱ్ఱ ఆలకించి వారిని రక్షించును. యెహొవా తన్ను ప్రేమించు వారినందరిని కాపాడును. అయితే భక్తిహీనులనందరిని ఆయన

నాశనము చేయును. నా నోరు యెహోవాను స్తోత్రము చేయును. శరీరులందరు పరిశుద్ధ నామమును నిత్యము సన్నుతించుదురు గాక. మనము ఎంతగా స్తుతించాలి.

## 146వ కీర్తన (2 + 3 + 2 + 3 = 10వ.)

**అంశము:-** ఆయన కార్యములనుబట్టి శక్తి స్వభావమునుబట్టి మేలులనిచ్చు దేవునికి జీవితకాల నిరంతర  స్తుతి.

**1-2వ. జీవిత కాలమంత స్తుతి:-** యెహోవాను స్తుతించుడి. నా ప్రాణమా, యెహోవాను స్తుతింపుము. నా జీవితకాల మంతయు నేను యెహోవాను స్తుతించెదను. నేను బ్రతుకుకాలమంత నా దేవుని కీర్తించెదను. అందరు స్తుతించండి. పెదవుల నుండి కాదు.ప్రాణము నుండి స్తుతి రావాలి. హృదయము నుండి రావాలి. జీవితకాలమంతా బ్రదుకు కాలమంతా స్తుతించాలి. ఎందుకు?  ఆయన అంత స్తుతికి పాత్రుడు.

**3-5వ. ఆయన కార్యములనుబట్టి ఆయనకు స్తుతి:-** రాజులచేతనైనను నరులచేతనైనను రక్షణ కలుగదు వారిని నమ్ముకొనకుడి. వారి ప్రాణము వెడలిపోవును. వారు మంటి పాలగుదురు. వారి సంకల్పములు నాడే నశించును. ఎవనికి యాకోబు దేవుడు సహాయుడగునో ఎవడు తన దేవుడైన యెహోవా మీద ఆశపెట్టు కొనునో వాడు ధన్యుడు.రక్షణ రాజులచేత నరులచేత కలుగదు. అంటే అధికారులు గాని ఏ నరుడు గాని రక్షింపలేడు వారిని నమ్మవద్దు వారి ప్రాణము పోతుంది. అవీ ఇవీ చేస్తామంటారు. ఏమి చేయలేరు. వారి సంకల్పములు మట్టి పాలు అవుతాయి. మన దేవుని సంకల్పము నిత్యము నిలుస్తుంది. అందుకు స్తుతించాలి. యాకోబు దేవుడైన యెహోవా మీద ఆశపెట్టు కొనువాడు ధన్యుడు కీర్తనల గ్రంథములోని 30 ధన్యతలలో ఇది ఒకటి. ఎందుకనగా తన పిల్లల ఆశలను నెరవేర్చువాడు. ఆయన సర్వసృష్టికర్త. ఆయన సృజించిన వాటిలోనివే కదా మనము అడిగేది. కనుక తప్పక మన ఆశను తీర్చగలడు. ఆయన ఎన్నడును మాటతప్పని వాడు కనుక విశ్వాసముతో అడిగి పొందుదాం. అందుకు స్తుతించాలి.

**6-7వ. శక్తి స్వభావమునుబట్టి దేవునికి స్తుతి:-** ఆయన ఆకాశము భూమి సముద్ర ములను దానిలోని సర్వమును సృజించినవాడు. ఆయన ఎన్నడును మాట తప్పనివాడు. బాధపరచబడు వారికి ఆయన న్యాయము తీర్చును. ఆకలిగొనిన వారికి ఆహారము దయచేయును. యెహోవా బంధింపబడిన వారిని విడుదల చేయును.

7వ వచనములో మూడు కార్యాలు: బాధపరచబడువారికి ఆయన న్యాయము తీర్చువాడు.ఆయన న్యాయము తీర్చు దేవుడు. నీతిగల న్యాయాధిపతి అనే రమ్యమైన పేరు ఆయనకుంది. అన్యాయస్తుడైన న్యాయాధిపతి ఒకడుండెను (లూకా 18:6) ఆ రోజుల్లో ఒకడే ఈ రోజుల్లో అనేకమంది ఉన్నారు.

డాక్టర్లు ఆపరేషన్ చేసేటపుడు బాధ కలుగుతుంది. మన మేలు కొరకే బాధ. దేవుడు కూడా మన మేలు కొరకే బాధ కలుగ జేస్తాడు బాగు పరుస్తాడు. అందుకు స్తుతించాలి. ఆకలి గొనిన వారికి ఆహారము దయచేయును. 5 రొట్టెలు కొన్ని చిన్న చేపలతో 5000 మందికి ఆకలి తీర్చాడు. మన దగ్గర ఉన్నవాటిని ఆశీర్వదించాడు. ఆయన అందరికీ ఉపకారి. ఇశ్రాయేలీయులు 40 ఏండ్లు అరణ్యములో ఉన్నా ఆకలితో చచ్చిన వారు లేరు. పాపముతో చచ్చినవారు ఉన్నారు. శరీర బంధకాల నుండి ఆత్మీయబంధకాల నుండి విడిపించేవాడు. పేతురును పౌలును చెరసాల నుండి విడిపించాడు. దయ్యములు, సాతానుశక్తులు పట్టినవారిని విడిపించాడు. అందుకు స్తుతించాలి.

**8-10వ. యెహోవా గుణములు:-** గ్రుడ్డివారి కన్నులు తెరవజేయువాడు యెహోవా క్రుంగినవారిని లేవనెత్తువాడు. యెహోవా నీతిమంతులను ప్రేమించువాడు. యెహోవా పరదేశు లను కాపాడువాడు. ఆయన తండ్రిలేనివారిని విధవరాండ్రను ఆదరించువాడు. భక్తిహీనుల మార్గమును ఆయన వంకరమార్గముగా చేయును. యెహోవా నిరంతరము ఏలును. సీయోనూ, నీ దేవుడు తరములన్నిటను రాజ్యము చేయును

8వ. దినములో మూడు కార్యాలు ఉన్నవి.యెహోవా గ్రుడ్డివారి కన్నులు తెరవజేయు వాడు. ఆత్మీయ గుడ్డితనాన్ని శారీరక గ్రుడ్డి తనాన్ని బాగుచేసాడు. ఎంతో మంది మనోనేత్రాలు వెలిగించబడ్డాయి అనేకమంది గుడ్డివారు చూపు పొందారు (అక్కడి భౌతిక పరిస్థితులనుబట్టి ఇశ్రాయేలీయులకు గుడ్డితనము ఎక్కువ వస్తుందట.) అందుకు స్తుతించాలి. యెహోవా క్రుంగినవారిని లేవనెత్తువాడు. 12 పర్యాయాలు దావీదు కృంగినట్లు చెప్పుకున్నాడు. కృంగిన వారిని లేవనెత్తేవాడు నీతిమంతులను ప్రేమించువాడు మనమే నీతిమంతులము. శాశ్వత ప్రేమ అంతము వరకు ప్రేమ మరణము వరకు ప్రేమ ఆయనకు మన మీద ఉంది. అందుకు స్తుతించాలి. పరదేశులను తండ్రిలేని వారిని విధవరాండ్రను కాపాడి ఆదరించువాడు. రూతు,

పరదేశి, విధవరాలు, తండ్రి లేనిది అనుకోవచ్చు. ఓర్పాకు భక్తి లేదు. అందుకే ఆమె బైబిల్‌లో తరువాత కనబడదు. 10 వ వచనములో ఈ రూతు వంశములో నుండి నిరంతరము యేసుక్రీస్తు వచ్చాడు. రూతు ఆశీర్వాదము పొందింది. ఓర్పా శాపము పొందింది. అందుకు ప్రభువును స్తుతించాలి.

## 147వ కీర్తన (6 + 5 + 9 = 20వ.)

**అంశము :-ప్రభువుకు స్తుతి.**

1-11వ. గొప్పవాడైన ప్రభువుకు తన కొరకు కనిపెట్టు కొనువారియందు ఆనందించు దేవునికి స్తుతి. 12-20వ. దేశముపై ఆశీర్వాదము.

పీఠిక :- ఇందులో సుత్తించుట ప్రాముఖ్యమైన అంశము. స్తుతితో ప్రారంభమయి స్తుతితో ముగుస్తుంది. స్తుతికి పర్యాయ పదాలు స్తోత్రము (1) కీర్తించుట (6) కొనియాడుట (12) మొదలగునవి ఈ కీర్తనలో ఉన్నాయి.

**1-6వ. గొప్పవాడైన ప్రభువుకు స్తుతి:-** 1-3 దేవుడిచ్చే ఆదరణ బట్టి స్తుతించాలి. ఏది మంచిది? స్తోత్రము చేయుట. స్తుతించుట మంచిది. ఇది మనోహరమైనది. ఒప్పిదము అంటే అంగీకరించ దగినది.ఎందుకు యెరూషలేమును కట్టినవాడు అంటే సంఘమును కట్టినవాడు ఆయనే.లోకములో ఎన్నోసంఘాలు ఉన్నాయి. ఇది జీవము గలిగిన దేవుని సంఘము. చెదరిన ఇశ్రాయేలీయులను ప్రోగు చేసే వాడు. ఎన్నోసార్లు ఇశ్రాయేలీయులు చెదరిపోయారు.అన్నిసార్లు పోగు చేసాడు. అట్లే దేవుని సంఘాలు చెదరిపోయినా పోగుచేసేవాడు. గుండె చెదరినవారిని ఆయన బాగుచేయువాడు.వారి గాయములు కట్టువాడు. గాయము చేసేవాడు కట్టువాడు ఆయనే.డాక్టరు మేలుకోరి గాయముచేస్తాడు మళ్ళీకడతాడు. అలాగే దేవుడు కూడా గాయ పరుస్తాడు కట్లు కడతాడు విప్పుతాడు (కీ116:16) అందుకు స్తుతించాలి.

**4-6వ.లో ఆకాశములో ఆయన అధికారముబట్టి స్తుతించాలి:-** నక్షత్రముల సంఖ్య నియమించిన వాడు. శాస్త్రజ్ఞులకు ఇంకా లెక్క తేల లేదు ఇంకా కొత్తవి కనిపిస్తున్నాయి. వాటన్నిటికీ పేర్లు పెట్టాడు. సాధ్యమా! ముప్పయి వేల కోట్ల కోట్ల నక్ష త్రాలు ఉన్నాయట! 3తర్వాతా 25సున్నాలుకాబోలు.ఇన్నిటికి పేర్లు పెట్టాలంటే ఎంత సమయము కావాలో చెప్పలేము 100 పేర్లు జ్ఞాపకము ఉంచుకోలేము ఇన్ని జ్ఞాపకము ఉంచుకున్న ఆయన జ్ఞానము అమోఘము.

ఆయన గొప్పవాడు అధికశక్తి, అధిక జ్ఞానము గలవాడు ఆయనకు మనము గుర్తున్నామా అనే అనుమానము వస్తుంది. ఇన్ని గుర్తుపెట్టుకున్న ఆయనకు తప్పక మనము గుర్తు ఉంటాము. మాటతో చేసిన వాటికే అంత జ్ఞానము వినియోగిస్తే చేతితో చేసిన మనలను గుర్తుపెట్టుకుంటాడు. దీనులను లేవనెత్తుతాడు. ఒక ఆత్మీయుడు దీనుడైతే అణగ ద్రొక్కబడుతుంటే లేవనెత్తుతాడు. భక్తి హీనులను కూలుస్తాడు. మనము కూల్చ అక్కర లేదు. అందుకు స్తుతించాలి

**7-11వ. తన కొరకు కనిపెట్టుకొనువారియందు ఆనందించు దేవుడు:-** 7-9వ. భూమి మీద ఆయన అధికారము. ఆయన అధికారమును బట్టి కీర్తించండి. కీర్తనల ద్వారా స్తుతించ వచ్చు వాయిద్యాలతో కూడా కీర్తించాలి. భూమి కొరకు వర్షము, పర్వతముల మీద గడ్డి మొలిపిస్తున్నాడు. కాకులకు ఆహారము ఇచ్చువాడు. మత్త 6:26 ఆకాశ పక్షులను చూడండి మత్త 12:12 మనిషి శ్రేష్ఠుడు. మనుష్యులను శ్రేష్ఠముగా ఎంచుతున్నాడు అందుకు స్తుతించాలి.

**10-11వ. లో అయన దేనిమీద ఆనందిస్తాడో కనపడుతుంది:-** మన ఆనందము ఈ లోకసంబంధముగా ఉంటుంది.గుంపులు గుంపులు ఆయనను వెంబడిస్తే సంతోషించ లేదు. అన్నిటిని విడిచి నన్ను వెంబడించని వాడు నాకు పాత్రుడు కాదు అన్నాడు. గుఱ్ఱముల బలము నరుల కాలిసత్తువ యందు ఆనందించడు అంటే సైన్యము అని.రాజుగారు సైన్యమును బట్టి సంతోషిస్తాడు కాని దేవుడు తనయందు భయభక్తులుగల వారియందు తన కృపకొరకు కనిపెట్టువారియందు ఆనందించువాడైయున్నాడు. మనము ఆయన కృప కొరకై కనిపెట్టితే మనయందు ఆనందిస్తాడు

**12-20వ. దేశముపై ఆశీర్వాదము:-** 12-13వ. భద్రతను బట్టి స్తుతించాలి:-కొని యాడుము. ఇది కూడా స్తుతే. సీయోనూ అంటే దేవుని సంఘమే. సంఘము ప్రభువును కొనియాడాలి. ఆయన గుమ్మాలను ఘడియలను బలపరుస్తాడు. అంటే శత్రువైన సాతాను ప్రవేశించకుండా హృదయ ద్వారమును కాపాడుతాడు. మన పిల్లలను ఆశీర్వదించు వాడు. మన పిల్లలు మంచి స్థాయిలో ఉన్నారంటే ఆయన ఆశీర్వాదమే.(2దిన16:9) యదార్థ హృదయము గల వారిని బల పరుస్తాడు. యదార్థహృదయము కలిగిఉంటె ఆశీర్వాదము (జక4:9). 14-15వ. సరిహద్దులలో సమాధానము కలుగజేస్తాడు అంటే ఇరుగు పొరుగు వారితో సఖ్యత కలుగజేస్తాడు. మంచి గోధుమలతో తృప్తిపరుస్తాడు అంటే శ్రేష్ఠమయిన ఆహారాన్ని ఇస్తాడు. ఆయన వాక్యము పరుగెత్తును మనలో వాక్యము బహు వేగముగా కార్యము చేయాలి. 16-

18వ. మంచి చేయువాడు మంచును కురిపించి వర్షము ఇచ్చువాడు ఆయనే. 19-20వ. యాకోబుకు వాక్యమును తెలియచేసినవాడు అంటే మోసగాడైనా ఆయనను వెంబడించాలనుకునే వారితో మాట్లాడే వాడు. తన న్యాయవిధులను ఇశ్రాయేలుకు తెలియజేసినవాడు. ప్రపంచములో ఏ జనమునకు ఈలాగు చేయలేదు. అలాగే విశ్వాసికి పరలోకము ఈ లోకము ఇచ్చినవాడు. (ఎఫెసీ 1:3, ఫిలి 4:19.) వీటన్నిటిని బట్టి ప్రభువును స్తుతించాలి.

## 148 వ కీర్తన (6+6+2=14వ)

### అంశము: సర్వ సృష్టి యొక్క స్తుతి

**1-3 ఆకాశములలో స్తుతి:-** ఆకాశవాసులారా, ఆకాశములు, పరమాకాశములు, మహాకాశములు (నెహె 9:32) ఉన్నాయని తెలుస్తున్నది ఇవన్నీ ఎన్ని ఉన్నాయో చెప్పలేము. ఇవన్నీ యెహోవాను స్తుతించాలని చెప్పబడింది. ఉన్నత స్థలముల నివాసులారా వీళ్లెవరో మనకు తెలియదు ఆయన దూతలారా, దూతలగురించి కొంత అవగాహన ఉంది మనకు సైన్యములారా పరలోక సైన్య సమూహము దూతల గురించి (లూకా 2:13) లో చెప్పబడింది. సైన్యములకు అధిపతి అని ఆయనకు పేరు ఇవన్నీ ఆయనను స్తుతించాలి పరలోకములో భూలోకములో స్తుతిఉంటుంది (ప్రక 5:10-13) సర్వసృష్టి స్తుతిస్తుంది. సూర్యుడు చంద్రుడు నక్షత్రములు అన్నీ స్తుతించాలి. నక్షత్రాల లెక్క 147 కీర్తనలో చెప్పబడ్డాయి. ఇవన్నీ ఆయనను స్తుతించాలి.

**4-6 పరమాకాశములలో స్తుతి:-** పరమాకాశములు ఆకాశముపైన ఉన్న జలములు స్తుతించాలి ఎందుకు? వాటిని పుట్టించింది యెహోవాయే. అవి పాపము చేయలేదు కాని వాటిని కలుగజేసినందుకు స్తుతించాలి. పాపము చేసిన మనము ఎంతగా స్తుతించాలి. వాటికి కట్టడ నియమించాడు అవి కట్టడను అతిక్రమింపవు మనము అన్ని కట్టడలను అతిక్రమించాము. మనము ఎంతగా స్తుతించాలి

**7-12వ. భూమిపై స్తుతి:-** భూమిమీద ఉన్న మకరములు అగాధ జలములు యెహోవానుస్తుతించాలి. అగ్నివడగండ్లు,హిమము ఆవిరి తుఫాను స్తుతించాలి. మృగములు పశువులు నేలను ప్రాకుజీవులు రెక్కలతో ఎగురు పక్షులు భూ రాజులు, సమస్త ప్రజలు,భూమి మీద నున్న అధిపతులు సమస్త న్యాయాధిపతులు యెహోవాను స్తుతించాలి. యౌవనులు కన్యలు వృద్ధులు బాలురు అందరు యెహోవాను స్తుతించాలి. 7 ఆకాశాలు ఉన్నాయని బైబిలు పండితులు చెప్తారు. అన్నీ యెహోవాను స్తుతించాలి.

**13-14వ.స్తుతికి కారణములు:-** అందరును యెహోవా నామమును స్తుతించాలి ఎందుకు? ఆయన నామము మహోన్నతమైన నామము ఆయన ప్రభావము భూమ్యాకాశములకు పైగానున్నది. అందుకు స్తుతించాలి.ఆయన తన ప్రజలకు ఒక శృంగమును హెచ్చించి యున్నాడు. రక్షణ అనే శృంగము అది ఆయన భక్తులకందరికిని ఆయన చెంతజేరిన జనులగు ఇశ్రాయేలీయులకును ప్రఖ్యాతి కరముగా నున్నది. రక్షణ ఎంతో ప్రఖ్యాతి గలది. యెహోవాను స్తుతించుడి.

## 149వ కీర్తన (3+3+3=9వ.)

**అంశము :-** భక్తులు కూడుకొను సమాజములో యెహోవా చేసిన ఆశ్చర్య కార్యములను బట్టి యెహోవాకు క్రొత్త కీర్తన.

**పీఠిక :-** ఇది స్తుతి కీర్తన మొదటిలో చివరలో యెహోవాను స్తుతించమని ఉన్నది. అందువల్ల ఇది స్తుతి కీర్తన.

**1-3వ.యెహోవా ఇశ్రాయేలీయులను పుట్టించినందున సమాజములో క్రొత్త కీర్తన పాడుట:-** యెహోవాను స్తుతించుడి. యెహోవాకు క్రొత్త కీర్తన పాడుడి. భక్తులు కూడు కొను సమాజములో ఆయనకు స్తోత్రగీతము పాడుడి. క్రొత్త కీర్తన పాడాలి. ఎందుకు? కొత్త కీర్తనలు పాడండి అని కీర్తన గ్రంధములోనే 6 పర్యాయాలు కనపడుతుంది 33:3, ఇంపుగా ఉత్సాహముతో పాడాలి. 40:3 స్తోత్రగీతములు అనేకులు అర్థము చేసుకోవాలి 96:1 యెహోవా మీదనే ఉండాలి. 98:1 యెహోవా ఆశ్చర్యకార్యములు బట్టి పాడాలి. 144:9, 149:1 ఇశ్రాయేలీయులు తమ్మును పుట్టించిన వానిని బట్టి సంతోషించుదురు గాక సీయోను జనులు తమ రాజును బట్టి ఆనందించుదురు గాక. పుట్టించినందుకు సంతోషించి స్తోత్రగీతము పాడాలి. 139:13-16 దావీదు దేవుడు పుట్టించినందుకు స్తుతించాడు. ఒక కన్ను సృష్టించడమే ఎంతో ఆశ్చర్యము అన్ని అవయవాలు ఆలోచిస్తే ఎంత ఆశ్చర్యము. నాట్యముతో వారు ఆయన నామమును స్తుతించుదురుగాక. తంబురతోను సితారాతోను ఆయనను గూర్చి గానము చేయుదురు గాక. నాట్యము ఇప్పుడు చేయలేదు. రోమా నుండి యూదా వరకు ఏమేమి అపొస్తలులకు చెప్పబడ్డాయో వాటినే మనము అనుసరించాలి. అపొస్తలులు వాటిని కార్యరూపముగా చేశారు. వ్రాసిపెట్టారు అపొస్తలుల కార్యముల గ్రంథము నుండి యూదా పత్రికవరకు చూస్తే వారు

పాటలు పాడినట్లు ఉంది. అపో16:25 కొలొ3:16 "సంగీతములతోను కీర్తనలతో ఆత్మసంబంధమైన పద్యములతోను అని చెప్పబడింది. నాట్యము ఎవరు చెయలేదు. దావీదు కాలములో సంఘము లేదు సమాజము ఉంది. సంఘ క్రమాలు అపోస్తలుల కార్యములు మొదలుకొని యూదా పత్రిక వరకు ఉన్నాయి. అవే చేయాలి.

**4-6వ. యెహోవా తనప్రజలందు ప్రీతిగలిగినవాడు, కనుక ఇంటిలో ఉత్సాహగానము చేయుట:-** యెహోవా తన ప్రజలందు ప్రీతిగలవాడు. ఆయన దీనులను రక్షణతో అలంకరించును. ఆయన ప్రీతి, రక్షణనుబట్టి స్తుతించాలి. భక్తులు ఘనత నొంది ప్రహర్షించుదురుగాక. వారు సంతోషభరితులై తమ పడకల మీద ఉత్సాహగానము చేయుదురు గాక. భక్తులు కావడమే ఘనత. అందును బట్టి సంతోషించాలి. పడకల మీద అంటే నిద్రపోయే ముందు పాటలు పాడాలి. ఉత్సాహస్తోత్రము ఉండాలి.

**7-9వ. శత్రువులైన అన్యజనులకు ప్రతిదండన చేయుట:-** భక్తుల కందరికి ఘనత యిదే, యెహోవాను స్తుతించుట:- అన్యజనులకు ప్రతిదండన చేయుటకును ప్రజలను శిక్షించుటకును గొలుసులతో వారి రాజులను ఇనుప సంకెళ్లతో వారి ఘనులను బంధించుటకు విధింపబడిన తీర్పు వారి మీద నడుపుటకును వారి చేతిలో రెండంచులు గల ఖడ్గమున్నది. ఆయన భక్తులకందరికి ఘనత యిదే యెహోవాను స్తుతించుడి. ప్రతిదండన, శిక్ష,బంధించుట, తీర్పు ఇవన్నీ చేయుటకు రెండంచుల ఖడ్గము అనగా వాక్యమున్నది ఇదే భక్తుల ఘనత ( 7 ఏండ్ల శ్రమల కాలము ప్రజలను శిక్షించుట ప్రకటన 16-21).

## 150 వ కీర్తన (1+1+4=6వ.)

### అంశము- యెహోవాను స్తుతించుడి.

**పీఠిక:-** హెబ్రీ భాషలో కీర్తనగ్రంధాన్ని సేపర్ టెహలీమ్ అంటారు అంటే వాయిద్యము లతో పాడదగినది అని. ఈ కీర్తనలో యెహోవాను స్తుతించండి అని 14 సార్లు ఉంది .1 లో 3 సార్లు 2 లో 3 సార్లు. 3 లో 2 సార్లు 4,5,6 లో 2 సార్లు ప్రతి వచనంలో 2 లేక 3 సార్లు ఉంది.

ఎవరిని స్తుతించాలి? :- యెహోవాను (1)

ఎక్కడ స్తుతించాలి ?:- ఆయన పరిశుద్దాలయమునందు (1)

ఎందుకు స్తుతించాలి?:- ఆయన కార్యములను ప్రభావమును బట్టి (2)

ఎలాగు స్తుతించాలి ?:- (3-5). వాయిద్యములతో

ఎవరు స్తుతించాలి ?:- (6) సకల ప్రాణులు

**1. ఎవరిని స్తుతించాలి:-** యెహోవాను. అంటే యెహోవానే స్తుతించాలి. మానవులను గౌరవించాలి కానీ దేవుని స్థానములోఉంచి స్తుతించకూడదు. కీర్తన 6:1-2 లో కోపము, ఉగ్రత, కృశింపు, ఎముకలు. అదరుట కనబడుతున్నది. 51:1-2 లో అతిక్రమము దోషము పాపము కనబడుతున్నవి 54వ కీర్తనలో అన్యులు బలాఢ్యులు శత్రువులు కనబడుతున్నారు. 57లో సింహాలు ఉన్నవి. 142,143 లోప్రాణాత్మ దేహాలు. కృంగి ఉన్నాయి కృంగుదలను నేడు డిప్రెషన్ అంటున్నారు దావీదు కీర్తనలలో 14 సార్లు కృంగి ఉన్నాను అన్నాడు. ఆసాపు ఒకసారి కృంగి ఉన్నాను అన్నాడు. కోరహు కుమారులు కూడా కృంగి ఉన్నారు. కానీ ఈ కీర్తనలో ఏ సమస్యా లేదు ఆ సమస్యలనన్నిటిని తప్పించుకొని దేవుని స్తుతించమని వ్రాసారు ప్రాణాత్మ దేహాలలో ఎక్కడ కృంగుదల లేదు. ఒకేమాట స్తుతించండి, స్తుతించండి అని భూలోకములో పరలోకములో సమస్యలు లేవు అంతటా స్తుతించండి అనే స్థితికి కీర్తనాకారులు తెస్తున్నారు మనకు అనేకసార్లు కృంగుదల వస్తుంది. అపుడు దేవునికి మొరపెడితే విడిపిస్తాడు అపుడు దేవునిశక్తి మనకు అర్థమవుతుంది అపుడు దేవుని స్తుతించగలము అందుకే శ్రమలు కృంగుదల వస్తాయి.

**ఎక్కడ స్తుతించాలి:** ఆయన పరిశుద్ధాలయమునందు దేవుని స్తుతించుడి. ఆయన బలమును ప్రసిద్ధిచేయు ఆకాశవిశాలమందు ఆయనను స్తుతించుడి.(1)

ఆకాశ విశాలములో కోట్ల కోట్ల నక్షత్రాలు ఉన్నట్లు విన్నాము వీటిని తెలుసు కొన్నపుడు ఆయనను స్తుతించగలము. నక్షత్రాల వెలుగు వేడి ఎంత గొప్పదంటే సూర్యుని వెలుగు వేడిలో 20 కోట్లలో ఒక వంతు మాత్రమే భూమిని చేరుతుందట. అ వేడినే తట్టుకోలేక పోతున్నాము ఒక సూర్యునికి ఇంత వెలుగు వేడి ఉంటె కోట్ల కోట్ల నక్షత్రాల వెలుగును వేడిని ఊహించలేము వీటన్నిటిని సృజించిన సృష్టికర్త ఎంత గొప్పవాడు అయి ఉంటాడు. అందుకే ఆయనను స్తుతించాలి. భూలోకము మొదలుకొని పరలోకము వరకు ఆయన స్తుతి వినిపించాలి. ప్రకటన 5:11, 13:5 లో సంఘము భూలోకములో ఉండదు. కనుక పరలోకములోను స్తుతి ఉన్నది. ప్రతి సృష్టము మూడు లోకాల్లో స్తుతి ఉంది. అంతే కాదు, మానవుణ్ణి సృజించాడు. పాపములో బడితే విడిపించి కొత్త సృష్టిగా క్రీస్తులో మనలను చేసాడు. మనకు రెండు సృష్టిలు దీనిని బట్టి ఆయనను స్తుతించాలి.

**2.ఎందుకు స్తుతించాలి:-** ఎందుకు స్తుతించాలి అయన పరాక్రమ కార్యములను ఆయన మహా ప్రభావమును బట్టి స్తుతించాలి. రక్తస్రావ రోగిలోనికి ఆయన ప్రభాము వెళ్ళి స్వస్థ పరచింది. స్తుతి చెల్లించేటపుడు ఆయన ఎవరు? ప్రభావము గలవాడు ఆయన ఏమి చేసాడు? పరాక్రమ కార్యాలు చేసాడు. మనకు ఇచ్చిన చదువులు ఉద్యోగాలు వివాహము పిల్లలు ఇండ్లు వాహనాలు ఇలా ఆలోచిస్తే ఎన్నో కార్యాలు చేసాడు వీటన్నిటికీ అర్హులమేనా ఈ లోక విషయాలలో గొప్ప ఆశీర్వాదాలు లేకపోయిన పరలోక సంబంధమైన ప్రతి ఆశీర్వాదము ఇచ్చాడు. పాపులమైన మనకు నరకమే గతి అయినా పరలోకము పరలోక ఆశీర్వాదాలు ఇచ్చాడు దీనికి ఎంతైనా స్తుతించుదుము గాక.

**3-5 ఎలాగు స్తుతించాలి**? బూరధ్వని స్వరమండలము సితారా తంబుర తంతివాద్యములతోను పిల్లనగ్రోవి మ్రోగు తాళములు ఇవన్నీ ఇపుడు ఏదో ఒక రూపములో స్తుతి ఉపయోగిస్తున్నాము. అయితే నాట్యము చెప్పబడింది. నాట్యము కొత్త నిబంధనలో లేదు. కీర్తనలు పాడినట్లు కొత్తనిబంధనలో 6 సార్లు ఉంది. అపో 13:33,35; 1 కొరి 14:26 ఎఫెసీ 5:19, కొలస్స 3:16, ప్రక 14:3 లో సామోస్ అనే గ్రీకు పదమునకు వాయిద్యములతో పాడదగినది అని అర్థము. ఎఫెసి 5:19. ప్రక 4:3. వీణా నాదము కనుక కొత్త నిబంధన కాలములోను శాశ్వత కాలంలోనూ కీర్తన పాడుట కనిపిస్తుంది. నాట్యాలు లేవు. అపొ 17:11 సంఘము భూలోకములో పుట్టినది మొదలుకొని పరలోకము చేరు వరకు నాట్యాలు లేవు. హెబ్రీ 10:1 పాత నిబంధన ఛాయ. ఇపుడు నిజ స్వరూపము చేయాలి. పస్కా,పెంతెకొస్తు, బూరల పండుగ, పర్ణశాలల పండుగ మనము చేయడము లేదు. ఇవి ఛాయ ఇవన్నీ క్రీస్తులో నెరవేరాయి కాబట్టి అవి చేయనవసరం లేదు. మన పస్కా నెరవేరింది.

బూర ధ్వని:- ఇశ్రాయేలీయులకు రెండు బూరలు ఉన్నాయి అవి సమయాన్ని సమకూర్పును చూపిస్తాయి. స్వర మండలము:- మన స్వరము చాలు.

**6. ఎవరు స్తుతించాలి**? సకలప్రాణులు యెహోవాను స్తుతించుదురు గాక యెహోవాను స్తుతించుడి. సకల ప్రాణులు భూలోకములో ఉండే ప్రతి ప్రాణి ఇంట్లో ఉండే ప్రతి సాకుడు జంతువులు కూడా ప్రభువును స్తుతించాలి.

# కీర్తనల గ్రంథ ధ్యానము -2

తృతీయ, చతుర్థ, పంచమ స్కంధములు 73-150 కీర్తనలు

## కీర్తనల గ్రంథ ముఖ్య ఉద్దేశ్యము

యదార్థవంతుల సభలోను సమాజములోను పూర్ణ హృదయముతో నేను యెహోవాకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించెదను. కీర్తన 111:1.

యెహోవాను స్తుతించుడి, యెహోవాకు క్రొత్త కీర్తన పాడుడి. భక్తులు కూడుకొను సమాజములో ఆయనకు స్తోత్ర గీతము పాడుడి. కీర్తనలు 149:1.

యెహోవా నామమునకు చెందవలసిన ప్రభావమును ఆయనకు ఆరోపించుడి. ప్రతిష్ఠితములగు ఆభరణములను ధరించుకొని ఆయన యెదుట సాగిలపడుడి. కీర్తనలు 29:2

కీర్తనల గ్రంథమును హెబ్రీ భాషలో "సిపర్ టెహిలిం" అనిరి. స్తుతుల గ్రంథము అని దీని భావము. గ్రీకు బైబిలులో "సామోన్" అనిరి.వాయిద్యముల మీద పాడగదగినది అని దీని భావము.

(A SONG ON AN INSTRUMENT) ఇంగ్లీష్ బైబిలులో "PSALMS" అనిరి. సెలా అను పదము 71 పర్యాయాలు కన్పించును. సెలా అనగా ఆగి ఆలోచించాలి గనుక ఎలా అను పదము కనిపించిన తరువాత ఆగాలి. అనగా ఒక అంశము అక్కడికి ముగించినదని తలంచాలి.మందిరములో ఆరాధించుటకు 1) ఇశ్రాయేలు ప్రజల గతకాల చరిత్ర. 2) ప్రస్తుత స్థితిగతులు 3) వారి బావి కాల నిరీక్షణను ధ్యానించుట సహాయకరము.

కీర్తన గ్రంథ ఆడియో, వీడియో ధ్యానములకై www.telugubiblestudy.inను సందర్శించండి.

**T.P.Varaprasada Reddy**

Shalom Church, JN.T.U. Post,

Ananthapur - 515 002, Cell: 9440285883

**టి.పి. వరప్రసాద రెడ్డి**

షాలోమ్ చర్చి, జె.యన్.టి.యు, పోస్టాఫీస్,

అనంతపురము - 515 002

ఫోన్: 9440285883, 9440669494